# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, ఏప్రిల్, 2016 ₹ 25

ISSN 2454–4329



ఒంటరి తీవె

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada*

**సంపుటి 27** ఏప్రిల్ **సంచిక 4**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాంద్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు

పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
**http://facebook.com/misimimaasapathrika**

| | | | |
|---|---|---|---|
| ప్రతి : | ₹ 25/- | సంవత్సరానికి : | ₹300/- |
| విదేశాలకు ప్రతి : | $ 2.50 | సంవత్సరానికి : | $ 25 |

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ............................................ 5

తెలుగు నందులు - ఒక ప్రారంభం ............................ 7
*- గొల్లపూడి మారుతీరావు*

కథన మీమాంస ............................................ 12
*- గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

ప్రవాసం ............................................ 17
*- కొసరాజు వెంకటేశ్వరరావు*

పీఠిక ............................................ 21
*- పింగళి లక్ష్మీకాంతం*

స్మృతి పథంలో కేశవరెడ్డి ............................................ 30
*- మోహన్*

కన్నడ శివుడికి తెలుగు పార్వతి ............................................ 32
*- శాకమూరు రాజగోపాల్*

క్రోమోసోమ్ కథనమ్ ............................................ 36
*- ముక్తవరం పార్థసారథి*

శ్రీ భగవద్రామానుజులు సాంఘిక ప్రబోధం ............................ 40
*- ఆచార్య కోసూరి దామోదరనాయుడు*

శాస్త్ర పరిశోధన : ప్రయోజనాలు ............................................ 45
*- వేలూరి కృష్ణమూర్తి*

కనక ............................................ 49

ఆలపాకమ్ ............................................ 52
*- పలగాని గోపాలరెడ్డి*

వారసత్వం ............................................ 55
*- సాయి పాపినేని, జయశ్రీ నాయని*

పల్నాటి వీరుడు - కన్నెగంటి హనుమంతు ............................ 62
*- వై. హెచ్.కె. మోహన్‌రావు*

నేను మలాలా ............................................ 67
*- యూసెఫ్‌జెయ్*

గదబ సంస్కృతి ............................................ 74
*- శ్రీమంతుల దామోదర్*

గీతం - సంగీతమ్ ............................................ 76

వెండితెరపై తెలుగుతార లీలానాయుడు ............................ 79

బొమ్మలాట ............................................ 80
*- వేమలి త్రినాథరావు*

సాహితీ బంధువు ............................................ 84
*- అవిజ వెంకటేశ్వర రెడ్డి*

పరితోషణ ............................................ 92
*- బి.వి. నరసింహారావు*

'రావోయి బంగారి మామా' ............................................ 94
*- కొనకళ్ల వెంకటరత్నం*

కంఠాభరణం ............................................ 95
*- జూకంటి జగన్నాథం*


| | | *చిత్రకారులు :* |
|---|---|---|
| *ముఖచిత్రం* | : రాధాకృష్ణ | *పి. వెంకటేష్* |
| *రెండవ అట్ట* | : ఒంటరి తీవె | *జి. వెంకటేశ్వర్లు* |
| *మూడవ అట్ట* | : ఇరుల పోరు | *జి. రవి సీతారామశాస్త్రి* |
| *నాల్గవ అట్ట* | : మాణిక్య దక్ష వాటిక | *యన్. రాజేశ్వర్* |

అట్టతో కలిపి 100 పుటలు

*వివరాలు : 50 వ పుటలో...*

ఇప్పటి రచయితలనేకమంది – ప్రపంచీకరణ ప్రభావంతో ఇక్కడి జీవితాలు ధ్వంసమైపోతున్నాయని వాపోవటం విడ్డూరంగా వుంది. అలాంటి కథలే ఇప్పటి సమాజాన్ని ప్రతిబింబిస్తున్నాయని మెచ్చుకోలు పలుకటమూ జీర్ణించుకోలేకపోతున్నాం. ఎందుకంటే – ఈ గ్లోబలైజేషన్ – ప్రపంచీకరణ అనే పదాలు కొత్త పాశ్చాత్య మీడియా సృష్టించినవి – వీటిని మనం దిగుమతి చేసుకుని భయభ్రాంతులమవుతున్నాం.

చరిత్రలోకి తొంగిచూడండి – మొత్తం భారతదేశాన్ని జయించాలని, కొల్లగొట్టాలని మహమ్మదీయులు శతాబ్దాలుగా చేసిన దండయాత్రలను ఏమనాలి? అలాగే భారతదేశ పశ్చిమతీరానికి ఐరోపా నావికులు వ్యాపారం నిమిత్తంగా తరలివచ్చి రాజ్యాలేర్పరచుకున్న పోర్చుగీసు, ఫ్రెంచ్, ఇంగ్లాండు దేశస్థుల వలసలనేమనాలి?

అవన్నీ భరించిన భారతం ఇప్పటి ప్రపంచీకరణ ప్రభావం, అందులోని సాంస్కృతిక విధ్వంసం, భరించలేకపోతున్నదనేవి డొల్ల మాటలుగాక మరేమిటి? అసలు గ్లోబల్ వాతావరణం యాంత్రికరణతోనే మొదలయింది. అది సినిమాతో వెర్రితలలు వేసింది. టి.వి.తో మీకున్న కాస్త మర్యాదను పోగొట్టింది – ఇక స్మార్ట్‌ఫోన్ మీ అస్తిత్వాన్ని అంతం చేసింది. ఇవన్నీ మన జీవితంలో భార్యాబిడ్డలు, బంధుమిత్రులకంటే ఎక్కువైపోలేదా?

సరే, ఇది అలా ఉంచండి – మనం చరిత్ర ఎలా చదివాం? పురుషోత్తముడు, అలెగ్జాండర్ దగ్గరనుంచి తుగ్లక్, బాబర్‌నామా, వాస్కోడిగామా, రాబర్ట్‌క్లైవ్ వగైరావగైరా – అసలు భారతదేశ చరిత్ర ఎప్పటినుంచి లభ్యమవుతుంది – మన చరిత్రకారులు దృష్టిపెట్టారా? మత నమ్మకాల చుట్టూ తిరిగేది చరిత్ర సమగ్ర రూపం కాదు. విజయనగర చరిత్ర విషయానికొస్తే – 2 శతాబ్దాల వంశపాలనలో 2 దశాబ్దాల కాలమేనా మనం రోజూ చెప్పుకునేది. 200 సం॥లు దేదీప్యమానంగా వెలిగిన విజయనగర సామ్రాజ్య చరిత్రలో ఒక్క కృష్ణదేవరాయలు పాలన ఎంతవరకు ముఖ్యం? మిగతా పాలకులు ఎన్ని దాడులు ఎదుర్కొన్నారు – ఎన్ని యుద్ధాలు చేశారు – ఎంత రక్తపాతాన్ని చూశారు – ఎప్పుడైనా తలచుకున్నామా – బేలూరు, హలిబేడు, లేపాక్షి లను నిర్మించింది ఎవరు? అంతకు పూర్వం వున్న కాకతీయుల చరిత్ర ఎంతవరకు సమగ్రంగా అందుబాటులో ఉంది? వింధ్య పర్వతాలకు దిగువన అశోకుని తర్వాత ఎన్ని సామ్రాజ్యాలు విలసిల్లి పరాయి దాడులను తిప్పికొట్టి నిలబడలేదు!? మరి ఉత్తరాన మౌర్యులు, గుప్తులు, కనిష్కుడు, హర్షుడు లేరా!?

విజయవర్మ వంశం వియత్నాం వరకు 800 నుండి 1200 వరకు అవిచ్ఛిన్నంగా పరిపాలించిందికదా? కాంభోజంలో అంకుర్‌వాట్ దేవాలయం ఈ వంశజులు నిర్మించినదికాదా? కళ్యాణ, బాదామి చాళుక్యులు, పల్లవులు ఎన్ని యుద్ధాలు చేశారు? ఎన్ని రాజ్యాలేర్పరచారు! ఎన్ని దేవాలయ నిర్మాణాలు చేయించారు! ఇంత చరిత్ర ఆధారంగా ఎంత చక్కని, చిక్కని కథలు, నవలలు నాటకాలు రావలసి ఉంది! వేదంవారి *ప్రతాపరుద్రీయము*, పిలకా గణపతిశాస్త్రి *విశాల నేత్రాలు*, అడవి బాపిరాజు *గోన గన్నారెడ్డి* తరువాత ఆ దృష్టి పెట్టిన రచయితే అరుదు, ఇటీవల *బోయకొట్టములు పండ్రెండు* వరకు.



చారిత్రక సంఘటనలు నేపథ్యంగా షేక్స్పియర్ నాటకాలు ఎంతటి సాహిత్యానికి తెరలేపినాయి! ఈనాటికీ మనం చదువుకుని జీవిత సత్యాలను చూడగలుగుతున్నాం. భారతేతిహాసంలోని వ్యక్తులు నేటికీ సజీవంగా మనకు తారసపడుతున్నారు! అందుకే చరిత్రలోకి చూడమంటున్నాం. ఆ సంఘటనల ఆధారంగా, సాహిత్యాన్ని సృష్టించమంటున్నాం. అది, మనల్నే కాదు, భావితరాలకు కూడా సాహసగాథలై ఈ ప్రపంచీకరణమనే పిరికితనాన్ని పారదోలగలదని ఆశించటంలో తప్పులేదు.



అంకుర్‌వాట్

*– సంపాదకులు*

# కమ్మతెమ్మెరలు

✧ "... *మిసిమి* లో కథలకు ఏళ్ళపాటు ఎదురు చూడాలి. ఆ ఎదురుచూపు ఇంత పునీతగా ఉంటుందని పాఠకులెవ్వరూ ఊహించరు. తెలుగులో కథలను ఎంతో సహజంగా చెప్పగల రచయితలను మనమెరుగుదుము. వారు మన గుండెలను పిండగలరు. కాని వారెవ్వరూ, అవి కథలనే స్ఫురణ నుండి మనలను మరిపించగలరని నేననుకోను. కథను ఇంత సహజమైన రీతిలో చెప్పడం సాధ్యమా అనిపించేటంత గొప్పగా ఉంది *భవాని* కథ. రచయితకు హృదయపూర్వక అభినందనలు, *మిసిమి* కి ధన్యవాదాలు..."

– ***కణుగుల వేంకటరావు,*** *శ్రీకాకుళం*

✧ "... కవరు విప్పగానే అందమైన *గోపాలుడు, రాధాకృష్ణులు, అనామిక, గోపిక* చిత్రాలు అద్భుతంగా దర్శనమిచ్చాయి. చిత్రకారుడు ప్రభాకర్ కుంచె నుండి మనోహర దృశ్యాలు రమణీయం...

... ముక్తవరం పార్థసారథిగారి *జీనియస్* వ్యాసం పరిశోధనాత్మకంగా వున్నది. తెలుగు గుబాళిస్తున్నది...

... *చాట్ల శ్రీరాములు* గురించి గొల్లపూడి మారుతీరావు ఎంతో ఆత్మీయంగా నివేదించారు...

... వేదిక *యాత్ర ముగింపు* : గురజాడ తాంబూలం వేసుకుని మరీ గంధర్వలోకాలకు వెళ్ళిపోయారుకదా! మరణం అలా వుండాలి. మారుతీరావు వ్యాసం ద్వారా 'రమణీ ప్రియ దూతిక యిచ్చు కప్పురంపు విడెం వలె' తోచింది. మారుతీరావు చమత్కార గరం గరాలుతో పాటు మిరియాల ఘాటూ, లవంగ మాధుర్యమూ కలగలిపి వ్రాస్తారు. *భవాని* కథలో అందమైన కవిత్వం వుంది. కవిత్వ పంక్తులలో కథ విషాద సౌందర్యం కాక భావసంపదా సౌందర్య మాధుర్యంగా సాగింది. చలం గారు జ్ఞాపకానికి వచ్చారు... ఏదీ! ఈ 'లలిత లతా నికుంజాల గజిబిజిలో, వెన్నెల వేడిలో, పొగడపూల పరిమళాల గిలి గాలులలో ఎన్నాళ్ళకొస్తాడు' రవీంద్రుని *గీతాంజలి* జ్ఞాపకం వస్తున్నది...

... కథ మనల్ని కదిలించి, శూన్యం వైపు – నిశ్శబ్దం వైపు నడిపించింది, అనంత నిరీక్షణలో *భవాని* !... ఓహ్!...

పుల్లారెడ్డిగారు గతంలో వాళ్ళ అమ్మ *ఓబుళమ్మ* గురించి వ్రాసి ధన్యతపొంది – పాఠకులకు ధన్యత కలిగించారు.

*చెన్నారెడ్డి* ప్రాచీనత గల ఆధునికుడు!..."

– ***చెరుకువాడ వెంకటరామయ్య,*** *విస్సాకోడేరు*

✧ "... *మిసిమి* ఫిబ్రవరి సంచికలో వి.ఎ.కె. రంగారావు గారు 'వేదిక' శీర్షికలో రాసిన ఉత్తరం చదివాక ఇది రాయాలనిపించింది... "దేవికారాణి వర్ణచిత్రమంటూ ముఖచిత్రంగా ప్రచురించిన దాంట్లో యేదో తిరకాసు ఉంది" అంటూ ఆ తిరకాసేమిటో ఆయన చెప్పే ప్రయత్నం చేశారు... ఆ వర్ణ చిత్రం దేవికారాణిది కాదన్నారు. "ఆ వర్ణచిత్రం వేసిన సుబ్బులక్ష్మి గారి జ్ఞాపక శక్తిని సంశయించడం" అనడం మాత్రం బాగాలేదు. ఇప్పటికీ ఆమె జ్ఞాపకశక్తి యేమాత్రం తగ్గలేదని వి.ఎ.కె. రంగారావు గారు తెలుసుకుంటే మంచిది. నేను ఎన్నోసార్లు సుబ్బులక్ష్మి గార్ని కలుసుకొని అనేక విషయాలు ఆమెతో మాట్లాడిన వ్యక్తిగా చెబుతున్నాను... ఆమె జ్ఞాపకశక్తి మనందరి జ్ఞాపకశక్తికంటె బావుంది...



చిత్రంలో దేవికారాణి పేరు (హిందీలో) ఉన్నది

ఒక ముఖ్యమైన విషయం – వి.ఎ.కె. రంగారావు గారు ఆ చిత్రం భానుమతి గారిదంటున్నారు. భానుమతి గారి ఫొటో కూడా పంపించారు. ఆ చిత్రం భానుమతిది కాదని కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఆ చిత్రం కాంచనమాలదేనని నాకనిపించింది. ఈ విషయాన్ని ఇప్పటికైనా *మిసిమి* సంపాదకులు స్పష్టం చేస్తే ఈ వివాదం సమసిపోతుంది..."

– ***అంపశయ్య నవీన్,*** *వరంగల్*

✧ "మేము ప్రచురించినది దేవికారాణి చిత్రమే.... ఈ విషయం సుబ్బులక్ష్మిగారు ధృవపరిచారు. ఈ రెండు బొమ్మలు పోల్చి చూసుకోవచ్చు.




మిసిమి నవంబరు సంచిక

✧ "... మార్చి, *మిసిమి* లో కె.ఎల్. రావు వ్యాసం : ఈ బొమ్మ గౌతమ్ పింగిల్ గారిదిగా గమనించండి. –*సం॥*

✧ "... మార్చి, అట్టమీద బొమ్మలు. దలాల్ నా అభిమాన చిత్రకారుడు. కాలెండర్ ఆర్ట్‌లో కూడా పంచరంగులను యధాతథంగా ఉపయోగించడంలో సిద్ధహస్తుడు. ఒక కళగా వృద్ధి చేసిన దలాల్‌కి నేను ఏకలవ్య శిష్యుణ్ణి..."

– ***కొరసాల సీతారామస్వామి,*** *అమలాపురం*

✧ "... చిరునవ్వులు చిందిస్తూ పంచరంగుల వన్నెలతో, నిండుగా ముస్తాబై, ముద్దులొలికే నవ వధువులా ఉన్న ఫిబ్రవరి ***మిసిమి***కి మనసారా స్వాగతం. అనేక కష్టనష్టాల కోర్చి, ఆర్థికంగా లాభదాయకం కాకపోయినా, నష్టాలను భరిస్తూ, సాహిత్యం పైన మీ కుండే మక్కువను పదిమందికి పంచుతున్నారు. అభినందనలు...

... మా చిన్ననాటి స్నేహితుడు శ్రీ కోదూరు పుల్లారెడ్డి గారి *'మా నాన్న చెన్నారెడ్డి'* ఎంతో ఉదాత్తంగా ఉంది. ఎవరి రచనో తెలుపకుండా ప్రచురించిన *భవాని* నన్ను కట్టి పడేసింది. నేను అనేక వేల కథలు చదివాను కానీ, నా మనసును ఆకట్టుకున్న వాటిలో ఇది ప్రత్యేకమైంది. అరుదుగా వచ్చే కథల్లో ఇదీ ఒకటి. రచయిత ఎవరో బాగా చేయితిరిగిన గొప్ప సాహితీ వేత్తలా ఉన్నారు. కథాకథనంలో, పాత్ర చిత్రణలో, భాషా శైలిలో, భావాలను స్పష్టంగా వెల్లడించడంలో తన నేర్పరితనాన్ని ప్రదర్శించారు... ముఖ్యంగా భవాని వ్యక్తిత్వం, మనసుకు హత్తుకొనేటట్లు చేస్తున్నది. ఆ పాత్ర మరుపు రానిదిగా మదిలో తిష్టవేసింది. కథలో ఆసాంతం సెంటిమెంట్ అంతర్లీనంగా ప్రవహించింది. భవాని, శివ వ్యక్తిత్వానికి, బాహ్య సౌందర్యానికి ప్రాముఖ్యతనివ్వకుండా, అతని అంతరంగానికి ఆకర్షితురాలై దరిచేరింది. అర్థాంతరంగా శరీరాన్ని వదలిన శివ విరహాన్ని, వేదనను మరచిపోయే సమయాన, కలల అలల మీద తేలియాడే, స్వప్నాల సౌధంలోని ప్రియనేస్తం తారసపడతాడు. అతనితో చేయికలిపి, శాశ్వతంగా జీవిత భాగస్వామి కావాలని ఉవ్విళ్ళూరే వేళ అనేక అనుభవాలు, సంఘటనలు శివ మాదిరి శాశ్వతంగా దూరమౌతాడేమోనని వెనక్కులాగాయి. ఆ భయం అడుగడుగునా ముందుకు సాగనీయకుండా ఆపేశాయి. అతనికి దూరంగానే ఉందామనే నిశ్చయంతో కథ ఆగిపోయింది... అయినా ఆశ చావలేదు. తాత్కాలికంగా తన ప్రేమ పాశాన్ని పక్కన పెట్టినట్లు అనిపించింది...

... శివ చనిపోయినపుడు భవాని వేదన అంతులేనిది. నా ఒడిలో వున్న శివ శవాన్ని – ఇప్పటి వరకు అతను శివ – ఇప్పుడు శవం, అన్నప్పుడు భాగవతంలో హిరణ్యకశిపుడు చెప్పిన ఒక ఉదంతం గుర్తుకు వస్తున్నది. ఒకావిడ భర్త శవాన్ని ఒడిలో పెట్టుకొని భవానిలా విలపిస్తుంటే, శివుడు ఒక చిన్న బాలునిలాగా ఆమెను సమీపించి "ఎందుకు ఏడుస్తున్నావు" అని ప్రశ్నిస్తాడు... 'నా భర్త చనిపోయాడు.'... 'మరి నీ ఒడిలో ఉన్నది ఎవరు'... 'నా భర్త శరీరం'... "మరిపోయింది ఎవరు? పోయాడనుకున్న భర్త నీ ఒడిలోనే ఉన్నాడు కదా?"... 'ప్రాణం పోయింది.' "నీవు విలపించేది దేని కొరకు? ప్రాణం కొరకా? శరీరం కొరకా? వీరిలో నీ భర్త ఎవరు?" అని ప్రశ్నిస్తాడు.. భవాని కూడా 'నేనెవ్వరిని? ఇది నాకే వింతగా అనిపించింది!' అనుకుంటుంది!... ఇక్కడ 'నీవెవరు?' అనే రమణ మహర్షుల ప్రశ్నకు జవాబు లభిస్తే అద్వైత సిద్ధి కలుగుతుంది... రచయిత అంతర్లీనంగా దీన్ని స్పృశించారనే భావన కలుగుతుంది. పాఠకులను ఆలోచింపచేసే రచనలు అరుదైన రోజుల్లో, ఎడారిలో ఒయాసిస్సులా ఇటువంటివి మా బోటి పాఠకులను నిలబెట్టుతుంటాయి... కథలోని కొన్ని జీవిత సత్యాలు... కాలం ఎవరి కష్టాన్ని పట్టించుకోదు–

... జీవితం మనకు కావలసినట్టు ఎప్పుడూ ఉండదని నా కెప్పుడో కనువిప్పు కాలేదా?... కలల మబ్బుల్ని పిండితే వలపు తేనియలు రాలుతాయా?... ఒకప్పుడు ఉన్నది – ఇప్పుడు లేదనుకుంటే ఆ వెలితి మరింత భయపెడుతుంది...

... నా ప్రేమ స్వరూపం రమణీయం... రమణీయంగా వుండక మరెలా ఉంటుంది..."

***– ఎ.సిద్ధయ్య నాయుడు,*** *కడప*

✧ "... గొల్లపూడి మారుతీరావుగారు ఫిబ్రవరి సంచికలో అనేకమంది చివరి కోరిలను (వేదిక శీర్షిక) వ్రాసినారు. గురజాడ అప్పారావుగారితో మొదలుపెట్టి అనేకమంది, ఒకరు తాంబూలము, మరికొందరు whisky, H.I.V. సోకిన క్రికెట్ ప్లేయర్ అనుభవములు వ్రాసిరి. మీరు అచ్చువేయించినారు. చదువరులకు ఏమి బోధించుటకు మీరు, వారు వ్రాయగా దీనిని అచ్చువేయించినారు. గురజాడ – గిరీశం ప్రస్తుత రాజకీయ నాయకులలో గిరీశముగారి లక్షణములు తెలిపిరి. జపాకుసుమ సంకాశము పేర వారు వ్రాసిన వ్యాసములు వచ్చినవి. చివరగా నేను వ్రాయదలచినదేమనగా ఉరికంబము ఎక్కు నేరస్థుని గూడ కోరికలు గురించి అడిగిన సంఘటనలున్నవి. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. భగవద్గీత మానవుడు ఏ కోరిక తీరక మరణించిన ఆ కోరిక నేరవేర్చుటకు మరల జన్మిస్తారని తాత్పర్యము. మరి గొల్లపూడివారు గొప్పవారుకదా! వారికి ఏ కోరిక మిగిలియున్నదో తెలుపు వ్యాసము వ్రాయుమని కోరవలెను. పత్రికాధిపతిగా మీకు ఆ హక్కు కలదు కదా! దయచేసి ఈ ఉత్తరము కమ్మతెమ్మెరలలో ప్రకటించ కోరుతాను..."

***– ఎమ్. రామానందం,*** *గుంటూరు*

# తెలుగు నందులు - ఒక ప్రారంభం

- గొల్లపూడి మారుతీరావు

ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు ఆర్సన్ వెల్స్ తన 23వ యేటనే అద్భుతమైన చిత్రాన్ని నటించి, దర్శకత్వం వహించి, నిర్మించాడు. దాని పేరు 'సిటిజన్ కేన్'. అమెరికా చలనచిత్ర రంగంలో ఇప్పటికి ఎప్పటికీ 'సిటిజన్ కేన్' ఒక మైలురాయి. విపర్యయం ఏమిటంటే - తర్వాత దాదాపు 50 సంవత్సరాలపాటు తన అనుభవం, పరిణతి పెట్టుబడులుగా అంతకు మించిన చిత్రాన్ని నిర్మించాలని ప్రయత్నం చేసి, నిర్మించలేక ఒక నిర్వీర్యతకు లోనయాడు. ఇది చరిత్ర. మరీ నీరసభావంతో అంటున్నానని అనిపించినా మన నాటకరంగ చరిత్రకి ఈ పోలిక వర్తిస్తుంది. ఈ ఆలోచనని సమర్థించుకుని, పరిష్కారాన్ని చర్చించడానికే ఈ ప్రయత్నం.

ఆధునిక నాటక రంగం గొంతు సవరించుకున్న తొలినాటి నాటకాలు 'పాండవోద్యోగ విజయాలు' వంటివి. అవును. అవే ఆనాడు ఆధునిక నాటకానికి తొలినాటి మణిపూసలు. అవే ఆధునిక నాటకానికి అప్పట్లో కొత్త గొంతులు. 'బావా, ఎప్పుడు వచ్చితీవు?', 'చెల్లియో చెల్లకో తమకు చేసిన యెగ్గులు...'వంటి పద్యాలు ఛందస్సు పడికట్లలో ఇమిడి తేలికగా 130 సంవత్సరాలు సామాజికుల, నటుల, చివరకు పల్లెలలో పశులకాపరుల నోళ్ళలో కూడా నిలిచే జీవలక్షణానికి సంధించిన అపూర్వమైన ప్రయోగాలు. సందేహం లేదు. తిరుపతి వెంకట కవులు ద్రష్టలు. అలాగే మళ్ళీ అంతగా ప్రాణం పోసుకుని ఈనాటికీ నిత్యనూతనంగా నిలిచిన మరో కళాఖండం - గురజాడవారి *కన్యాశుల్కం, ప్రతాప రుద్రీయం, గాంధీ విజయం, రంగూన్ రౌడి, వరవిక్రయం, చింతామణి, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం* వంటి రచనలు ఆనాటి నాటక రంగానికి ప్రాణప్రతిష్ఠను చేసిన నమూనా ఉదాహరణలు. ఇవన్నీ నాటకరంగం ఒక పెద్ద మలుపు తిరగడానికి దోహదం చేసిన మైలురాళ్ళు.

అయితే - ఏమాటకామాట చెప్పుకోవాలి- *రంగూన్ రౌడి, వరవిక్రయం* వంటి నాటకాలు వినా మిగతా రచయితలకు ప్రక్రియ కొత్తదయినా, ఇతివృత్తం కారణంగా పౌరాణిక నేపథ్యం కారణంగా వారి కృషి నల్లేరుమీద బండి. కారణం - సామాజికుల మనస్సుల్లో, సంస్కృతిలో, ఆలోచనల్లో, పలుకుబడిలో నిలదొక్కుకున్న ఇతివృత్తాల కొనసాగింపు కనుక. *శ్రీకృష్ణతులాభారం, గయోపాఖ్యానం, మాయాబజారు* వంటివి - పౌరాణిక ఇతివృత్తం నేపథ్యంలో నాటకీయతకు, విలక్షణమైన శిల్పానికి పెద్దపీట వేసిన గడుసయిన కొనసాగింపులు.

మోతే నారాయణరావుగారి హయాంలో సురభి వారు వేసిన *మాయాబజారు* నేను చూశాను. అద్భుతం! ఎన్.టి.ఆర్., అక్కినేని, సావిత్రి, కె.వి. గారి నిర్మాణ కౌశల్యాన్ని కాస్సేపు పక్కనపెడితే దాదాపు 50 ఏళ్ళ క్రితమే తేలిగ్గా సినిమాను మరిపించగలిగినంత గొప్ప ప్రదర్శన సురభివారిది. నిజానికి సినిమా ఆ నాటకానికి ఒక జల్తారు నగిషీ. మోతే నారాయణరావుగారు ఆఖరి రోజులు విశాఖపట్నం శాంతి ఆశ్రమంలో గడిపినప్పుడు వారి పక్కన నేను ఉన్నాను. నా ఈ అభిప్రాయాలకి ఆనాటి పెద్దల మాటల్ని సాక్ష్యం తెచ్చుకుని బలాన్ని ఇవ్వడానికే ఈ మాట చెప్తున్నాను. ఈ రచనల్లో వస్తువు మేలిమి బంగారం. బంగారం బాగుంటే నైపుణ్యంగల పనివాడి చేతుల్లో నగ రాణిస్తుంది. సరుకు గొప్పది, ఆనాటి సామాజికుల అవగాహన దానికి పట్టం కట్టేది అయినపుడు నాటకరంగం జెగేయమానంగా రాణించింది.



కన్యాశుల్కంలో ఓ సన్నివేశం

మళ్ళీ ఇందులో ఇద్దరు మహానుభావులు ప్రాతఃస్మరణీయులు – గురజాడ, వేదంవారు. అయితే వేదంవారికి ఎంతో కొంత చరిత్ర పెట్టుబడికాగా గురజాడ unsurpassed genius. కనీ వినీ ఎరగని నాటక శిల్పానికి ఇప్పటికి నూటపాతిక సంవత్సరాల ఆయుష్షుని పోసిన స్రష్ట. మరో మహానుభావుడు కాళ్ళకూరి నారాయణరావుగారి *వరవిక్రయం, చింతామణి* అసామాన్యమైన రచనలు. అప్పటికి కొత్త పంథాలో పౌరాణిక ప్రభంజనానికి ధీటుగా నిలిచిన రచనలు. ఆ తర్వాత *వింధ్యారాణి, రంగూన్‌రౌడి* – సినిమా భాషలో సిల్వర్‌జూబ్లీలు కాకపోయినా శతదినోత్సవాలకి నిలిచిన రచనలు.

అయితే ఈ రచనల జాబితాలు ఉటంకించటం ఇక్కడ ఉద్దేశం కాదు. 'ఆధునికం' పేరిట కొత్త మలుపు తిరిగిన లేదా తిప్పిన ఓ అపూర్వమైన అధ్యాయం ఈ దశలోనే ప్రారంభమయి, కొనసాగి, దరిమిలాను సామాజికుల ఆదరణని అలుసుగా తీసుకుని ఇద్దరు కృష్ణులు, నాలుగు పద్యాలుగా వెర్రితలలు వేసి క్రమంగా నీరుకారింది.

ఈ నాటకరంగ వైభవానికి, సామాజికుల హృదయాల్ని రసప్లావితం చేసిన ఈ స్వర్ణయుగానికి ఆయువుపట్టు ఏమిటి? పురాణ గాథల్ని, వాటితో ముడివడిన సనాతన ధర్మాన్నీ, సంస్కృతినీ పరిపుష్టం చేసే ఇతివృత్తాలు. అవి ఆయా నాటకాలకి మినిమం గ్యారంటీని ఇచ్చాయి. అవి నాటకరంగ వైభవానికి insulation. ఈ ఇతివృత్తాలు కొన్ని దశాబ్దాలపాటు కొత్తగా వచ్చిన సినీప్రక్రియకు కూడా ప్రాణంపోశాయి. పదేపదే అవే కథల్ని, అవే మూలాల్నీ మార్పులు చేసి చూపినా అవే విలువల్ని గుర్తుపట్టి ప్రేక్షకులు ఉదారంగా అక్కున చేర్చుకున్నారు. యముడికి కోల్గేట్‌తో పళ్ళు తోమించినా, నారదుడు నాసిరకం హాస్యానికి అద్దం పట్టినా, చిత్రగుప్తుడు వెర్రి మొర్రి గెంతులు వేసి హాస్యపాత్రగా చక్కిలిగింతలు పెట్టడానికి తాపత్రయపడినా ఆయా ప్రయత్నాల visual distortions ని శతాబ్దాల విశ్వాసాల వెల్లువ భరిస్తూ వచ్చింది. దీన్ని అలుసుగా తీసుకుని సినీ నిపుణులు లక్ష్మణరేఖని దాటిపోయారు. శ్రీకృష్ణుడినీ, నారదుడినీ, యముడినీ ఇలా చాలా పాత్రల్ని వీధిన పడేశారు. ఏదీ? ఏసు ప్రభువునీ, మహమ్మద్ ప్రవక్తనీ ఆ పని చెయ్యమనండి. ఎక్కడో డెన్మార్కులో ఒక పత్రిక వేసిన ప్రవక్త కార్టూన్లు ప్రపంచాన్ని అట్టుడికించాయి. అమ్మని 'అమ్మా' అని పిలవడం ఒక విలువ. అది సమాజం మానసిక ఆరోగ్యానికి నిదర్శనం. అమ్మని 'నీయమ్మ' అనడం వినోదం కాదు. వికారం. It is decadence, Intellectual debauchery. తల్లికి కూతురు పెళ్ళి చేసే కథ ఆ మధ్య టీవీలో వచ్చింది. అది మంచి అభిరుచి అని నేను అనుకోను. సంప్రదాయానికి దూరంగా జరుగుతూనే ఆలోచింపజేసిన మరొక టీవీ కథ. పిచ్చివాడనుకున్న వ్యక్తి భార్యని ఎవరో మోసం చేసి అనుభవించాడు. ఇంటిల్లిపాదీ ఆమెని బయటికి గెంటెయ్యాలని ధ్వజమెత్తారు. భర్త కిమ్మనలేదు. పెరట్లో రామాయణం పేజీల్ని సబ్బుతో కడుగుతున్న పిచ్చి భర్త మీద టీవీ నాటకం ముగిసింది. అర్థంకాని మళయాళ భాషలో ఈ నాటకాన్ని కొచ్చిన్ హోటల్లో చూస్తూ వణికిపోయాను. తర్వాత తెలిసింది – సంవత్సరాల తర్వాత మా గొల్లపూడి శ్రీనివాస్ మెమోరియల్ పురస్కారాన్ని అందుకున్న రెండో సంవత్సరం విజేత శ్యామాప్రసాద్ ఆ రచనని చేశాడని. మారే విలువలకీ, దృక్పథంలో మార్పుకీ అద్దంపట్టే రచన ఇది. గేలరీలను నవ్వించి, గోళ్ళూడగొట్టి వసూళ్ళు చేసే సినిమా కాదు. ఇందులో సంప్రదాయాన్ని ప్రశ్నించడం ఉంది. ఆ ప్రశ్న వెనుక కారుణ్యం, ఆర్ద్రత, దయ వంటి ప్రతిపాదన eternal value ఉంది.

నరనారాయణులు పురాణాలలో నిక్షిప్తమైన పాత్రలు, ఒక విచికిత్స కోసం వారిద్దరూ తగాదాపడితే? ఇది healthy poser. ఫలితం గయోపాఖ్యానం. భర్తపట్ల భక్తికీ, అభిజాత్యానికీ తగాదా వస్తే? ఫలితం – శ్రీకృష్ణతులాభారం. సంప్రదాయం అంగీకరించిన సత్యాన్ని పరీక్షకి పెడితే అది మనల్ని tikle చేస్తుంది. వెక్కిరిస్తే – వాంతి అవుతుంది. ఆ మధ్య ఓ చక్కని పౌరాణిక చిత్రంలో ఇద్దరు వేదపండితులచేత పేడని తినిపించారు ఒక మహానుభావుడు. ఇది దిక్కుమాలిన హాస్యం మనకి.

శాశ్వత విలువల విశ్లేషణ మన దేశానికే కాదు, మన భాషకే కాదు – అన్ని దేశాలకీ, అన్ని భాషలకీ వర్తిస్తుంది. శాశ్వతమైన విలువల్ని ప్రతిపాదించే ఏ ఇతివృత్తమైనా దేశ కాల పరిస్థితుల్ని దాటి నిలుస్తుంది. ఈ రహస్యాన్ని గుర్తించి – ఒక కొత్త ప్రక్రియని నూరేళ్ళ కిందటే చిరస్మరణీయం చేసిన రుషి ఒకాయన ఉన్నాడు. ఆయన పేరు వాల్ట్ డిస్నీ. The Lion King నాటకాన్ని నేను లండన్లో చూశాను. The beauty and the beast ని ఇంగ్లండులో కొన్ని వేలమంది పిల్లల మధ్య కూర్చుని చూసి పులకించాను. నా మనుమరాలు ఆ కథని ఇండియాలో ఆవేశంగా చెప్పింది. అదీ శాశ్వత

విలువలకి ఉన్న మన్నిక. అదీ ఆనాటి పాండవోద్యోగ విజయాల బలం. వెరసి ఆనాటి ఆధునిక నాటకరంగ ఆరోగ్య లక్షణం. ఆ నాటకాల్ని ఇంటెలిజెన్స్‌తోకాక ఇన్‌స్టింక్ట్‌తో, విచక్షణతోకాక విశ్వాసంతో బేరీజు వేసుకునే పసి హృదయాల సమీకరణ ఆ విజయానికి పెట్టుబడి. నేను కేవలం పిల్లల గురించి మాత్రమే చెప్పడం లేదు. ఆనాటి ఆధునిక నాటకాల నుంచి ఈనాటివరకూ నాటకం రాణింపుకి వయోపరిమితి ఆంక్ష కాదని ఉదహరిస్తున్నాను. For great theatre the appeal is ageless. ఈ రహస్యాన్ని కనిపెట్టినవాడు వాల్ట్ డిస్నీ. ఏనాడో కనిపెట్టి - వెకిలి మార్గాలలో పడి మరిచిపోయినవాడు తెలుగు నాటక ప్రయోక్త. ఇది ఒక పార్శ్వం.

మరి ధర్మమూ, కాకరకాయా పక్కనపెట్టినా 400 సంవత్సరాల కిందట షేక్స్పియర్ నాటకాలనీ, చదవడానికే కొరకరాని కొయ్యలుగా ఉండే క్రిస్టోఫర్ ఫ్రై వంటివారి నాటకాలనీ, సంగీత రూపకాలనీ super industrial nations - ఇంగ్లండు, అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలో చూస్తున్నారే! ఇందుకు కారణం ఏమిటో గుర్తుపట్టగలిగితే మనమూ తెలుగు నాటకాన్ని ఆకాశాన నిలపగలం. నిజానికి ఆ పని మనకి తేలిక. ఎందుకంటే మనం వెర్రితలలు వేస్తున్నా పాత విలువల కారణాలకే ఇంకా ప్రేక్షకులు ప్రదర్శనల్నిచ్చి చూస్తున్నారు కనుక.

ఈ నిజాన్ని గ్రహించడానికి కొందరికి జీవితకాలం పట్టింది. నార్లవారు గొప్ప మేధావి. ఈ జాతి గర్వించదగ్గ పాత్రికేయులు. అయితే ఆయన గొప్ప నాటక రచయిత కాదు. పురాణ పాత్రల్ని వెక్కిరించే రచనలు – ఆయన స్వయంగా అనుభవిస్తూ, ఆనందంగా చదవగా నేనూ, పురాణం సుబ్రహ్మణ్య శర్మ విన్నాం. మన తరంలోనే మనం రామాయణ కల్పవృక్షాల్నీ, విషవృక్షాల్నీ చూశాం. సావిత్రి, పురూరవ వంటి నాటకాల్ని intellectual excursions గా చలంగారు రాశారు. ప్రముఖ నవలారచయిత లాయడ్స్ డగ్లస్ 'ది రోబ్' అనే నవలని ఎందుకు రాశాడో వివరిస్తూ ఒక మంచి వ్యాసం రాశాడు. *కళావని* సంచికకి, "అలాంటి నాటకాలు ఎందుకు రాశారో తెలపండి" అని చలంగారికి ఉత్తరం రాశాను. "ఇంకెన్నటికీ అలాంటి పని చెయ్యనని మీ పత్రికలో ఓ పేజీలో వెయ్యండి. ఈశ్వరాశీర్వాదాలతో – చలం" ఇదీ ఉత్తరం. అప్పుడప్పుడు ఇలాంటి రచనలు – పురాణాలలో, ప్రబంధాలలోని పాత్రలను వెక్కిరిస్తూనో, వక్రభాష్యాలు చేస్తూనో వస్తూనే ఉన్నాయి. ఇవి చెప్పుకోడానికి రుచిగా ఉంటాయి. శ్రీకృష్ణుడు ముండల ముఠాకోరు – అనడం సరదాగానే ఉంటుంది – అది అభిరుచి దారిద్ర్యమైనా. కానీ – విషయమేమిటంటే – సమాజంలో institution గా స్థిరపడిపోయిన ఇతివృత్తాలు, పాత్రలు – కొత్త అన్వయాలకి లొంగవు. కాగా ఎదురుతిరుగుతాయి. ఇది గత వైభవాన్ని వాడుకుని తమ విజ్ఞతని చాటుకోవాలనే కక్కుర్తి. మీరు క్షమిస్తే – అమ్మని 'లం' అని నిరూపించే కొత్త అన్వయానికి చేసే ప్రయత్నంలాంటిది.

సంప్రదాయంలోనో, జాతి పలుకుబడిలోనో నలిగిన ఆ పాత్రల పాపులారిటీ కేవలం పాత్రలకే కాదు, తరతరాలుగా ఈ జాతి వాటిపై ఉంచిన విశ్వాసాల బరువది. వాటిని పెల్లగించటం అసందర్భం, అసంభవం, అనవసరం, అనర్థం. ఇందుకు ఇద్దరి సాక్ష్యాలను మాత్రమే ఇక్కడ ఉటంకించాను. అది శతాబ్దాలుగా ప్రజల మనస్సుల్లో స్థిరపడిన thought process. నెమలి పింఛం కారణంగా శ్రీకృష్ణుడు మహానుభావుడైతే మన నెమళ్ళన్నీ ఈపాటికే బ్రిటీష్‌వారి టోపీల్లో సమాధి అయి వుండేవి. ఒక పాత్రీకరణకు అది angularity. అది సంబద్ధమని కొందరికి తమ జీవిత కాలంలోనే అర్థమయింది, మరికొందరికి వేళమించిపోయింది.

సనాతన ధర్మమంటే వాసెనగట్టిన ఆవకాయ జాడీకాదు. పూర్వులు తమ emperical norms తో తూకం వేసి మన మనుగడను సుఖవంతం చేయడానికి నిర్దేశించిన జీవన సూత్రాలు. మన పూర్వులేకాదు, ప్రతీ దేశంలోనూ, ప్రతీ జాతిలోనూ ఈ పెద్దలు ఉంటారు. వీటికీ, దేవుడికీ, మతానికీ, పంగనామాలకీ, నిలువుబొట్లకీ ఏమీ సంబంధం లేదు.

ఈక్వేటర్‌కి దగ్గరగా ఉన్నవాడు వేడిని తట్టుకోడానికి తన మార్గాన్ని వెతుక్కుంటాడు. "దీనికింత శ్రమ ఎందుకయ్యా, ఈక్వేటర్‌ని కాస్త పక్కకి తోస్తే పోలా?" అనడం విప్లవం కాదు. అలా వాదించి, నాలిక కొరుక్కున్న పెద్దల సాక్ష్యం ఉంది కనుక ఈ వాక్యాలు, పేర్లు, చాలామంది సాహితీపరుల మనస్సుల్లో ఈపాటికి కదిలే ఉంటాయి. ప్రత్యేకంగా ఉటంకించనక్కరలేదు.

ఇప్పుడు ఆధునిక నాటక రంగంలో రెండో దశ. అది మా తరం. ఇందులో నా తరం మళ్ళీ రెండోది. మొదటితరం – ఆత్రేయ, నరసరాజు, పినిశెట్టి, సుంకర, వాసిరెడ్డి, కొడాలి

తదితరులు. వీరంతా సంప్రదాయపు మూలాలకు దూరంగా నడిచి – సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసే సరికొత్త పంథాని నిర్వహించిన పెద్దలు. ఇక్కడ మళ్ళీ – ఈ ఇతివృత్తం కొత్తదనం ఆయా రచనలకి మినిమం గ్యారంటీని ఇచ్చింది. సుంకర వాసిరెడ్డి *మాభూమి*, ఆత్రేయ *ఎన్.జి.ఒ.* ఆనాటికి పెద్ద అంగలు. ఆనాటి ప్రజా నాట్య మండలి (IPTA) సభ్యులు బలరాజ్ సహానీ ఈ నాటకాన్ని ముసలయ్య అనే తన డ్రైవర్‌ని పక్కన కూర్చోపెట్టుకుని హిందీలోకి తర్జుమా చేయించుకున్న ఉదంతం రాసిన ఉత్తరం నా దగ్గర ఉంది. ఈ దశలో రెండో దశలో రెండోతరం – కొర్రపాటి, గొల్లపూడి, భమిడిపాటి, నంది, పాత్రో మొదలయినవారు. ఇక్కడికి వచ్చేసరికి ఓ పెద్ద పరిణామం చోటుచేసుకొంది. రచనలో, ప్రక్రియలో, ప్రయోక్త ప్రయోగంలో ఈనాటి నాటకరంగం రాణించినా – తొలినాటి నాటక రంగానికి దక్కిన prolonged patronageని కోల్పోయింది. కారణం? ఈ తరంలో మనిషి జీవనంవేపు, సామాజిక చైతన్యంవేపు, అభ్యుదయం వేపు, సామాజిక రుగ్మతలవేపు మోరసారించాడు. ఈ స్పృహ నిజానికి గొప్పదీ, కొత్తదీ, ఆ దశలో ఆశించదగినదీను. అయితే రాణింపు విషయంలో గతకాలపు నాటకానికిగల 'రుచి' దక్కలేదు. ఈ ప్రదర్శనలు గొప్పవి. *కీర్తిశేషులు, మరో మొహంజొదారో, రాగరాగిణి* రాణించాయి. కాని గతకాలపు నాటకంలాగ Sustained patronage కి నోచుకోలేదు. ఎందుకని? ఆ నాటకాలకి దమ్ము చాలకా? పదేపదే చూడాల్సిన ఉత్సాహాన్ని ఇవ్వలేనందుకా? నాటకం ఆదరణని కోల్పోయిందా?




అవును, కొంతవరకూ నిజమే. ఈ నాటకానికి ఈ మాత్రం ఆదరణ చాలదు. ఇవాల్టికి కూడా రెండో ప్రపంచ యుద్ధం రోజుల్లో జె.బి. ప్రీస్ట్లీ రాసిన *ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్* ఆరవ విడత నిర్వహణని ఇంగ్లండు వెస్టెండులో చూస్తున్నారు. *మర్డర్ ఎట్ ది వికారేజ్, విట్‌నెస్ ఫర్ ది ప్రాసిక్యూషన్* వంటి నాటకాలకు పోలిస్తే అగాథా క్రిస్టీ *మౌస్ ట్రాప్* గొప్ప నాటకమేమీ కాదు. కాని, గత 64 సంవత్సరాలుగా వెస్టెండులో ప్రతిదినం ప్రదర్శింపబడుతూ ప్రపంచ చరిత్రను సృష్టించింది. మరి మన దేశంలో ఏమయింది? బొంబాయిలో హిందీ నాటకాన్ని చూస్తున్నారు. పొరుగు రాష్ట్రంలో ఏ నాటకమయినా తేలికగా వంద ప్రదర్శనలివ్వగలదు. మన తెలుగు నాటకం క్షీణ దశలో ఉన్నదని చాలమంది పెదవులు విరిచారు. ఆ మధ్య ఒక టీవీ ఇంటర్వ్యూలో ఒకమ్మాయి 'ఈనాటి నాటకరంగం అడుక్కు తినడానికి కారణం ఏమిటండి?' అని అడిగింది – దాదాపు గర్వంగా తనెప్పుడూ నాటకాన్ని చూడలేదంటు. నేను కేవలం నాటకాన్ని చూడటానికే కనీసం ఏడెనిమిదిసార్లు ఇంగ్లండు వెళ్ళి ఉంటాను. నన్ను ఆ దేశానికి ఆహ్వానించిన ప్రతి ఆహూతులకూ నాటకం చూపించాలని షరతు విధిస్తూ ఉంటాను. మరి మన రాష్ట్రంలో లోపం ఏమిటి? ఊరూరా నాటక శాలలు నిర్మిస్తే నాటక ప్రదర్శనలు జరుగుతాయని కొందరు భావించారు. మంచి వంటగదులు నిర్మించినంత మాత్రాన మంచి వంటకాలు తయారు కావు. మంచి వంటవాడికి వంటగది అగత్యం కాదు, అదనపు సౌకర్యం.

ఆ మధ్య జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బహుమతిని గెలుచుకున్న ఒక ప్రయోక్త లేచి, "బాబోయ్, మాకు కావలసింది బహుమతులు కావు. పదిమందికీ నాటకాన్ని చూపే అవకాశం" అని వాపోయాడు. ఆనాటి సభకి నేను అధ్యక్షుడిని.

విదేశీ నాటకాలు కొన్ని సంవత్సరాలుగా చూస్తున్నవాడిగా మన దేశంలో ఆయా విభాగాలలో ప్రావీణ్యం ఏ దేశానికీ తీసిపోదు. గొప్ప నటులూ ఉన్నారు, గొప్ప సాంకేతిక నిపుణులూ ఉన్నారు. అయితే ఇవాళ ప్రతిదినం ముంబయిలో, చెన్నైలో నాటకాన్ని చూస్తున్నట్టు యిక్కడ ఎందుకు చూడడంలేదు?

నాటకం చూడడం వ్యసనం. ఆ మాటకు వస్తే ఏ 'రుచి' అయినా అలవాటుగా వంటపట్టినప్పుడే స్థిరపడుతుంది. మా నిన్నటి తరం రచయితలకు ఇతివృత్తం కలిసివచ్చింది. వారి ప్రతిభ అలంకరించింది. ప్రేక్షకుల అలవాటు ప్రక్రియకి ప్రాణం పోసింది. మా తరం రచయితలు – క్రొత్త ఇతివృత్తాల్ని ఎత్తుకుని, కొత్తగా చెప్పడానికి పూనుకుని, కొత్త ప్రేక్షకులని గుత్తగా సంపాదించుకోలేక అవస్థ పడుతున్నారు. ఈ పనిని పొరుగు రాష్ట్రం చేసి విజయాన్ని సాధించింది. ఇక్కడ ప్రభుత్వం తెలుగునాట తెలుగు నాటకానికి ఓ ఆరోగ్యకరమైన పోటీనీ,

ఉత్సవాన్నీ ఏర్పరచి, నంది బహుమతులతోపాటు, నగదుని ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల ప్రయోక్తను వెనకేసుకు వస్తున్నాను. తిరుపతిలోనో, హైదరాబాదులోనో ఒక ఉత్సవంలో, ఒక ప్రదర్శనలో చూపిన ప్రతిభ, దాని గుర్తింపు, ఆర్థికమైన పారితోషికం నాటక రంగానికి ఉపకరించదు. ఈమధ్య క్రేజీ మోహన్ అనే తమిళ నట ప్రయోక్త కొత్త నాటకం *గూగుల్ ఘటోత్కచ* చూశాను. హాస్యరచన. నాటకం బాగానే వుంది. అప్పుడే అయిదారు వందల ప్రదర్శనలు జరిగిపోయాయి. హిందూ పేపరు తెరిస్తే ప్రతీరోజూ ఎక్కడో ఒకచోట ఆ ప్రదర్శన జరుగుతూనే ఉంటుంది. అదీ నాటక రంగానికి ఊపిరి. నాటకాన్ని వేసే వనరులు కాదు, నాటకాన్ని చూసే, చూపే వనరులు ఏర్పడాలి.

ఏటా ఎంపిక అయిన ఉత్తమ నాటకాన్ని ఔత్సాహిక స్థాయి నుంచి ప్రొఫెషనల్ స్థాయికి అలంకరించే స్థోమతుని – ఏ యిరవై, ముప్పై లక్షలో ఖర్చు చేసి నాటకానికి ప్రొఫెషనల్ స్థాయిని, అదనపు అలంకారాన్ని, రుచినీ – వెరసి నాటకాన్ని కేవలం నాటక ప్రియులేకాక – నాటకం అంటే బొత్తిగా అవగాహన లేని, అక్కరలేనివారినీ ఆకర్షించే ప్రక్రియగా మలచాలి. ఇది విధిగా ప్రభుత్వమే చేయగలదు, చెయ్యాలి. మొన్నటి ఆధునిక నాటకానికి ఉన్న పౌరాణిక ఇతివృత్తపు రుచి, పద్యాల, సంగీతపు మత్తుని వదులుకున్న – ఈనాటి ఆధునిక నాటకానికి ఇటువంటి ఊతం అవసరం. ముఖ్యంగా Non-denominational audiences ని రంగస్థలంలో కూర్చోపెట్టగలగాలి. ఈ పనిని లండన్‌లో, బ్రాడ్వేలో ప్రతీ నాటకం చేస్తోంది. కారణం వారికి ఉన్న వనరులు, దొరికిన ఊతం. ఈ పనిని తప్పనిసరిగా ప్రభుత్వమే చేయగలగాలి. ప్రతీరోజూ నాటక ప్రదర్శనకి ఆ నటులే వేర్వేరు కారణాలకి కలిసిరాలేకపోవచ్చు. కనుక ముఖ్యపాత్రలకి అండర్ స్టడీస్ (ప్రత్యామ్నాయ నటులు) సిద్ధమవుతారు. అంటే, నాటకం ప్రదర్శన సీజన్ అయేనాటికి వేర్వేరు విభాగాలలో నిపుణులు రూపుదిద్దుకుంటారు. కలకత్తాలో ప్రముఖ నటుడు శంభుమిత్ర నాటక సమాజం బహురూపి తరపున *రక్త కొరబి* (Red Oleanders) చూశాను. ప్రతీరోజూ ఆఫీసుకు వెళ్ళి వచ్చే వ్యక్తి సాయంకాలం థియేటర్‌కి వచ్చి నాటకం వేసి ఇంటికి వెళ్తాడు. ఏ కారణంచేతనయినా రాలేకపోతే ప్రత్యామ్నాయ నటుడు ఆ పాత్రని ఆనాటికి నటిస్తాడు. ఈ కారణంగా నాటక సమాజం సమగ్రమూ, సంపూర్ణమైన దక్షతని సంపాదించుకుంటుంది. ఒక సంవత్సరం పాటు ఉత్తమ పోటీ నాటకం ప్రదర్శితం కాగలిగితే రెండు జరుగుతాయి.

1. నాటకం రుచి ప్రేక్షకులు మరుగుతారు. 2. రంగస్థలానికి ఆర్థికమైన, ఆలంబనమైన బలం దక్కుతుంది. ఇంగ్లండులో రాయల్ షేక్స్పియర్ కంపెనీ ప్రధాన పోషకురాలు – ఎలిజబెత్ మహారాణి. తెలుగు నాటకానికి ఈ రాష్ట్రపు ముఖ్యమంత్రి పోషకుడు కావడం ఎంత బలాన్నిస్తుంది?

Consistency creates habit. Continuity moulds the taste. Enjoying good art, having good taste is the ultimate goal of any good theatre.

ఆర్సన్ వెల్స్ తన విజయాన్ని ఒక జీవితకాలంలో పునరుద్ధరించుకోలేకపోయాడు. తొలినాటి మహానుభావులు, ప్రయోక్తలు తీర్చిదిద్దిన ఆధునిక నాటక రంగాన్ని మళ్ళీ ఆ స్థాయికి తెచ్చుకోలేకపోతున్నాం. కారణం – నాటకం మారింది. నాటకం అపీలు మారింది. అలవాటు కావలసిన ప్రేక్షకులని నాటకశాలలకు ముమ్మరంగా ఆహ్వానించగల వ్యవస్థ ఏర్పడలేదు. 'చూపే' వ్యవస్థకి ఊతం ఇస్తే చాలదు. 'చూసే' వ్యవస్థని తరిఫీదు చేసుకొనే ఊతం కావాలి. వంటవాళ్ళని భుజం తట్టితే చాలదు. వారి వంటను మెచ్చి, భుజించే రసజ్ఞుడిని సిద్ధం చేయాలి. ఆ ఉపకారం సాధికారికంగా, ప్రభుత్వమే చేయగలగాలి. పూనుకుంటే చేయగలదు.

మరొక్కసారి – ప్రభుత్వం సాగిస్తున్న నందీ నాటకోత్సవాలు ఆనందించదగ్గ చర్య. కాని సుస్థిరమైన 'అభిరుచి'ని ప్రోదు చెయ్యడానికి ప్రభుత్వం ఊతం – ఈ దశలో ఆధునిక నాటకాన్ని కొత్త మార్గంలో నిలపగలదు. అప్పుడప్పుడు కళ్ళు మిరుమిట్లు గొలిపే నాటక ప్రయోగాలు నాటకరంగ చరిత్రలో మైలురాళ్ళు. కాని చరిత్ర – ఆ మైలురాళ్ళవేపు నిరంతర ప్రయాణం, ఎందుకంటే – Theatre does not live by masterpieces, but between them.




గొల్లపూడి మారుతీరావు
విశాఖపట్నం.
email : gmrsivani@gmail.com


(ఈ వ్యాసం ఇటీవల తన జీవన్నాటకానికి తెరదించిన 'చాట్ల శ్రీరాములు'కు అంకితం!)

# కథన మీమాంస

*- గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

కథ కట్టడం ఎంత కష్టమో తెలీదు కాని, కథను పట్టుకోవటం మాత్రం చాలా కష్టం.

ఈ కష్టం ఇతర పాఠకులెవరికీ లేకపోవచ్చు. చదివి సుఖమో, దుఃఖమో, చిరాకో ఏదో ఒకటి అనుభవిస్తారు. ఈ 'అనుభవం' కోసమే వారు చదువుతారు. లోకంలో తాము అనుభవించని పార్శ్వాన్ని, కథ ద్వారా అనుభవించడానికి! కానీ, అధ్యయన రంగంలోని పాఠకులలా కాదు. దాన్ని ప్రత్యేకంగా పఠించి, దానిపై తమ విద్యావ్యాసంగాన్ని సాగించాలి. లేదంటే, 'విశ్లేషించి, వివేచించడం కూడా నేర్పించడంలేదు, ఈ తెలుగు డిపార్ట్‌మెంట్లను మూసేస్తేకానీ, తెలుగు చదువులు బాగుపడవు' అని ఏ ఇస్మాయిల్ లాటి పెద్దలో కోప్పడతారు. లోకంలో పెద్దలు ప్రవేశపెట్టిన వాటికి, ఓ శాస్త్రీయ క్రమం కూర్చి, పిల్లలకు శిక్షణ ఇచ్చేవి విశ్వవిద్యాలయ విభాగాలు. స్వంతంగా ఏదో కొన్ని సూత్రాలను, సిస్టమ్స్‌ను కనిపెట్టొచ్చేమో కాని, ప్రక్రియల్ని, వస్తువుల్ని, వాటి గతిని, గతి వివేకాన్ని కనిపెట్టలేవు కదా! ఆ వివేకాల వద్దనే అసలు గొడవంతా వస్తోంది.

కథను గురించి మాట్లాడేవాళ్ళలో, 'కథ'ను పట్టుకొని, దాని 'కట్టుడు' గురించి మాట్లాడేవాళ్ళు తక్కువమంది. *కథావస్తువులోకి వెళ్తున్నట్లే వెళ్తూ, దాని సామాజిక నేపథ్యంలోకి, దాన్ని నియంత్రించే రాజకీయ భావజాలాల్లోకి వెళ్ళిపోయేవాళ్ళు ఎక్కువమంది. చాలామంది దృష్టిలో కథ ఒక సాహిత్య ప్రక్రియగాకంటే, 'సామాజిక ప్రక్రియ'గా మారిపోతోందా? వీరు సామాజిక విశ్లేషకులుగా పరివర్తనం పొందుతున్నారా? అనే అనుమానాలు తరచూ కలుగుతాయి. 'సాహిత్యం సమాజానికి ప్రతిబింబం' అనే మాట ఎంత నిజమో, అది 'అద్దంలో బొమ్మ' కాదనడం కూడా అంతే నిజం.*

సమాజానికి, సమాజ శాస్త్రానికి ఎంత స్వతంత్ర ప్రతిపత్తి ఉందో, సాహిత్యానికి, సాహిత్య శాస్త్రానికీ అంతే స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. ఆయా విషయాల అధ్యయన రంగంలో వాటి స్వతంత్ర ప్రతిపత్తిని పాటించి, సాగడమే గమ్యం.

'కథానిక' అభ్యుదయ భావజాలం బాగా వ్యాపించిన దశలో, పత్రికా ప్రపంచం అభివృద్ధి పరచిన సాహిత్య ప్రక్రియ అనడంలో ఎటువంటి సందేహమూలేదు. కేవలం వినోదం కోసం వచ్చే కథల్ని ఓ పక్కన ఉంచితే, సామాజిక బాధ్యతతో వచ్చే కథల్లో, ఆ అభ్యుదయ భావజాలం, ప్రజాసామాన్య రుచి - శుచి తప్పక పనిచేస్తాయి. వాటిని గుర్తించి, లోతుగా పరిశీలించడమే 'అధ్యయనం'. అయితే, అభ్యుదయ భావజాలం కమ్యూనిస్టు దృక్పథాలకు పర్యాయపదం కాదు. అలా కొందరు పట్టుబట్టి ప్రచారంలోకి తెచ్చినా అది వాస్తవం కాదు. సమాజంపట్ల తపన పడే ప్రతి బుద్ధిజీవీ, ఆదర్శ కల్పనల్లోకి వెళ్ళకుండా, ఆదర్శ వాదాన్ని తగ్గించుకొని, వాస్తవ వాదంతో చేసే ఆలోచనలు, స్పందనలు అన్నిటి సమాహారం అభ్యుదయతత్వం. అయితే, ఆ క్రమంలో సృజనను మరీ ఓ కృష్ణద్వైపాయనుని ద్వీపంలా మార్చేసి, ఆత్మవిచారంలో మునిగిపోతూ, ఆ విచారాన్ని అర్థంకాని వ్యక్తిగత సంకేత భాషలో చెప్పే ప్రతీక వాదమూ కాదు. వీటికి విరుగుడుగానే రష్యన్ రూపవాదం మొదలైంది. అయితే, అది మరో విపరీత ధ్రువం వైపు చూసింది.

పతనోన్ముఖమైన బూర్జువా (Burgois) సంస్కృతికి వ్యతిరేకంగా, రష్యన్ విప్లవానికి ముందే, ప్రారంభమైన రష్యన్ ఫార్మలిస్టు (రూపవాదు)ల్లో తొలితరం వారు, వారిలోనే కలిసిపోయిన అప్పటి ఫ్యూచరిస్టులు, 'సృజన'కున్న ప్రత్యేక వ్యక్తిత్వాన్ని పూర్తిగా పక్కనపెట్టేశారు. 'సాహిత్యం ఒక పనిముట్టు మాత్రమే', 'ఇతర వృత్తి కార్మికుల్లాగా, రచయిత / కళావిదుడు కూడా చేతివృత్తి నైపుణ్యం చూపే వస్తు తయారీదారు మాత్రమే' అన్నది వారి ప్రధాన దృక్పథం. ద్మిత్రీవ్ (Dmitriev) మాటల్లో - 'The artist in now simply a constructor and technician, a leader and foreman' (Qtdin 'A Reader's guide to contemporary Literary Theory' by Raman Selden'. P.9) అనే మాటలు అప్పట్లో

సుప్రసిద్ధం. ఈ దృక్పథాలకు తార్కికమైన సహజ పరిణామమే, సాహిత్యం ఓ 'ప్రొడక్షన్ ఆర్ట్'గా పెరగడం. ఈ ధోరణి, తరువాతి కాలంలో, రచనల్లో వ్యాపారాత్మకతను పెంచేసింది. రచనాధర్మాలనూ, ప్రయోజనాలనూ మార్చేసింది.

దాన్నలాగుంచితే, సాహిత్యాన్ని కూడా ఓ craft - కుశలకర్మ, పనితనంగా చూసే ఈ నేపథ్యం నుంచే 'రూపవాదం' ప్రారంభమై కొన్ని మలుపులు తిరిగినా, తన విశిష్టతను ధ్రువపరచుకొంది. కార్మిక శబ్దం కవాతు నుంచి కవుల్ని, రచయితలను తరువాతి కాలంలో మినహాయించినా, రచయితల 'సాంకేతిక ప్రజ్ఞ'నూ పనితనం నైపుణ్యాలను (Craft skills) విపులీకరించడానికి వాటికి ఓ శాస్త్రీయ క్రమాన్ని ఇవ్వడానికి ప్రయత్నించింది. ఫలితంగా కేవలం భావజాలం గురించి, సామాజిక వాదాల గురించి ఏకరువు పెట్టటం మానేసి, సృజనాత్మక రూపంలో, కీలకమై, శాస్త్రీయ వివేచనలకు అవకాశమిచ్చే సాహిత్య సాంకేతికతలను నిరూపించి చెప్పగలిగింది. ష్లోవ్‌స్కీ (Shklovsky) సాహిత్యాన్ని గూర్చి ఇచ్చిన ప్రసిద్ధ నిర్వచనం the sum total of all stylistic devices employed in it' – ఈ దశలో వచ్చిందే. తర్వాత యాకొబ్‌సన్ (Jacobson) చేతిలోనూ, భక్తిన్ సంప్రదాయం (Bhaktin School)లోనూ, రూపవాదం + మార్క్సివాదం సున్నితంగా కలిసిపోయి, పై డివైసెస్ – తాంత్రికతల – నిరూపణ మరింత నిశితమై, రూపవాదం ఓ విధమైన నిర్మాణ క్రమతా (స్ట్రక్చరలిస్ట్) వాదంగా పరిణామం పొందినా, కథాకథన నైపుణ్యాల గురించి మాత్రం ఖచ్చితంగా వారివల్లనే అవగాహన పెరిగింది. కథాకథన శాస్త్రం (narratology) నిస్సందేహంగా రష్యన్ రూపవాదులు అభివృద్ధి పరచిందే. ఈ అంశంపై ప్రస్తుత వ్యాస రచయిత 1986 చివర హైదరాబాదులో నిర్వహించిన ఓ బృహత్ సెమినార్‌లో ప్రారంభోపన్యాసమిస్తూ ముల్క్‌రాజ్ ఆనంద్, 'భారతీయ కథాకథన శాస్త్రం (నేరెటాలజీ) అటు రష్యన్ దృక్పథానికీ, ఇటు మన జానపద దృక్పథానికీ మధ్య సంధిరేఖలో ఉందని' అన్నారు. కథానిర్మాణంలోని దృక్పథాల పరంగా భారతీయ జానపదతను, కథన విశ్లేషణా తంత్రాల పరంగా రష్యన్ దృక్పథాలను ప్రతిబింబిస్తున్నదని వారి భావం – ఆ మాట, చాలావరకు యథార్థమేమో!

రష్యన్ రూపవాదం రెండో పరిణామ దశ, ప్రేగ్ (Prague) లింగ్విస్టిక్ సర్కిల్ ప్రభావానికి బాగా లోనవుతూ, భాషాపరంగా, కథన మీమాంసలో కొత్త దృక్పథాలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా – సాహిత్య భాషలోని వివిధ నిర్మాణ క్రమాలను, వాటి విశ్లేషణా పద్ధతికి సంబంధించిన అంశాలను ఆవిష్కరించింది. 'భాషే భావజాలానికి ప్రతీక' అనే వారి నినాదం సాహిత్య ప్రపంచాన్నంతా ఆకర్షించింది. గిడుగు తదనంతర కాలంలో, 'అభ్యుదయ యుగ' నేపథ్యంలోని మన వ్యావహారిక భాషోద్యమంపై దాని ప్రభావం పరోక్షంగా ప్రసరించిందికాని, భాషాపరమైన కథావిశ్లేషణ పద్ధతుల ఆవిష్కారం మాత్రం జరగలేదు. టెక్చర్, స్ట్రక్చర్, టెన్షన్ వంటి సాంకేతిక అంశాల పరిచయం కానీ, ఆ మేరకు కథాకథన విశ్లేషణకానీ (ప్రాచుర్యం పొంద)లేదు. నాజీల తాకిడివల్ల జెక్ (czech) జాతీయుల ప్రేగ్ స్కూల్ దెబ్బ తినడమేకాదు, రష్యన్ రూపవాదమే బాగా దెబ్బతింది. ఆ తర్వాతే 'న్యూ క్రిటిక్స్'గా పేరొందిన బ్రిటీషు రూపవాదుల ప్రభావం పెరిగింది. మనవారు కవితా విశ్లేషణల్లో కొంతకు కొంత బ్రిటీషు రూపవాదాన్నయినా అనుసరించారు కానీ, కథాకథన మీమాంసకు ఒక స్పష్టమైన రూపమిచ్చిన రష్యన్ రూపవాద విధానాలను మాత్రం అనుసరించలేదు. కనీసం, వాటిపట్ల స్పష్టమైన అవగాహన కూడా పెంచుకోలేదంటే అతిశయోక్తి కాదు.

అంచేత, అభ్యుదయ భావజాల యుగంలో పెరిగిన కథానిక వివేచనలో, అత్యధికంగా సామాజిక – రాజకీయాలను లేదా పరోక్ష సాహిత్య రాజకీయాలను చర్చించడమే ఎక్కువగా అనిపిస్తుంది కాని, కథను పట్టుకొని, దాని కట్టుడు గూర్చి ఆలోచించడం అగుపించదు. భావజాలం రచయిత దృక్పథాలను ఎంత తీర్చిదిద్దినా, అతని పాత్రలు, కథలు కేవలం దానికి ప్రతినిధిప్రాయాలేనా? రచయిత ప్రతిభకు, అతని వ్యక్తిత్వం, అందులోని 'అవ్యక్తత', వాటి స్పష్టాస్పష్ట అభివ్యక్తులకు ఏ స్థానం లేదా? అనే ప్రశ్నలకే అవకాశం లభించలేదు. రచయితలు, పత్రికా సమీక్షక, విమర్శకుల వరకు దానివల్ల కలిగే నష్టమేమీ లేదు. కథ గురించి సీరియస్‌గా అధ్యయనం చేయాల్సిన అధ్యయన రంగంలోనే చెప్పుకోతగ్గంత పెద్ద నష్టం కలిగింది.

ఇక్కడో సామాజిక వాస్తవాన్ని ఒప్పుకోవాలి. 80 ల వరకైనా, సాంప్రదాయిక సాహిత్యం మీద, లేదా ఆధునిక కవిత్వం మీద విశ్వవిద్యాలయ స్థాయిలో కాస్త గట్టిగానే పరిశ్రమ జరిగేది కాని, 80 ల నుంచే క్రమంగానూ, 80 ల తర్వాత ప్రముఖంగానూ అధ్యయన రంగంలోని వారి దృష్టి

ఎక్కువగా కథలపైకి మళ్ళింది. 20 వ శతాబ్దం అవతరించేదాకా మహాకావ్యాలు, 20 వ శతాబ్దం మొదటి సగం కవితలకు, నడిభాగం నవలలకూ, చివరి భాగం కథలకూ తెలుగు సాహిత్యం పట్టాభిషేకం చేసింది. సాహిత్యం సమాజానికి దగ్గరయ్యేకొద్దీ, పాఠకుల అభిరుచి, విరామం, కొనుగోలు తీరూ మారేకొద్దీ, కథలకు ప్రాధాన్యం పెరిగిపోయింది. రాబోయే తరాల్లో సాహిత్య స్పృహను బ్రతికించేవి ఎక్కువగా కథలే. ఆ తర్వాతే కవితలు. కవితలు కూడా కథనాత్మక రూపాల్లోకి మారిపోతుండడం దానికి నిదర్శనం. పేరుపొందిన నిన్నటి కవులు కూడా, ఇవ్వాళ గల్పికల్లాటి కవితలనో లేదా కవితాత్మక కల్పికలనో, వాటినేమనాలో తెలియదుకాని, కథ లేని కథనాత్మక చిత్రణలను రాస్తున్నారు. 'అనుభూతి సాంద్రత' వల్లనే కవితలుగా వాటికి పరిగణన.

చిత్రమేమిటంటే, ఈ 'అనుభూతి సాంద్రత' కథ మీద కూడా బాగా ఎక్కువగా పడుతూంది. సాహిత్యానికి, అది ఏ ప్రక్రియ అయినా, సహజ లక్షణమైన అనుభూతి ఉత్పాదక గుణం వేరు. ఈ అనుభూతి సాంద్రత వేరు. కథ సంఘటన, పాత్ర, పాత్రల సన్నికర్ష క్రమంలో ఉన్న ఫిక్షన్‌లో లేదా కథాసాహిత్యంలో ఉన్న ప్రధాన లక్షణం అనుభూతి ఉత్పాదకత. అదే దాన్ని ఏ వార్తాకథకంటేనో, వార్తా కథనంకంటేనో లేదా తరచూ పత్రికల్లో అగుపించే యధార్థ జీవిత కథాచిత్రాలకంటేనో భిన్నంగా మార్చి చూపుతోంది. అవే యధార్థ జీవితాలను కథలుగా మలచి, రావూరి భరద్వాజ గారు వెనకటికి 'జీవన సమరం' అనే కథల సంపుటి తెచ్చారు. దానికి అప్పట్లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి కూడా లభించింది. అన్నీ యధార్థ జీవిత కథలే, అయితే వార్తాకథనాలు కావు. అక్కడే ఆ సామాన్య వార్తాకథనానికి, సాహిత్య కథనానికి మధ్య తేడాను భాష ఎలా తెస్తోందో, సాహిత్య భాషానిర్మాణంలోని ప్రత్యేకతలెలాటివో, ఆ సాహిత్యభాష ఎలాటి డివైసెస్‌ను సృష్టించుకొంటోందో శాస్త్రీయంగా పరిశీలించడానికి ప్రయత్నించింది. ప్రేగ్ లింగ్విస్టిక్ స్కూల్‌లోని రష్యన్ రూపవాదం, భాషకున్న ఆ సంవేదనా శక్తిని, దృశ్యీకరణ శక్తిని, ప్రతిమాశక్తిని తర్వాతి దశలోని నియోమార్క్సిస్టులు కూడా అంగీకరించారు. క్రిస్టఫర్ కాడ్వెల్ ప్రతిభాకార్యానికి పునఃగౌరవం తెచ్చారు. పడమటి దేశాల్లోని రూపవాదులు భాష గురించి ఎక్కువ మాట్లాడకపోయినా, ప్రతిమాది దృశ్యీకరణం సాంకేతికతలను బాగానే చర్చించారు. కవిత్వపరంగా వాటిని అన్వయించుకొని, పరిశీలించేటంతగా కథలపరంగా ఆలోచించకపోవడం మన అవగాహనా పరిమితుల ఫలితమే. దాన్నలాగుంచి, ఇక్కడ గుర్తించాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే, సాహిత్య భాషలోని ఆ సంవేదనాశక్తి సహజంగానే అనుభూతి కేంద్రితమై ఉంటుంది. అనుభూతిని ఉత్పన్నం (జెనరేట్) చేయగలిగేదే సాహిత్యం. అయితే, అందులో ఏ ప్రక్రియ ప్రత్యేకత ఆ ప్రత్యేకతకుంది. ఏ కథతోకాని, కథాగతమైన మోటిఫ్‌తో కానీ సంబంధం లేకుండా, పరస్పరం సంబంధం లేకుండా వచ్చే ప్రతీకలతోనే, భావశకలాలతోనే 'అనుభూతి సాంద్రత'ను పెంచడం, ఆధునిక కవిత ప్రాణలక్షణం.

అభ్యుదయ భావజాలం బాగా పాతబడ్డాక, సామాజిక వివాదాలకూ, నినాదాలకూ కవిత్వం ప్రత్యామ్నాయంగా మారిపోతున్న దశలో, 80 ల తర్వాత 'అనుభూతి కవిత్వ'మంటూ ఒకటి ఉద్యమ స్థాయిలో ప్రారంభమై, ఇప్పటికీ తెలుగు కవితను ఆ స్ఫూర్తితోనే నడిపిస్తోంది. దాని రూపం, అనుభూతి సాంద్రత కథకుల్ని కూడా ప్రభావితం చేయడంతో కాబోలు, 'కథానిక'ల నిడివి కూడా తగ్గి, సంఘటన, సంఘర్షణ, పాత్రల సంవృతి (రౌండ్ క్యారెక్టర్స్) వగైరా అంశాల మీద ఫోకస్ తగ్గి, అనుభూతి సాంద్రత మీద ప్రాధాన్యం మోపుతూ కవితల్లాటి కొత్త కథలూ రావడం మొదలుపెట్టాయి. కొట్టొచ్చేలా కవితాత్మకత అగుపించే కథలూ వస్తున్నాయి. ఒకప్పుడున్నన్ని కొత్త కథాంశాలు ఇప్పుడు రావడం అరుదైంది.

ఒకప్పుడు ఒక చిన్న సంఘటన, ఒక అనూహ్యమైన ముగింపు ఉంటేనే కథ. కొన్ని దశాబ్దాలపాటు ఓ. హెన్రీ మన మనస్సుల్ని పరిపాలించాడు. ఇప్పుడు ముగింపు లేకపోవడమే ఒక కథ, కథాశిల్పం. ముగింపనేది సంఘటనలోని అనూహ్యత కాదు, ఆ మొత్తం దృశ్య చిత్రణలోని కవితాత్మకతే ఓ ముగింపు శిల్పంగా పోస్ట్ మాడర్నిస్ట్ / పోస్ట్‌స్ట్రక్చరలిస్ట్ కథాశిల్పంగా చాలా రచనల్లో అగుపిస్తుంది. కవితాత్మకత అనేమిటి? కొన్ని కథల్లో అవుతే అచ్చం కవితలే ముగింపులో సాక్షాత్కరిస్తున్నాయి. కవితకూ, కథకూ రెండు ప్రక్రియల్లోనూ ఎడం తగ్గడం కొట్టొచ్చినట్లు అగుపిస్తోంది. ఏదో ఓ మిశ్రమ ప్రక్రియ రెండింటిలోనూ రూపుదిద్దుకోవడం స్పష్టంగా అగుపిస్తోంది. సాహిత్య వివేచనలో ప్రక్రియాశాస్త్రం (genology = study of genres) ఓ ప్రత్యేక అంశం; భాషాశాస్త్రంలో ధ్వని శాస్త్రం (ఫోనెటిక్స్)లాగా!

ప్రక్రియల్ని శాస్త్రీయంగా వివేచించే సాహిత్యవేత్తలు ఒక మాటంటుంటారు: "సాంస్కృతికంగా – చారిత్రకంగా ఒక సంధి స్థితి ఏర్పడ్డప్పుడే మిశ్రమ ప్రక్రియలు ఆవిర్భవిస్తుంటాయి" అని! ప్రస్తుతం తెలుగువారనే ఏమిటి? భారతీయ భాషల్లోనివారందరూ ఎదుర్కొంటున్న సాంస్కృతిక సంధి స్థితి, 21వ శతాబ్దిలోని ఈ రెండవ దశాబ్దంలో దాని వేగమూ, అందరికీ తెలిసిందే. బహుశః దానికి సంకేతంగానే కవితాత్మక కథలూ, కథనాత్మక కవితలూ/గల్పికా కవితలు వంటి మిశ్రమ ప్రక్రియలు రూపుదిద్దుకొంటున్నాయి. మరికొద్దికాలంలో ఈ 'ప్రొడక్షన్ ఆర్ట్' ఏఏ కొత్త మలుపు తిరుగుతుందో ఊహించదానిక్కూడా సాధ్యం కాకుండా ఉంది. మానవ నాగరికత ఉన్నంతవరకూ కథ, కవిత ఏదో ఒక రూపంలో కొనసాగుతాయని మాత్రం విశ్వసించవచ్చు.

దురదృష్టమేమిటంటే మనకు కావ్య మీమాంస పెరిగినట్లుగా కథన మీమాంస పెరగలేదు. 'అదేమిటి? కావ్యమనే మాటలో కథ కలిసుండడంలేదా? కథనం వర్ణనానికి మరో రూపమే కదా!' అనే ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. అలంకారవంతమైన సాహిత్య భాషను, దాని నిర్దుష్టతను ఖచ్చిత పరచి చూపడానికి కావ్య మీమాంస ప్రయత్నించింది. భరతుడు కథానిర్మాణ క్రమాన్ని, అందులోని సంధులను సూత్రప్రాయంగా పేర్కొన్నాడు. ఇతర అంశాలను చూసినంత లోతుగా వాటిని చూడకపోయినా, ఆ అంశాలనైతే స్పృశించాడు. రాజశేఖరుడూ అంతే స్పృశించాడు. అటు అరిస్టాటిల్ కూడా Plot గురించి పరిశీలించాడు. అయితే, ఇటు భరతుడు కానీ, అటు అరిస్టాటిల్ కానీ చూసింది 'ఇతివృత్తం' అని మనం పిలిచే ప్లాట్‌నే. ప్లాట్ వేరు, కథ వేరు – అలాగే ప్లాట్ నిర్మాణ క్రమం వేరు. కథనంలోని వ్యూహాలు, తంత్రాలు, ఎత్తుగడలు, సూచన విన్యాసాలు, అనుభూతి ప్రేరేపక వర్ణనా విలక్షణతలు, వగైరాలు వేరు. వీటన్నిటినీ వివక్షలోకి తీసుకొనేది కథన మీమాంస. సాహిత్యం పోషకశక్తి సమాశ్రితంగా ఉన్నప్పుడు ఎదిగింది కావ్య మీమాంస. ప్రజాసామాన్య సమాదరణ లభించాక పెరిగేది కథన మీమాంస. నిన్నటి యుగాలకు కావ్య మీమాంస అవుతే, నేటి యుగాలకు కావలసింది ఖచ్చితంగా కథన మీమాంసే. ఇప్పుడైనా దీన్ని అభివృద్ధి పరచుకోవలసిన అవసరం అధ్యయన రంగంలో అధికంగా ఉంది. ఇంతదాకా అభివృద్ధి అయిన విధానాలనైనా పాటిస్తూ ఉంటే, కొత్తవి వాటంతట అవే వికసిస్తాయి. ఏ రష్యన్ భావజాల ప్రభావంతో మనం కథలకంటె, కథల వెనుక సామాజిక వాస్తవాల గురించి, సామాజిక – రాజకీయ దృక్పథాల గురించి వ్యాఖ్యానించటం ఎక్కువగా అలవరచుకొన్నామో, అదే రష్యా రూపవాదులు అభివృద్ధి పరచిన కథన మీమాంసను మాత్రం గుర్తించి అనువర్తించుకోలేదు. అందుకే, ఆ సంప్రదాయం గురించి ఈ టిప్పణి ప్రారంభంలో కొంత ఎక్కువగా ఉదహరించడం జరిగింది. బ్రిటీషు రూపవాదులు అభివృద్ధి పరచిన సాహిత్య, సాంకేతికత, కథలకంటే కవితలకు, కవితా సౌందర్య విశ్లేషణకు ఉపకరించేది. మనవాళ్ళు దాన్ని బాగానే పట్టుకొన్నారు. కథకు సంబంధించి కాదు, కథన మీమాంస ఆవశ్యకత గూర్చి మావంటి 'చదువు మూల'ల్లో ఉన్నవారు ప్రస్తావించినా లోకం దృష్టికి ఆనదు.

పత్రికా ప్రచారాల్లోని విమర్శకులో, పాపులర్ రచయితలో పూనుకొంటే కొంత సఫలం కావచ్చు. ఆ ఆశతోనే, *ఈ వ్యాసకర్తకు సన్నిహితంగా ఉన్న ఒక పాపులర్ రచయిత, ఆ సలహాను స్వీకరించి, వివిధ ప్రసిద్ధ కథావిమర్శకుల నుంచి కథన మీమాంస మీద వ్యాసాలను ఆహ్వానించి ఓ సంపుటి వెలువరించినా, అదీ మొత్తంగా కథల సామాజికతను ప్రస్తావించేదే అయింది. నిర్దిష్ట సాంకేతికతల మీద ఫోకస్ అందులో లేదు. 'కథ'కంటే కథాసామాజికత మీదకే దృష్టి ఎందుకు వెళుతుందో తెలియదు. కనీసం, దానికి సాహిత్య పరిధిలో కొన్ని ద్వారాలనైనా ఏర్పాటు చేసుకొంటే బాగుంటుంది. చరిత్ర పరిశీలన వేరు – చారిత్రక సాహిత్య పరిశీలన వేరు; అలాగే సమాజ అధ్యయనం వేరు – సామాజిక సాహిత్య అధ్యయనం వేరు,* "Literary form is not simply a unified and compressed reflection of the form of society... but a special means of distancing reality" అంటారు రామన్ సెల్డెన్ (పైదే! పు. 35). సర్టిఫికెట్లపై పడే ఆఫీసు సీలు లాగా కథల మీద సమాజం సీలుండదు. ఆ పడే ముద్ర ఓ ప్రతీకాత్మకమైందనీ, దాన్ని చూసే విధానం సమాజ శాస్త్రంలోనూ, రాజకీయ శాస్త్రంలోనూ కాకుండా సాహిత్య శాస్త్రంలోనే ఉండాలనీ, ఉంటుందనీ గుర్తుపెట్టుకొంటే, ఆటోమాటిక్‌గా, అతి సహజంగా కథన మీమాంస ముందుకు వస్తుంది. శాస్త్రీయ విశ్లేషణకు అవసరమయ్యే తన మెట్లనూ, తంత్రాల్నీ తానే నిరూపించుకొంటుంది. ఇంతకీ కథను పట్టుకోవటమంటే ఏమిటి? కథ ఎక్కడ ఉంది? మొదట వేసుకొన్న ప్రశ్నలకు మళ్ళీ ఓసారి వద్దాం. ఎంతమంది మంచి కథకులున్నారో, కథమీద బహుశః అన్ని మంచి నిర్వచనాలు

కూడా మనకున్నాయేమో! హిందీలో సుప్రసిద్ధ రచయిత నిర్మల్ వర్మ కథానిక గురించి చెబుతూ అది 'నవల – కవితలకు నడుమ మధ్యవర్తి' అంటారు. 80 ల తర్వాతి అనుభూతి వాదానికి అది ప్రతిధ్వనేమో! మరో రచయిత 'ఓ మంచి కవితలాగా, కథక్కూడా ఓ రహస్యం ఉంటుంది. దాన్ని కాపాడుకోవడంలోనే కథ విశిష్టత ఉంటుంది.' అంటాడు. ఇలాటి మార్మిక, కవితాత్మక నిర్వచనాలు చదుకోడానికి చాలా బాగా ఉంటాయి. కాని ఆచరణాత్మకంగా కథావిశ్లేషణకూ, కథను 'పట్టుకో'వడానికీ ఉపకరించేవి కావు. కథను రాయడం నేర్చుకోవాలనుకొనేవారికో, విశ్లేషణను అభ్యాసం చేద్దామనుకొనేవారికో చెప్పాల్సివస్తే, కథను గూర్చి నిర్దుష్టంగా ఏం చెప్పాల్సి ఉంటుంది? దీన్నిగూర్చి చాలామందే చర్చించారు. ఆ చర్చ సారమంతా ప్రస్తుతానికనవసరం. సూటిగా సమాధానం వద్దకు వస్తే, ఎక్కువమంది అంగీకరించింది 'కథ', 'పోరాటం'లో ఉంది' అనే మాట. సగటున ఎక్కువమంది సంఘటన, పాత్ర అనుభవం, సంఘర్షణల్లో కథ ఉంటుందన్నారు. ఒకదాన్ని సాధించేటప్పుడు పొందే 'ఆత్మవైరుధ్య' అంతఃస్సంఘర్షణ (conflict)లో కథ పండుతుందని కొందరన్నారు. అయితే, వాటన్నిటికంటే ఓ లక్ష్యాన్ని సాధించడంలో వ్యక్తి పడే ఆరాటం, చేసే పోరాటమే (struggle) అసలు కథ, ఉత్తమ కథ – అవుతుంది. ఆ పోరాటంవల్ల సాధించేది సులువుగా దొరికినప్పుడు, కథ సరళరేఖయై, 'బోర్' అంటూ, విఫలమవుతుంది. మరీ జటిలమైనప్పుడు, అంతకంటే వైఫల్యమే మేలు అని పక్కనపడుతుంది. సాఫల్య సాధనలోని మలుపులు వాస్తవంగా ఉండడమేకాదు, అర్థవంతంగా ఉండేకొద్దీ కథ సాఫల్యం పెరుగుతుంది. అక్కడే రచయితకి సరైన పనితనం, అంతకంటె బలమైన ప్రేరణ కావాలి. ఆ రెండూ సమంగా ఉన్నప్పుడే రచన కళాత్మకంగా మారుతుంది. ప్రేరణ (inspiration) బలంగా లేనప్పుడు, ఎంత మంచి పనితనం (craft/skills) చూపినా కళాత్మకత (art) పండదు. ఈ పనితనం – ప్రేరణ – కళాత్మకతలను మొదటగా రచయిత భాషలోనే పట్టుకోవాలి. వాటి మధ్య స్పేస్‌ల్లోనే, అవి వేసే ముడుల్లోనే కథకు కీలకమైన అంశాలు ఉంటాయి, 'కథన మీమాంస' ఉంటుంది. స్పెల్లింగు మాటేమిటోకాని, స్పేసింగ్‌ను గుర్తు పట్టలేని వారికి కథన మీమాంస, కదన మీమాంసే!!




ఆచార్య గంగిసెట్టి లక్ష్మీనారాయణ
(పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం)
హైదరాబాద్.
ఫోన్ : 944 180 9566


# సమీక్ష

## సాగుతున్న సమరం

ఈ కవి – తన దుఃఖాన్ని దాచుకోలేదు – తన భావోద్రేకాన్ని తన కన్నీటి ధారలతో వెలికితెచ్చి – ఎండబెట్టాడు – అన్నీ వ్యాపారమైపోయిన లౌకిక లోకాన్ని ఓర్పుతోనే నిందించాడు. జీవితం వ్యాపారం కాలేదని ఆశతో స్పందించాడు. తన ప్రేమలు – వైఫల్యాలు – మరెవ్వరికీ ఆపాదించలేదు – తన నిరీక్షణ – ఎవరికోసమో చెప్పకపోయినా మనకు తెలుస్తూనేవుంది. తన దుఃఖంలో నుంచి సమాజ శ్రేయస్సును దర్శించగల ఆశాజీవీ కవి – ప్రకృతిని చక్కగా చదవగల విద్యార్థి – ఋతువులను గణించగల అధ్యాపకుడు – అన్నింటినుంచి సమాజాన్ని సంపన్నం చేయాలని కోరుకొనే ఉదాత్తుడు. ఇలాంటి కవి...



రమేష్ పి. నిశంక్





ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి (2009–2011) రమేష్ పి. నిశంక్!

గాంధార దేశం – బుద్ధుని పాదముద్రలు నిలిచిపోయిన పవిత్ర గాంధార దేశం – ఒకప్పుడు గాంధారి కళ్ళకు గంతలు కట్టుకుని చీకటిలో నడచిన గాంధార (ఖాందహార్) దేశం – ఇప్పుడు ఉగ్రవాదంతో మార్మోగిపోతుందే అని ఖేదపడుతున్న కవి – ఈ కవి కథానాయకుడు – తప్పుడు గుంపులను వ్యతిరేకిస్తూ బైరన్ చెప్పినట్లు – తన గాయాలకు – ఎవరో చేసిన తన గాయాలకు – తన కన్నీటి లేపనాలనద్దుకుంటూ – ఈ కవి కథానాయకుడే. ఇంత చక్కటి కవిని, చిక్కటి కవిత్వాన్ని తెలుగులో మనకందించిన హేమలత గారిని అభినందించాలి.

(పుస్తకాల కోసం డా. భాగవతుల హేమలత, ఫోన్ : 949 243 7606)

– ఎ.కె.

# ప్రవాసం

– కొసరాజు వెంకటేశ్వరరావు

తెలుగువారు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోవున్నా అయినా తమదైన సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకుంటూనే సేవ చేస్తున్నారు. గండికోట దుర్గాన్ని 1571లో నైజాం నవాబు ఆక్రమించగా ఆ దుర్గాధిపతి పెమ్మసాని తిమ్మానాయుడు, తమ సైన్యంతో దక్షణ దిశగా వెళ్ళిపోయి, తమిళనాట అనేక ప్రదేశాలలో స్థిరపడ్డారని చరిత్ర తెలియజేస్తున్నది. అదేవిధంగా తమిళనాడు – కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలైన కృష్ణగిరి, హోసూరు, డెంకనీకోట, వేపనపల్లి, రాగిపల్లి, ఉద్దానపల్లి, తళి, చందాపురం, అత్తిపల్లి, జిగిణి, ఎన్నాగరం, కల్లుబాలెం, నల్లూరు అగరారం (కృష్ణగిరి జిల్లా – తమిళనాడు) ప్రాంతాలలో తెలుగువారు తరతరాలుగా అక్కడే స్థిరపడిపోయి, తమిళం, కన్నడ భాషలు నేర్చుకుని స్థానికుల సాంప్రదాయాలను, భాషను గౌరవిస్తూ, స్థానికులతో మమేకమై తమ జీవనం సాగిస్తున్నారు.

కృష్ణగిరి జిల్లాలో 50 శాతం పైగా తెలుగువారి జనాభా వున్నది. కృష్ణగిరి జిల్లాకు, కర్ణాటకలోని మాండ్య, బెంగుళూరు, కోలారు జిల్లాలు హద్దులుగా వున్నాయి. స్వాతంత్ర్యం రాక ముందు కృష్ణగిరి జిల్లా బ్రిటీషువారి పాలనలోను మాండ్య, బెంగుళూరు ప్రాంతాలు, మైసూరు సంస్థానంలో భాగంగా వుండేవి. కన్నడ, తమిళ, ఉర్దూ భాషల బలమైన తాకిడి, ఒత్తిడి, ఆంధ్ర రాష్ట్రాలకు దూరంగా వుండటం, అధికార భాషగా వున్న తమిళ భాష యొక్క ప్రాబల్యం – మొదలైన సమస్యల వలయంలో కృష్ణగిరి జిల్లాలో చిక్కుకున్న తెలుగువారు నిరంతరం అంతర్మథనంతో పోరాటాన్ని కొనసాగిస్తూ విద్య, ఆర్థిక, సాంఘిక, ఆధ్యాత్మిక, రాజకీయ – మొదలైన రంగాల్లో తగినంత ప్రగతిని సాగిస్తున్నారు. తమ మాతృభాషను బ్రతికించుకోవటానికి తపన పడుతున్నారు. వారు తెలుగువారందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

హోసూరు శాసనసభ నియోజకవర్గం నుండి 1967, 1971 సంవత్సరాలలో రెండుసార్లు శాసనసభ్యునిగా ఎన్నుకోబడిన కీ.శే. కోదండరామయ్య, తమిళనాడు శాసనసభలో తెలుగు వాణిని వినిపించిన మొట్టమొదటి మహామనిషి. ఈయన తమిళనాడు రాష్ట్రంలో తెలుగు తేజాన్ని ప్రజ్వలింపచేసి స్థానిక తెలుగు ప్రజల అనేక సమస్యలను అవగాహన చేసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకునిపోయి పరిష్కరింప చేశారు. ఆ రాష్ట్రంలో తెలుగు భాషను అధికారిక స్థాయిలో ఉపయోగించబడేందుకుగాను పాటుపడి కృతకృత్యులైనారు. కాని, దురదృష్టవశాత్తు ఆయన మరణం తరువాత వచ్చిన ప్రభుత్వాలు అదే ఒరవడిని కొనసాగించలేకపోవటం తెలుగువారి దురదృష్టం. శ్రీ కోదండరామయ్య స్థానిక తెలుగు సమితిని స్థాపించి, తెలుగు భాషాభివృద్ధికి ఎంతో పాటుపడిన గొప్ప వ్యక్తి. ఈ సమితి దినదిన ప్రవర్ధమానమై నేటికీ తెలుగు వెలుగుల్ని ఆ ప్రాంతంలో విరజిమ్ముతున్నది. ఈ సంస్థ సాహిత్యోపన్యాసాలు, కవి సమ్మేళనాలు, నాటక ప్రదర్శనలు, సారస్వత పోటీలు, తెలుగు ఉపాధ్యాయులకు అవగాహనా శిబిరాలు నిర్వహిస్తూ తెలుగు భాషాభిమానాన్ని ఉద్దీపనం చేస్తున్నదని శ్రీ జి. చంద్రశేఖర్‌గారు తమ వ్యాసం *కృష్ణగిరి తెలుగు తేజాలు* (**మిసిమి**, ఏప్రియల్ – 2015)లో తెలియచేశారు. ఈ సమితి వ్యవస్థాపకులు కోదండరామయ్యగారు 1984 లోనే మరణించినా, ప్రస్తుత హోసూరు శాసనసభ్యులు గోపీనాథ్, తళి శాసనసభ్యులు రామచంద్రన్, మాజీ శాసన సభ్యులు వెంకటస్వామి, మనోహరన్‌లు మొదలైన తెలుగు భాషావైతాళికులు తమిళనాడులో ముఖ్యంగా కృష్ణగిరి జిల్లాలో తెలుగు భాషా, సంస్కృతుల సువాసనలు నలుదిక్కులా వెదజల్లటానికి నడుంకట్టి తెలుగు భాషను, సాంప్రదాయాలను, ఆచారాలను సజీవంగా వుంచటంలో తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. వీరిని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు.

కృష్ణగిరి జిల్లాలో అనేక తెలుగు రచయితలు, సంఘాలు తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిలో *కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం* (కృష్ణరసం) ప్రముఖమైనది. వారేకాక "తెలుగు సాహిత్య పరిషత్తు,

కళావేదిక, వికాస వేదిక, స్వరాలయం, బస్తీ యువక బృందం, హోసూరు మిత్రబృందం, ఉపాధ్యాయులు, పత్రికా విలేఖరులు, పీఠాధిపతులు, నాటక రంగాలు, తెలుగు సాహిత్యం, సాంస్కృతిక, నాటక రంగాలను ప్రోత్సహిస్తూ తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవల్ని అందిస్తున్నాయి. నాగొండపల్లి కృష్ణప్ప గారు అధ్యక్షులుగావున్న *కృష్ణరసం* లో అనేకమంది ప్రముఖ కవులు అనేక రచనలు, కథల సంపుటాలు హోసూరు ప్రాంతపు జానపదుల జీవితం, ఆ ప్రాంతపు మాండలిక భాషలో ప్రచురింపబడి ఆంధ్రదేశంలో కూడా గొప్ప ప్రాచుర్యం పొందాయి. ఇందులో చాలా రచనలు తమిళనాడు – కర్ణాటక సరిహద్దుల్లో నివసిస్తున్న తెలుగువారి జీవనశైలిని, ఆచార వ్యవహారాలను, వారి ఆహారపు అలవాట్లను, వారి భాషను ప్రతిబింబిస్తున్నాయి.

*కృష్ణరసం*లో ప్రముఖ సభ్యులైన నంద్యాల నారాయణరెడ్డి గారు హోసూరు కథల శీర్షికపై *ఇరులదొడ్డి బతుకులు* అనే కథానిక విలక్షణమైన కథనశైలి కలిగిన ఈ కథలు పాఠకుల మనసుపై మంచి ముద్ర వేశాయి. రచయిత హోసూరు నగరానికి నాలుగైదు ఆమడల దూరంలో అడవుల మధ్యలో వుండే ఇరులదొడ్డి అనబడే చిన్న పల్లెను కేంద్రంగా చేసుకొని ఏభై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలను, మాయామర్మాలు తెలియని అక్కడి ప్రజల్ని, వారి దైనందిన బ్రతుకు పోరాటాన్ని, తన గత అనుభవాల్ని, అనుభూతుల్ని నెమరువేసుకుంటూ ఈ కథల్లో పూసగ్రుచ్చినట్లు వ్రాశారు. ఇరులవాళ్ళు అంటే చీకటి (నల్లని) మనుష్యులని అర్థం చెప్పవచ్చు. ఈ కథల పరంపర ఒక విధంగా రచయిత ఆత్మకథే అని చెప్పవచ్చును.

రాజకీయ, భౌగోళిక ఎల్లలు తుడిచివేసిన ఈ తెలుగు భాష ఆరాధకుని గుండెల్లో గూడుకట్టుకున్న వేదన, పలుకు తీరులో వైవిధ్యం, వారి భాష, అక్కడి ప్రాంతీయ యాస, కమ్మటి తెలుగు పదాలు వీరి రచనలో సుగంధాలు విరజిమ్మే తెలుగు నుడి సౌరభాలు పాఠకుల్ని విచలితుల్ని చేస్తాయి. ఈ రచయిత ఇంతకు మునుపు కొన్ని వందల యేండ్ల క్రితమే ఆంధ్ర దేశం నుండి దక్షిణ తమిళనాడు (పాండ్య మండలం) వలసపోయి అక్కడే స్థిరపడిన రైతు కుటుంబానికే చెందిన శ్రీ రాయంకుల శ్రీకృష్ణ రాజనారాయణ పెరుమాళ్ రామానుజం నాయకర్ (కీ.రా) గారు తమిళంలో వ్రాసిన *గోపల్లెపురం* అనే నవలను *గోపల్లె*గా తెలుగులోకి ఆ ప్రాంతపు తెలుగు మాండలిక పదాలతో అనువదించారు. కీ.రా. గారికి తెలుగు భాష వ్రాయటం, చదవటం రానందున, తమ పూర్వీకులు అనుభవించిన వ్యథలను, బాధలను తన అవ్వ ద్వారా విని, దానిని మిగతా వారిలాగా మరచిపోకుండా తనకు తెలిసిన తమిళ మాండలిక శైలిలో అతి మనోహరంగా తమిళ పాఠకుల ముందు వుంచగా, దానిని అంతే ఆసక్తికరంగా శ్రీ నారాయణరెడ్డి తెలుగులోకి అనువదించి, తమిళ దేశంలో ఉన్న తెలుగు మాండలికాలను మనకు అందించారు. ఇంతటి చక్కని తెలుగు అనువాదాన్ని తెలుగువారికి అందించిన శ్రీ నారాయణరెడ్డి ధన్యజీవి. వారు తెలుగు భాషకు చేస్తున్న సేవ అజరామరమే అవుతుంది. ఈ *గోపల్లె* పుస్తకంలో తమిళనాట ఎన్నో వందల సంవత్సరాల నుండి స్థిరపడిన తెలుగువారి ఆచార వ్యవహారాలను సంస్కృతిని, తమ మాతృదేశంపై (రాష్ట్రం), మాతృభాషపై వారికి ఉన్న మక్కువ. ప్రేమ, ఆప్యాయతానురాగాలను అనువాదకుడు తెలుగువారికి పరిచయం చేశాడు. తమ మాతృభాషను తమ ఇంటివారికే పరిమితం చేసుకోవలసిన పరిస్థితులలో తెలుగువారు అనుభవిస్తున్న వ్యథలను, అవమానాలను బయటి ప్రపంచానికి తెలియజేసిన నారాయణరెడ్డి గారు అభినందనీయులు.

*ఇరుల దొడ్డి బతుకులు* పుస్తకములో రచయిత జీవితంలో నుంచి తీపి గురుతులు, ఆయన నోటివెంటనే వింటున్న అనుభూతి కలుగుతుంది. రచయితలో మనం ఒక ప్రకృతి పుత్రుణ్ణి, ఒక నిజాయితీపరుణ్ణి, ఒక కార్యశీలిని, ఒక శ్రమైక జీవిని, ఒక సరసుణ్ణీ వెరసి ఒక నిండైన తెలుగు మనిషిని చూస్తామని *నడుస్తున్న చరిత్ర* సంపాదకుడు, సామల రమేష్‌బాబు నాలుగు మాటలు (ముందుమాట)లో వ్రాసింది అక్షరాలా నిజాలే. హోసూరు ప్రాంతానికి నారాయణరెడ్డి వెలుగుదీపంలాగా అక్కడ తెలుగువారికి దారి చూపిస్తున్నారు. సస్యశ్యామలంగా వున్న తన ఊరిలో వున్న వ్యవసాయాన్ని వదలి, హోసూరులో ఒక గది అద్దెకు తీసుకుని హోటల్ భోజనం చేస్తూ సంసారాన్ని తన ఊరిలోనే వదలి, తెలుగు భాషను బ్రతికించుకోవడానికి *కృష్ణ ర.సం.* సభ్యులతో కలసి నారాయణరెడ్డిగారు తెలుగు భాషకు చేస్తున్న సేవ అమోఘం. రచయిత ఇరులదొడ్డి బ్రతుకులలో తన కథనానికి తీసుకున్న వస్తువు, దాని నేపథ్యం, ఆయన పేర్కొన్న అడవులు, కొండలు, గుట్టలు వాటి గురించి చెప్పడానికి ఆయన వాడిన భాష అచ్చమైన తెలుగు నుడికారాలతో, అందమైన పల్లెపడుచు

సోయగాల కులుకుల నడకలతో సాగినట్లుగా ఉన్న విధానం చదువర్ల మనసుల్ని బాగా ఆకట్టుకొన్నదని ఆ కథానికల ముందుమాటలో *కృష్ణరసం* గౌరవాధ్యక్షులు కలువకుంట నారాయణగారు వ్రాశారు. ఆ కథలలో వ్రాసిన భాష తమ ప్రాచీన మూలాల్ని నిలబెట్టుకోవటం మూలంగానే ఆ కథలకు జవసత్వాలు వచ్చాయి. ఈ కథలలో క్రొత్తగా అనిపించే పదప్రయోగాలు కనిపిస్తాయి. ఈ పదాలలో పొద్దప్ప (సూర్యుడు), గుట్టుపాటలు (బూతుపాటలు), పలుకెన (ఫోను), రాగరాయి (తిరుగలి), కూసికూసి (పిలిచిపిలిచి), మాపుసారి (సాయంకాలం), మన్నాడు (మర్నాడు)లాంటి పదాలు చాలా లలిత లలితంగా ఉన్నాయి.

రచయిత *ఇరుల దొడ్డి బతుకులు* లో ఇరవై కథలలో వాడిన వర్ణనా చాతుర్యము అద్భుతముగా ఉన్నది. తెలుగువారి జీవనశైలిని ఈ కథలలో నిక్షిప్తంచేసి రచయిత తెలుగు జాతికి మహోపకారం చేస్తున్నారు. ఈ పుస్తకము కడప పట్టణములో ఆగస్టు 2013లో విడుదల చేసిన సందర్భముగా ఆ సభలో మాట్లాడిన ప్రముఖ రచయిత, కవి శ్రీ చంద్రశేఖరరెడ్డి గారు ఈ కథల్ని సీరియల్‌గా దూరదర్శన్ (టి.వి.)లో ప్రసారం చేస్తే తెలుగువారందరకూ ఈ కథల సొగసుల్ని చూసి ఆనందించే అవకాశం కలుగుతుందని చెప్పిన మాట అక్షరాలా నిజమే. ప్రకృతిని ప్రేమించే ఆచారం తెలిసినవాడు కనుకనే రచయిత ఇటువంటి వాడియైన పరిశీలన అడుగడుగునా వర్ణనా చాతుర్యం తెలియచేసే కథల్ని వ్రాయగలిగాడు. కలువకుంట నారాయణగారు అభిప్రాయ పడినట్లుగా శ్రామిక సౌందర్యాన్ని ఆరాధించే, ఆస్వాదించే గుణమున్న ఈ రచయిత వివిధ సందర్భాలలో పలు వృత్తులవాళ్ళ అవతారాలెత్తాడు. రైతుబిడ్డగా ప్రధాన భూమిక పోషిస్తూనే, తన సావాసగాడైన కృష్ణునితో కలసి కుండలు చేసే కుమ్మరి అయ్యాడు. జిగిణి నుండి తెచ్చిన కత్తెరతో ఇరులవాళ్ళ జుట్టు కత్తిరించే మంగలి అయ్యాడు. ఇనుప కొలిమి దగ్గర సమ్మెటపోటు వేసే కమ్మరి అయ్యాడు. గడ్డపార పుచ్చుకుని బావి తవ్వే బోయ అయ్యాడు. గోవులు మేపే గొల్లవాడైనాడు. కలంపట్టి కథలూ, కవితలూ వ్రాశాడు. ఇరుల వాళ్ళలో సుగాలీ జనంలో ఒకడుగా కలసిపోయాడు. కులవృత్తి ఏదైనా గొప్పదే అని గౌరవించ తగిందే అని రచయిత చెప్పక చెప్పాడు. కుల గజ్జి ముదిరిపోతున్న ఈ కాలంలో రచయిత తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పడం అభినందించతగ్గ అంశం. వారి అభిప్రాయం అక్షర సత్యాలు.

రచయిత *ఇరులదొడ్డి కథలు* లో హోసూరు ప్రాంతంలో చలామణిలోవున్న అనేక తెలుగు మాండలికాలను ప్రయోగించారు. *ఇరుల దొడ్డికి పయనం* కథలో – మోటరు (బస్సు), ఎక్కిపియి (ఎక్కించు), మడక (పొలం), మద్దేనం (మధ్యాహ్నం), మాపుసారి (సాయంకాలం), వెలుపు (వెడల్పు), మాలగేరి (మాలపల్లి), వంక (వాగు), మన్నాడు (మర్నాడు), మాన్లు (చెట్లు), కరడు (ఎలుగుబంట్లు), అరండ (దట్టమైన), మదుకు (మూల), వక్కాకు (తమలపాకు), సన్నికాయికా (తలనొప్పి), లద్ది (పేడ) అనే పదాలను – *సాబరగుట్ట మునకలు* అనే కథలో పబ్బతి (పద్ధతి), పురువురుమబ్బు (మసకమసక చీకటి), దచ్చినాన (దక్షిణాన), కమ్మేళ్ళు (కమ్మవారు), రెయ్యమ్మ (రాత్రి), బూర్నీసులు (కంబళ్ళు), మొయిళ్ళు (మేఘాలు), పొద్దప్ప (సూర్యుడు), అజ్జులు (అడుగులు), కన్నుబ్బులు (కనుబొమ్మలు), కడసి (చివర), తెల (కంచం), మునక (స్నానం), సంగతి (రాగి సంగటి) అనే పదాలు – *ఆవుల్ని మేపే ఏనుగులు* కథలో తొమ్మునూ్నట (తొమ్మిది వందలు), కుర్రలు (కోడెలు), కొట్టము (చావిడి), తిప్ప (పేడదిబ్బ), ఉద్ద (పోగు), సేద్దెము (సేద్యం), నూగులు (నువ్వులు), పలత్తు (దిగుబడి), మిసిరి (మృగసిరి), గనిమ (గట్టు), బరుగులు (పరిగలు), పెద్దసిలి (పునర్వసు నక్షత్రం), గుంటువలు (గుంటకలు), బిడుపు (తీరిక), ఉబ్బ (పుబ్బనక్షత్రం), జతగాళ్ళు (స్నేహితులు), మేపులు (మేతలు), బెమ (ఇష్టం), ఓని (డొంకదారి), ఉజ్జ (రుద్ది), అగల (విలాసమైన), వబ్బ (పొద), గాసి (శ్రమ), గవులు (గుహలు), రణపంత (రాబందు), జానము (ఆకాశం) అనే పదాలను ప్రయోగించగా *ఇరులోళ్ళకు తెలుగు నేర్పిన ఎన్టీయార్* కథలో ఎల్ల (హద్దు), తిరుక్కొంటాయి (తిరిగి వస్తాయి), అత్తాచిత్తలు (హస్తా, చిత్ర నక్షత్రాలు), అనరాగి (అనురాధ), ఐనూరు (ఐదువందలు), చెల్లిపోయినాయి (ఖర్చు అయినాయి), బిడువు (విశ్రాంతి), నంజర (మాంసము), ఇట్టాడుకుని (బలాదూరుగా), ఇక్కట్లు (కష్టాలు), ఓదు (కన్నడంలో చదువు అని అర్థం), మేస్తిరి (మేష్టారు), అరవము (తమిళం), కత్తిరించి (నరికి), ఎత్తుకొనుట (తీసుకొనుట), రెయి (రాత్రి), చిత్రమందిరం (సినిమాహాలు), మదుకు (మూల), ముదుక్కొనుట (నిద్రపోవుట), తెల్లవారి ఆట (మార్నింగ్ షో), కవురు (మసక), ఎన్టీయార్ (యన్.టి. రామారావు) అనే పదాలు ఉపయోగించారు. *నాయకురాలు నాగవ్వ* అనే కథలో కుదురుకొనటం (స్థిరపడటం), తెగుబాటు (దౌర్జన్యం), కసువు (పశువుల మేత), చెనిక (పార), గడారు (గడ్డపార), కిరుసుకొంటా (ఆర్తనాదం చేస్తా), పురుకుల (పిరికి), కోలుకారు నిలయం (పోలీసు స్టేషన్), పోటుమట్టు (ఆయుధం), దూరు (ఫిర్యాదు), బాటముప్పు (రోడ్డులో ప్రమాదం), తీర్పెడము (కోర్టు), పలుకెన (ఫోను) అనే పదాలను ప్రయోగించగా వేరొక కథలలో గౌడు (ఊరిపెద్ద), బైస్కోపు (సినిమా), తెలి (కంచం), మోట్రు (బస్సు), నుగ్గి (దూరి), ఒబ్బలు (చిన్న పొదలు), కరుడు (ఎల్లగొడ్డు), ఏనిగ (ఏనుగు), నంజు (విషము), కుణుస్తా (నాట్యం చేస్తూ), దువ్వ (దూరం), తొలాట (మొదటి ఆట), మనుము (జంతువులు), పరస (జాతర), ఉమిసి (ఉమ్మివేసి), దొణ్ణె (దుడ్డుకర్ర), సద్దు (ధ్వని), మెలపు (జాగ్రత్త), ఒరిమి (హక్కు), తిప్పళము (కత్తి), కాలువాసి (నాల్గవ వంతు), బానము (ఆకాశం), నవ (దురద), రెయ్యి (రాత్రి), మొకాలు (ముఖాలు), మీరమీర

(రమారమి), అరితి (భక్తి), తోమం (శ్రభం), ఉసిళ్ళు (గుగ్గిళ్ళు), సోక్కి (లీనమై), మన్నీడు (రాజు,) గంటసాలప్ప (ఘంటసాల), ముడుపు (నిర్ణయం), నెళవు (పరిచయం), మోపిక (బాధ్యత), నారుగా (మెత్తగా), నెరవు (వ్యాసం), అవను (తయారుగా), సలప (చెక్కపిడి), తరాల (రకాల), ఆము (మట్టికుండలు కాల్చే పొయ్యి), మాడీ (మేడ), పబ్బతి (సంప్రదాయం), దవస (ధాన్యం), నెట్టు (తిన్నగా), సొరగలోకం (స్వర్గలోకం), ఇగ్గాసులు (సైకిళ్ళు), తళాది (పునాది), తిరగా (స్థిరంగా), పేరేగిలు (బస్సులు), సరుకేగులు (లారీలు), సద్దు (ధ్వని), గూటకట్టె (వాసికర్ర), జిగిలి (అరుగు), వెలుపు (వెడల్పు), అనెంక (ఆ తరువాత), ఇగ్నేస్పరుడు (విఘ్నేశ్వరుడు), మొరము (వేట), తలికి (సరికి లేక సమయానికి), బెషు (బెంగ), అంటితోట (అరటితోట), అర్తాలు (అర్థాలు), మంగ (కోతి), గుమవలు (బానలు), గుడగుతా (దొర్లుతా), సన్ని (జ్వరం), మక్కర (తట్టు), మబ్బు (చీకటి), ఎప్పు (పాలను తోడు వేయటం), సీమ్మయినం (ప్లాస్టిక్), కాంచి (కాల్చి), చెమ్మటి (సమ్మెట), తమట (డప్పు), సీమనూనె (కిరోసిన్), కూటిల్లు (హోటలు), సోగాయి (చొక్కా), కోగు అంగడి (మంగలిషాపు), గొరుగెన (రేజరు), తెరాట (సినిమా), బోద (మత్తు), తిరిగెన (రాట్నము), బాయి (బావి), ఈడుపులు (లోలాకులు), బిరాన (వేగంగా), సునుపిళ్ళు (ఫ్యాక్టరీలు), తలవర (గ్రామ ప్రెసిడెంటు), అమాస (అమావాస్య), కిరిసె (అరుపు), బేలాడి (బ్రతిమిలాడి), పాటు (కష్టం), పళిగి (అలవాటు), ముడుక్కోని (దాక్కొని), ఉరులు (ఉచ్చు), తూగడిస్తా (నిద్ర), పుండ్రికి (గోగునార), వెత (బాధ), తిమిసింది (పొడిచింది), చెనిగి (సెనగ), బుక్కి (తిని), బేటరు (బ్యాటరీలైటు), సాగుడు (మంచుకాలం), పారతా (పరిగెత్తుతా), గూళెద్దు (కోడె ఎద్దు), పళిగిన (అలవాటు పడిన), తలపోతులు (ఆలోచనలు), దోన్నెకట్టి (దుడ్డుకర్ర), దీవ్వు (దూరం), నడతి (సంఘటన), అజ్జాలు (అడుగులు), జోట్టె (పొట్లం), గారసున్నం (సిమెంటు), సోరణ (స్పృహ), గాచారం (గ్రహచారం), అలకొట్టటం (వినిపించటం), నిరాళంగా (హాయిగా), వెత (బాధ), బెరాడతా (వెతుకుతా), ఏకాశీ (ఏకాదశి), రావిడి (తొందర), ఉరువు (వదలి), దూరు (కేసు), కల్ల (కంచె), ముత్తురాయుడు (ఆంజనేయుడు), ముత్తు (ముత్యం), కణి (జోస్యం), గావు (బలి), తిమిసి (గుచ్చి), బెలపతి (మారేడు ఆకు), తెల్లము (నిజము), పురుకు (పిరికి), మక్కర్లు (గంపలు), ఒద్దిక (రిహార్సల్), బండిముక్కరి (జల్ల), అడాటు (బనియన్), కణజం (పాతర), అలవరపు (శిక్షణ), అద్దలం (మేకప్), తెల్ల బెళుకు (పెట్రోమాక్స్), ఆటమిట్ట (రంగస్థలం), కేళిక (నాటకం), కడలి (సముద్రం), ఉసురు (ప్రాణం), బండము (ఉన్ని), కొండ సెలలు (కొండశిలలు), ఉరులు (ఉచ్చు), తెంకాయ తోపు (కొబ్బరితోట), తోటాయి (తూటా), సరుకేగి (లారీ), మెడాలు (మేఘాలు), పులివాడ (వాసన), దుగ్గిడి (ధ్వంసం), తబ్బు (కౌగిలించు), రణపంతలు (రాబందులు), కసరు (చేదు), మోసు (మొలక), ఒప్పం (లైసెన్స్), కూరుపాసం (స్వెట్టరు), కొర (మంచు), గూళెద్దు (ఆంబోతు), సాలి (అడవి తోవ), బీము (బియ్యం), తమి (కుతూహలం), గురుము (ధాన్యాలు), ఉల్లము (మనస్సు), ముడుపు (నిర్ణయం), సోరణ (స్పృహ), అడక (ప్రశ్నలు), బానము (ఆకాశం) – మొదలైన అనేక ముచ్చటైన తెలుగు పదాలను మన తెలుగు పాఠక లోకానికి అందించిన శ్రీ నారాయణరెడ్డి ధన్యజీవి.

హోసూరు తాలూకా, నల్లూరు అగ్రహారంలో 1943లో జన్మించిన ఈ మహనీయుడు, హోసూరులో పదకొండవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఈ రచయిత వ్యవసాయ సంఘంలో సభ్యుడై రైతుల సమస్యలమీద ఎన్నో పోరాటాలు చేసిన ఈ రైతుబిడ్డ, తన వ్యవసాయాన్ని కుటుంబ సభ్యులకు వదలివేసి, మాతృభాషాభిమానంతో తెలుగు భాషోద్యమానికి నడుంకట్టి *కృష్ణరసం* లో ప్రముఖ సభ్యునిగా వుంటూ తెలుగు భాషాభివృద్ధికి ఇతరులతో కలసి ఎన్నో ఉద్యమాలు నడిపిస్తున్న ఈ 72 ఏళ్ళ యువకుడు రచించిన *ఇరుల దొడ్డి బతుకులు* కథను *నడుస్తున్న చరిత్ర* పత్రికలో ధారావాహికంగా ప్రచురించి, హోసూరు తెలుగువారి ఆక్రందనల్ని, ఆవేదనల్ని బయటి ప్రపంచానికి తెలియజేసి, తెలుగు వారికి మహోపకారం చేశారు. రమేష్‌గారు అనేక తెలుగు రచయితల్ని ముఖ్యంగా డా. వసంత్, బసవరాజు, మునిరాజు, సురేష్‌రెడ్డి, కలువకుంట నారాయణరెడ్డి, అశ్వత్థరెడ్డి, మహేష్, బాలకృష్ణ, సుమ, పార్థసారథి, చిదంబరరెడ్డి, బాలాజీ, నీలావతి, శ్రీనివాస ప్రసాద్, వసుంధరాదేవి, దేవేంద్రాచారి మొదలైనవారితో తెలుగులో కథల్ని వ్రాయించి, తమిళనాట ఒకప్పటి సేలం జిల్లా, తరువాత ధర్మపురి జిల్లాగా మారి ఇప్పుడు కృష్ణగిరి జిల్లాలో భాగాలైన డెంకణికోట (తమిళుల తేన్ కనికొట్టయ్) హోసూరు (పెరియార్ నగర్) తాలూకాలలో తరతరాలుగా నివసిస్తున్న తెలుగువారి బ్రతుకుల్ని, వారి వెతలను తెలుగువారందరకూ తెలియచేసి తెలుగు రాష్ట్రాలలో వున్న తెలుగువారందర్నీ పలకరించి, మురిపించేటట్లు చేశారు.



కొసరాజు వెంకటేశ్వరరావు
పురాతత్వ శాస్త్రవేత్త
హైదరాబాద్.
ఫోన్ : 949 063 6659

# పీఠిక

– పింగళి లక్ష్మీకాంతం

**ఈ** రామాయణము రచించిన కవి గోన బుద్ధారెడ్డి. తన తండ్రి విట్ఠలధరణీశుని పేర దీనిని వెలయించి రంగనాథ రామాయణమని పేరిడెను. ఈ యంశము గ్రంథావతారికలో శిలాశాసనమువలె నుదహరింపఁబడియున్నను, ఈ గ్రంథ కర్తృత్వము వివాదగ్రస్తమగుట శోచనీయము. గ్రంథకాల కర్తృత్వాదినిర్ణయమునకు అక్కరకు వచ్చు సాధనములలో గ్రంథస్థనిదర్శనము పరమ సాధనము. గ్రంథాంతర నిదర్శనములు దాని యభావమున అనుమాన ప్రమాణములుగాఁ బర్యాలోచింపఁదగినవేకాని, దానివలె స్వతఃప్రమాణములుగా గ్రహింపఁదగినవి కావు. ఈ ధర్మము నుజ్జగించి కొందఱీ రామాయణ రచనాఖ్యాతిని రంగనాథుఁడను నొక కవికి నంటఁగట్టఁజూచుచున్నారు. వాల్మీకి రామాయణమును వాల్మీకియు, భాస్కర రామాయణమును భాస్కరుఁడును వలె, ఈ రామాయణమును రంగనాథుఁడు రచించుటచేతనే రంగనాథ రామాయణమను పేరు వచ్చినదని వారి వాదము. ఆ రంగనాథుఁడు గోన బుద్ధారెడ్డికిఁగవియశమును సమకూర్పఁదలఁచి, యవతారికలో నాతనిపేరు పెట్టినను, సత్యము దాఁగదు కనుక రంగనాథుని పేరనే ఈ గ్రంథము జగత్ప్రసిద్ధమైనదని వారొక చిత్రమైన యుక్తి చెప్పుదురు. అట్లేకానిచో బుద్ధ రామాయణమనియో విట్టల రామాయణ మనియో పేరుండవలెనుగాని, రంగనాథ రామాయణమను పేరెట్లు పొసఁగుననని యెదురు సవాలు వేయుదురు. "ఎవరయా? ఈ రంగనాథుఁడ"ని ప్రశ్నింతుమేని, యాతనిని బేర్కొన్న కొన్నియైతిహ్యములను లక్షణ గ్రంథములను జూపి యా రంగనాథుఁడే యీ రామాయణకర్తయని బోడితలకు మోకాలికి ముడిపెట్టుదురు. ఎంత చిత్రమిది! రంగనాథుఁడను నొక కవి ఆంధ్ర కవి లోకమున నుండవచ్చును. అతఁడే యీ రామాయణ కర్తయనుట యెట్లు? ఏ లాక్షణికుఁడేని యీ రామాయణము రంగనాథునిదే యని యుదాహరించి యుండవచ్చును. ఆ లాక్షణికులు లక్ష్య సంగ్రహ పరాయణులే కాని చరిత్ర పరిశోధకులు కారు. వారికా పరిశోధనతోఁ బ్రసక్తిలేదు. బహుగ్రంథపరిశీలకుఁడని పేరువడసిన అప్పకవికే యా లోపముగలదు. ఇంతకును, ఈ తొట్రుపాటంతయు గ్రంథనామమునకు నుపపత్తి కుదుర్చుటకే కదా! అగుచోఁ బ్రత్యక్షముగా గోచరించు నాధారములఁ బురస్కరించుకొని యీ పేరు సమర్థింపఁ జూడవలెనుగాని, వానిని ద్రోసిపుచ్చి సత్యమునకు దూరము తొలఁగిపోనేల? ఈ గ్రంథము బుద్ధభూవిభుఁడు రచించెను. తన తండ్రి విట్ఠలునిపేర వెలయించెను. గ్రంథమున గోచరించు నాధారములివి. "వెలయించుట"యనఁగా నాతనిపేర రామాయణమును బిలుచుట. ఈ యర్థమే యా తండ్రికొడుకుల యిరువురి మనస్సులందును గలదని యీ క్రింది పంక్తులు ఘోషించుచున్నవి.

*"భూమిఁగవీంద్రులు బుధులును మెచ్చ / రామాయణంబు పురాణమార్గమునఁ / దప్పక నా పేరఁదగ నంధ్రభాషఁ / జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు మూర్వి"* (పుట. 4)

*"పనిపూని యరిగండ భైరవు పేర / ఘను పేర మీసరగండని పేర లలితనిర్మల గుణాలంకారు పేర / నలఘు నిశ్చలదయాయతబుద్ధి పేర నాతతకృతి పేర నతిపుణ్యు పేర / మా తండ్రి విట్ఠలక్ష్మాపాలు పేర ...................... శ్రీ రామచరిత / మొప్పఁజెప్పెద."* (పుట. 4)

ఈ యర్థమున దీనికి విట్ఠలరామాయణమనియో విట్ఠలనాథ రామాయణమనియో పేరుండఁదగును. అటుల లేదు. రంగనాథ రామాయణమనియున్నది. ఇటులున్నను విట్ఠలు పేరనే వెలయించుటయే యగునేమో మన మాలోచింపవలయును. అగుననియే యొక యూహచే నాకుఁ దోఁచుచున్నది. విట్ఠలుని పూర్తి పేరు "పాండురంగ విట్ఠలనాథుఁడై యుండవచ్చును. దీనిలో నుచ్చరణ సౌలభ్యముగల 'రంగనాథ'యను నేకదేశమును రామాయణ శబ్దమునకు లగించి కవి, 'రంగనాథ రామాయణ'మని కర్ణపేయమైన పేరు పెట్టియుండవచ్చును. 'నామైకదేశే నామగ్రహణం' శాస్త్రసమ్మతమే కదా! అథవా వెలయించుట యనఁగాఁ గృతియిచ్చుట యగునేని, తండ్రికిఁ గృతియిచ్చిన యా

కావ్యమును ధర్మపురి, లేపాక్షి రామాయణములవలె నే క్షేత్రదేవతాపరముగనో కవి పిలిచియుండవచ్చును. ఈ రెంటిలో మొదటిపక్షమే నాకు బలవత్తరముగాఁ దోఁచుచున్నది.

మొదలు, రంగనాథ రామాయణమున్న పేరు తొల్లింటి నుండియుఁ గలదా? మధ్యకాలమున వచ్చినదా? నడుమ వచ్చినదని చెప్ప సాహసించు వారెవరును నుండరు. ఉన్నచోఁ దొలినాఁటి పేరేమై యుండునని యడిగినపుడు చెప్పలేరు సరిగదా, యూహింపనైనను నూహింపలేరు. అదిగాక, యెంత ప్రయత్నించి ప్రచారము చేసినను నడుమ వచ్చిన పేరులు తొల్లింటివానిని దుడిచి వేయలేవు. కావున, నీ గ్రంథమునకు మొదటినుండియు రంగనాథ రామాయణమనియే పేరు. రంగనాథుఁడు రచించుట చేతనే రంగనాథ రామాయణ మయ్యెనేని యాతని యశము తన కాపాదించుకొన్న బుద్ధారెడ్డి తన దుష్కార్యమును యుగాంతరముల దనుక మూదలించు చుండెడి యీ పేరున కెట్లంగీకరించియుండును. మఱి తన కీర్తి నాతనికి ధారపోసిన రంగనాథుఁడు ఆత్మవంచనకును మిత్రవంచనకును బాల్పడి తన పేరనే గ్రంథమెటుల వెలయించి యుండును.

అదిగాక, "ఆతతకృతి పేర నతిపుణ్యుపేర, మా తండ్రి విట్ఠలక్ష్మాపాలు పేర" అనెడి పంక్తి విట్ఠలుని పుత్రుఁడుతప్ప మఱెవ్వఁడు వ్రాయఁగలఁడు.

ఇంకొక సంగతి, ఈ బుద్ధారెడ్డి కొడుకులు కాచవిభుఁడు, విట్ఠలుఁడు, అనువారు ఈ రామాయణ పరిశిష్ట భాగమగు నుత్తర కాండను రచించి, దానికి రంగనాథ రామాయణ మనియే పేరిడిరి. రంగనాథునిబట్టియే రంగనాథ రామాయణ మయ్యెనేని ఈ రంగనాథుఁడే యా తరమువరకు బ్రతికియుండి వారికిని దన కవితా తపస్సును ధారపోసెననుట హాస్యాస్పదము కాదా!

కావున, రంగనాథ రామాయణము రంగనాథ కృతము కాదు. రాజకర్తృకములైన గ్రంథములలో, ఆముక్త మాల్యదకును దీనికిని మాత్రమే యిట్టి దుష్కీర్తి యాపాదింపఁబడినది. నన్నెచోడుఁడు, రఘునాథుఁడు, అనంత భూపాలుఁడు మొదలగు రాజకవుల నెవరిని శంకింపని విమర్శకులు, బుద్ధారెడ్డి, కృష్ణదేవరాయలను మాత్రమే శంకించి, వారి యశము నితరుల పరము చేయఁజూచుట వింతలలో వింత. అవతారికలోఁగవివర్ణించుకొన్న యాతని వంశవృక్ష మీ క్రింది రీతిగానున్నది :

గోన కాటభూపతి → రుద్రభూపతి → బుద్ధభూపతి → విట్ఠలుఁడు → బుద్ధభూపతి (రామాయణకర్త)

వీరు భూవిభులనియు భూపతులనియు వ్యవహరించు కొనుట రాచరికమునుబట్టి. పుట్టుకచే రెడ్డి కులజులు. వీరు వేయించిన శాసనములలో ఈ విషయము స్పష్టముగా నున్నది. కాకతీయాంధ్ర చక్రవర్తులకు వీరు సామంతులై యిప్పటి నిజాము రాష్ట్రములోని రాయచూరు ప్రాంతముల నేలుచుండిరి. ఈ వంశములో రామాయణకర్తయగు బుద్ధారెడ్డి యెప్పటివాఁడో సరిగా నిర్ణయించుటకుఁ దగిన యాధారము లీ గ్రంథమునఁగాని ఉత్తరాఖండమునఁగాని లేవు. అయ్యెడ శాసనములే శరణ్యము. ఈ వంశనామ చిహ్నితములైన శాసనములు, క్రీ.శ. పదమూడవ శతాబ్దివి మూఁడు కానవచ్చుచున్నవి. వానిలో రెండింటికి బూదపూరు వాసనములని పేరు. మూఁడవది రాయచూరి శాసనము.

ఈ బూదపూరు శాసనములలో మొదటి దానినిబట్టి కాకతి గణపతిదేవ చక్రవర్తి సైన్యాధిపతులలో మల్యాల గుండ దండాధీశుఁడను నతఁడొకఁడు కలఁడనియు, నతఁడు గోన బుద్ధభూపాలుని పుత్రికయగు కుప్పమాంబకు భర్తయనియు దెలియుచున్నది. ఈ శాసనము క్రీ.శ. 1259లోఁ బుట్టినది. రెండవ బూదపూరు శాసనము క్రీ.శ. 1276లో, ఆ కుప్పమాంబికయే వేయించినది. అప్పటికామె భర్త గుండదండాధీశుఁడు పరలోక గతుఁడైనట్లును, కుప్పమాంబిక లింగప్రతిష్ఠ చేసి భూదానాదులు కావించినట్లును దానిలో వివరింపఁబడియున్నది. దీని యందును కుప్పమ తండ్రి గోన బుద్ధభూవిభుఁడుగానే పేర్కొనఁబడెను.

ఈ కుప్పమ రామాయణావతారికలోని వంశవృక్షమునఁ గానవచ్చు బుద్ధ భూపతులిరువురిలో రంగనాథ రామాయణ కర్తయైన బుద్ధభూపతికేని ఆతని తాతయైన బుద్ధభూపతికేని పుత్రిక కావచ్చును. రామాయణకర్తకే కొమార్తె యయ్యెనేని యా గ్రంథ రచనాకాలము పదమూఁడవ శతాబ్ది పూర్వార్ధమై యుండును. ఎట్లనఁగా – క్రీ.శ. 1259 నాఁటికి అత్తింటకాఁపురము చేయుచు శాసనములోఁ బ్రస్తుతింపబడఁ దగిన వయస్సులోనున్న కూఁతురుగల బుద్ధారెడ్డికి ఆనాఁటికిఁ గనీసము నలుబదియైదు సంవత్సరముల ప్రాయమైనను నుండవలయును. రామాయణ రచన నాఁటికాతఁడింకను జిన్నవాఁడు. రాజ్యమేలుచున్న తండ్రి యానతిని రామాయణ రచన కుపక్రమించిన యా కుమారుని వయస్సు ముప్పది,

ముప్పదియైదు సంవత్సరములై యుండవచ్చును. ఈ యూహ నిజమగునేని యీ కవి క్రీ.శ. 1210 ప్రాంతమున జనించి క్రీ.శ. 1240 ప్రాంతమున గ్రంథరచన చేసియుండును.

అటుగాక కుప్పమాంబ, రామాయణకర్త తాతకే కొమార్తెయనుకొన్నచోఁ దండ్రికి సమవయస్కురాలగు మేనత్తకంటె నీ కవి సుమారిరువదియైదు సంవత్సరములు చిన్నవాఁడై యుండఁదగును. క్రీ.శ. 1259 నాఁటికి శాసనములోఁ బ్రస్తుతింపఁబడిన కుప్పమకు నిరువదియైదు సంవత్సరములైనను వయస్సుండవలయును. అప్పట్టున రామాయణ కర్త క్రీ.శ. 1260 ప్రాంతమున జనించి, క్రీ.శ. 1290-95 ప్రాంతమున గ్రంథము రచించి యుండ వలయును.

ఈ రెండింటిలో నాకు మొదటి పక్షమే సమంజసముగాఁ దోఁచుచున్నది. కుప్పమ రామాయణ కర్తకుఁ గొమార్తెయని, రామాయణము క్రీ.శ. 1240 ప్రాంతమున రచింపఁ బడినదని. ఏమన, ఈ పూర్వ రామాయణ మాఱుకాండలు తనకంటె మున్ను రచింపఁబడినవి కనుకనే ఉభయ కవి మిత్రుఁడు తిక్కన, తెనుఁగున రామాయణమును బూర్తిచేయు తలంపుతో నుత్తరకాండను, ద్విపదగాఁ గాకున్నను, నిర్వచనోత్తర రామాయణమను పేరఁ బద్యకావ్యముగా రచించి యుండును. లేనిచో రామాయణ రచనా కుతూహలముగల తిక్కన యున్నట్లుండి పూర్వ కాండలను వదలి యుత్తరకాండనే చేపట్టవలసిన యావశ్యకత లేదు. ఈ నిర్వచనోత్తర రామాయణము క్రీ.శ. 1260 ప్రాంతమున రచింపఁబడినదని చరిత్ర పరిశోధకులు నిర్ణయించిరి. దాని పూర్వ రచయైన రంగనాథ రామాయణము పైని చెప్పినట్లు క్రీ.శ. 1240 ప్రాంతమునఁ బుట్టినదనుకొనుటలో విప్రతిపత్తి యేమియు నుండదని నా యభిప్రాయము.

అటుగాక రెండవ పక్షమునుబట్టి యిది క్రీ.శ. 1290 ప్రాంతమునఁబుట్టెనేని, క్రీ.శ. 1320 ప్రాంతమునఁబుట్టిన భాస్కర రామాయణమునకుఁజాల సన్నిహితముగానుండును. ఆ పద్యరామాయణము ఈ ద్విపద రామాయణమునకు నించుమించు ఛాయవలె నడచినట్లు చూపఁగల గుర్తులనేకములు కలవు. అవన్నియు భాస్కరాదులకు బుద్ధారెడ్డియందుఁగల గౌరవమునకు సూచకములు. భాస్కరునివంటి ప్రౌఢకవిచే నట్టి గౌరవము పొందఁదగిన యీ ద్విపద, యానాఁటికిఁబ్రాచీన గ్రంథముగా సుప్రసిద్ధికి వచ్చియుండవలయునుగాని, యాతని కించుమించు సమకాలికమగుట మాత్రము తటస్థింపదు. సన్నిహితులకును సమకాలికులకును విద్యాస్పర్థలు మెండుగానుండును గాని, యిట్టి గౌరవ ప్రపత్తులుండుట యరుదు. అందును సమానేతి వృత్తములను రచించిన కవులలో, అది మఱియు శూన్యము. పాల్కురికి సోమనాథుని ద్విపద కావ్యములు, అర్వాచీన కాలమునఁ బద్యకావ్యములైనట్లుగనే, యీ రంగనాథ రామాయణము సైతము, ఇంచుమించు నొక శతాబ్ది గడచిన పిమ్మటనే యనుకరణ యోగ్యమయ్యెనని తలంచుట సత్యదూరము కాదు.

ఈ యంశములన్నియుఁ బర్యాలోచించి చూడఁగా గోన బుద్ధారెడ్డి యీ రామాయణము పదమూఁడవ శతాబ్ది పూర్వ భాగముననే రచించినట్లు నిశ్చయింప వీలగుచున్నది.

ఈతని పుత్రులు రచించిన యుత్తరకాండలో వీరి వంశ క్రమమునుగూర్చి పొసఁగని వాక్యమొకటి కలదు. పూర్వ రామాయణమునుబట్టి బుద్ధారెడ్డి తండ్రిపేరు విట్ఠలుఁడు. ఈ యుత్తర రామాయణమున నాతని పేరు గన్న క్షితీంద్రుఁడు (గన్నారెడ్డి) అని కలదు. దీనిని సమర్థించుటకు నూహతప్ప మఱియొక యాధారము లేదు. సంపన్న రెడ్డి వంశములలో సాధారణముగాఁ బ్రతి పురుషునకును రెండేసి పేరులుండునఁట. ఒక పేరు గృహమునను, మరియొకటి లోకమునను బ్రసిద్ధమై యుండునఁట. విట్ఠలునకుఁకూడ గన్నారెడ్డియని రెండవ పేరుండియుండవచ్చును. లేదా బుద్ధారెడ్డి, విట్ఠల గన్నారెడ్లిరువురిలో నొకరు కన్నతండ్రియు మఱియొకరు పెంపుడు తండ్రియునైనఁగావచ్చును. నిరపాయమైన యీ స్వల్ప విషయమును మిషగాఁగైకొని యుత్తర రామాయణ కర్తలు పూర్వ రామాయణకర్తకుఁ బుత్రులేనాయని శంకించుట తప్పు. పూర్వ రామాయణము రచించిన తమ తండ్రి బుద్ధభూవిభుని యాదేశానుసారమే, తా ముత్తరకాండను బూర్తిచేసితిమని యీ సోదరకవులెలుగెత్తి యుగ్గడించిరి. దీనిని కాదనుట యెట్లు?

*"గోన కులార్ణవకువలయేశుండు / నా నొప్పు గోనగన్నక్షితీంద్రునకు*
*ననఘాత్మయగుచున్న నన్నమాంబికకుఁ / దనయుండు సాహిత్య*
*తత్త్వకోవిదుఁడు / దాన ప్రసిద్ధుండు ధర్మశీలుండు / భూనుతాచారుండు*
*బుద్ధభూవిభుఁడు / ...............................*
*తెలుఁగున నొప్పఁగా ద్విపదరూపమున / నలిపూర్వరామాయణము*
*మున్ను చెప్పి / ........................మము బిల్వఁబంచి....... /*

*నా కులదీపకుల్ నా గుణాన్వితులు / నా కీర్తివర్ధనుల్ నా కూర్మిసుతులు గాన నా పూనిన కథయెల్లజనులు / మానుగాఁగొనియాడ మధురవాక్యముల / నెమ్మిఁజెప్పుఁడు మీరు నిపుణులైయనుచు మమ్ముఁబంచిన మేము మా తండ్రిప్రతిన / చిరకీర్తులెసఁగంగఁ జెల్లింపఁగనుట / పరమధర్మంబని భక్తితోఁగోరి ....................*
*రామావతారంబు రమణీయమగుట / రాముపావనచరిత్రము దివ్యభాష లోకానురంజన శ్లోకబంధములఁ / జేకొని వాల్మీకిఁజెప్పినజాడ మా తండ్రి బుద్ధక్షమానాథు పేర / నాతత నృపకైరవాప్తుని పేర ఘనుఁడు మీసరగండ కాచవిభుండు / వినుతశీలుఁడు పినవిఠలభూపతియు / నని జనుల్ మముగొనియాడంగ మేము వినుత నూతనపద ద్విపదరూపమునఁ / బ్రాకటంబుగ నాంధ్రభాషనుజెప్పఁ / గైకొన్న యుత్తరకథయెట్టిదనిన”*

(ఉత్తరకాండావతారిక)

*“భూసుతుఁడగు గోనబుద్ధభూవిభుని / సూను లుదారులు సుగుణభూషణులు / ఘనుఁడు మీసరగండ కాచభూవిభుఁడు వినుతపుణ్యుండగు విఠ్ఠభూపతియు / రచియించి రుత్తరరామాయణంబు రుచిరమై నిత్యమై రూఢి పెంపెసఁగ / నా చక్రవాళ శైలావనియందు నా చంద్రతారార్కమై యొప్పుఁగాత.”* (కాండాంతము)

ఈ కాచవిఠ్ఠల విభులు పూర్వ రామాయణకర్తయైన బుద్ధభూవిభుని పుత్రులనియు, ఉత్తరకాండ రచయితలనియు స్పష్టమేకదా. ఇఁక వీరిని గుఱించిన చరిత్రాంశము లింతకుమించి కానవచ్చుటలేదు. పైని పేర్కొన్న శాసనములలో మూఁడవదియైన రాయచూరు శాసనమున (క్రీ.శ. 1294) “గన్నారెడ్డి విఠ్ఠలనాథులు” అను నిరువురి పేరులుదహరింపఁ బడియున్నవి. వారిలో గన్నారెడ్డికి “కాకతీయ కటక సన్నాహరుద్రదేవ దక్షిణభుజాదండాది” బిరుదములు కలవు. విఠ్ఠలుఁడా గన్నారెడ్డికి “రాజ్యరక్షామణి.”

“శ్రీమతు మీసియరగండ గోన గన్నయరెడ్డివారు వర్ధమానపురమందు సుఖసంకథా వినోదంబున పృథివీరాజ్యంబు సేయుచుండగాను తద్రాజ్యరక్షామణియైన విఠ్ఠలనాథ భూనాథుండు రాచూరి పట్టణ ప్రవేశాభిముఖుండై” (రాయచూరు శాసనభాగము).

ఈ గన్నారెడ్డి విఠ్ఠలనాథులును, ఉత్తరకాండలోఁ దాతమనుమలుగాఁ గానవచ్చు గన్నారెడ్డి విఠ్ఠలనాథులును నొక రేయనుటకుఁ దగిన యుపపత్తులు లేవు. శాసనములోని విఠ్ఠలుఁడు గన్నారెడ్డికి రాజ్యరక్షామణి. ఉత్తరకాండకర్త విఠ్ఠలుఁడు గన్నారెడ్డికి మనుమఁడు. ఆ యిరువురే యీ యిరువురైనచో నంతటి దగ్గఱ బంధుత్వము శాసనమున విస్మరింపఁబడుట పొసఁగదు. అదిగాక తాతగారికి మనుమఁడు రాచరికమున రాజ్యరక్షామణి యనిపించుకొనఁ దగినంతగా నండయై నిలిచెననుట సులువుగా నమ్మరానిది. ఒకవేళనట్టి మనుషులుందురనుకొన్నను గొడుకులను గోల్పోయిన తాతలకు వార్ధకమునఁ గుడిభుజములై యుండి యౌవరాజ్య సూచకమైన బిరుదమేదో వహింతురుగాని, యుద్యోగ సూచకమైన రాజ్యరక్షామణి బిరుదము తాల్పరు. అందుచేత, వీరిరువురకును దూరబంధుత్వమేమైన నుండవచ్చునుగాని, తాత మనుమల వరుస మాత్రము లేదు. ఒకవేళ నీ విఠ్ఠలుఁడా విఠ్ఠలుఁడైనఁ గావచ్చునుగాని, యీ గన్నారెడ్డి మాత్రమా గన్నారెడ్డి కాఁడు.

***తెనుఁగునఁ గల రామాయణములన్నింటిలో రంగనాథ రామాయణము మొదటిది.*** పుట్టువుచేతనేకాక గుణముచేతను నగ్రగణ్యమే. భాస్కర రామాయణము కొంతకుఁగొంత దీనినతిక్రమింపఁజూచినను దీని ప్రఖ్యాతి దానికి రాలేదు. దేశికవిత్వమును మెచ్చని మార్గాభిమానులు (Neo-Classists) ఈ ద్విపద కావ్యమును ద్రోసిపుచ్చి యా పద్యకావ్యమునే యాదరించినను దీని ప్రశస్తిని దానికిఁగొని తేఁజాలకపోయిరి. భాస్కర రామాయణము బహు కర్తృకమగుటచేతను, అందును మల్లికార్జున భట్టాదులు భాస్కరునివంటి ప్రౌఢకవులు గాకపోవుటచేతను, ఆ రచన సర్వత్రసమముగా లేక, కొన్నిపట్టుల బాగుగాఁ, గొన్నిపట్టుల నోగుగా, అతుకులమారి కూర్పుగాఁబరిణమించినది. ఇఁక రంగనాథ రామాయణమో, ఆద్యంతము నొకచేతి మీఁదనే ధారావాహినిగా నడచిన రచనయగుటచేత నట్టిలోటు లేక ప్రతిప్రకరణ గుణాస్పదమై నెగడినది. మఱియు వాల్మీకి రామాయణమువలె నిదియు “పాఠ్యే గేయే చ మధుర” మై, పాటగాఁ బాడుకొనువారికిని, కావ్యముగాఁ జదువుకొను వారికిని సమాదరపాత్రమై, పండితులకేగాక పామరులకును వినియోగపడి సార్వజనీనమైన పేరును గడించినది. ఈ రామాయణములోని కొన్ని ప్రకరణములను బాటలుగాఁబాడు నారీమణులిప్పటికిని గలరు. రామాయణకథా ప్రదర్శనముల వేళఁ దోలు బొమ్మలవాండ్రు గానముచేయు గ్రంథమిదియే. అసలు మన దేశికవిత్వము ప్రాయికముగా గేయకవిత్వము. ద్విపదకావ్యము లా గేయభావమును సంరక్షించునని యగుటచేతఁబ్రజాలోకమున వీనివ్యాప్తి పద్యకావ్యముల కుండదు. ఈ రహస్యము

గుర్తెఱింగియేకాఁబోలు సోమనాథాది శివకవులు తమ మతప్రచారమును ద్విపదకావ్యములద్వారా సాగించిరి. వాని వ్యాప్తినరికట్టుటకు నితరులకు దుర్ఘటమయ్యెను. ఈ ద్విపదరామాయణ వ్యాప్తియు నట్లే యప్రతి హతముగా నేఁటికిని ఆంధ్రలోకమున సాగుచున్నది. అందును, బశ్చిమాంధ్రులు సారస్వత మహోత్సవములలో బుద్ధారెడ్డికే యగ్రతాంబూలమిచ్చెదరు. ఆ సీమలో రంగనాథ రామాయణము చదువని యక్షరాసుఁడులేఁడు. ఒరులు చదువఁగానైనను వినని నిరక్షరాస్యుఁడునులేఁడు. వారికది పూర్వార్జితమైన యక్షయధనము.

పశ్చిమాంధ్రులకును బ్రాగ్దేశాంధ్రులకును సారస్వత సృష్టిలోను, సారస్వత సేవలోను, గొంత భేదమున్నది. మన వాఙ్మయమునఁగల 'మార్గ–దేశి' శాఖలలోఁ బూర్వకాలమున మార్గశాఖ ప్రాక్సీమలోను, దేశిశాఖ పశ్చిమ సీమలోను నెక్కువ వృద్ధియైనదని బాహుళ్యముమీఁదఁ జెప్పవచ్చును. ఇట్లనుటచేఁ, బడమట మార్గకవిత్వము పుట్టలేదనికాని, తూర్పున దేశిరచనలు లేవనికాని యర్థముకాదు. మఱి యీ విభాగము ప్రాధాన్యమునుబట్టి చేసినదనుట. ఈ భేదమునకు నైసర్గికమైన యొక కారణము పొడకట్టుచున్నది. ప్రాక్సీమ, పర్వతారణ్య రహితమును, ఫలవంతమునునైన భూభాగమగుటచే నౌత్తరాహుల ప్రవేశమునకు, వారి విద్యాసభ్యతల వ్యాప్తికి నెక్కువ యవకాశమబ్బినది. ఈ ప్రాంతముల సంస్కృతవిద్య యెక్కువగా వ్యాపించుటయు, సంస్కృత సారస్వతానుకరణముగా సారస్వతసృష్టి జరుగుటయు దానిఫలమే. ఎన్నఁటి మాటలో యెందుకు, వర్తమాన కాలమున గూడ వంగ సాహిత్యానుకరణము ఈ సర్కారులలోవలెఁ బశ్చిమాంధ్రమున లేదు. ఇఁకఁ బశ్చిమాంధ్రులు వీరియంత యదృష్టవంతులు కారు. నిరంతరము ప్రకృతితోఁ బోరుచుఁబాటుపడవలసిన కష్టజీవులు. ఆ కష్టజీవనమే వారిని దృఢకాయలుగా, వీరులుగా స్వాతంత్ర్య తత్పరులుగాఁ జేసినది. తాతలనాఁటి తల్లిభాషయే వారికిఁ జాలును. పరభాషల యావశ్యకతగాని, నేర్వవలెనను కుతూహలముగాని, నేర్వఁదగినయవకాశముగాని వారికుండదు. పర సంప్రదాయములకు మురిసి హత్తుకొను మెత్తఁదనము వారి మనస్సులకును ఉండదు. తమ సంఘములో మహోదారమైన జీవితముగడపి తరలిపోయిన వీరుల చరిత్రలే వారి కావ్యములకు నితివృత్తములు. అవియే వీరపదములు. ఒకవేళ నితర చరిత్రలు మహత్త్వమునుబట్టి సంఘము లోనికిఁ జొచ్చుకొని వచ్చినను, అవి దేశీయతా ముద్రలతో రూపాంతరముపొంది యాత్మీయములగునే కాని యెరవుసొమ్ములవలె వింతదనమును దాల్పవు. ఇది యా సీమలో నుత్పన్నమైన ప్రాచీన సారస్వతమునకు సాధారణమైన ధర్మము. ఇది యా సీమలో నుత్పన్నమైన ప్రాచీన సారస్వతమునకు సాధారణమైన ధర్మము. కాలప్రభావమును బట్టి యీ ధర్మమర్వాచీన కాలమునఁగొంత సడలినను, ఆ జనుల సారస్వతాభిరుచి మాత్రము పూర్వ సంప్రదాయము దెసకే మొగ్గచూపు చుండును. దేశీయతా మహితమైన యా యభిరుచిని తృప్తిపరచఁగల కవులే మహాకవులుగా, జాతీయ కావ్యకర్తలుగాఁ బూజింపఁ బడుదురు. ***గోనబుద్ధారెడ్డి యట్టి మహాకవి. ఇతఁడు సంస్కృత మహాకావ్యమును దెనిఁగించినను ఆంధ్రీకరణమును దేశీయ చిహ్నములతో విలక్షణతా శోభితమొనర్చి తన స్వతంత్రా తృష్ణను, తన దేశీయుల సారస్వతాభిరుచులను దనిపెను. ఈ కావ్య విఖ్యాతికిది యింకొక కారణము.***

నిజమునకు శుద్ధదేశికవిత్వమును ఇతివృత్తము, భాష, ఛందస్సు – అనెడి మూఁడును దేశీయములేయై యుండవలెను. గీతి, దానికి నాయువుపట్టు. అట్టి లక్షణముగల వాఙ్మయమే మన పదకవిత్వము. దానికి కేవల భిన్నమైనది శుద్ధమార్గ కవిత్వము. దీనియందు ఇతివృత్తము సంస్కృత పురాణ సంబంధి, భాషయు సంస్కృత మయము, ఛందము కూడ సంస్కృత వృత్తానుకరణము. కాలక్రమమున నీ యనుకరణ వాఙ్మయమే ప్రబలి, ప్రౌఢ సాహిత్య మనిపించుకొని, స్వతంత్రమును, సజీవమును నగు దేశికవితను వెనుకకు నెట్టినది. దానిని సృష్టించువారును సేవించువారును బామరులుగాఁ దిరస్కరింపఁబడిరి. తుదకు ననుకరణశీలమైన వాఙ్మయమే పట్టముకట్టుకొనెను. దీని దాడికిఁ దాళలేక యా కోమల దేశికవిత, నగరములు రాచబాటలు వదలి పల్లెపట్టుల, సందుగొందుల నడయాడఁదొడఁగెను. సహజ సౌందర్యముగల యా ముగ్ధసరస్వతికి నేదో కొంత ప్రౌఢవేషము వేసి నాగర మర్యాదలు నేర్పి, సభాప్రవేశార్హత కలిగింపవలెనని పాటుపడినవారే ద్విపద కావ్యకర్తలు. వీరొకవంక తమ దేశికవితాభిమానమును, ఇంకొకవంక విద్వత్కవి కీర్తికాంక్షను నణఁచుకొనలేక, యుభయతారకమైన మార్గముత్రొక్కి

కొంతవఱకుఁ జరితార్థులైరి. ఇట్లనుటచే సంస్కృతమువలన మన భాషకు సమకూడిన మేలును దలఁపనివాఁడననికాని, కొంచెపఱచువాఁడననికాని యెంచకుఁడు. తత్సాహాయ్యము వలననే, తెలుఁగుబాస యింత సంపన్నమును, దెలుఁగు వాఙ్మయమింత విస్తృతమును నయినవి. కాని, యా సాంస్కృతిక శాఖతోపాటు నానాఁటికి పెంపొంది యంతకంటెను నెక్కువ విస్తృతికి రాఁదగిన దేశిశాఖ యుపేక్షింపఁబడినదనియే నా విచారము. ఈ దుర్దశకుఁ గారణము ప్రజలో, రాజులో, కవులో, ఎవరు చెప్పగలరు?

సహజముగాఁ బ్రాచీన ద్విపదకావ్యకర్తల చిత్తవృత్తి దేశికవితా ప్రవణమే. కాని, యా దారినే పోయినచో దృఢస్థానకమును విద్వల్లోక ప్రతిష్ఠితమునునైన సారస్వతాలయమునకు వెలివారమగుదుమన్న భయముచేఁ దత్ప్రవేశార్హతనిచ్చు సంస్కారములఁ గొన్నింటిని స్వయముగాఁ జేసికొనిరి. అనఁగా పైని పేర్కొన్న దేశికవితాలక్షణములలో, నే యొకటి రెండింటినో పాటించి, మిగిలిన వానిలో మార్గశాఖానుయాయులేయై, యిటు ప్రజాసామాన్యమునకును, అటు సాహిత్యపరులకును నిష్టులై వారి హృదయములలోను వీరి కోశములలోను స్థానములను దక్కించుకొనిరి. వీరిది పదకవిత్వమయ్యుఁ బామరకవిత్వము కాదు. పండిత కవిత్వమయ్యు దేశికవిత్వము కాకపోదు. ఇదియే ద్విపద కావ్యకర్తలకుఁ గల ప్రత్యేకత.

కాలమునుబట్టి యీ వర్గములో మొదటివాఁడు సోమనాథుఁడు. ఆ సోమన నతిశయించి, ప్రథమ గౌరవము దక్కఁగొన్నవాఁడు బుద్ధారెడ్డి. వీరిరువురు నించుమించు సమకాలికులని చెప్పఁదగినవారు. సోమన ద్విపద కావ్యములు వ్యాకరణ ఛ్చందోలక్షణాదులలో నిర్దుష్టములు కాకపోవుటచేతఁ బండితకవులకును, శైవమత విషయములే యగుటచేత శైవేతరులైన బహుళాంధ్ర జనమునకును, ఎక్కువ యాదరపాత్రము కావయ్యెను. ***ఇంక బుద్ధారెడ్డి ద్విపదకావ్యము, లక్షణయుక్తమును సర్వపూజార్హగు రామచరితమును నగుటచే వారు వీరనక యెల్లరకును శిరోధార్యమయ్యెను. అందువలన రామాయణములలో నగ్రగణ్యమగుటయేకాక ద్విపద వాఙ్మయశాఖలో సైతము రంగనాథ రామాయణమగ్రగణ్యమే.***

మఱి యింకొక సంగతి, సంస్కృత పురాణాంధ్రీకరణమున కంకురార్పణము చేసిన నన్నయభట్టు భారతానువాదములో మూలకథావిధేయముగ నడచెనేకాని, తానై స్వతంత్రించి యా కథలో నెట్టి మార్పులను జేయలేదు. ఒకచోఁగథ తగ్గించుట, ఒకచోఁబెంచుట, ఒకచోవదలుట, అను పద్ధతి దానియందును గలదు గాని, యది మూలభిన్నమని చెప్పఁదగిన స్వతంత్ర కల్పన కాదు. రచనాసరణి కనుకూలముగా వేసికొన్న యనువాదమార్గము. కేవలానువాదకుఁడు స్వతంత్ర మూలభిన్న కల్పనలేమియు చేయఁడు. స్వతంత్రానువాదకుఁడట్టి కల్పనలు చేయుటకు వెనుదీయఁడు. ఆతని గ్రంథము నామమాత్రమునకే యనువాదముగాని, నిజమునకుఁగాదు. రంగనాథ రామాయణ మీ మాదిరి యనువాదము. ఆంధ్ర పురాణేతిహాస కర్తలలో నింతస్వేచ్ఛగా నూతన గాథాకల్పన చేసిన కవి యింకొకఁడు లేఁడు.

ఈ రామాయణమునకు విశిష్టత నాపాదించిన యంశమే మూలభిన్నగాథాకల్పన. ఆ గాథలు రామకథాప్రస్తావము కల పద్మపురాణాదులలోఁగాని, నవవిధ రామాయణములలోగాని యుండిన యుండవచ్చును. ఉండుఁగాక, కవి యా పురాణములనన్నింటిని వెదకి గాలించి యేర్చి యిందు కూర్చుకొనెనని చెప్పుట కష్టము. ఆ కథలన్నియు నే మార్గముననో, యేనాఁడో యాంధ్రప్రజల చెవులఁబడి, వారి నోటఁబడములుగాఁ బాటలుగాఁ గీర్తనలుగా నలిగి రక్తమున జీర్ణించి సంఘమున వేరు నాటుకొనిపోయి యుండును. ఆ పదకవిత్వ ఖనినుండియే యీ కవీశ్వరుఁ డా జాతిరత్నములను దీసి సానలఁదీర్చి రామాయణమహామాలలోఁ గూర్చి యుండును. ఈ కావ్యమునకు దేశితనము నాపాదించిన యింకొక లక్షణమిదియే. అట్లుగాక దీక్షకొరకు యథావాల్మీకముగానే కవి దీనిని దెనిఁగించి యుండునేని పరచితవస్తురహితమైన యీ రచన దేశీయుల కాశాభంగము కలిగించెడిది. కావ్యమునెడ వారు విముఖులును నయ్యెడివారు.

*"ఆదికవీశ్వరుఁడైన వాల్మీకి*
*యాదరంబునఁబుణ్యులందఱు మెచ్చఁ*
*జెప్పిన తెలుఁగున శ్రీరామచరిత*
*మొప్పఁజెప్పెదఁ గథాభ్యుదయ మెట్లనిన"*

అని కవి ప్రతిన చేసినను దద్భిన్నముగాఁ బ్రతికాండము నందును నేదోయొక యవాల్మీకాంశమును గల్పించుచునే కథ నడపెను. వానిలోఁ బెక్కు కావ్యమునకు గుణ సంపాదకములును దద్విశిష్టతకు హేతుభూతములు నైనవి. వీనిలోఁ గొన్నింటికి లోకమే యాధారమనుటకు నిదర్శనముగా స్త్రీల పాటలను,

బదములను, భజన కీర్తనలను బెక్కింటిని జూపవచ్చును. నేఁటి యీ పాటలే కవికి, ఆ నాఁడాధారము లయ్యెనని నే ననఁజాలనుగాని యీ పాటల యర్థముగల ప్రాచీన పదములేవో తప్పక యైయుండునని మాత్రము చెప్పఁగలను. సంస్కృత పురాణములు పండిత కవులాంధ్రీకరింపకమున్నే, యందలి గాథలు విడివిడిగాఁ బద కవిత్వ రూపమునఁ దెనుఁగు దేశమున వ్యాపించెనని చెప్పుట సారస్వత ధర్మ విరుద్ధముగాదు.

కీర్తన : "రాతినాతిగఁజేసె నీ పదరజమటంచును ఖ్యాతిగా విని

చరణము: ప్రీతితో నెఱనమ్మితిని నాపాతకములెడబాపు తండ్రీ!

పల్లవి : సీతామనోహరా! రారా! సేవకుఁడ నన్నుబ్రోవవేరా!"

అహల్య రాతిగాఁ బడియున్నదనెడి యర్థముగల యిట్టి కీర్తనలు – ఇంతకంటెను బ్రాచీనమైనవి, తెనుఁగు దేశమున నెప్పటినుండికలవో యెవనికెఱుక.

*"అదరి గౌతముఁ దహల్యాదేవిఁజూచి*

*పడఁతి పాషాణరూపముదాల్చి యిచట*

*కరముగ్రమగునెండ గాలిఁబెంధూళిఁ*

*బొరలుచుండుము నీవు పొడగానఁబడక"*

*(రంగనాథరామాయణము, బాలకాండ పుట. 57)*

ఈ పంక్తులలో బుద్ధారెడ్డి గ్రహించిన దా కీర్తనలోని యర్థమేకదా. "లక్ష్మణదేవరనవ్వు," "ఊర్మిళాదేవి నిద్ర", "లక్ష్మణమూర్ఛ" అనునవి ఆంధ్రస్త్రీలు నిరంతరము పాడుకొను పాటలలోఁబ్రశస్తములై పేరుమోసినవి. ఈ కవియుద్ధకాండాంతమున "ఆత్మసంప్రీణనము"లోఁ జొనిపిన "సౌమిత్రినవ్వు" "లక్ష్మణదేవరనవ్వు"నకు ఛాయగాక మఱేమగును? (చూడు పుట. 649 యుద్ధకాండము).

ఇవియు, మఱి యిట్టివేయైన మఱికొన్నియు నంశములుకాక, కావ్యసౌందర్య సంపాదనదృష్టిచే నరణ్య యుద్ధకాండలలో నీ కవి ప్రవేశపెట్టిన యమూలక గాథలు ముఖ్యమైనవి మూఁడుకలవు. వానిలో మొదటిది జంబుమాలి వృత్తాంతము (పుట. 176–179). దీని యునికి యీ రామాయణమునకుఁ గ్రొత్తవన్నెను బెట్టుచున్నది. అనతివిస్తృతిగల యీ చిన్నకథ స్వయం సంపూర్ణమై వెలుగొందుటేకాక ప్రధాన కథకు సైతము పోషకముగానున్నది. ఈ వృత్తాంతమే లేనిచో శూర్పణఖా ప్రవేశము సోపపత్తికమే కాదు. లోకులకు పరిహాసపాత్రమైన యా యవివేకురాలి చరితము దీనివలననే శోచనీయము దయనీయమునునయ్యెను.

రెండవది కాలనేమి వృత్తాంతము (పుట 566–581 యుద్ధకాండ). ఇందు, మనల నాశ్చర్యమగ్నులఁజేయునది రాక్షసుల ప్రతిక్రియాకల్పనాచతురత. అది యటుండ, రావణశక్తిచే మూర్ఛపడియున్న లక్ష్మణుఁడెప్పుడు పునరుజ్జీవితుఁడగునా యని తహతహపడు పాఠకులకు, నీ యవాంతర కథవలనఁ గలిగిన కాలయాపనము, భరింపరాని యుత్కంఠను గలిగించి, దుర్భర సంశయాస్పదమైన పరిస్థితి సృష్టించి, యంతమునఁ జేకూరిన మేలును నినుమడిగా, ముమ్మడిగా నాస్వాదయోగ్యమొనర్చుచున్నది.

మూఁడవది సులోచనావృత్తాంతము. దీనిని వేఱొకచో వివరించెదను.

ఇవిగాక ప్రత్యేకముగా యుద్ధకాండ కథకు వన్నెతెచ్చిన కల్పనలు, వేఱువిధములైనవి మఱికొన్ని కలవు. బాలకాండమున నయోధ్యలో బయలుదేరిన రామకథ క్రమముగా, ఆర్యావర్తమును దండకారణ్యమును కిష్కింధారాజ్యమును సముద్రమునుదాటి, యుద్ధకాండమున లంకలోఁ బ్రవేశించి కించిదవశిష్టముగా నచటనే ముగియును. ఈ తుదిఘట్టమునఁగాని రావణునియొక్కయు నాతని సంసారము యొక్కయు స్థితిగతులనుగూర్చి పాఠకులకు యథార్థజ్ఞానము కలుగునవకాశముండదు. అందుచే లంకాపట్టణము దయ్యాలకొంతారమనియు, రావణుఁడు దయ్యాల దైవమనియు, నాతని దారపుత్త్రాదులు భూతప్రేత పిశాచములనియుఁ దలఁచుకొని భయపడుదురు. ఆ సంస్కారముయొక్క నిజస్వరూపము నెఱుఁగవలెనన్నచో, ఈ రంగనాథ రామాయణమునే చదువవలయును. వారి మేలిగుణములదెస ఈ కవికున్న చూపు వాల్మీకికి లేదు. ఆ రావణగృహము దైవభక్తులకు, నీతిశాలులకుఁ, బతివ్రతలకు, వీరమాతలకు, వీరపత్నులకు నాకరము. ఆ రావణుని స్వభావమైనను పైకి గానవచ్చునంత యాసురముకాదు. ఇతరులమాట యెట్లున్నను నాతని సుగుణములను వాల్మీకి బీజప్రాయముగానైనను సూచింపలేదు. అతని మహత్త్వమును గుర్తించి వెల్లడించిన వా డీ రామాయణకర్త. కావ్యశిల్ప ధర్మమునుబట్టి చూచినను నాయకునివలెఁ బ్రతినాయకుఁడును నుదాత్తమూర్తియై యుండుటయే సమంజసముగాని, నీచ ప్రకృతి యగుట తగదు.

రావణుఁడెంత లోకభీకరుఁడైన శూరుఁడో అంత మహోదారుఁడైన వీరుఁడు. క్షుద్రములైన క్రౌర్యాసూయలచేఁ

గన్నులు మూసికొనిపోయి యెదిరి ఘనతను మెచ్చని యంధుఁడుకాఁడు. ప్రపంచము, అరావణమో, అరామమో కావలెనని గట్టిపగఁబూనియుండియు, ఆ రాముని ధనుర్విద్యా కౌశలమును జూచినంతనే తలలూఁచి యూఁచి మెచ్చి బట్టుకైవడిఁ బొగడిన గుణగ్రహణపారీణుఁడు.

*"నల్లవో రఘురామ! నయనాభిరామ! / విలువిద్యగురువ వీరావతార! కరశరలాఘవ క్రమకళానిపుణ / స్ఫురదురుచాప సంశోషితకృపణ భుజసారదృఢముష్టి భువనవిఖ్యాత / విజిత రిపువ్రాత విజయసమేత మానవరాజకుమార కంఠీర / వా, నవ్యదివ్యశస్త్రాస్త్ర సంపన్న స్ఫారఘోరాక్షయ బాణతూణీర / వీరాగ్రగణ్యయో విశ్వశరణ్య బాపురే! రామభూపాల! లోకముల / నీ పాటి విలుకాఁడు నేర్చునే కలుగ / పాటించి పురములపైఁ బద్ధహరుని / ఏటొప్పునిందు నీ యేటొప్పుఁగాక"*

"పగవాని నీ రీతి పంతంబువిడిచి" పొగడరాదనియు "పొగడిన భయ మందఁబోలు నటంచు" పగవారు తనవారు పలుచఁగాఁ జూతు" రనియు మందలించిరి. వారి మాటలను దశకంఠుఁడు నవ్వి "మేటిశూరుల పెంపు మెచ్చంగ వలదె" యని నీతిచెప్పుచు నచ్చోటువాసి పోయెను (పుట. 396).

ఇంతమాత్రమేకాదు. రాముఁడు సాక్షాద్విష్ణుస్వరూపుఁడని యెఱిఁగిన మహాజ్ఞాని, యీ రావణుఁడు. ఆ జ్ఞానమును మనమున నిగూఢముగా నుంచుకొని శత్రుసాధనచే నా రాముని చేతిలోఁ గడతేరి సాయుజ్యసుఖమును బొందఁగోరు ముముక్షువు.

*"శ్రీరాము శరములచేఁ జత్తునేని / నాకవాసులుమెచ్చ నా కోరుచున్న వైకుంఠమెదురుగావచ్చు నిచ్చటికి / లలన! నీవేటికి? లంక యేమిటికిఁ? / దలకొన్నముక్తి సత్పథముఁగైకొందు"*

(పుట. 592)

మహారాక్షసత్వములోఁబరమదివ్యత్వమును జూడగల్గిన యీ కవి యీ రాక్షస రాజును అసురలోకమునుండి యాధ్యాత్మిక లోకమునకుఁగొంపోయెను.

ఇఁక రావణుని తమ్ములలో విభీషణుఁడు లోకమెఱిఁగిన రామభక్తుఁడే. ఆతని చరితమిచటఁ బ్రస్తుతముకాదు. ఇంచుమించు రావణునివంటివాఁడే యనుకొన్న కుంభకర్ణుఁడెట్టివాఁడో చూతము. ఇతఁడు "ధర్మోజయతి"యని యెఱిఁగియు స్వపక్షమును వీడక యన్నకై యసువులనర్పించిన మహాత్యాగి. ఈతని ధర్మబుద్ధి వ్యక్తము చేయుటకోయన, ఈ కవి యుద్ధభూమిలో విభీషణ కుంభకర్ణుల కొక ప్రసంగము కల్పించి యాతనిచే నమూల్యములైన యీ క్రిందివాక్యములు పలికించెను:

*"విను విభీషణ! నీదు విక్రమంబునకు / ననువైనతఱి యిది యవనీశు నెదుర / నన్నదమ్ములపాఁడియని స్రుక్కవలవ / దిన్నరనాథునిహృదయంబె పట్టు / పూని యెన్నఁడు నిన్నుబొందవాపదలు భానువంశ్యునికృప పడసితిగాన / నా రాముదయగల దటుమీఁదసిద్ధ సారదయోదయశ్లాఘ్యచిత్తుఁడవు / లంక సద్గుణగణాలంకృతినేల నింక నెవ్వరుగలరిట నీవెకాక / సాహస బలమహోత్సాహంబుమెఱసి యహవంబున వేగమదరినన్ గడక / మగతనంబునుబాఁడి మదిలోనఁదలఁచి / తగనీవునాతోడఁ దాకెదవనుచుఁ / బలికితిగాని యీ పట్టున నిలువ / నలవియె బ్రహ్మరుద్రాదులకైన / తొలఁగుము తమ్ముఁడా త్రుంగకే వైన / వలయు నీ రాక్షసవంశంబుమనుప"*

(పుట. 472)

ఇఁకవీరి తల్లి కైకసి, యిట్టి కొడుకులఁగన్న వీరమాతయే గాక, కులమునకు రానున్న చేటు నూహించి పెద్దకొడుకునకు బుద్ధులుగఱపఁ బాటుపడిన సత్యనిరత. ఈ వృద్ధమాత, తెగువతోఁ దనంత పుత్రు కొలువుకూటముచేరి రామునితోడి పగ వలదని నయభయములబోధించి ఫలములనక "ఏ తెఱంగునఁ బోవదిది దైవకృతము: నీతి సెప్పిన విననేర్చునే"యని యిల్లుచేరి యూరడిల్లిన ప్రశాంతహృదయ.

ఈమెను బోలినదే యీ యింటి పెద్దకోడలు మండోదరి. పురాణవేత్త లీమెను మహాపతివ్రతలలో గణించి ప్రస్తుతించుట లోకవిశదమే. పతివ్రత కనుకనే పతిహితము కోరి యాతనిబుద్ధి మరల్ప మాటి మాటికిఁ బ్రయత్నించిచూచెను. అందు విశేషమేమియునులేదు. మఱి, "రాము విశిఖసంతాన వేగము సైరింపలేక, జర్జరితాంగుడై రజనీచరేంద్రుఁడు రణభూమివిడిచి" యిల్లుచేరి చింతాక్రాంతుడై నపు డాతని పౌరుషోత్సాహము లెసకొల్ప

*"......... ఓపంక్తికంధర! నీకుఁ*
*జనునె దీనునిభంగి శౌర్యంబువిడువ*
*...................................*
*...................................*
*జగములు నీవన్నఁ జలియించు, నేల*
*మగఁటిమి సెడియిట్టి మతముగైకొంటి?*
*నేఁడింత ధైర్యంబు నీకు లేకున్న*
*నాఁడేల తెచ్చితి నరనాథుదేవి?*
*...................................*

*...............................*
*వలదని చెప్పినవారి వాక్యములు*
*తలకూడెనే నేఁడు దనుజలోకేశ!*
*భుజవిక్రమంబెల్లఁ బోవంగవిడిచి*
*నిజముగా మునివృత్తి నీవు గైకొంటి*
*వింద్రుండెయని నోడనెఱుఁగవు రామ (?)*
*చంద్రుగెల్వకయున్న జనులెల్ల నగరె*
*యని చేసి గెలుతుగా కసురేశ! నీకు*
*ననదచందములేల?"*

*(పుట. 562)*

అని దూఱఁబలికి పతిని రణభూమికి మరల్చిన వీరవనిత. పగవీడుమని పలుమార్లు చెప్పిన హితముకంటెఁ బౌరుషము వీడవలదని తుదిసారి చేసిన యీ యుపదేశము ఇంద్రజిత్తునుగన్న వీరమాతకే తగును.

మండోదరికోడలైన సులోచన, అత్తగారికిని అత్తగారి యత్తగారికిని నెందును దీసిపోని సకలసద్గుణసంపన్న. ఈమె వారి యింటికొక మాణిక్యదీపము. ఈ ధీరపతివ్రత యుద్ధరంగమున శత్రుమధ్యమునకుఁబోయి వారిని మెప్పించి, రణనిహతుఁడైన పతికళేబరమును సహగమనార్థమై తెచ్చికొన్నపుడు,

*"ఆ యింతి తెగువకు నా యింతి తెలివి*
*కా యింతిసమబుద్ధి కా మహామహిమ*
*కా యింతి పతిభక్తి కా యింతివేగఁ*
*గాయముదెచ్చిన క్రమశక్తియుక్తి*
*కేమనఁజాలక"*

ఎందును నాశ్చర్యమెఱుఁగని రావణుఁడే మహాశ్చర్య చకితుఁడయ్యెను. ఈ కథను జదివిన యెల్లవారు నాశ్చర్యచకితులేయగుదురు.

ఈ సులోచనావృత్తాంతము నీ గ్రంథపరిష్కర్తలు తెరమఱుఁగున నిలుపక రంగముననే ప్రదర్శించి యుండవలసినది. ఈ కథ పూర్వముద్రణమునందున్నట్లు వ్రాతప్రతులందుఁ గానరాకపోవుటచే వారనుబంధములోఁ జేర్చిరఁట (చూడు. అనుబంధము 1 పుట 680-685). ఆ పూర్వముద్రణము వేయించిన వారికైననునేదో యొక వ్రాతప్రతియే యధార్థమైయుండునుగాని స్వంత కవిత్వము చెప్పి యుండరు గదా. ఆ వ్రాతప్రతి యిప్పుడు లభ్యము కానంతమాత్రమున దాని యునికిని ఏల సందేహింపవలెను? ఈ రమణీయగాథ, అనుబంధమునఁగాక ప్రధాన గ్రంథమునఁ జేరియుండవలసినది. ఒకటవ యనుబంధములోని యీ కథారచన ప్రధాన గ్రంథ రచనకు ననుగుణముగా నున్నదిగాని యన్యకర్తృకమనిపించుటలేదు.

ఏవం విధ మహితమైన యీ పౌలస్త్యకుటుంబమును జిత్రించుటలో నీ కవి చూపిన స్వతంత్రతకు, సమబుద్ధికి, విశాలదృష్టికి, భావుకలోకమే ప్రమాణము.

ఈ మహాగ్రంథమును ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారి కోరికపై నెంతయో శ్రమకోర్చి బహుతాళపత్ర గ్రంథ పరిశీలనమున నిర్దుష్టముగాఁ బరిష్కరించి ముద్రణ యోగ్యముగా నొనర్చి యిచ్చిన పండితవర్యులు శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి ఈ విశ్వకళాపరిషత్తువారి పక్షమున నా కృతజ్ఞతాభివందనములర్పించుచున్నాను. వారి మేలెన్నఁడును మఱువరానిది.

ఈ రంగనాథరామాయణమునకు నెంతో విపులమైన విమర్శ వ్రాయవలెనని యున్నది. కాలానుకూల్యమునుబట్టి, ఆ పని భావికాలమున నెఱవేర్పఁగలనని యాశపడుచున్నాను. అందుచేతఁ బ్రస్తుత మీ సంగ్రహ పీఠికనే వ్రాసితిని.

ఈ పీఠికను శ్రీ డాక్టరు. సర్. కట్టమంచి రామలింగారెడ్డి గారు వ్రాయవలసినది. వారికి బొత్తుగా నవకాశములేక నన్ను వ్రాయమని ప్రోత్సహించి, తమ యభిప్రాయములను గొన్ని నాకు సూచించిరి. వారికి నా యెడఁగల విశ్వాసమునకుఁ జాల కృతజ్ఞుఁడను. నేను సాధ్యమైనంతవరకు వారి యభిప్రాయములను నా యభిప్రాయములతో జోడించి, పొందించి యథాశక్తి యీ పీఠికను బూర్తి చేసితిని. కాని, యిది వారే వ్రాసియున్నచో నింతకంటె నెన్నోమడుఁగులు బాగుగ నుండెడిది. ఆ లోటును వారి యనుబంధపీఠిక తీర్చినదని సంతోషించుచున్నాను. విద్వల్లోకముగూడ సంతోషించుఁగాక.

ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు
15-5-1942



పింగళి లక్ష్మీకాంతం



కేశవరెడ్డి

# స్మృతి పథంలో
# కేశవరెడ్డి

'దిస్ నంబర్ కెన్నాట్ బి రీచ్డ్ రైట్ నౌ' అనిందావిడ చెవిలో. ప్లీజ్ ట్రై ఆఫ్టర్ సమ్ టైమ్' అని కూడా అనింది. తర్వాత ఆవిడ ఫ్రెండ్స్ అనుకుంటా ఇద్దరొచ్చి తెలుగులో, హిందీలో అలాగే గుసగుసలాడారు.

'ఆయన ఔటాఫ్ రీచ్' అటండీ అన్నాడు ఎదురుగుండా ఉన్న ఫ్రెండ్ అవును, అందదని అర్థమయింది. కేశవరెడ్డి కొడుకు నందూకి పదే పదే ఫోన్ చేసినా పలకడం లేదు. ఆయనకు డైరెక్ట్‌గా చేద్దామనుకుంటే సమాధానం అదే వచ్చింది. హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో నెల క్రితమే కలిసినప్పుడు, పోనన్నాడు. వస్తానన్నాడు. పార్టీ చేసుకుందామని కూడా చెప్పాడు. మేం రెడీ, ఆయనే రాలేదు. బ్లడ్ కేన్సర్ అని డాక్టర్లు తేల్చారు. ఫర్లేదన్నాడు. నాలుగైదు టెస్ట్‌ల తర్వాత విషయం తెలుస్తుందని చెప్పాడు.

పది పదిహేను రోజులు తిరిగాయి. మళ్ళీ కిమ్స్‌కు వచ్చాడు. ఇంటెన్సివ్ కేర్ అనీ, టెస్టులనీ ఎవ్వర్నీ లోపలికి పోనీలేదు. చీకటి పడ్డాక స్పెషల్ వార్డ్‌కి మార్చారు. ఈ సారి పాటల కవి గోరటి వెంకన్నా, జర్నలిస్టు ప్రకాష్, నేనూ వెళ్లాం. మనిషి బావున్నాడు. హుషార్‌గా ఉన్నాడు. ఆయనకి కేన్సర్ అంటే నమ్మలేనంతగా ఉన్నాడు. మళ్లీ 'అంతా బాగే కదా' అంటున్నాడు. మీ బాగు చూద్దామని వచ్చాం సార్, అందామనుకుంటే ఇంతలో ఓ కథ మొదలెట్టాడు. ముగ్గురం మంచం పక్కనే నించుని చెవులు రిక్కించి వింటున్నాం. నర్సులూ, ఎవరెవరో ఏవో కిట్లు పట్టుకుని అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. మంచం పక్కన స్టీల్ స్టాండ్‌లు పెడుతున్నారు. దిండు పక్కన బాక్స్‌లు అమరుస్తున్నారు. ఆయనకేం పట్టినట్టు లేదు. మా వంకే చూస్తున్నట్టున్నాడు. చూడ్డం లేదు కూడా: 'ఒక మహా రచయిత ఉన్నాడు. (పేరు మరచిపోయాం) తల్లి అంటే చాలా ప్రేమ. పిచ్చి కూడా. ఫ్రాన్స్ నుంచి దేశం కాని దేశం వస్తాడు. చాలా రాస్తాడు. ఇంకా చాలా రాయడానికి ప్లాన్ చేస్తాడు. ఈ చిరకాల ప్రవాసంలో ఒక ఇండియన్ డాక్టర్, ఫ్రెండ్ అవుతాడు. తరచూ కలిసి కబుర్లు ఆడుతుంటారు. మంచి కాలక్షేపం. చక్కని కంపెనీ. తన కొత్త నవల గురించి ఉత్సాహంగా చెబుతుంటాడు. ఇంతలో ఆ డాక్టర్, ఎందుకో మరి రచయితని టెస్ట్ చేస్తాడు. నీకు కేన్సర్ అని తేలుస్తాడు. ఫర్లేదు, ట్రీట్ చేస్తానంటాడు. రచయిత డౌన్, దిక్కు తోచదు.'

అలా చెప్పుకు పోతున్నాడాయన. ఇంతలో నర్స్ వచ్చింది. స్టీల్ స్టాండ్ దగ్గరకు లాగి, ట్యూబ్ సరిచేసింది. అలవాటనుకుంటా, ఆయన చెయ్యి చాపాడు. మోచేతిని పరుపు మీద పెట్టి ఇటు వేపు సూది గుచ్చి చిన్న ప్లాస్టర్ వేసింది ట్యూబ్ పెట్టింది. ముగ్గురం అసహనంగా కాళ్ళు తొక్కుకున్నాం.

కేశవరెడ్డి గారి కథ మళ్లీ మొదలు : రచయిత గారికి అమ్మ గుర్తొచ్చింది. కాయితం, కలం తీసుకుని అదే పనిగా పెద్ద లెటర్ రాశాడు: 'నాకు కేన్సరొచ్చింది. ఒక్కణ్ణే, నువ్వు వెంటనే వచ్చి నన్ను చూసుకోవాలి. మందులూ, మాకులూ వాడాలి. త్వరగా వచ్చేయమ్మా' కాయితం మడిచి మిత్రుడికిచ్చి అమ్మకి పంపమని చెప్పాడు.

నర్సు పెట్టిన ట్యూబ్ లోంచి రక్తం పైకెళ్తోంది. బాటిల్‌లోకి బొట్లు. పడుతున్నాయి. మళ్లీ కథ : 'మిత్రుడు లెటర్ విప్పి చదివి విస్తుపోయి, అమ్మ చనిపోయి పద్దెనిమిదేళ్ళు అయి పోయిందిగా ఇప్పుడిదేంటి' అని అడిగాడు. 'అవును గదా, మరిచిపోయా నంటాడు' రచయిత. మరి నాకేదన్నా వస్తే గుర్తొచ్చేదెవరు అమ్మే కదా అంటాడు.

అని అలా చెప్తూనే కేశవరెడ్డి మొహం పక్కకి తిప్పుకున్నాడు. నాకు మీరే, రోజూ గుర్తొస్తుంటారు. అంటున్నాడో లేదో ఆయనకి కన్నీళ్ళు జలజలా కారుతున్నాయి. గొంతు పూడుకుపోతోంది. అనుకోకుండా ఇలా జరిగేసరికి మాకూ అలాగే అయింది. ఏమీ తోచలేదు. భుజం మీద చేయి వేశా. తేరుకున్నాడు. బయల్దేరాం. కారు నిజామాబాద్‌కు కదిలింది. తర్వాత కాసేపు అక్కడే నిలబడ్డాం. మళ్లీ ఈ రోజు పొద్దుటే ఆయన గురించి వినడం 'ఔట్ ఆఫ్ రీచ్' అని.

మోహన్

(ఆంధ్రజ్యోతి, 14 ఫిబ్రవరి 2015)

## దళితుడి పయనం :

చిన్నప్పుడు ఒక కార్టూన్ స్ట్రిప్‌ను నిత్యం చూస్తుండేవాడిని. బహుశా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ననుకుంటా. ఆ కార్టూన్ స్ట్రిప్‌లో ప్రధాన పాత్ర పేరు హేగర్. అతని ఇంటిపేరు హారిబుల్. అతడొకసారి ఆర్మీలో రిక్రూట్ కావడానికి వెళతాడు. రిక్రూటింగ్ ఆఫీసరు అతని పేరు రాసుకుని, “ఇంటి పేరు చెప్పు” అంటాడు. ఇతడు, “It is horrible” అంటాడు. ఆఫీసరు “ఫరవాలేదు చెప్పు” అంటాడు. ఇతడు మళ్ళీ “It is horrible” అంటాడు. ఆఫీసరు తలపట్టుక్కూర్చుంటాడు.

కొంతకాలం క్రితం ఒకరోజు మా ఆసుపత్రిలో పేషెంట్లను చూస్తున్నాను. ఒక రోగి consultation room లోకి వచ్చాడు. రోగిని పరీక్షించేముందు అతని పేరు, కులం, ఊరు, వయసు వగైరా వివరాలను statistical purpose కోసం నమోదు చేయాలి. అవన్నీ అయ్యాక ‘‘ఏం చేస్తుంటావు?” అనడిగాను. అతడు “అడుక్కుతింటుంటా” అన్నాడు. “అది సరే, నీ కులవృత్తి ఏమిటి?” అనడిగాను. అతడు, అడుక్కుతింటాం’’ అన్నాడు. అతడు, ‘‘మా కులపోళ్ళంతా చేసేది అదే. అందరం అడుక్కు తింటాం” అన్నాడు. తరువాత తెలిసిందేమిటంటే అడుక్కు తినడమే కులవృత్తిగా గల కులాలు ఈ దేశంలో డజనుకు పైగా ఉన్నాయట!

ఈ దేశంలో వ్యవస్థీకృతమై ఉన్న ఈ భ్రష్టకారి కుల వ్యవస్థ మీద పోరాటం దాదాపు రెండువేల సంవత్సరాల నుంచి సాగుతున్నది. ఇన్ని వేల యేండ్లుగా ఏ కులమైతే తనను అవమానాలకు, అమానవీయతకు, హైన్యతకు గురిచేస్తూ వచ్చిందో ఆ కులనామాన్ని, తన పేరు చివరన ఆత్మగౌరవాన్ని, తద్వారా తన సాంఘిక సమానత్వాన్ని నిర్ద్వందంగా, బాహాటంగా ప్రకటించుకున్నాడు. ఈ శతాబ్దంలో సగర్వంగా చెప్పుకోదగిన సాంఘిక చైతన్యంగా దీనిని భావించడానికి ఏమాత్రం తటపటాయించ నవసరంలేదు. ఐతే ఈ సాంఘిక చైతన్యం బాహ్యశక్తులతో పోరాడి సంపాదించింది కాదు. వేల యేండ్లుగా తనను అంటిపెట్టుకుని ఉండినా ఆత్మన్యూనతతో పోరాడి, దానిని ఛేదించి, తన జీవితాన్ని మెరుగుపరచుకునే క్రమంలో నేడు దళితుడు ఒకానొక కీలకమైన మజిలీని చేరుకున్నాడు. ఇలా సాధించుకున్న ‘సాంఘిక’ సమానత్వం దానికదే అతని జీవితాన్ని గుణాత్మకంగా మార్చడానికి నిర్వహించగల పాత్ర ఎంత? ఈ ప్రశ్నకు సమాధానం ‘సున్న’ అని చెప్పాల్సి ఉంటుంది. కాని ‘సున్న’కు విలువ లేదని ఏ గణితశాస్త్రజ్ఞుడైనా అనగలడా? అనలేడు. సున్నాకు ముందు ‘అంకె’ చేరితే దానికి ఎనలేని విలువ సమకూరుతుంది. ఆ అంకె పేరే ఆర్థిక సమానత్వం.

కులవ్యవస్థ ఉత్పత్తి సంబంధాలతో బలంగా పెనవేసుకుని ఉంది. దళితుడు ఉత్పత్తి సాధనాలపై అదుపు సాధించుకుని, ఆర్థిక సమానతను సాధించకపోతే, అతడు ప్రతిష్ఠించుకున్న ఆత్మగౌరవం శాశ్వతంగా నిలిచే అవకాశం ఏమాత్రం లేదు. నిలిచి ఉన్నప్పుడు గూడా అది కేవలం భుజకీర్తుల్లాగా మాత్రమే నిలిచి ఉంటుంది. అనగా కులపోరాటం అనివార్యంగా, అవశ్యంగా వర్గపోరాటంలో సంలీనమై ఒకదానికొకటి complimentary గా సాగవలసి ఉంది.

ఈ నవల 1977లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా వచ్చి, 1979లో పుస్తకరూపంలో వెలువడింది. పుస్తకానికి త్రిపురనేని మధుసూదనరావు ముందు మాటలు రాస్తూ, “నవలలోని కొన్ని అంశాలను గురించి రచయిత పునరాలోచించవలసి ఉందని”ని పేర్కొన్నారు. కానీ, ఆనాటి పరిస్థితులలో అలా పునరాలోచించవలసిన అవసరం ఉందని నేను భావించలేదు. గత 22 సంవత్సరాలలో దళిత పోరాటం వివిధ ప్రాంతాలలో, వివిధ రూపాలలో సాగి, ఎన్నో దశలను దాటింది. నేడు దళితుడు తన సంకెళ్ళను కళ్ళకు అద్దుకోవడం లేదని నిస్సంకోచంగా అంగీకరిస్తున్నాను. ఐతే ఇది ఒక మజిలీ మాత్రమేననీ, ఈ మజిలీ నుండి దళితుడు వర్గపోరాటం వైపు సాగుతాడని బలంగా నమ్ము తున్నాను.

**డా॥ కేశవరెడ్డి**
**(ఇన్‌క్రెడిబుల్ గాడెస్' (క్షుద్రదేవత) నవలకి ముందుమాట 22-05-1999)**

# కన్నడ శివుడికి తెలుగు పార్వతి

– శాకమూరు రాజగోపాల్

కర్నూలు జిల్లా ఆలూరు పట్టణం చెంతనుండే 'గూళ్యం' అనే ఊరుకు నేను వెళ్ళింది సుమారుగా 23 సంవత్సరాలు అయ్యుండొచ్చేమో! లెక్కలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినా, 'గూళ్యం' బళ్ళారి టౌన్‌కు సమీపానే ఉందిలే! హగరి నది నడమటి ఒడ్డు (తీరం)న బసరకోడు, వణేనూరు... మొదలైన కర్నాటకకు చెందిన గ్రామాలు; తూర్పు తీరాన గూళ్యం, సుళువాయి, హలహరవి, ఎళ్ళార్తి మొదలైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రామాలు ఉన్నవి. నదికి తూర్పు తీరానున్న గ్రామాలు పరిపాలన దృష్టి నుంచి ఆంధ్రకు చేరినా, కన్నడాన్ని మాట్లాడే గ్రామాలుగా అవి ఉన్నవి. ఈ గ్రామాలలో పంటలకు చెందిన వ్యాపార లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకొనే కౌటుంబిక సంబంధాలు... అన్నీ బళ్ళారి జిల్లాలోని హగరినదీ తీర ప్రాంత గ్రామాల జతగానే నిరంతరంగా ఉంటవి. బళ్ళారిలోని జనం 'ఉరుకుంది' జాతరకో, 'కౌతాళం', 'ఎళ్ళార్తి' గ్రామాలలోని ఉరుసు ఉత్సవానికో వెళ్తుంటే, ఆంధ్ర వైపు నుంచి దుర్గమ్మ జాతరకో, పెళ్ళిబట్టలకో, తెలుగు సినిమాలు చూసేందుకో బళ్ళారికి వస్తుంటారు. సరిహద్దులలోని భేదం మ్యాప్ మీద మాత్రమే ఉంటుంది. నదికున్న రెండు ఒడ్డులలోని జనంలో వేరే వేరే రాష్ట్రాలకు చేరినోళ్ళమనే భావన అదెంత మాత్రం లేనే లేదులెండి!

నేను గూళ్యం గ్రామానికి వెళ్ళింది గాదిలింగస్వామి అనే సాధువు జాతరకేనండి. అవి తీక్షణమైన వేసవి రోజులు. హగరినది పలుచగా ప్రవహిస్తుంది. కొన్ని చోట్ల పాదం మునిగితే, మరికొన్ని చోట్ల మోకాళ్ళమట్టంలో నీళ్ళు పారుతున్నవి. గూళ్యం వైపు నుంచి జనం నది దాటి అటువైపు ఎదురుచూస్తున్న బళ్ళారి బస్సులకు చేరుకొంటున్నారు. అలాగున బళ్ళారికి వస్తున్నోళ్ళలో ఎంతోమంది మద్యపాన వ్యసనులూ ఉన్నారుకదా! అప్పుడు అవిభజిత ఆంధ్రప్రదేశ్‌లో నందమూరి తారకరామ రాయ ప్రభుత్వ పాలన నుంచి మద్యపాన నిషేధం ఉంది. తాగుబోతోళ్ళ సదుపయోగంకని కర్నాటకలోని నదీ తీరం బారుకూ సారా అంగళ్ళు స్థాపించబడి, ఆకలితో అలమటిస్తున్న పసోడ్ని మాతృమూర్తి చనుబాలు తాగేందుకు రారమ్మని పిల్చినట్లుగా ఆ తాగుబోతోళ్ళను ఆహ్వానిస్తున్నవి. వచ్చినోళ్ళు కంఠ పూర్తి (గొంతు నిండా) పాకెట్లు పాకెట్లు సారా తాగి, ఫుల్ లోడ్‌గా మారి నది దాటి వెళ్తున్నారు. కన్నడంలో పలకరిస్తే తెలుగులో జవాబిస్తూ, తెలుగులో మాట్లాడిస్తే కన్నడంలో జవాబిస్తూ ఉన్న వీళ్ళు, నిషా వంటి మీదకెక్కినా నది లోపల ఎక్కడా పడకుండానే, జారకనే, మునగకనే నదిని దాటి వెళ్ళడం చూస్తూంటే అదొక అద్భుత దృశ్య సంగతిగా అయ్యింది.

గూళ్యం వీధులలో అటు ఇటు తిరుగుతున్నప్పుడు, ఆకస్మికంగా ఒక ఇంటి ప్రాంగణం నుంచి యక్షగానంలోని రిహార్సల్ దృశ్యం జరుగుతూ నా కళ్ళలో పడింది. అది శివ – పార్వతి నడుమ సంభాషణల ప్రసంగంగా ఉంది. శివుడు తెలుగులో మాట్లాడుతుంటే, పార్వతి కన్నడంలో జవాబిస్తుంది. ఇది కొన్నిసార్లు సైతం ఉల్టా–పల్టాగా అవుతుంది. ఒక భాషలో మాట్లాడుతూనే ఇంకొక భాషలోకి గెంతే ఈ సంభాషణల పొర్లాటను చూసి నేను అవాక్కైయ్యాను. స్థానికులు ఇదొక మామూలు విద్యామానం అన్నట్లుగా చూస్తున్నారు. కారణం, వారివారి ఇళ్ళలో కన్నడం వాడుక భాషైనా, దైనందిన జీవనంలో ఇటువంటి భాషాపొర్లాటను చేసేది వాళ్ళకు అదెంతగానో అలవడి ఉంది కదా! కుం. వీరభద్రప్ప గారి కథల్ని, నవలల్ని చదివినోళ్ళకు రచనలలోని ఆయా పాత్రలు నుడికారంలోని పొర్లాటను చేస్తుంది, పాఠకులైన మీకు తెలిసే ఉంది కదా! సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత అయిన కుం. వీరభద్రప్ప గారిలో ఇది కన్నడం మీద తిరస్కారమో లేకపోతే తెలుగు మీద మమకారంలోని ఫలమో అయితే కాదులెండి! ఉర్దూలో చదివిన శాంతరసగారు, తమ సహాధ్యాయులు కలిసిన తక్షణమే కన్నడం నుంచి ఉర్దూలోకి జారుతుండేవారు కదా! ఉత్తర కర్నాటకలోని గ్రామీణ ప్రాంతాలలో, కన్నడం ఇంటి భాషగా వాడే మహమ్మదీయ బాంధవ్యులు ఉర్దూలోకి గెంతేది ఉందికదా! బెళగాంలోని సరిహద్దు భాగాలలో మరాఠి మరియు కన్నడాల నడుమ ఈ భాషల పొర్లాట ఉండే ఉంది కదా! ఆధునిక

శిక్షణకు (చదువుకు) అలవాటుపడిన మనం కూడా కన్నడ-ఇంగ్లీష్‌ల నడుమ భాషా పోర్లాటను చేస్తుంటాములే. అయితే ఈ భాషాపోర్లాటను ఎవరు ఎప్పుడు ఎందుకు చేస్తారు అనే దానికి సర్వ సమాన కారణాలు ఉండవు. ఒక భాషలోని అధికారాన్ని లోతుగా ఒప్పుకొనియుంటే జరిగే పోర్లాటకు ఒక అర్థం ఉంటుంది. రెండు భాషల్ని సమానంగా పరిగణించే చోట ఇంకొక అర్థం ఉంటుంది. గూళ్యంలో ఉంది రెండో రకమైన అర్థంలోని విన్యాసమే సుమీ!

నాకిప్పుడు గూళ్యంలోని నాటకం జ్ఞాపకం వచ్చింది. 'ద్రౌపది వస్త్రాపహరణం' అనే యక్షగాన పుస్తకాన్ని చదివేటప్పుడు కదా! ఇది బళ్లారి జిల్లాలోని 'కుడుతిని'లో ఉండే నరసింగరాయర (19వ శతాబ్దం) గారి రచన. బళ్ళారి, చిత్రదుర్గ, తమకూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఒక శతాబ్దం నుంచి ప్రదర్శించబడుతూ వస్తున్న ఈ యక్షగానంలోని మొదటి ముద్రణ 1915లో అయ్యింది. దీన్ని స్వయంగా నటుడూ మరియు బళ్ళారి జిల్లాలోని యక్షగానాల మీద శోధన చేసిన విద్వాంసులైన కె.ఆర్. దుర్గాదాస్ గారు సంపాదించి ప్రకటించారు.

నరసింగరాయర గారి యక్షగానం ఎంతో జనప్రియమైంది. దీన్ని 'గరుడ చేడు హనుమంతప్ప' అనే ద్విభాషాకవి తెలుగులోకి అనువదించారు. కన్నడం మరియు తెలుగు రూపాలు, సరిహద్దులలో అటుఇటు ఉండే గ్రామాలలో ప్రదర్శించబడుతూ వెళ్తున్నవి. అందులోనూ తెలుగు భాష వాడుకగా ఎక్కువున్న గ్రామాలలో, కలావిదులు తెలుగు పద్యాల్ని చేర్చి ప్రదర్శించసాగారు. పద్యం మరియు సంభాషణలు తెలుగు పఠణం నుంచి కన్నడంకూ కన్నడ పఠనం నుంచి తెలుగుకూ ఎగుమతి దిగుమతి అవుతూ వెళ్తుంటవి. ఇకనూ విశేషం ఏమిటంటే ఈ యక్షగానంలోని హస్తప్రతి లభించేది తెలుగు లిపిలోనే. ప్రస్తుతం వాడుకలో ఉన్న ప్రతిని అనంతపురం జిల్లా రాయదుర్గం తాలూకాకు చెందిన 'వెంకోబరావు హనకనహాళు' అనే వారు చేసింది, "ఇందులో ఏవైనా తప్పులు ఉన్నయెడల తెలిసిన పెద్దలు దిద్దుదురని కోరుచున్నాను!" (అర్థం కన్నడంలో = ఇదరల్లి ఎనాదరూ దోషగలిద్దరె, బల్లవరు తిద్దబేకెందు కోరికొళ్ళువెను) అని ఆరంభంలోనే విన్నవించారు. రెండు నుడికారాల్ని (భాషల్ని) వేర్వేరని తెల్పని భాషాద్వైత ప్రజ్ఞె ఇది కదా!

ప్రదర్శనలో మొదటగా సభామాట. అందులో -

"భలెలెలైసారథి, తుచ్చనాద సోమకాసురన కొచ్చి కెడహి నిశ్చలద వేదంగళ రాక్షిసి బ్రహ్మదేవనిగె హెచ్చిన కరుణవ కొట్టు మెచ్చు పడెదో స్వచ్ఛవాద అచ్యుతమూర్తి నానల్లవేనలా సారథి" (అర్థం తెలుగులో = భలెలెలై సారథి, తుచ్ఛుడైన సోమకాసురుణ్ణి చీల్చి పడేసి నిశ్చలమైన వేదాంగాల్ని రక్షించి బ్రహ్మదేవుడికి ఎక్కువగా కరుణయిచ్చి మెప్పు పొందిన అచ్యుతమూర్తిని నేను కదా సారథి) అంటూ విష్ణువు స్వపరిచయం వస్తది.

తర్వాత బాలకృష్ణుడి పాత్రధారి తెలుగులో "కూర్మాంబై నీవు కుదురుగ నిలిచిన కూర్మావతార నాలో దేవా దేవాధిదేవా మహానుభావా" (అర్థం కన్నడంలో = కూర్మావతారదరదల్లి నీవు గోయంతే నింతవరల్లవే దేవా దేవాధిదేవా మహానుభావా) అంటూ పాడుతాడు. ఇలాగున మొదటి అంకంలోనే కన్నడ సంభాషణ, తదుపరి తెలుగు పదాలు వస్తూ వెళ్తుంటవి. ప్రదర్శన సమాప్తమయ్యేది కూడా తెలుగు మరియు కన్నడ మంగళకర పద్యాలతోనే.

"మంగళ మంబుజనేత్రా మానిత గుణగాత్రా గంగాధర వరపుత్రా జయతే సదా! రారా నన్ను నేలలానా నేరము ఎంచుట ఎలా" (అర్థం కన్నడంలో = మంగళకరవాద కమల నేత్రవుళ్ళవనే, గౌరవార్హ గుణవుళ్ళ దేవదేవనే, గంగాధరన వరపుత్రనే సదా జయవాగలి, దేవా నన్న తప్పు ఎణిసువుదేతకె?) అంటూ తెలుగు పద్యం వస్తది. తర్వాత "మంగళమయ తనుజానుజగె జయమంగళ మాద్రి తనుజనిగె" అంటూ కన్నడ పద్యం వచ్చి యక్షగానం సమాప్తమౌతది.

స్వారస్యం ఉండే దెక్కడంటే, ప్రదర్శనం మధ్యలో పాత్రధారులు కన్నడం నుంచి తెలుగులోకి సునాయాసంగా గెంతటం -

"అహో! తిండి పోతులందు దండిగ ప్రఖ్యాతి పొందిన భండ భీమా" (అర్థం కన్నడంలో = అహో! తిండిబాకనెందు ధండియాగి ప్రఖ్యాతి హొందిరువ భండనాద భీమనే) అంటూ దుశ్శాసనుడు భీముణ్ణి చీదరించితే -

భీముడు ''అహో! దుష్టులందు నిస్సీముడైన దుశ్శాసనుడా, భ్రష్టావిను" (అర్థం కన్నడంలో = అహో దుష్టరల్లి నిస్సీమనాద దుశ్శాసన నెంబభ్రష్టా, కేళు) అంటూ గర్జించుతాడు.

అర్జునుడేమో "ఎలా దుష్ట కర్ణా, పట్టదరాణియ ఛట్టనే ఎళకొండు బందు కెట్ట దుశ్శాసననిగె నిట్టు గెట్టు హేళువ

నిన్న నాలిగె ఛట్టనే కిత్తి నెలక్కిట్టు బిడెవెనొ" (తెలుగులో అర్థం = ఏమిరా దుష్టకర్ణా, పట్టమహిషిని రపరపా ఈడ్చుకొంటూ వచ్చిన చెడ్డ దుశ్శాసనుడికి నీతిమాలిన మద్ధతును చెప్పే నీ నాలికను తక్షణమేకోసి నేలమీద పెట్టి విడుస్తాను)" అంటూ బెదిరించితే –

కర్ణుడు ప్రత్యుత్తరంగా "ఒరే ధనుంజయా, ఈ కురువీరుక్కుడు కడగలికి మీ చక్కెర బొమ్మయగు ద్రౌపదిని చిక్కబరపగా, నీవతని దిక్కునిక్కు చూడగా బక్కతనంబున గూడక ఈ పెక్కులు పల్కిన నీకెక్కువుగనా అర్జునా లోకదర్జునా" (అర్థం కన్నడంలో = ఎలవో ధనుంజయా, ఈ కురువీరను ఉత్సాహదింద సక్కరె బొంబెయంతహ నిమ్మ ద్రౌపదిగె కెణకువాగ, అతనన్ను ఎదురిసదె కైలాగదవనంతె కూతు, ఈగ బడివారద మాతాడిదరె దొడ్డవనాగువెయా అర్జునా, లోకదర్జునా) అంటాడు. కొన్నిసార్లు దుశ్శాసనుడు ఒకే ఊపిరితో భీముణ్ణి తెలుగులో దూషిస్తాడు.

ద్రౌపది కూడా "ఐతె కొంచమైనా దయలేదా నితాంత గుణవంత ప్రాణకాంతా" (అర్థం కన్నడంలో = నినగె నన్నమేలె కొంచవాదరూ దయవిల్లవే అతిశయ గుణవుళ్ళ ప్రాణకాంతా) అంటూ తెలుగులో అడిగితే అందుకు –

భీముడు "హే, పట్టదరాణియే ధిట్టవాగి కేళు, ఎప్పత్తుమణ తూకదిందొప్పువ ఈ గదె హిడిదు అప్పళిసి కుప్పళిసి... (అర్థం తెలుగులో = హే, పట్టపురాణీ ధిటవుగావిను, డెబ్బై మణుగుల తూకంతో నిండి యున్న ఈ గదను పట్టుకొని అట్టహాసంగా ఎగిరెగిరి...) అంటూ తన శౌర్యాన్ని చెప్పుకొంటాడు.

ఇటువంటి భాషా పొర్లాట 'ద్రౌపది వస్త్రాపహరణం'కే పరిమితం కాలేదు. రామసాగరంలోని సాలివెంకయ్య కవిగారి 'గిరిజాకల్యాణం'లోనూ ఉంది. అక్కడ కృష్ణుడు "హరన తప కెడిసువుదక్కే తరునీమణి నమగిన్ను వరబల సాలదు (శివుడి తపస్సు చెడిపేందుకు తరుణీమణి మాకికనూ వరబలం చాలదు)" అంటూ రతిదేవికి చెప్పితే –

అందుకు రతిదేవి "బో యదవిదా ఇది న్యామేమిరా (ఓయదువిరా ఇదు న్యావిదేనో)" అంటూ రోదిస్తూ తక్షణమే అక్కడే నిలబడియున్న మన్మథుణ్ణి ఉద్దేశించి "హోగ బేడవో ప్రియా భోగదొడెయా (వెళ్ళబోకురా ప్రియా భోగాల రారాజా)" అంటూ పాడుతుంది. అప్పుడు కృష్ణుడు రతిదేవితో "హే అమ్మా రతిదేవి, మనస్సు కఠిణమాడి మన్మథనిగె వీళ్యమం కొట్టు కళుహిసబేకెందు బేడికొళ్ళువె (ఓ అమ్మా రతిదేవి, మనస్సు కఠిణం చేసుకొని మన్మథుడికి రణతాంబూలం ఇచ్చి పంపించాలని వేడుకొంటున్నా)" అని చెప్పితే, అందుకు రతిదేవి "వోమామా శివన నేత్రాగ్నికి నాం భర్తుని పంపుట న్యాయమా? (కన్నడంలో = ఓ మావా, శివన కణ్ణ బెంకిగె నన్న పతియన్ను తళ్ళువుడు న్యాయవే?)" అంటూ దీనురాలుగా ప్రశ్నిస్తుంది.

ఈ భాషాపొర్లాట బళ్ళారి సీమలోని యక్షగానాల విశిష్టతకే పరిమితంకాలేదు. బీదర్ జిల్లాలోని ఔరాద్ (నిజామాబాద్‌లోని బోధన్‌కు సరిహద్దు) నుంచి కోలార్ జిల్లాలోని బంగారు పేట్ దాకా ఉండే కర్నాటక – తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులలో దొరికే సాహిత్య సంపదలోని సామాన్య గురుతులుగానే అయి ఉన్నవి. ఇదే సరిహద్దు సీమలో మొహ్రం పాటల్ని కన్నడంలో ప్రారంభించి తెలుగులో ముగించే గాయకమణులు ఉన్నారు. శిలవేరి శివప్ప, సాయిబణ్ణ తాత, కైవారద నారాయణ, మంజర్లా ఖాదర్‌సాబ, రాయదుర్గంకు చెందిన భంభం బాబా, మోట్నళ్ళి హసనసాబ మొదలైన కన్నడ తెలుగు ద్విభాషా కవులు ఉన్నారు. కైవార తాతయ్య ఒకే రచనలో కన్నడం తెలుగు రెండిట్నీ వాడేదాన్లో నిష్ణాతుడు. యక్షగానంలోని దేవతలు తమ పరిసరాలలోని భాషా వాస్తవ్యాన్ని ప్రతిబింబించే దర్పణాలుగా అయ్యున్నారంతే!

కర్నాటకంకు కొంకణి (గోవా), మలెయాళం (కేరళ), తమిళం (తమిళనాడు), తెలుగు (ఆంధ్ర, తెలంగాణా), మరాఠి (మహారాష్ట్ర)... ఇలాగున ఐదు భాషల ఆరు రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నవి. కొన్నిచోట్ల సరిహద్దు సమస్య ఉంది. మరికొన్నిచోట్ల భాషాపరంగా జగడం ఉంది. అయితే ఆంధ్ర, తెలంగాణా... కర్నాటక నడుమ పైన పేర్కొన్న సమస్యలేవి లేవు. కోలార్ జిల్లాలోని వందలాది గ్రామాలలో నూటికి ఎనభైశాతం తెలుగు భాషికుల నుంచి నిండియున్నా, ఆంధ్రప్రదేశ్‌కు చేరాలని అక్కడున్నోళ్ళు కోరుకొనేది లేదు. జనంలో తాము బతుకుతున్న ప్రాంతం ఏ రాష్ట్రానికి చేరితే మంచిది అనే లెక్కాచారం బాగా తెలిసి ఉండి ఉండొచ్చేమో! అయితే సంకుచిత ధోరణికి వెలుపల, వాళ్ళు సాంస్కృతిక సంబంధాల్ని ఇచ్చిపుచ్చుకొనేదాన్ని చేసుకొంటూ బతుకు బండిని లాగుతున్నారు. ఈ ఇచ్చిపుచ్చుకొనే సుసంస్కృతి భాగంగా ఈ భాషా పొర్లాట ఉందికదా! నా మిత్రుడొకరు

కోలార్ జిల్లాలోని ఒక కళాశాలలో కన్నడ అధ్యాపకుడిగా ఉన్నారు. తరగతిలోకి వస్తున్న విద్యార్థితో "యాకోతద? (ఎందుకురో ఆలశ్యం)" అని అడుగగా, ఆ విద్యార్థి 'నాక్యాల్ అడగతావు? ఐన్‌వానిగె అడుగు'' అంటూ తెలుగులో బిరుసుగా జవాబిచ్చాడట. రాయదుర్గం, కల్యాణదుర్గం (అనంతపురం జిల్లాలోని తాలూకాలు)లలో కన్నడం వాడుక భాషగా ఉన్న ఇళ్ళలోకి తెలుగు భాషకు చెందిన అల్లుళ్ళు, కోడళ్ళు వచ్చినప్పుడు, ఈ భాషాపోర్లాట జరుగుతుంది. ఎంతోమందికి భాష, ధర్మం, గుడులు, మసీదులు... ఇవేవి సమస్యలుగా ఉండేదిలేదు. అయితే వీటిని రాజకీయాల సెంటిమెంట్‌కు వస్తువుగా మలచుకొన్నోళ్ళ కథ వేరేగా ఉంటది. సమస్య ఏమిటంటే అటువంటోళ్ళ కొద్దిమంది మాటల్నే మొత్తం ఆ ప్రాంతానికి చేరిన జనులు అభిప్రాయమని మనం నమ్ముతుంటాం. ప్రసారమాధ్యమాలు అలాగే నమ్మిస్తుంటవి.

బహుభాషలు, బహుసంస్కృతులు, బహుధర్మాలు ఈ దేశంలోని సహజ అస్మితాలు. అవి పలికే మాటల నుంచి సాహిత్య కృతుల నుంచి, ఆచరణల నుంచి, కళాప్రాకారాల నుంచి సంపదలుగా అవి మన తరం వారికి లభించినవి. ఎంతగానో జీవన పోరాటంలో మునిగి ఉండే జనం, పరిసరాలలో భాషల్ని రెండు ముక్కుపుటాల మార్గంగా ఒకే ఊపిరి పీల్చి వదిలినట్లుగా వాడుతుంటారు. ముఖ్య గమనిక ఏమిటంటే పరిసరాలలోని భాషలలో తమదీ ఒకటి అన్నప్పుడు సమస్య ఉండదు. తమది విశిష్టం అన్నప్పుడూ అదంతగా కష్టం కాదు. తమది శ్రేష్ఠం అనిన తక్షణమే తారతమ్యం ఆరంభమౌతది. గూళ్యంలో భాషాపోర్లాటను శివ-పార్వతి పాత్రలే చేసింది నాకు అర్థ పూర్ణంగా అన్పించింది. కారణం, వీళ్ళు మన ముక్కోటి దేవతలలోనే ఎల్లప్పుడూ జతగా ఉండేటి దంపతులు. జగడం చేసి విడిపోయినా మరల పోరాడి కలిసే దంపతులు కదా వీరు. మరెన్నడూ విడిపోరాదని ఒకే దేహంలో అర్థనారీశ్వర రూపంలో ఒదిగి ఉండగలరు. రెండు విశిష్టాలు వేర్వేరుగా ఉండనట్లుగా పెనవేసుకొనేదే కదా అద్వైతం! కాళిదాసు అద్వైత తత్వాన్ని వివరిస్తూ శివపార్వతి రూపకాన్నే వాడుకొన్నారు. వాక్కు మరియు అర్థాలన్నట్లుగా వారు సదా జోడిగా అవుతారు అని చెప్పారుకదా! పురాణాలలో శివ-పార్వతుల నడుమ కలహం జనించేది ఉందిలే. ఎన్నోసార్లు అందుకు కారణం ఆ దంపతులలోని భిన్నమతం అయితే కాదు, మధ్యలో దూరే ఇతర దేవతల వైషమ్యమే కారణం.

హగరి నదికి శివ-పార్వతులలాగ రెండు ఒడ్డులు ఉన్నవి. వాటి నడుమ ప్రవహించే జలం ఒకటే. గూళ్యం గ్రామంలో రెండు భాషలు వాడుకలో ఉన్నవి. వాటిని సలీసుగా (తేలికగా) మాట్లాడేందుకు ఉన్న నాలుక ఒకటేనండి!

**కన్నడ మూలం : ప్రొ॥ రహమత్ తరీకెరె**

**తెలుగు అనువాదం : శాకమూరు రాజగోపాల్**

(ప్రొ॥ రహమత్ తరీకెరె హంపీలో ఉండే కన్నడ విశ్వవిద్యాలయంలో కన్నడ భాషా ప్రొఫెసర్‌గా పనిచేశారు. వీరు కన్నడంలో వ్రాసిన *ప్రొఫెసర్ గారి విశిష్ట యాత్రా కథనాలను* శాకమూరు రామగోపాల్ తెలుగు అనువాదం చేశారు.)

## బుద్ధ జయంతి 2560 ప్రత్యేక సంచిక



మే మాసం అంటే బుద్ధపూర్ణిమ. బుద్ధజయంతి ప్రత్యేకం. పూర్ణిమనాడే సిద్ధార్థుడు జన్మించాడు. పూర్ణిమనాడే బుద్ధుడయ్యాడు. పూర్ణిమనాడే మహాపరినిర్వాణం చెందాడు. ఈ ప్రత్యేక సంచిక కోసం సంవత్సరం పొడవునా వ్యాసాలు స్వీకరిస్తుంటాం. బౌద్ధచరిత్ర, సిద్ధాంతాలు, అశోకుని ప్రచారం - ఈ విధంగా బుద్ధ సంబంధిత వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాం. ఏప్రిల్ 15వ తేదీ వరకు **మిసిమి** కార్యాలయానికి చేరేట్లు చూడగలరు.

*- సంపాదకులు*

# క్రోమోసోమ్ కథనమ్

*- ము.పా.సా.*

## స్వప్రయోజనం

మనుషుల్లో LINE - I, Alu జన్యువుల మధ్యకు చేరి పలు మ్యుటేషన్‌లకు కారణమయ్యాయి. వీటివల్లనే వస్తుంది హెమోఫిలియా – గాయపడినప్పుడు రక్తస్రావం ఆగకపోవటం, రక్తం గడ్డకట్టటానికి అవసరమైన జన్యువులను ఆక్రమిస్తాయివి. ఈ సందర్భంలో మనం P ఎలెమెంట్ అనబడే జన్యువు గురించి కూడా తెలుసుకోవాలి. ఇది సెల్ఫిష్ DNAలోని ఒక భాగం. ఇతర జన్యువులను చిందవందర చేస్తుంది. పళ్ళమీద వాలే ఈగల్లో యిది ఎక్కువగా ఉంటుంది. కాని మనుషులకు వ్యాపించినట్టుగా దాఖలాలు లేవు.

LINE - I, 1400 అక్షరాల పొడవుంటుంది. Alu పొడవు 180 అక్షరాలు. ఇంతకన్న పొట్టి జన్యువులూ లేకపోలేదు. అన్నింటినీ పరాన్నభుక్కులనేలేంగాని అతి వేగంగా వ్యాప్తి చెందుతాయివి. 1984లో ఆలెక్ జెఫ్రీస్ యాదృచ్ఛికంగా ఈ మినిసేటెలైట్స్ గురించి కొంత సమాచారం సేకరించాడు. కండరాల ప్రొటీన్ మియోగ్లోబిన్‌ను అధ్యయనం చేస్తున్నప్పుడు ఒక జన్యువు మధ్యలో పునరావృతమవుతున్న DNA కనిపించింది. కాని ఈ పునరావృతమవుతున్న అక్షరాల సంఖ్య ఎంత ప్రత్యేకంగా వుందంటే, దాన్నే యునీక్ జెనెటిక్ ఫింగర్ ప్రింట్ అన్నారు. ఈ ఆవిష్కరణ ఇమ్మిగ్రేషన్ అధికారుల పని సులువు చేసింది. ఫింగర్ ప్రింటింగ్ ద్వారా, కొత్తగా తమ గడ్డమీద అడుగు పెట్టినవాళ్ళలో ఎవరు, తమ పౌరుల దగ్గర బంధువులో, ఎవరు అబద్ధాలు చెబుతున్నారో సులభంగా తెలుసుకోగలిగారు. అయితే, ఫింగర్ ప్రింటింగ్ పద్ధతివల్ల కలిగిన లాభాలు దీనికే పరిమితం కాలేదు. 1986లో ఆగస్ట్ 2 నాడు, లెస్టర్ షైర్‌లోని అడవుల్లో ఒక స్కూలుపిల్ల శవం కనిపించింది. డాన్ ఆష్‌వర్త్ పేరుగల ఆడపిల్లమీద ఎవరో అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపారు. వారం రోజుల తర్వాత ఒక ఆస్పత్రి ఉద్యోగిను అరెస్ట్ చేశారు. అతడూ వెంటనే నేరం అంగీకరించాడు. ఇక్కడితో ఈ వ్యవహారం ముగియాల్సిందే. కాని, మూడేళ్ళ క్రితం, అదే ఊళ్ళో మరో పదిహేనేళ్ళ పిల్లను కూడా ఎవరో యిలాగే అత్యాచారం చేసి, చంపేశారు. ఆ కేసు కూడా యిప్పుడే ఓ కొలిక్కి తీసుకురావాలనుకున్నారు పోలీసులు. ఎందుకంటే రెండు హత్యలూ ఒకేలా జరిగాయి. హంతకుడు ఒకడే అయివుండే అవకాశం వుంది. కాని హాస్పిటల్ ఉద్యోగి తనకు ఆ హత్యతో ఏమాత్రం సంబంధం లేదన్నాడు.

జెనెటిక్ వేలిముద్రల ప్రక్రియ గురించి అప్పుడే పత్రికల ద్వారా పోలీసులకు తెలిసింది. ఆలెక్ జెఫ్రీని సంప్రదించి, ఈ మిస్టరీని పరిష్కరించడంలో సహాయం చెయ్యమన్నారు. ఇద్దరు ఆడపిల్లల నుండీ సేకరించిన వీర్యాన్నీ, హంతకుని రక్తాన్నీ పరీక్షించారు జెఫ్రీస్. అన్ని శాంపిల్స్‌లోనూ రకరకాల మినిసేట్‌ఫైట్స్ కనిపించాయి. మరో వారం తర్వాత జెనెటిక్ వేలిముద్రలు కూడా సిద్ధం చేశారు. వీర్యం శాపింల్స్ రెండూ ఒకే వ్యక్తికి సంబంధించినవని తెలిసింది. కేసు మూసేశారు పోలీసులు. అయితే జెఫ్రీస్‌ను దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం మరొకటుంది. రక్తం శాంపిల్స్ ఆధారంగా సేకరించిన జెనెటిక్ వేలమిద్రులూ, వీర్యం నుండి సేకరించిన వేలిముద్రలూ సరిపోలలేదు. అంటే వాటిలో తేడాలున్నాయి. దీని అర్థమేమిటి? పట్టుబడిన నేరస్తుడు హత్య చెయ్యలేదన్నమాట. కాని పోలీసులు ఈ సత్యాన్ని అంగీకరించదలుకోలేదు. జెఫ్రీ పరిశోధనలో ఏదో తప్పు జరిగి వుంటుందనుకున్నారు. కేవలం పోలీసులే కాదు, ఫోరెన్సిక్ లేబరేటరీ వాళ్ళు కూడా జెఫ్రీ ఎక్కడో పొరబాటు చేశాడన్నారు. అయిష్టంగానే, నేరస్తుడిమీద కేసు ఉపసంహరించుకున్నాడు. చరిత్రలో తొలిసారిగా, DNA ఆధారంగా ఒక వ్యక్తి నిర్దోషిగా నిరూపితమయ్యాడు. అయినా పలు సందేహాలింకా మిగిలే ఉన్నాయి. ముద్దాయి తన నేరాన్ని అంగీకరించిన తర్వాత కూడా యివేమి తిరకాసు? హంతకుని వీర్యంతో సరిపోల్చే ఉద్దేశంలో, ఆ ప్రాంతంలోని మరో 5500 మంది వీర్యం నమూనాలు సేకరించారు పోలీసులు. కాని వాటిలో ఏ ఒక్కటీ హంతకుని వీర్యంతో సరిపోలలేదు. అనేక నాటకీయ పరిణామాల తర్వాత మరో వ్యక్తి (అతడు అనుమానితుడు కానే కాదు) వీర్యం నమూనా సేకరించారు. అంతే. మిస్టరీ వీడింది. జెనెటిక్ వేలిముద్రలు అతడివేనని

తేలింది. విచారణలో రెండు హత్యలూ చేసింది తనేనని అంగీకరించాడు. కోర్టువారు ఈ సాక్ష్యాన్ని అంగీకరించారు. 1988, జనవరి 23 నాడు హంతకునికి యావజ్జీవ శిక్ష విధించారు. ఫోరెన్సిక్ పరిశోధనల్లో జెనెటిక్ ఫింగర్ ప్రింటింగ్ అత్యంత కీలకమైన అంశంగా మరోసారి నిర్ధారించబడింది. హత్యలు మాత్రమే కాదు, శరీరానికి సంబంధించిన అన్నిరకాల పరిశోధనల్లోనూ ఈ టెక్నిక్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు. 1990లో ఒక మృతదేహం దొరికినప్పుడు అది ఎవరిదో గుర్తించటానికి ఈ పద్ధతిని తొలిసారి వాడారు. వివాదాస్పదమైన అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్, మోనికా లెవిస్కీ కేసులో కూడా వీర్యం ఎవరిదో నిర్ధారించటానికి ఈ ఫింగర్ ప్రింటింగ్ ఉపయోగపడింది. "శిశువుకు తండ్రి ఎవరు?" అని నిర్ధారించవలసి వచ్చినప్పుడు ఇప్పుడు 'DNA తెలుసు' అనటం సర్వసాధారణమైంది.

## క్రోమోసోమ్ కథనమ్ – 9

"ప్రాణాంతకమైన రోగానికి, ప్రమాదకరమని తెలిసినా చికిత్స చేయాల్సిందే."

– *గైఫాక్స్*

క్రోమోసోమ్ – 9 మీద వుంటుంది ABO బ్లడ్‌గ్రూప్‌ను నిర్ణయించే జన్యువు. DNA ఫింగర్ ప్రింటింగ్‌కు ముందు, బ్లడ్‌గ్రూప్‌లు న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా చలామణీ అయ్యాయి. అంటే, ఆ రోజుల్లో, నేరం జరిగిన ప్రదేశంలో రక్తం మరకలు కనిపించాయంటే పోలీసులకు పండగే. వాళ్ళింకే పరిశోధనా చెయ్యనక్కర్లేదు. బ్లడ్‌గ్రూప్ ఎవరిదైతే వాళ్ళే నేరస్తులన్నమాట. బ్లడ్‌గ్రూప్ సరిపోలకపోతే, మరెన్ని సాక్ష్యాలున్నా సరే, ముద్దాయి నేరస్తుడు కాదని కోర్టులూ అంగీకరించాయి. కాని ఈ వాదన హేతువిరుద్ధం. కేవలం ఈ బ్లడ్ గ్రూప్ ఆధారంగా, 1946లో, కాలిఫోర్నియా సుప్రీంకోర్ట్ చార్లీచాప్లిన్‌ను ఒక బిడ్డకు తండ్రి అని నిర్ధారించింది (అతడు తండ్రి కాదని చెప్పటానికి అనేక ఇతర సాక్ష్యాలున్నా, కేవలం బ్లడ్‌గ్రూప్ ఆధారంగా ఈ తీర్పు ప్రకటించారు జడ్జిలు). న్యాయవిచారణలో సైన్సు సహాయం చేస్తుందే తప్ప లాయర్లు, జడ్జిలందరూ సైంటిస్టులు కావాలని మనం ఆశించలేంగదా!

మనం జెనెటిక్స్ గురించి మాట్లాడుకుంటున్నాం. కోర్టు తీర్పుల గురించి కాదు. బ్లడ్‌గ్రూప్‌ల అవగాహన, జన్యుపరిశోధనలో అత్యంత ముఖ్యభూమిక పోషిస్తుంది. ABO అన్న బ్లడ్‌గ్రూప్‌ల విభజన తొలిసారిగా 1900లో జరిగింది. A, B, AB, O గ్రూపులుంటాయని ఇప్పుడు అందరికీ తెలుసు. ఎర్ర రక్తకణాలన్నీ కలిసి వుంటాయి. అయితే, ఈ గ్రూపుల మధ్య సంబంధాలు మాత్రం కొంత సంక్లిష్టమే. A గ్రూపువాళ్ళు A లేక AB వాళ్ళకు, B గ్రూపువాళ్ళు B లేక AB గ్రూపువాళ్ళకు, AB వాళ్ళు యితర AB వాళ్ళకు మాత్రమే, O వాళ్ళు ఎవరికైనా రక్తదానం చెయ్యవచ్చు. అంటే O గ్రూపును ఇతర అన్ని గ్రూపులూ అంగీకరిస్తాయి. వీళ్ళను యూనివర్సల్ డోనర్స్ అంటారు. ఈ బ్లడ్‌గ్రూపులకు భౌగోళికమైన లేదా జాతిపరమైన కారణాలేవీ లేవు. యూరోపియన్లలో సుమారు 40% మందికి O గ్రూపు, మరో 40% మందికి A గ్రూపు, 15% AB, 5% మందికి AB గ్రూపు రక్తముంటుంది. ఇంచుమించు అన్ని ఖండాలలోనూ ఇదే నిష్పత్తి కొనసాగుతున్నది. ఒక్క అమెరికాలలో తప్ప. ఇక్కడ స్థానిక ఆదివాసీ తెగలలో ఇంచుమించు అందరివీ O గ్రూపు రక్తమే.

1920 ల దాకా ఈ బ్లడ్‌గ్రూపుల జన్యుకారణాల గురించి పెద్దగా తెలియదు. 1990లలో మాత్రమే దీనికి కారణమైన జన్యువును గుర్తించగలిగారు. A, B గ్రూపులను నిర్ణయించేది ఒకే జన్యువు. రక్తం కొన్నిసార్లు O గ్రూపుగా మారటానికి కూడా కారణం దీని recessive రూపమే. దీని పొడవు 1062 అక్షరాలు. ఇందులోని ప్రొటీన్‌కు రసాయనిక ప్రక్రియను ప్రేరేపించే శక్తి వుంటుంది. A గ్రూపు జన్యువుకు, B గ్రూపు జన్యువుకూ (1062 అక్షరాలలోని) ఏడక్షరాలే తేడా. అందులోనూ మూడు తటస్థంగా వుండేవే. అంటే, వీటివల్ల, ప్రోటీన్‌లలోని అమీనో ఆసిడ్‌లలో ఏమీ తేడా రాదు. మిగతా నాలుగు అక్షరాలు (వీటి సంఖ్య 523, 700, 793, 800) మాత్రమే కీలకం. A గ్రూపులో ఇవి CGCG గానూ, B గ్రూపులో G,.A, A.C గానూ వుంటాయి. ఒకే ఒక్క అక్షరం తేడాలో O గ్రూపు ఏర్పడుతుంది. తేడా అంటే, ఈ జన్యువులో 258 సంఖ్యగల అక్షరం వుండదు. ఈ ఒక అక్షరం తేడాతో ఒక ప్రొటీన్‌కు బదులు మరొక ప్రొటీన్ ఏర్పడుతుంది. ఏదైనా బ్లడ్‌గ్రూప్‌లు మనుషుల జీవితాలలోగాని, వాళ్ళ ప్రతిభాపాటవాల్లోగాని ఏమీ ప్రభావం చూపించవు. అయితే, చిరకాలంగా అందరూ ఇలాగే భావించారుగాని, 1960లలో A బ్లడ్‌గ్రూప్‌కు, విరేచనాలకూ సంబంధముందని తేలింది. అలాగే B బ్లడ్‌గ్రూపు వాళ్ళకు మరికొన్ని జబ్బులు వచ్చే

అవకాశముంది. O గ్రూపువాళ్ళకు అంటువ్యాధులూ, కలరా మిగతావాళ్ళకన్న త్వరగా వస్తాయని 1980లలో తెలిసింది. అనేక పరిశోధనల తర్వాత AB గ్రూపువాళ్ళకు రోగాలు సోకే అవకాశాలు అతి తక్కువని తెలుసుకున్నారు. వీళ్ళ రోగనిరోధక శక్తి ఎంత ఎక్కువంటే కలరా వీళ్ళకు సోకే అవకాశమే లేదు. అయితే అంతమాత్రం చేత, డ్రెయినేజిలో పారే మురికి నీరు తాగినా ఏం కాదని కాదు. కలరా సంగతెలావున్నా మరో లక్ష యితర జబ్బులు తప్పక వస్తాయి.

రోగాలను దరిచేయనీవాని AB జెనోటైప్ గురించి మరికొన్ని కొత్త విషయాలు తెలిశాయి. మనలో ప్రతి క్రోమోసోమ్ అలాగే B అంటే BB కలరాకు సంబంధించినంత వరకూ, B లతో పోల్చితే A గ్రూపువాళ్ళు క్షేమం. అంటే, ఆ మహమ్మారి గనక వస్తే, ఒక సమాజంలో A వాళ్ళకన్న B వాళ్ళు ఎక్కువగా మృత్యువాత పడతారు. అంటే ఇక కాలక్రమంలో B అంతరించిపోతుందా? AB గ్రూపువాళ్ళకు ఇతరులకన్న రోగనిరోధక శక్తి ఎక్కువగనక AA లకు BB లకు కలిగిన సంతానం (AB)లో రోగాలను తట్టుకునే స్వభావం బాగా వుంటుంది. అయితే, AB గ్రూపు స్త్రీపురుషులకు పుట్టే పిల్లల్లో కూడా సగం మంది మాత్రమే AB లుగానో AA లుగానో BB లుగానో ఉంటారు.

వ్యాధికీ, కణవిభజన (మ్యుటేషన్)కూ మధ్య ఉన్న సంబంధాన్ని తొలిసారిగా 1940లలో, ఆంతోనీ ఆలిసన్ అనబడే ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి గుర్తించాడు. ఈయన కెన్యా దేశస్థుడు. ఆఫ్రికాలో ఎక్కువగా దర్శనమిచ్చే సికల్‌సెల్ ఎనీమియా అనబడే వ్యాధికీ, మలేరియాకు సంబంధం ఉండవచ్చుననే అనుమానంతో ఆ దిశగా పరిశోధనలు ప్రారంభించాడు. ఆక్సిజన్ తక్కువైన పరిస్థితుల్లో నెత్తుటి కణాలు నిర్వీర్యమవుతాయి. సికల్‌సెల్ మ్యుటేషన్ వల్ల ఇది సంభవిస్తుంది. ఆఫ్రికాలోని మలేరియా అధికంగా ఉన్న ప్రాంతాల్లో రక్తం నమూనాలు సేకరించిన ఆలిసన్, సికల్‌సెల్ మ్యుటేసన్ ఉన్నవాళ్ళలో మలేరియా పారసైట్లు ఉండే అవకాశం ఎక్కువని గుర్తించాడు. మలేరియా మహమ్మారిగా ప్రబలిన ప్రాంతాల్లో మాత్రమే సికల్‌సెల్ మ్యుటేషన్ ఎక్కువగా ఉంది. ఆఫ్రికా నుండి అమెరికాకు వలస వచ్చిన (బానిసలుగా కొని తేబడిన) వాళ్ళలో ఇది అత్యధికం. శతాబ్దాల క్రితం మలేరియాను నిర్మూలించటానికి చేసిన ప్రయత్న ఫలితమే సికల్‌సెల్ నీమియా. "హిమోగ్లోబిన్ జన్యువు"లోని కేవలం ఒక అక్షరం తేడాతో సికల్‌సెల్ మ్యుటేషన్ జరుగుతుంది. వెరసి, మనం గ్రహించవలసిన సత్యమొక్కటే. ఒక వ్యాధిని తగ్గించటానికి ప్రయత్నిస్తే మరోవ్యాధి వచ్చే అవకాశముంది. "ఆస్టియోపారోసిస్ (ఎముకలు బలహీనపడటం)కూ, క్షయవ్యాధికే సంబంధముంది" అన్నాడు ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన ఏడ్రియన్ హిల్. అలాగే, సిస్టిక్ ఫైబ్రాయిడ్‌కూ, టైఫాయిడ్‌కూ దగ్గిర చుట్టరికముందని ఇటీవలే తెలుసుకున్నారు. క్రోమోసోమ౦ – 7 మీద వున్న CFTR జన్యువు (ఊపిరితిత్తుల, పేగుల వ్యాధి) సిస్టిక్ ఫైబ్రాయిర్‌కు కారణం. కాని ఈ జన్యువే టైఫాయిడ్ రాకుండా ప్రతిఘటిస్తుంది (టైఫాయిడ్‌కు కారణం సాల్మోనెల్లా బాక్టీరియం). వివిధ జన్యువులు ఒకదానొకటి ప్రతిఘటిస్తుంటాయి గనక, ఒకదాన్ని నిర్మూలించటానికి ప్రయత్నిస్తే, మరొక జన్యువువల్ల రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. సుమారు అయిదోవంతు జనాభా ABO బ్లడ్‌గ్రూప్ ప్రొటీన్లను, తమ లాలాజలంలోకి వదలటానికి ఇబ్బంది పడతారు. లాలాజలంలో కరిగిపోగలిగిన ఈ ప్రొటీన్లను విడుదల చెయ్యలేని వాళ్ళకు మెనింజిటెస్ (మెదడు, వెన్నెముకల వ్యాధి) మూత్రనాళ వ్యాధులు వచ్చే అవకాశముంది. అయితే వీళ్ళకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం చాలా తక్కువ. మొత్తంమీద అంటురోగాలకు మూలకారణం జన్యువులే అన్న విషయం స్పష్టమయింది.

ఇంతా చేస్తే మనకు ఈ విషయం గురించి ఇప్పటికి మనం మాట్లాడుకున్నది చాలా తక్కువ. ప్రాచీన కాలంలో మానవ సమాజాలను తుడిచిపెట్టిన మహమ్మారులు ప్లేగ్, ఆటలమ్మ, టైఫాయిడ్, ఇన్‌ఫ్లుయెంజా, సిఫిలిస్, స్ఫోటకం, వగైరా జన్యువులమీద తమ పాదముద్రలు వదలివెళ్ళాయి. మన జన్యువులు వాటిని ప్రతిఘటించాయి. విజయం కూడా సాధించాయి. కాని తరతరాలుగా నడచిన ఈ హోరాహోరీ పోరాటానికి ఖరీదు కూడా చెల్లించాయి. ఆ ఫలితమే సికల్‌సెల్ ఎనీమియా, మరొక గ్రూప్ రక్తం (రక్తదానంలో) మన శరీరం అంగీకరించలేకపోవటం వగైరా. డాక్టర్లు ఇన్నాళ్ళూ అంటువ్యాధులను తక్కువ అంచనా వేశారు. పర్యావరణం, వృత్తిసంబంధిత సమస్యలు, ఆహారం వంటివి వీటికి కారణాలు కావచ్చుననుకున్నారు గాని, వైరస్‌లు, బాక్టీరియావల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఇటీవలే తెలిసింది. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవలసింది కడుపులోని పుండ్ల గురించి (స్టమక్ అల్సర్). వీటిని ఇట్టే తగ్గిస్తామంటూ వివిధ మందుల కంపెనీలు కోట్లు గడించాయి. కాని వీటి చికిత్సకు

యాంటీబయోటిక్స్ తప్ప మరేమీ అవసరం లేదని ఇటీవలే గ్రహించారు. అల్సర్‌కు కారణం ఒక బాక్టీరియా (హెలికో బాక్టర్ పిలోరి). అలాగే, గుండె జబ్బులకూ, చర్మవ్యాధులకూ సంబంధముంది. కీళ్ళనొప్పులకు కూడా కారణం వైరస్‌లే. డిప్రెషన్, స్కిజోఫ్రెనియాలు కూడా బోర్నా అనబడే ఒక అరుదైన మెదడు వైరస్‌వల్లే వస్తాయి. అయితే, ఈ వ్యవహారాన్ని అర్థం చేసుకోవటం అంత సులువు కాదు. మాటల్ని ఎవరూ యథాతథంగా తీసుకోకూడదు. ఏది ఏమైనా, వ్యక్తుల జన్యువులలోని రోగనిరోధక శక్తిలో తేడాలుంటాయనేది మాత్రం నిర్వివాదాంశం. ఇద్దరు వ్యక్తులు నూటికి నూరుపాళ్ళు ఒకే రకమైన జీవన విధానం అవలంబించినప్పటికీ ఒకరికి జబ్బు వస్తుంది. మరొకరికి రాదు. జన్యుమహత్త్యం అంటే అదే. ఒకరకంగా జీనోమ్ అంటే తరతరాల మన రోగాల రికార్డు అన్నమాట. వ్యక్తులే కాదు, సమాజాలు కూడా ఇందులో ప్రతిఫలిస్తాయి. కలరా ఒక అరుదైన వ్యాధి. 1830లకు ముందు అది కేవలం గంగానదీ పరీవాహక ప్రాంతానికే పరిమితమైంది. ఆ తర్వాత క్రమంగా యూరోప్‌కు, అమెరికా, ఆఫ్రికా ఖండాలకు వ్యాపించింది. అయితే O గ్రూపు జన్యువులు అమెరికాలోని స్థానిక తెగల్లో ఎందుకు ఎక్కువగా ఎందుకున్నాయన్న విషయం మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. వీళ్ళ పూర్వీకుల్లో AB గ్రూపులే ఉన్నాయి. అందుకే రెండు గ్రూపుల జన్యువులూ ఉన్నఫళాన అంతరించిపోతాయి? దీనికి 'సిఫిలిస్'ను ఒక కారణంగా చెప్పుకోవచ్చు. 1492 కి ముందు స్థానికులలో ఈ జబ్బు ఎక్కువగా ఉండేదని అందరికీ తెలుసు. O గ్రూపు జన్యువుకు సిఫిలిస్‌ను తట్టుకునే గుణం ఉంటుంది. ఇప్పుడు మరో వింత పరిశోధన గురించి తెలుసుకుందాం. కలరాకూ, బ్లడ్‌గ్రూపులకూ ఉన్న సంబంధాన్ని అన్వేషించారు శాస్త్రజ్ఞులు. జన్యుపరంగా భిన్నమైన స్త్రీ పురుషుల మధ్యనే ఆకర్షణ ఎక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు క్లాస్ పెడెరెకింగ్, సాండ్రాపురి. ఒకరి చెమట వాసన మరొకర్ని ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. జన్యువుల విలక్షణత అది. శరీర దుర్వాసనలు కొందరు ఇష్టపడతారు. ఎలుకలతో చేసిన ప్రయోగాల్లో కూడా ఇదే విషయం స్పష్టమైంది. ఆడ ఎలుక, జన్యుపరంగా తనకన్నా భిన్నమైన మగ ఎలుకతో సంతానం కనాలని కోరుకుంటుంది. అలా రకరకాల జన్యువుల సంయోగంకు రోగాలు వచ్చే అవకాశం తగ్గుతుంది. మొత్తంమీద ఈ బ్లడ్‌గ్రూపుల, జన్యువుల గందరగోళం ఓ పట్టాన తెలదు.

అసలు ఇషయమేమంటే, జన్యుపరిశోధన ఇంకా ప్రాథమిక దశలో ఉన్నప్పుడే హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'హ్యూమన్ జీనోమ్' అనేదే ఒక భ్రమ. ఆ మాటను నిర్వచించటం అసాధ్యం. శరీరంలోని వందలాది కీలక ప్రదేశాలలో, ఇరవైమూడు క్రోమోజోమ్‌లలో విస్తరించి ఉన్నాయి జన్యువులు. వీటి ఉనికి అందర్లోనూ ఒకే పద్ధతిలో ఉండదు. A గ్రూపు మాత్రమే సహజమనీ, O, B లేదా AB లు అసహజమనీ ఎవరూ అంగీకరించరు. అందువలన, హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టు సగటు మనిషి 'జన్యుపటం' ప్రచురించటానికి సిద్ధపడినప్పుడు, క్రోమోజోమ్ – 9 మీదున్న ABO జన్యువు గురించి ఎలా వ్యాఖ్యానించబోతున్నది? 200 మంది జీనోమ్‌లను తీసుకొని 'సగటు పటం' ప్రచురిస్తుందట. కాని అలా చెయ్యటంవల్ల ABO గురించిన సత్యం ఆవిష్కృతం కాదుగదా! ప్రతిక్షణం మారుతూ ఉండే జన్యుసంయోగం ప్రక్రియను 'ఇదింతే' అని ఎవరైనా ఎలా నిర్ధారించగలరు? నిరంతర మార్పు జీవలక్షణం.

ఈ విషయాన్ని మొదట గ్రహించిన వాడు జె.బి.ఎస్. హాల్డేన్. జన్యువైవిధ్యానికి కారణం పారసైట్స్ కావచ్చునని 1949 లోనే ఊహించాడు. జన్యువులు పునరావృతం కావటంలోనూ, వీటి నిరంతర చలనంలోనూ పారసైట్స్‌దే ప్రధాన పాత్ర అని 1970లో ప్రకటించి జెనెటిక్స్ పరిశోధనల్లో సంచలనం సృష్టించాడు కొలిగ్. 1980లలో, రాబర్ట్ మే (ఆస్ట్రేలియా) ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు చేశాడు. పారసైట్స్ నిలకడగా ఉండవు. Chaos - కేయాటిక్ చలనం వాటి లక్షణమని తేల్చాడు (ఈయనకు Father of Chaotic The ory అంటారు). ఆ తర్వాత బ్రిటిష్ శాస్త్రవేత్త విలియం హామిల్టన్, లైంగిక పునరుత్పత్తికి సంబంధించిన గణిత నమూనాలు రూపొందించారు. సైన్సు పునాదులు గట్టివనుకునే రోజులకు కాలం చెల్లింది. ఇదిలాగే ఉంటుందని దేని గురించీ ఇదమిత్థంగా చెప్పలేం. మార్పు, గమనం, సంఘర్షణ జీవలక్షణం. జీనోమ్ పటం మనం తయారుచేసినా, ప్రతిక్షణం రూపనిర్మాణాలను మార్చుకుంటున్న జన్యువుల ఒక రూపం మాత్రమే అది అని గ్రహించాలి. జీనోమ్ పుస్తకంలో అక్షరాలు, పదాలు, వాక్యాలు ఎప్పటికప్పుడు మారిపోతూనే ఉంటాయి మరి.

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా.
హైదరాబాదు. ఫోన్ : 917 767 8708



శ్రీమద్రామానుజాచార్యులు

# శ్రీ భగవద్రామానుజులు

## సాంఘిక ప్రబోధం

- కోసూరి దామోదరనాయుడు

*ముద్దుమొగంబు కెంజిగురు*
*మోవి దయారసమొల్కు గన్నులున్*
*నిద్దపుఁ జెక్కులున్ పసిడి*
*నిగ్గులు దేఱెడు మేను బాగుగా*
*దిద్దిన యూర్ధ్వపుండ్రములు*
*తెల్లని జన్నిదమున్ త్రిదండమున్*
*దద్దయు నొప్పు చిన్ని శిఖ*
*దాల్చిన మా యతిరాజుఁ గొల్చెదన్*

ప్రాచీన సంఘానికి, నేటి సంఘానికి మౌలికంగా కూడా తేడాలున్నాయి. పాత సంఘంలో వ్యక్తికి మరో వ్యక్తికి మధ్య ఉన్న సంబంధం సామాజిక సంబంధంతో భిన్నంగా ఉండేది. వ్యక్తి సంబంధం సామాజిక సంబంధాన్ని కూడా శాసించగలుగుతుండేది. కొన్ని సందర్భాలలో సామాజిక సంబంధం వ్యక్తి సంబంధాన్ని అనుశాసిస్తూ కూడా ఉండేది. ఈ ఆటుపోటుల మధ్య నలిగినవారు మనగలిగినవారు దశదిశానిర్దేశం చేయగలిగినవారు మహాత్ములుగా మిగిలిపోయారు. అలాంటి మహాపురుషులలో విశిష్టాద్వైత మతస్థాపకులైన శ్రీ భగవద్రామానుజల వారు ముఖ్యులు.

రామానుజాచార్యులు నదీ స్నానానికి వెళ్ళేటప్పుడు ఒక బ్రాహ్మణుని భుజంపై చేయి వేసి వెళ్తుండేవారు. వచ్చేటప్పుడు ఒక దళితుడిపై భుజంపై చేయి వేసి తీరానికి చేరేవారు. జనులు ఆశ్చర్యంగా చూసేవారు. ఒకసారి వార్ని అడిగారు. 'స్వామి! తమరు స్నానం చేసి ఏం లాభం? దళితస్పర్శతో తాము అపవిత్రం అవుతూనే ఉన్నారు కదా! అందుకు ఆచార్యుల వారు మందహాసంతో "స్నానం వల్ల నా దేహం మాత్రమే శుభ్రం అవుతుంది. మనస్సులోని మాలిన్యం పోవడం లేదు. ఇతరుల కంటె నేను గొప్పవాణ్ణి అనే భావన అన్నిటికంటే మించిన ఆటంకం స్నానం చేసి దేహ మాలిన్యాన్ని పోగొట్టుకున్న తరువాత నేను దళితుణ్ణి తాకినా అహంకారాన్ని తొలగించుకుంటున్నా, మనోమాలిన్యాన్ని వదిలించుకుంటున్నాను. నేను ఎవరికంటే గొప్పవాణ్ణికాను. నాకంటే ఎవరు తక్కువ వారు కారు. నాకంటె దళితుడు కూడా శ్రేష్ఠుడే. ఈ భావనవల్ల నాకు ఆనందం లభిస్తుంది" అని అన్నారు.

రామానుజులవారు సంఘాన్ని శాసిస్తూ, ఆ సంఘానికి నాయకత్వం వహిస్తూ, సంఘంతో నడుస్తూ, సంఘంతో మార్గదర్శకత్వం వహిస్తూ జీవించిన మహానుభావులు. సంఘంలో తల్లిదండ్రుల తరువాత గురువుకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అజ్ఞానాంధకారాన్ని పోగొట్టేవారు, పారద్రోలేవాడు గురువనే అభిప్రాయం తాను ఆచరిస్తూ ఇతరులను కూడా ఆచరింపచేసేవారు ఆచార్యులు. ప్రాచీనకాలంలో 'గురువుగీత' దాటిన శిష్యులు కూడా లేకపోలేదు. కాని రామానుజుల వారి ధిక్కారం విద్యాసంబంధి. గురువులు ఒకసారి మహావిష్ణువు కన్నులున్న తీరును కోతివెనుక భాగం లాంటి ఎర్రని కళ్ళని వ్యాఖ్యానిస్తే, రామానుజుల వారు సూర్యోదయంతో వికసించిన పుండరీకం లాంటిదనే అర్థం చెప్పి విశదీకరించారు. ఈ వ్యాఖ్యానం గురువుకు నచ్చలేదు. తనమాటకు తల ఒగ్గని వానిపై పగపెరిగింది. అదే నెపంతో గురువుగారు శిష్యుని మరణానికి కూడా పథకం పన్నారు. ఆ పథకం విఫలమయింది. చివరకు యాదవప్రకాశులే రామానుజులకు శిష్యులయ్యారు. ఇది ఒక రకంగా సాంఘిక ప్రబోధం. సంఘంలో గౌరవస్థానాన్ని అలంకరించే వ్యక్తి అహంకారంతో గాని, అజ్ఞానంతోగాని తప్పటడుగు వేస్తే అలాంటివారిని తప్పుబట్టడంలో తప్పేమి లేదని చెప్పే సాంఘిక నీతిని రామానుజుల వారు లోకానికి

తన ప్రబోధం ద్వారా నిరూపించారు. ఒక కుటుంబంలో ఇల్లాలికున్న స్థానం మహత్తరమైనది. 'గృహిణీ గృహ భాగ్యముచ్యతే' అని ఆర్యోక్తి. 'ఇంటిని చూచి ఇల్లాలిని చూడు' అని తెలుగు సామెత. పవిత్రమైన వివాహబంధంలో అనుకూల దాంపత్యం కోసం 'ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరామి' అని ప్రతిజ్ఞ చేయించడం ఆర్ష సంప్రదాయం. కాని కొందరి జీవితాల్లో 'ఇది ఎడమెుహం పెడమెుహం కావడం' సంసారంలో ఎదురుగాలులు, సుడిగాలులు, వడగాలులు కూడా వీయడం కనిపిస్తుంది. ఈలాంటి సన్నివేశాలు రామానుజులు వారి జీవితంలోను ఉన్నాయి.

రామానుజులు భార్య తంజమ్మ. ఆమెతో పదహారవ యేటనే పెళ్ళి జరిగింది. కాని ఆవిడకి ఛాందస ఆచారాల మీద ప్రగాఢమైన పట్టుదల ఎక్కువ. తంజమ్మ మూడు సందర్భాలలో భర్త వాంఛకు భిన్నంగా ప్రవర్తించినట్లు చెప్పుకుంటారు. తిరుక్కచ్చినంబిని రామానుజుల వారు తమ ఇంటికి విందుకు ఆహ్వానించారు. రామానుజులు స్నాన పూజాదికం ముగించుకుని అతిథుల్ని తీసుకురావడానికి బయలుదేరి వెళ్ళారు. తిరుక్కచ్చినంబి మరొక మార్గంలో రామానుజుల ఇల్లు చేరినాడు. రామానుజులు ఇంట్లో లేకపోవడం తెలుసుకుని భగవత్సేవకు త్వరగా వెళ్ళాలని అన్నం వడ్డించమని తంజమ్మను అడిగాడు. ఆమె ఆలాగే అన్నం వడ్డించింది. తిరుక్కచ్చినంబి వెళ్ళిపోయిన తరువాత విస్తరిని కర్రతో మూలకునెట్టి ఆ చోటుని ఆవు పేడతో అలికి శుద్ధి స్నానం చేసింది. రామానుజులు ఇంటికి వచ్చి భార్య రెండవసారి చేసిన స్నానానికి కారణం విని నిర్ఘాంత పోయారు. ఆ రోజుల్లో తనకులం కాని వారిని ఇంటికి ఆహ్వానించాలని అనుకోవడం, ఆహ్వానించడంలో రామానుజుల ఔన్నత్యం సమత్వం తెలుస్తుంది.

మరొకసారి ఆకలితో శ్రీ వైష్ణవులొకరు ఇంటికి రాగా భోజనం పెట్టమని రామానుజులు భార్యతో చెప్పారు. ఇంట్లో ఒక్క గింజ అన్నం కూడా లేదని భర్తతో చెప్పింది. అయితే ఇంట్లో వెతకగా దాచిపెట్టిన (బియ్యం) అన్నం కనిపించింది. రామానుజులు కోపాన్ని నిగ్రహించుకున్నారు.

'అతిథి' అనే మాటకు 'తిథి' నియమాలు లేకుండా వచ్చేవాడని అభిప్రాయం ఇంటికి అతిథి వస్తే ఆదరించడం గృహస్థుల కనీసధర్మం. పైగా వచ్చినవాడు వైష్ణవుడు. అటువంటి వ్యక్తికి ప్రీతితో, గౌరవంతో, ఆదరణతో, ఆచార్యభావంతో విందు సత్కారాలు చేయవలసివుండగా విముఖత చూపడం, అబద్ధం చెప్పడం తగదు.

పెరియనంబి రామానుజుల గురువు. పెరియనంబి భార్యతో సహా రామానుజుల ఇంటికి ఒకసారి వేంచేశారు. ఇంట్లో శాస్త్రం చర్చ, దివ్యప్రబంధ పారాయణం క్రమంగా సాగుతూ వుంది. ఒక రోజు తంజమ్మ విసుక్కుంది. మాటలు హద్దు తప్పాయి. పెరియనంబి భార్య మౌనం వహించింది. ఆలాగే నీళ్ళు చేదుకొనేచోట తంజమ్మకు పెరియనంబికి మధ్య అనవసరంగా వాగ్వివాదం పెరిగింది. ఇవన్నీ తెలుసుకొన్న పెరియనంబి తన శిష్యుణి ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని భార్యతో బయలుదేరి వెళ్ళిపోయారు. రామానుజులు ఇంటికి వచ్చి జరిగింది తెలుసుకొని గురువు వెళ్ళిపోవడం విని చాలా బాధపడ్డారు. ఇటువంటి భార్యతో ఏగడం కష్టమని రామానుజుల వారు భార్యను పుట్టింటికి వెళ్ళిపొమ్మని ఆదేశించి తాము సన్యాసం పుచ్చుకున్నారు. సంఘంలో దాంపత్య జీవనంలో ఉండవలసిన క్రమంలో హద్దు, ఆచరణ లేకపోతే ఆ దాంపత్యానికి ఏవయినా ఇబ్బందులు కలిగితే గృహస్థుడు తన వారిని పరిత్యజించవచ్చు అనే సాంఘికనీతి.

మనం మానవులం. మనిషికి జన్మలు అనేకం. జన్మలలో సుఖం కంటె దుఃఖం ఎక్కువ. సుఖాలు కూడా క్షణికం. బాధలు అనేకం. సుఖదుఃఖాలు జన్మాదులు లేని స్థితి మోక్షం. ఆ మోక్షం కోసం మానవుడు ప్రయత్నిం చాలి. మోక్షానికి జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలున్నాయి. గురుముకతః మంత్రోపదేశం పొంది భగవంతుని కటాక్షం పొందితే ముక్తి సిద్ధిస్తుంది. ముక్తి సాధనకు 'అష్టాక్షరి'ని పరమమంత్రంగా వైష్ణవులు భావిస్తారు.

గోష్ఠీపూర్ణుడు రామానుజుల వారికి అష్టాక్షరి మంత్రాన్ని ఉపదేశించాడు. గోష్ఠీపూర్ణుడు ఆ మంత్రాన్ని ఎవ్వరికి చెప్పకూడదని రామానుజుల వారిని హెచ్చరించాడు. అయితే రామానుజుల తిరుక్కోటియూర్ వైష్ణవా లయ గోపురాన్ని ఎక్కి గురువు ఉపదేశించిన 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని బిగ్గరగా అందరికీ వినబడేటట్లు ఉచ్చరించారు. అది తెలిసి గోష్ఠీపూర్ణుడు మండిపడి నరకానికి వెళుతావని హెచ్చరించాడు. అందుకు రామానుజులవారు తొణుకుబెణుకు లేకుండా "స్వామీ! ఇన్ని వందల మంది జనం వైకుంఠానికి వెళ్ళే అవకాశం వుండగా నేనొక్కడినే నరకానికి పోతే ఏం" అన్న మాటలకు గురువు నిరుత్తరుడయ్యాడు. భగవన్నామ స్మరణం సామాన్య మానవునకు కూడా

అందుబాటులో ఉండాలన్నదే రామానుజుల వారి పరమాదర్శం. ఇది సాంఘిక ప్రబోధం. ఒక సుఖం ఒక వ్యక్తికి పరిమితంకారాదు. సమాజంలో అందరికీ ఆ సుఖం దక్కాలనే కాంక్ష ఈ సాంఘిక నీతిలో దాగివుంది.

రామానుజులువారు తిరుమలకు వస్తూ దారిలో అష్టసహస్రగ్రామం చేరుకున్నారు. ఆ గ్రామంలో వరద రాయలు, యజ్ఞేశులు రామానుజులవారి శిష్యులు. యజ్ఞేశు లు ధనవంతుడు. వరదరాయలు బీదవాడు. రామాను జుల వారు వరదరాయల ఇంటికి వెళ్ళారు. వరదరాయలు ఆ సమయంలో ఇంటిలో లేరు. భిక్షాటనకై వెళ్ళారని తెలిసింది. రామానుజులు తమ గుమ్మంలో అడుగుపెట్టినందుకే వరదరాయలు భార్య పరమానంద భరితురాల యింది. బీదస్థితిలో చాలీచాలనీ దుస్తులతో ఉన్నందువల్ల ఆమె బయటకు రాలేకపోయింది. రామానుజులు ఆమె స్థితిని గ్రహించారు. తన తలకు చుట్టుకున్న రంగుగుడ్డను లోనికి విసిరారు. ఆమె ముకుళిత హస్తాలతో వెలుపలికి వచ్చి రామానుజుల వారికి పాదాభివందనం చేసి వినయ పూర్వకంగా స్వాగతం చెప్పింది. రామానుజుల వారు ఇంటిలోకి అడుగుపెట్టారు. అప్పుడు ఆ ఇల్లాలు ఇంటిలో బియ్యంలేని విషయాన్ని తెలుసుకొని రామానుజుల వారి అనుతితో కిరాణాకొట్టు కెళ్ళింది. ఆ కిరాణావర్తకుడు ఆమె పై చాలా కాలంగా కన్నువేసిన సంగతి ఆమెకు తెలుసు. కాని తనకా సరుకులు కావాలి. రాకరాక వచ్చిన రామానుజుల వారికి ఆతిథ్యం ఇవ్వాలి. అందుకే కిరాణాకొట్టుకవాని కోరికకు సరేనంది. అయితే 'ఆతిత్యం పూర్తి అయ్యాకనే' అనే షరతుపెట్టింది. కిరాణాకొట్టువాడు ఆమెకు సరుకుల్ని ఇచ్చి పంపాడు. ఆతిత్యం పూర్తి అయింది. రామానుజులవారు వెళ్ళిపోయారు. ఆ తరువాత వరదరాయలు ఇంటికి వచ్చాడు. జరిగినది అంతా ఆమె భర్తకు చెప్పింది. వరదరాయలు భార్యతో కిరాణాకొట్టు దగ్గరికి వెళ్ళి "నేనే నా భార్యను స్వయంగా నీ కప్పకించడానికి వచ్చాను. మేమిద్దరమూ ఒకరినొకరం పూర్తిగా ఎరుగుదుము. ఆమె హృదయం నాది" అని అంటాడు. కిరాణా వర్తకుడు తటపటాయించాడు. అతనిలో కామం అణగారింది. మానవత్వం పరిమళించింది. వరదరాయలు కాళ్ళమీద పడి 'స్వామి మీకిచ్చిన సరుకులకు నేను మూల్యం తీసుకోను. మీ దయవల్ల నా కళ్ళు తెరచుకున్నాయి" అని పశ్చాత్తాపపడ్డాడు. ఇది తెలుసుకున్న రామానుజులవారు వర్తకునకు కబురుచేసి తన శిష్యునిగా స్వీకరించారు.

ఈ సన్నివేశంలో రెండు అంశాలున్నాయి. మొదటిది చాలీచాలని గుడ్డలు ధరించిన స్త్రీకి దయతో తన వస్త్రదానం చేయడం. ఇది దానం కాదు. మానరక్షణాప్రయత్నం. కనీసపు మానవ లక్షణం. రెండవది వర్తకునిలో మార్పు. ఈ మార్పు రావడానికి కారణాలు రెండు. ఒకటి వరదరాయే తన భార్యను అప్పగించడానికి రావడం. రెండవది (రామానుజులు కారణం కావడం) ఈ పరివర్తనకు రామానుజులు వారు కారణం కావడం లౌకిక కామకాంక్షను ఆధ్యాత్మిక కాంక్షగా మార్చడమే ఇందులోని పరమార్థం.

మారనేర్నంబి జన్మచేత అస్పృశ్యుడు అళవందారు శిష్యుడు. పెరియనంబికి ప్రాణ స్నేహితుడు. మారనేర్నంబి దీర్ఘవ్యాధిగ్రస్తుడు కావడంవల్ల ఊరి వెలుపల గుడిసెలో ఉండేవాడు. పెరియనంబికి ప్రాణస్నేహితుడు కావడం కారణంగా ఎవరికీ తెలియకుండా రోజూ అన్నంపెట్టి వచ్చేవాడు. రామానుజుల శిష్యులు కొందరు పెరియనంబిపై పిర్యాదు చేశారు. ఒకరోజు పెరియనంబిని రామానుజులు వారు అనుసరించారు. జబ్బుతో పడివున్న మారనేర్నంబికి పెరియనంబి అన్నంపెట్టడం చూసి రామానుజుల హృదయం ద్రవించింది. పెరియనంబి చేస్తున్నపనికి నిరసించి కొందరు బ్రాహ్మణులు ఇంటిని చుట్టుముట్టారు. అప్పుడు రామానుజులు పెరియనంబి పక్షాన నిలిచి మారనేర్నంబిని ఆదుకుని ఆలయ ప్రవేశం చేయించారు.

నాయకుడు మనసావాచా కర్మణా ఒక రీతిగా ప్రవర్తించాలి. కాకుంటే అతడు నాయకుడు కాడు. అవకాశవాది అవుతాడు. రామానుజులు ఆచార్యులు. తాను ఆచరిస్తూ ఇతరుల్ని ఆచరింపజేసేవారు. విశిష్టాద్వైతంలో జాతిమతభేదాలు లేవు. ఉచ్చనీచాలు లేవు. అందువల్లనే అస్పృశ్యుడైన మారనేర్నంబిని ఆదరించారు. అదికాక జబ్బుపడిన వారిని ఏ కులం వారయినా ఆచరించడం ఛాందసధర్మం కాదు. కనీసపు మానవధర్మం.

రామానుజుల కాలానికి ముందే శ్రీవైష్ణవం విశిష్టాద్వైతంగా రూపుదిద్దుకుని ప్రచారప్రాభవాలతో వెల్లి విరిసినప్పటికి రామానుజుల వారి కాలంలోనే ఈ మతానికి ఎనలేని ఆదరణ కలిగింది. దీనికి కారణం శ్రీ భాష్య గీతాభాష్యాది గ్రంథాలలో విశిష్టాద్వైత అనుష్ఠానికి సంబంధించిన విశేషాలను ఎక్కువగా

వివరించడం. ఆంధ్రదేశంలో వైష్ణవానికి విశేషమైన ప్రాచుర్యం కలిగింది. రామానుజులవారి కాలంలోనే విశిష్టాద్వైతం భక్తికర్మ జ్ఞాన యోగాలతో పాటు ప్రపత్తియోగాన్ని ప్రతిపాదించి భగవద్విషయాన్ని ప్రజలకు అతి సన్నిహితంగా తీసుకెళ్ళి వారికి ముముక్షువులుగా మార్చే ప్రయత్నం కొనసాగింది కూడా రామానుజులు. వారి కాలంలోనే వారు దీన్ని ఒక ఉద్యమంగా ప్రచారంచేసి ఒక ప్రవక్తగా పేరుపొందారు. ఈ ప్రపత్తి యోగానికే శరణగాతి, న్యాసవిద్య అని కూడా పేరు. భక్తికర్మ జ్ఞానయోగాలు ప్రతిపాదించే విషయాలను అనుష్టించడానికి కొంత ప్రయత్నం అవసరం. శరణాగతిలో ఈ మూడింటికంటె చాలా సులభమైంది. మన సమస్త బాధ్యతలను ఒక దక్షత కలిగిన వాని మీద వేసి మనం నిశితంగా వుండటం శరణాగతితత్త్వం. శ్రీమన్నారాయణుడు దక్షుడు. భక్తుల బాధ్యతలను మోయగల సమర్థుడు. భక్తులు తమ బాధ్యతలతోపాటు తనను కూడా శ్రీమన్నారాయణునికి సమర్పించుకోవడం విశిష్టా ద్వైతం ప్రతిపాదించిన శరణాగతితత్త్వం.

శ్రీవైష్ణవంలో శరణాగతికి అత్యంత ప్రాధాన్యత వుంది. భగవద్గీతలో :

*"సర్వధర్మాన్ పరిత్యజ్య మమేకం శరణం వ్రజ*
*అహంత్వా సర్వపాపేభ్యోమో క్షయిష్యామి మా శుచః"*

అనే శ్లోకానికి విశిష్టాదైవతం రమణీయమైన అర్థం చెప్పింది. శ్రీ వేంకటేశ్వరుని వదరహస్తం ఆయన పాదం వైపు చూపడం తననే శరణం పొందమని చెప్పడానికే నన్నట్లు విశిష్టాద్వైతుల భావన. వైష్ణవుల్లో ఇలాంటి రమణీయమైన భావాలు ఏర్పడింది. రామానుజుల వారి శరణాగతి తత్త్వాన్ని మోక్ష సాధనకు ఒక మార్గంగా నిర్దేశించిన తరువాతనే శరణాగతి అంటే శ్రీ భగవద్రామా నుజులవారు గుర్తుకువస్తారు.

భారతీయ జనజీవితంలో ఆలయానికి ప్రత్యేకప్రాధాన్యం ఉంది. ఆలయాలు కేవలం దైవాలయాలు కావు. కళానిలయాలు, సంస్కృతీ చిహ్నాలు. భక్తికి, విశ్వాసానికి, భయానికి కేంద్రాలు ఆలయస్థాపన రాజులకు గౌరవకారణం. ఆలయ ఉద్ధరణ సామంతుల ప్రధమ కర్తవ్యం. ఆలయ కైంకర్యాలు కట్టడిచేయడం అధికారుల ప్రధమ కర్తవ్యం. అందువల్లనే చోళులు, పల్లవులు, ఇతర ప్రముఖులు ఆలయాలకోసం త్యాగం చేశారు. సర్వస్వం అర్పించారు. ఆ దృష్టితోనే వైష్ణవాన్ని రామానుజుల వారు మోక్షమండపంగా – శ్రీరంగంను, త్యాగమండపంగా – కాంచీవరదక్షేత్రమును, పుష్పమండపంగా తిరుపతిని ఏర్పాటు చేశారు. 108 దివ్యదేశాలు చూడలేనివారు ఈ క్షేత్రాలను దర్శిస్తే ఆ పుణ్యం వస్తుందని చెప్పారు. అంతేకాక వైష్ణవ ప్రచారానికి అనుకూలంగా తీర్చిదిద్దారు. దీనివల్ల సాంఘికంగా మార్పు రాగలిగింది. రామానుజుల వారు శ్రీరంగంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరణ చేయించారు. ఆలయంచుట్టూ అందమైన పుష్పవాటికలు నాటించారు. పూజావిధానంలో చక్కని కట్టుబాట్లు ఏర్పరిచారు. వేదపఠనంతో దివ్యప్రబంధానికి సమానమైన ప్రాముఖ్యం ఇచ్చారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి దివ్యశంఖ చక్రాలను అమర్చినది రామానుజులవారే అన్న ప్రతీతి సంప్రదాయంగా వస్తోంది. తిరుపతి మొదట్లో శైవక్షేత్రమని దాన్ని విష్ణుక్షేత్రంగా రామానుజులువారు మార్చారని మరి కొందరివాదన. రామానుజుల కాలంనాటికి స్వామి విగ్రహంలో తాత్కాలికంగా కనిపించకపోయినా శంఖచక్రా లను రామానుజులవారు పునఃప్రతిష్ఠ చేశారని మరికొందరి భావన.

రామానుజులవారు మేల్కోటెలో ఉండగా ఉత్తమ సంస్కరణలు ప్రవేశ పెట్టగలిగారు. మేల్కోటెలో ఏడువందల మఠాలు స్థాపించినట్లు తెలుస్తోంది. అస్పృశ్యతకు రామానుజులు పూర్తిగా వ్యతిరేకి. వారిని 'పవిత్ర కులోద్భవులని', 'తిరుకులత్తార్' అన్న పేర్లతో పిలిచేవారు. మహమ్మదీయ చక్రవర్తి కుమార్తెతో ఢిల్లీ నుండి తెప్పించిన చెల్వపిళ్ళరాయ అమితంగా అభిమానించి నారాయణమూర్తి పాదపద్మ సమీపంలో ఆమెకు ప్రాతినిధ్యం కల్పించి పుజాదులు జరిగేలా ఏర్పాటు చేశారు. రామానుజులు కుల పరిధులనే కాక మత పరిధులను కూడా అధిగమించి తమ హృదయ వైశాల్యాన్ని వెల్లడించారు.

రామానుజుల వారు నూట ఇరవై సంవత్సరాలు బ్రతికిన పరిపూర్ణ మహామనీషి. సంఘంలోని పండితుల్ని, ఆధ్యాత్మిక జిజ్ఞాసువుల్ని, వివేకుల్ని తమ తొమ్మిదిగ్రంథాల ద్వారా మెప్పించగలిగారు. సాంఘిక ప్రబోధంలో ఒక భాగమే. ఆ గ్రంథాలు

1. వేదార్థ సంగ్రహం 2. శ్రీభాష్యం 3. గీతాభాష్యం 4. శరణాగతి గద్య 5. శ్రీరంగ గద్య 6. శ్రీ వైకుంఠ గద్య 7. వేదాంత దీపం 8. వేదాంతసారం 9. నిత్య గ్రంథం ఎవరికి వారు తమ ఆత్మోద్ధరణకు పాటుపడాలని వేదాంతం

చెబుతోంది. భారతీయ తత్వశాస్త్రంలో సంఘం అనడానికి నిర్వచనం వేరు.

బౌద్ధమతంలో 'బుద్ధం శరణం గచ్ఛామి' 'ధర్మం శరణం గచ్ఛామి' 'సంఘం శరణం గచ్ఛామి' అనేవి మూడు సూత్రాలు. బౌద్ధులు, జైనులు సంఘానికి ప్రాధాన్యమిచ్చి, సేవాభావానికి అగ్ర తాంబూలం ఇచ్చి మతాన్ని ప్రచారం చేశారు. ఈ కారణంవల్ల సంగంలోని అన్ని వర్ణాలవారికి, అన్ని జాతులవారికి స్త్రీ పురుషభేదం లేకుండా మత విషయంలో ప్రాధాన్యం పెరిగింది.

కాలక్రమేణ ఆ మతాలలో కూడా ఈ అనుసంధానం దారితప్పింది. భగవద్రామానుజులవారు మరల సాంఘిక దృష్టితో మతప్రచారం చేశారు. స్త్రీపురుష భేదం లేక ముక్తికి మార్గం సుగమం చేశారు. ఉచ్ఛనీచాలు లేక ఔన్నత్యానికి సోపానాలు నిర్మించారు. భగవద్రామానుజులవారి సాంఘిక ప్రబోధం దృఢమైన పునాదులపై కట్టుబడి లౌకిక జగత్ప్రవాహానికి అన్నివిధాల సహకరించే ఒక ఆనకట్టలాంటిది.

స్వామి వివేకానందుల వారి మాటల్లో "రామానుజాచార్యుల హృదయం మహా ఉదాత్తమైంది. పీడితుల కోసం ఆయన హృదయం బాధపడింది. వారిపట్ల ఆయనకు సానుభూతి కలిగింది. అప్పటికి దేశాచారాలలో కలసిపోయి అంతటా విజృంభిస్తున్న కర్మకలాపాలను ఆయన సాధ్యమైనంత వరకు సంస్కరించి పవిత్రం చేశారు. ప్రజలకు అత్యావసరమైన కొత్తకర్మలను, పూజాకలాపాలను ఏర్పరచారు. ఇది కాక ఉత్తమ ఆధ్యాత్మిక పూజావకాశాన్ని బ్రాహ్మణుడు మొదలు అంత్యజుని వరకు ప్రతి వారికీ కల్పించారు. ఇదే శ్రీ రామానుజులు చేసిన గొప్పపని".




ఆచార్య కోసూరి దామోదరనాయుడు
తెలుగు అధ్యయనశాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి.
ఫోన్ : 944 164 5601


---




ప్రొ. రావినూతల సత్యనారాయణ

తెలుగు భాషలో 'కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం' పొందిన వారి రచనలను, సమీక్షించాలని మిసిమి సంకల్పించింది. అందుకు తగినట్లు ప్రొ. రావినూతల సత్యనారాయణ గారు స్పందించారు.

ఇదొక బృహత్ కార్యం. ఇందులో రచయితల రచనలే కాకుండా ఒక్కొక్కప్పుడు వారి జీవితంలోకి తొంగిచూడవలసిన అవసరం రావచ్చు. కేవలం రచనలు చదివితే సరిపోదు. రచయిత స్వభావంపట్ల కూడా అవగాహన ఉండకపోతే సమీక్ష తేలిపోతుంది. రచయితలు తాము రాసే రాతకు, జీవించే జీవితానికి పొంతనే ఉండదు. వీటిని సమన్వయపరుస్తూ వారి రచనలను విశ్లేషించగలగాలి. కవిత్వమైనా, కథయైనా, నవల అయినా, నాటకమైనా, విధానమేదైనా అన్నీ వ్యక్తిత్వ సూచికలే. రచయిత అనుభూతి పరిసరాల వీచికలే.

ప్రతి రచయితా తన మనసులో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుంటాడు. ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆర్తి - ఇవన్నీ తన రచనలలో ప్రతిబింబింపచేస్తాడు. రచయితలకు భావావేశం ఎక్కువ. దానికి భిన్నమైన తర్కం కూడా ఉంటుంది. అవన్నీ పాఠకులలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. రచయితను, పాఠకుడిని ఎదురెదురుగా నిలబెట్టి కరచాలనం చేయించగలిగినవాడే నిజమైన సాహితీ సమీక్షకుడు. ఆయన తన సమీక్షలో ఆయా రచయితలకు సంబంధించిన ఏ పుస్తకాన్నీ వదలలేదు.




తెలుగు భాషలో వెలుగు చూసి, పురస్కారం పొందిన రచనలన్నింటినీ, రచయితలెందర్నో సమీక్షించి, పరిచయం చేసి తెలుగు పాఠకులకు గ్రంథ రూపంలో అందిస్తున్నారు. ఇది విజ్ఞులైన పాఠకులకూ, పరిశోధనాశీలురైన విశ్వవిద్యాలయ విద్యార్థులకూ కరదీపికగా ఉండగలదని ఆశిస్తున్నాం.

(ప్రతులకు *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి.)

# శాస్త్రపరిశోధన : ప్రయోజనాలు

– వేలూరి కృష్ణమూర్తి

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న ప్రపంచ విజ్ఞానశాస్త్ర (World science Day) దినంగా మనం ఆచరిస్తున్నాము. విజ్ఞానం, దాని ప్రగతి యొక్క నిజమైన ఉద్దేశమేమిటన్న విషయం గురించి మొదటినుంచి తర్జనభర్జనలు జరుగుతూనే వున్నవి. విజ్ఞానశాస్త్ర క్షేత్రంలో కొన్ని ఘటనలు కొద్ది వారాల క్రితం జరిగినవి. మొదటిది, మన దేశస్థాయిలో జరిగిన అఖిల భారత విజ్ఞానశాస్త్ర సమ్మేళనం మైసూరులో మొట్టమొదటిసారి జరిగింది. ఈ 103 వ విజ్ఞానశాస్త్ర సమ్మేళనాన్ని ప్రారంభోత్సవం జరిపిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోది మాట్లాడుతూ – 'విజ్ఞాన శాస్త్రజ్ఞులు ప్రజల ఆశా ఆకాంక్షలకు స్పందించేటటువంటి విజ్ఞానశాస్త్ర పరిశోధనలను గైకొనాలని విన్నవించారు. రెండవ ఘటన ప్రపంచ స్థాయికి చెందిన ఉత్తర కొరియా దేశం జరిపిన హైడ్రోజన్ బాంబ్ పరీక్ష మొత్తం ప్రపంచాన్నే అందులోనూ ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాలను భయాందోళలనకు గురిచేసింది. ఇలాంటి సంకట పరిస్థితిలో ఒక ముఖ్యమైన ప్రశ్నకు మానవాళి, శాస్త్రవేత్తలు జవాబు యివ్వాల్సి ఉంటుంది. ఆ ప్రశ్న – విజ్ఞానశాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యమేమిటి? అది మానవాళి ప్రగతికా లేక వినాశనానికా?

పై ప్రశ్నను ప్రపంచంలో మొట్టమొదటిసారి అణుబాంబ్‌ను ప్రేల్చిన నాటినుండే వేస్తున్నారు. విజ్ఞానానికి నైతిక బాధ్యత ఉన్నదా, లేదా? అలా ఉన్నట్టయితే యీ నైతిక బాధ్యతను విజ్ఞానశాస్త్రంతో సమన్వయం ఎవరు చేయాలి? ఇలాంటి ప్రశ్న పరంపరల మధ్య ప్రాచీన భారతీయుల విజ్ఞానశాస్త్ర పరమైన సాధనలను సింహావలోకనం చేయడం అవసరమౌతుంది. ప్రాచీన భారతదేశంలో ధర్మం మరియు విజ్ఞానశాస్త్రం సామరస్యంతో వుంటూ సమాజముఖంగా వుండేవని భావించటానికి అనేక ఆధారాలు వున్నవి. అందరికీ మేలు చేయడమే ధర్మమన్న భారతీయతత్వం, ఋషివాక్యం మరియు విజ్ఞానశాస్త్ర కళల సమ్మేళనమే ప్రాచీన భారతీయ సమాజపు లక్షణ లక్ష్యంగా వుండేది. ఇలాంటి ఆలోచనలతో ప్రేరితమైన విజ్ఞానశాస్త్ర ధర్మమొకటి మరలా రూపించగలమా? విజ్ఞాన శాస్త్రానికొక నైతిక పునాది లభిస్తుందా? ఈ ఆశాభావంతో ప్రాచీన భారతదేశపు విజ్ఞానశాస్త్ర ప్రగతిని నెమరువేసే ప్రయత్నమిది.

విజ్ఞాని డేవిడ్ బామ్ ఒక స్వారస్యకరమైన మాటను అని వున్నారు : "ప్రాచీన ప్రజల మూఢత్వం మతసంబంధమైన ఆచరణ అని అనేటట్టయితే, ఆధునిక ప్రజల మూఢత్వమే విజ్ఞానశాస్త్రమనిపించుకొంటుంది" అని.

పైన చెప్పిన చెప్పిన మాటల నేపథ్యంలో ప్రాచీన భారతీయ విజ్ఞానశాస్త్రాన్నీ ఆధునిక భారతదేశ విజ్ఞానశాస్త్ర సాధనలను ప్రపంచపు విజ్ఞానశాస్త్రంయొక్క చరిత్ర సాధనలతో ముఖాముఖి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రాచీన భారతీయులు ఎప్పుడూ ధ్యానంలో మునిగివుండి అంతర్ముఖులై బయట ప్రపంచంవైపు ఉదాసీనంతో వుండేవారన్న మాటొక్కటే ప్రాజ్ఞుల వలయాలలో వుండేది. కాని, ప్రాచీన భారతదేశంలో అంతరంగపు జగత్తుకూ బహిరంగ జగత్తుకూ సమానమైన మన్నన లభించేదన్నదానికి తగినన్ని సాక్ష్యాధారాలు వున్నవి. అంతర్ముఖమైన అన్వేషణ ఆధ్యాత్మికమనిపించుకొని వుంటే బహిర్ముఖ అన్వేషణ విజ్ఞానశాస్త్రమనిపించుకొన్నది. ఈ రెండింటి సామరస్యాన్ని ప్రాచీన భారతంలో చాలామటుకు సాధించగలిగారు. అందువల్లనే భారతదేశంలో ఎప్పటికీ ధర్మం మరియు విజ్ఞానశాస్త్రం పరస్పర సంఘర్షణలో పడివుండలేదు. విజ్ఞానశాస్త్రంగానీ, ఆధ్యాత్మికంగానీ, మన ప్రగతికిగానీ, వినాశనానికి కాదన్న వివేకం ప్రాచీనుల ప్రజ్ఞా సాంప్రదాయం యొక్క సహజ ధర్మంగా వుండేది. ప్రాచీన భారతీయుల ఈ సమచిత్తాన్ని యిప్పటి జనసముదాయమూ కాపాడుకొని ముందుకు పోవడానికి, మునుపటి వారి సాధనల ఒక అవలోకన సహాయపడుతుంది. ప్రస్తుతం విజ్ఞానశాస్త్రంలో వివిధ శాఖలు అభివృద్ధి చెందినవి. ఆ జ్ఞాన శాఖలు యిప్పటి

పేరులో కాకపోయినా, వాటి మూలధాతువులను ప్రాచీన భారతదేశపు విజ్ఞానశాస్త్ర శాఖలలో చూడవచ్చు. గణిత శాస్త్రం, భౌతికశాస్త్రం, వైద్యశాస్త్రం, రసాయనశాస్త్రం, సస్యశాస్త్రం, లోహశాస్త్రం – యిలా కొన్ని శాస్త్రాలలో సాధనలు, అప్పటి భారతదేశంలో జరిగినవని చెప్పడానికి మనముందు కొన్ని సాక్ష్యాలు వున్నవి. దీని తాత్పర్యం భారతదేశంలో అన్నీ వుండేవని ఘోషణ చేయడం కాదు. 'ఏవీ వుండలేదన్న' నిర్ణయాన్ని పునరాలోచన చేయాలన్నదే ప్రస్తుత వ్యాస ఉద్దేశ్యం మాత్రమే కాదు – పాశ్చాత్య విజ్ఞానుల మార్గాలకంటె భిన్నంగా విజ్ఞాన శాస్త్ర మార్గాలను భారతదేశం ఏర్పరచుకొని వుండేదని తెలపటం ఒక ఉద్దేశం కూడ. ఆధునిక విజ్ఞాన శాస్త్రపు నీడలో నడుస్తున్న వినాశకారకమైన ప్రవృత్తిని నియంత్రించగల ఆత్మసంయమనాన్ని భారతీయ విజ్ఞానశాస్త్ర మనోధర్మం ప్రపంచానికి యివ్వగలదా? అలాంటి రకమైన విజ్ఞానశాస్త్రపు మార్గమొకటి సాధ్యమా? అన్న అన్వేషణ జరగాలన్న ఒక మహత్వాకాంక్ష ఈ వ్యాసం యొక్క ఉద్దేశం కూడ. ఈ నేపథ్యంలో ప్రాచీన భారతదేశం యొక్క విజ్ఞానశాస్త్ర పరంపర యొక్క విజ్ఞానశాస్త్ర సంబంధమైన సాధనలలో కొన్నిటినైనా మనం గమనించవచ్చు. ఇక్కడ వుంటున్నది భారతీయ విజ్ఞానశాస్త్రపరమైన సాధనల పట్టీకాదు. భారతీయ విజ్ఞానశాస్త్ర పరంపర, విజ్ఞానశాస్త్ర పరిపూర్ణతవైపు సాగిపోగల వాతావరణాన్ని, సంకల్ప శక్తిని ఏర్పరచుకోవడానికి యీ వ్యాసం ఒక అవలోకించే వెలుగు రేఖ మాత్రమే.

## గణిత శాస్త్రం :

విజ్ఞానశాస్త్రపు భాషే గణితం అన్న ఒక భావన వున్నది. విజ్ఞానశాస్త్రం ముందుకు సాగడానికి గణితం యొక్క సహాయం అనివార్యం. ప్రాచీన భారతీయులు గణితశాస్త్రంలో చాలా ఆసక్తి కలిగి వుండేవారు. వారి నిత్య జీవితంలోని అవసరాలకు సహాయపడగల గణితాన్ని వారు ఒక్కొక్క మెట్టే దక్కించుకొంటూ పోయారు. క్షేత్రగణితం, గణితశ్రేణి, దశమాన పద్ధతి మొదలైన గణిత సంబంధమైన కల్పనలు ప్రాచీన భారతీయ గణిత పండితులకు అవగతం. శుల్ప సూత్రాలు ప్రాచీన గణిత శాస్త్రకారుల సాధన ఒక పెద్ద సాక్ష్యం. భక్షాళి హస్త ప్రతిని యిచట జ్ఞాపించుకొనవచ్చు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, భాస్కర–1, బ్రహ్మగుప్త, మహావీరాచార్య, శ్రీధరాచార్య, భాస్కర–2 మొదలైనవారు భారతీయ గణిత శాస్త్రంలో గొప్ప ప్రతిభాన్వితులు. ప్రపంచపు గణిత శాస్త్రానికి భారతదేశం యిచ్చిన 'శూన్యం' (సున్న) కల్పనకు పూర్తి ప్రపంచమే మనకు ఋణపడి ఉన్నదని ఎంతోమంది విజ్ఞానులు కొనియాడారు.

## భౌతిక శాస్త్రం :

'పరమాణు సిద్ధాంతంతో కలిపి భౌతిక శాస్త్రపు కొన్ని సిద్ధాంతాలను గురించి ప్రాచీన భారతదేశంలో అన్వేషణ జరిగినది. ప్రస్తుత పరమాణు సిద్ధాంతం యొక్క అన్ని వివరణలు కాకున్నా అటువంటి సిద్ధాంత సంబంధమైన ఆరంభపు కల్పనలు బిందువు రూపంలో ప్రాచీన భారతదేశపు పరమాణు సిద్ధాంతాన్ని మనం గమనించవచ్చు. గురుత్వాకర్షణ గురించి తెలిసి వుండినదనీ చెప్పవచ్చు. వెలుగుకు సంబంధించిన కొన్ని మూలతత్వాలు, వేడి, ధ్వని, శబ్దం మొదలైన భౌతికశాస్త్ర సంబంధమైన కొన్ని వివరణలను గురించి అప్పటి కాలంలో జిజ్ఞాస జరిగి వుండినదనడానికి స్పష్టమైన సూచనలున్నవి. కాలం, సమయం గురించి ప్రాచీన భారతీయులకు ప్రత్యేకమైన ఆసక్తి వుండేదన్నది నిర్వివాదాంశం.

## ఖగోళ శాస్త్రం :

ప్రాచీన భారతదేశంలో గొప్ప సాధనలు చేసిన కార్యక్షేత్రమంటె ఖగోళశాస్త్రం. గ్రహాలు, నక్షత్రాలు, గ్రహణాలు మొదలుగాగల ఖగోళ వాస్త్ర సంబంధమైన ఎన్నో వివరణలు ప్రాచీన భారతీయ ఋషులకు అవగతం. కాలాన్ని కొన్ని విభాగాలుగాచేసి కొలవడమనే విధానాన్ని అప్పటి ఋషులు క్రమపద్ధతిలో రూపించుకొన్నారు. వరహా మిహరుడి 'పంచసిద్ధాంతి', బ్రహ్మగుప్తుడి 'బ్రహ్మస్ఫుట సిద్ధాంతం' మొదలైన గ్రంథాలు ఈ క్షేత్రంలో వారి సాధనకు అద్దంపట్టినటువంటివి. జ్యోతిఃశాస్త్రంలో పదునెనిమిది సిద్ధాంతాలు ప్రచలితంలో వుండినవన్న వివరణలూ లభిస్తున్నవి. ఖగోళ విజ్ఞానశాస్త్ర స్థానాన్ని అనంతర కాలంలో జ్యోతిష ఫలాల శాస్త్రంగా ఆక్రమించుకోవడంతో భారతదేశంలో ఖగోళశాస్త్రం వెనుకపడడం మనం పరిశోధించి ప్రమాణ పూర్వకంగా విశ్లేషించాల్సి వున్నది.

## రసాయన శాస్త్రం :

రసాయన శాస్త్రంలోనూ ప్రాచీన భారతదేశం ఎంతో సాధనను చేసినది. కరిగించి అచ్చువేసి ఇనుమును తయారు చేయగల విజ్ఞానశాస్త్రం ప్రాచీనం మరియు మధ్యకాలపు భారతీయులకు తెలిసివుండేది. లోహాలను కరిగించడం, ఇనుమును తయారు చేయడం, భాషీకరణం మొదలైన రసాయన

శాస్త్రపు అవగాహనలు భారతీయులకు తెలిసి వుండేవి. హరప్పా, మొహంజదారో మొదలైన ప్రదేశాలలో లభించిన వస్తువులు ఆ కాలపు విజ్ఞానశాస్త్ర క్షేత్రంలోని సాధనకు సాక్ష్యంగా వున్నవి. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో బంగారు, వెండి మొదలైన లోహాల నుండి ఆభరణాలను తయారు చేస్తున్న విషయాల గురించి ఉల్లేఖించారు. సుగంధ ద్రవ్యాలు మరియు సౌందర్య వర్ధకాల ఉపయోగమూ వుండేది. పాత ఢిల్లీ వద్ద వున్న కుతుబ్‌మీనార్ వద్ద నిలిచివున్న ఉక్కుస్థంభం 1500 వేల సంవత్సరాలైన తరువాత కూడా యిప్పటికీ తుక్కు పట్టకుండా వుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది రసాయనశాస్త్రంలో భారతదేశ శాస్త్రజ్ఞుల సాధనకు ఒక ప్రతీకగా నిలబడి వున్నది. రసాయన శాస్త్ర సంబంధమైన కొన్ని గ్రంథాలు లభించి ప్రాచీన భారతదేశం యొక్క రసాయన శాస్త్రంలోని సాధనలను పరిచయం చేస్తుంది. ఉదా: *రసపద్ధతి* అన్న గ్రంథంలో లోహాలను శుద్ధ పూతి, మిశ్రమమని మూడు విభాగాలుగా వింగడించడమైనది. లోహం మరియు ఉపలోప విభాగాలనూ అచట గమనించవచ్చు. ఆయుర్వేదంలో ఉపయోగించే కొన్ని భస్మాలకు, ఔషధులకు, రసాయన శాస్త్రపు పరిజ్ఞానం అత్యగత్యంగా వుండి వుండాలన్నది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కౌటిల్యుడి *అర్థశాస్త్రం*లో కొన్ని లోహాల ఉపయోగాలకు తోడు గనులను గురించి కూడ దీనిలో ఉల్లేఖించబడినది.

**ఆయుర్వేదం :**

ఆరోగ్య శాస్త్రాన్ని ఆయుర్వేదమని పిలవడం పరిపాటి. ప్రస్తుతం మనకు లభ్యమవుతున్న మూడు ప్రముఖ ఆయుర్వేద గ్రంథాలంటే *చరక సంహిత, సుశ్రుత సంహిత* మరియు *అష్టాంగ సంగ్రహం.* ఆయుర్వేదంలో ఎనిమిది అంగాలు వున్నవి. అవి : కాయచికిత్స, కౌమార్యభృత్యా, భూతవిద్యా, శాలాఖ్యా, శల్య, అగధతంత్ర, రసాయన తంత్రం మరియు వాజీకరణ తంత్రం. యీ ఎనిమిది అంగాలు శస్త్రచికిత్స ఉల్లేఖమూ *చరక సంహిత*లో వుండడం గమనించదగిన విషయం. ఎనిమిది రకాలుగా శస్త్రచికిత్స ప్రక్రియ జరిగే విషయం గురించి ఉల్లేఖించబడినది. కత్తిరించడం, అంగచ్ఛేధన, గాయం చేయడం, రంధ్రం చేయడం, శోధించడం, తీసివేయడం, విశ్లేషణ మరియు కుట్టివేయడం, అని శస్త్రక్రియ సంబంధమైన ఎనిమిది మెట్టులను నిరూపించడానికి తోడుగా శస్త్రచికిత్స తరువాత రోగిని ఉపచరించాల్సిన పశ్చాత్ కర్మ గురించి కూడ వివరించబడినది. శస్త్రచికిత్సకుడి గుణాలను కూడ యిందులో వివరించారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి ప్లాస్టిక్ సర్జరీ గురించి సుశ్రుతులు తన గ్రంథంలో వివరిస్తారు. కొద్దికాలం క్రితమే ప్రఖ్యాత విజ్ఞాని రొద్దం నరసింహ, పురాణాలనూ, విజ్ఞానాన్ని కలబోయకూడదని హెచ్చరిస్తూనే, ప్రాచీన భారతీయ శస్త్ర విజ్ఞానులకు 'ప్లాస్టిక్ సర్జరీ' గురించి తెలుసుననడానికి సాక్ష్యాధారాలు వున్నవని చెప్పిన విషయం ఈ సందర్భంలో స్థగితమైనదని పరిశోధన చేసి మరలా యీ పద్ధతికి విజ్ఞానశాస్త్ర పరంగానే ప్రాణంపోయాల్సిన అవసరం ఉన్నది.

**సస్య విజ్ఞాన శాస్త్రం :**

*అగ్నిపురాణం, అర్థశాస్త్రం మరియు బృహత్సంహిత* లలో సస్య విజ్ఞానశాస్త్రం సంబంధించిన కొన్ని వివరణలు లభిస్తాయి. వృక్షాయుర్వేద కల్పననూ గమనించవచ్చు. విత్తనాలను ఎన్నుకోవటం, బీజాంకురం, రసాయనికాల వాడకం, భూమిని ఎన్నుకోవడం మొదలైన కృషి, సేద్య సంబంధమైన కొన్ని విషయాలను వీటిలో ప్రస్తావించబడినది. పరాశర మహర్షిచే రచింపబడినదన్న 'కృషి పరాశర' అన్న గ్రంథం యొక్క రచనాకాలం క్రీ.పూ. 100 నాటిది. ఆ గ్రంథం ఆరు అధ్యాయాలలో సస్యవిజ్ఞానశాస్త్ర సంబంధమైన ఎన్నో వివరాలను తెలిపివున్నారు. బీజోత్పతి కాండం, వనస్పతి కాండం, పానస్పత్య కాండం, వీరుధావల్లి కాకుండా, గుల్మశు పకాండ మరియు చికిత్సాకాండం. యివే ఆ అధ్యాయాలు భక్తి చూపడమేకాక సంరక్షించాలన్న చింతకూడ వున్నదన్న కొన్ని నిదర్శనలనూ యిందులో చూడవచ్చు. ప్రకృతి వున్నదే మనుష్యుడి లోభాన్ని, దురాశను పూరించడానికన్న స్వార్థానికి ప్రాచీన భారతదేశపు విజ్ఞానశాస్త్ర ధర్మశాస్త్ర సమాజంలో గుర్తింపు వుండలేదన్నది ఖచ్చితం.

**జీవ (ప్రాణి) శాస్త్రం :**

జీవమున్న ప్రాణులను గురించి, వాటి స్వరూపం, వర్గీకరణం, పెంచడం, సంతానక్రమం, చికిత్స మొదలైన విషయాలు కొన్ని గ్రంథాలలో ఉల్లేఖించబడినవి. పదునాల్గవ శతాబ్దంలో అశ్వచికిత్సకు సంబంధించిన భారతీయ గ్రంథమొకటి పర్షియన్ భాషకు అనువదింపబడినదన్న విషయం ప్రచారంలో వున్నది. పాలకాప్యుడి *హస్తాయుర్వేద* అన్న గ్రంథంలో ఏనుగుల రోగాలకు ఔషధాలనూ, శస్త్రచికిత్సల గురించి వివరణలు వున్నవి. అలాగే జయదత్తుడి *శాలిహోత్ర శాస్త్రం* అశ్వాల రోగాలకు చికిత్సను వివరిస్తున్నది.

**ముగింపు :**

ప్రాచీన భారతదేశంలో విజ్ఞానశాస్త్ర జ్ఞానం జనజీవనానికి ఆధారమై నిరంతరంగా సాగుతుండేవి. కాని కాలక్రమంలో బయటినుండి ఎదురైన కొన్ని రకాల ఆక్రమణలు మరియు లోపలి సమాజంలోనే కనపడిన జడత్వం మొదలైన ఎన్నో కారణాలు మనదేశంలో విజ్ఞానశాస్త్రం వెనుకంజ వేయడానికి కారణమైనది ఒక దురంతమే. బ్రిటీషువారు భారతదేశం రావడానికి మొదలు విజ్ఞానశాస్త్ర క్షేత్రంలో ఎన్నెన్నో సాధనలు చేసి కృతార్థులయ్యారు. ఈ విషయాన్ని ధర్మపాల్ అనునతడు 'ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ ది ఎయిటీన్త్ సెంచరి (Indian Science & Technology in the Eighteenth Century) అన్న కృతిలో విశదంగా నిరూపించారు. మన పూర్వుల జ్ఞానము మనకు వెలుగుబాట కావాలికాని అదొక భారం కాకూడదు. మూల గ్రంథాల అధ్యయనపు కొరత, పరిశోధన ప్రవృత్తిలో కనబడుతున్న జడత్వం, చేయడంకంటె చూపించుకోవాలన్న దానికి లభిస్తున్న మన్నన. ఇలాంటి మనోభావం ప్రాచీన భారతదేశపు విజ్ఞానశాస్త్రపరమైన సాధనలను యిప్పటి భారతదేశంలో కేవలం స్తుతించడానికి పరిమితమైనదేమోనన్న అనుమానం రాకుండా వుండదు. ఒక సమయంలో ఆధ్యాత్మికతనూ, విజ్ఞానాన్నీ, పూర్తి జగత్తుకు నేర్పగల గురుస్థానంలో వున్న భారతదేశం అప్పటినుండి క్రిందికి దిగిపోయినది, ఏ కారణంవల్లనన్న ఆత్మావలోకనానికి యిది సరియైన సమయం. ఇప్పుడు కూడ భారతీయుల ఆలోచనా క్రమం యొక్క పునరుజ్జీవనం ద్వారా విజ్ఞాన శాస్త్ర పరంగానూ భారతదేశం యొక్క అనన్యతను ప్రపంచంలో మరలా స్థాపించవచ్చునన్న అభిప్రాయాన్ని కొంతమంది మేధావులు పొందివున్నారు.

పాశ్చాత్యుల విజ్ఞానశాస్త్ర మనోధర్మానికీ, భారతీయుల విజ్ఞానశాస్త్ర మనోధర్మానికీ కొన్ని వ్యత్యాసాలు వుండడాన్ని గుర్తించి, భారతీయుల ఆలోచనాక్రమం ఎలా జీవన్ముఖమైనది, వాస్తవమైనది, వినశీలమైనది అని తెలిపివున్నాను. ఈ నేపథ్యంలో భారతీయ సమాజం ప్రస్తుతం కార్యోన్ముఖం కావాలి. విజ్ఞానాన్నే ఒక మూఢత్వం చేసుకొని రాక్షస అడుగులను వేస్తున్న ఆధునిక మనస్థితికి సరియైన మార్గాన్ని ఒదిగించడానికి భారతీయ విజ్ఞానశాస్త్ర పరంపరకు సాధ్యమౌతుందనేటట్టయితే, ఆ కల్పనకు సఫలీకృతం చేయాల్సిన కర్తవ్యం మనపై వున్నది.




కన్నడం: ఎస్. సూర్యప్రకాశ్ పండిత్

తెలుగు: వేలూరి కృష్ణమూర్తి 'అనన్య'

శ్రీరాంపురం, మైసూరు.

ఫోన్ : 0 944 897 7877


---




*ఈ గ్రంథ పఠనం ఆద్యంతమూ ఏం కాబోతోంది, ఏం జరుగబోతోందన్న ఉత్కంఠతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ కవి తన ప్రియురాళ్ళను కలుసుకోబోతున్నప్పుడు, వారి జీవితాల్లోకి అడుగు పెట్టబోతున్నప్పుడు ఉత్సుకతకు లోనవుతాం. మళ్ళీ అతను వారికి దూరమౌతున్నప్పుడు మనం ప్రియమైన ఆత్మీయుల నుండి విడిపోతున్నట్టు గుండెల్ని పిండే బాధకు లోనౌతాం. అదే ఈ రచనలోని, అనువాదంలోని గాఢత. తను మొదటగా ప్రేమించిన చావర్తు, కారోలైన్, క్లేర్, మరీముఖ్యంగా అగస్టా, మేరియానా, మార్గరేట్, గూసిలీరాణి తెరాజా, భార్య అనబెల్లా – వీరి నుండి బైరన్ దూరమైనపుడు మనకు దుఃఖం కలుగుతుంది. తనకూ క్లేర్‌కూ జన్మించిన కూతురు అలెగ్రా చనిపోయినపుడు బైరన్‌తోబాటు మన గుండెలూ ఏడుస్తాయి.*

*బి.వి. రామిరెడ్డి*

*(సాక్షి, ఫిబ్రవరి–29, 2016)*

# కనక

రాత్రి నుంచి, కనక పురిటి నొప్పులు వింటూనే వున్నాడు – ఎప్పుడో తెల్లారుతుండగా – బిడ్డ ఏడుపు వినపడింది.

నా బిడ్డ మాయలోకంలో పడింది, అనుకుని ఆసుపత్రి వరండాలో గోడవారగా ఆనుకుని మగత నిద్రలోకి జారుకున్నాడు.

ఎండతోపాటు ఆసుపత్రి మేల్కొంది. వచ్చే పోయే జనంతో – నర్సుల హడావుడి నడకలతో, మందుల వాసనతో నారాయణ ఉలిక్కిపడి లేచాడు – ఆసుపత్రి ఆరుబయట వేపచెట్టు క్రిందకు వెళ్ళి పళ్ళు తోముకొని ముఖంమీద నీళ్ళు జల్లుకున్నాడు.

మెల్లగా వరండాలోకి వచ్చి రాత్రి కనక పడిన నొప్పులు – బిడ్డ ఏడుపు గుర్తుకువచ్చి – నర్సమ్మను అడిగాడు – చూడవచ్చా అని – ఆమె అటు అన్నట్లు వేలు చూపింది.

కనక మగతగా పడివుంది – పక్కలో పండులాగా బిడ్డ – నల్లని జుత్తుతో – మేలుకునే వుంది. మెల్లగా దగ్గరకు వెళ్ళి పరీక్షగా చూశాడు; పాప తనని చూసి నవ్విందా? తన భ్రమా? మళ్ళీ వరండాలోకి వచ్చి తర్వాత వేపచెట్టు క్రింద కూర్చున్నాడు. తన చుట్టూ వున్న పరిసరాలు – మెల్లమెల్లగా పొగమంచులో కనపడకుండాపోయాయి.

మర్నాడో, ఆ మర్నాడో, కనకను, పాపనూ తీసుకుని ఆ చిన్న టౌను బస్సుస్టాండుకి చేరి తన వూరు పోయే బండి కోసం కూర్చున్నాడు. కనక, తలకు చెవులమీదుగా గుడ్డ కట్టుకుని నీరసంగా వుంది. తన చేతుల్లో పాప కదుల్తోంది. ముద్దుగా! ఇంకా పురిటివాసన!

బస్సులో ఎక్కిన తర్వాత పాపకు చెంగుచాటుగా చనుబాలు కుడిపి కనక నిద్రపోయింది. నారాయణ పాపను చేతుల్లో పొదివిపట్టుకుని ముద్దులు పెట్టాడు. అమ్మ వాసన! ప్రక్కనే వున్న దంపతులు నారాయణను చూసి నవ్వి – 'పాప బావుంది' అన్నారు. వాళ్ళు చేతులు జాస్తే పాపను అందించాడు. నారాయణ కళ్ళు తడిసిపోయాయి.

కనక మగతగానే వుంది. గంటో – రెండు గంటలో ఎంతసేపు ప్రయాణం సాగిందో పొద్దు దిగే వేళకు–



వాళ్ళ వూరి స్టాపులో బస్సు ఆగింది. వెనకాలే దుమ్ము లేచింది.

ముందు కనక దిగింది. అలా మగతగానే అక్కడి చెట్టు క్రిందకు జేరింది.

వెనక నారాయణ దిగాడు – బస్సు కదిలిపోయింది; మళ్ళీ దుమ్ము లేచింది.

కనక, నారాయణ రావటం చూసింది. బస్సు రేపిన దుమ్ములో, తన కంటి నీటి పొరల్లో నారాయణ ఎండమావుల్లోంచి నడిచి వస్తున్నట్లుంది. నీరసంగా లేచింది – 'పాపేది?' 'పాపేదయ్యా!' అని ఏడుపులాంటి అరుపు.

'వద్దే – అది బతకనివ్వదు – వద్దే – దాన్ని బతకనివ్వదే' అంటూ ఏడ్చాడు.

కనక అతని చేతుల్లో వాలిపోయింది.

వెనక పొద్దూ వాలిపోయింది.

---

భట్టు గారు చెప్పిన బి.బి.సి. నాలుగు నిమిషాల కథకు అక్షరరూపం. ***–ఎ.కె.***

# అట్టమీద బొమ్మలు

**రజతోత్సవం జరుపుకున్న కోనసీమ చిత్రకళాపరిషత్ ప్రదర్శనలో బహుమతి పొందిన చిత్రాలు :**

ప్రకృతి ఒక అద్భుతం. అందునా కోనసీమ అందాలు మరో అద్భుతం. ప్రకృతి ఆరాధకుల పాలిట కొంగు బంగారం. చలనచిత్ర పరిశ్రమ సినీ గేయ రచయితల, కవులకు ఈ సీమ సౌందర్యం ముడిసరుకు అయింది. పురాతన క్షేత్ర సముదాయం పర్యాటకులకు కేరళను తలపించే దృశ్య సోయగాలు, గోదావరి నదీప్రస్థానంలో చిట్టచివరి భూభాగంగో 'కొన'నున్న 'సీమ' కోనసీమగా తన అందాలను ఆరబోస్తుంది. కోనసీమలోని ప్రతి పల్లెకు యుగయుగాల ప్రాశస్త్యం ఉంది. తరతరాల చరిత్ర ఉంది. ఎగిసిపడే కెరటాలతో బంగాళాఖాతం, ఎటు చూసినా ఏడునదీ పాయలు పరవళ్ళు తొక్కే గోదావరి నదీజలాలు, ఆ జలాలతో ఆవరించిన లంక భూములు, నదీమ తల్లికి వడ్డాణంలా అమరిని వంతెనలు, ఒంపుసొంపుల పంట కాల్వలు పచ్చని తివాసీ పరిచినట్లుండే వరి చేలు. ఆ చేలు గట్లపై బారులు తీరిన కొబ్బరిచెట్లు. ఈ అందాల నడిబొడ్డులో ఉన్న అమలాపురంలో వెలసినదే 'కోనసీమ చిత్రకళాపరిషత్'.




రాధాకృష్ణ
(25 వేలు బహుమతి పొందిన చిత్రం)

వృత్తిరీత్యా చిత్రకళోపాధ్యాయునిగా పనిచేస్తున్న కొరసాల సీతారామస్వామి 1989లో C.C.R.T. వారి పప్పుట్రీ ట్రయినింగ్ నిమిత్తం ఢిల్లీ వెళ్ళి 70 రోజులు ఉత్తర భారతదేశ పర్యటనతోబాటు విద్యాబోధన – లలిత కళలు అనే అంశంపై ట్రయినింగ్‌లో పాల్గొని అనేక క్రొత్త అంశాలతో బాటు ఖాళీ సమయంలో అకాడమిలోగల అనేక చిత్ర గ్రంథాలు పరిశీలించి అక్కడ జరిగే కార్యక్రమాలు వీక్షించారు. ఆ స్ఫూర్తితో కొరసాల అమలాపురంలో చిత్రకళా కార్యక్రమాలు పెడితే ఎలా ఉంటుందనే ఆలోచన కలిగింది. ఆ రూపమే కోనసీమ చిత్రకళా పరిషత్ స్థాపనకు నాంది అయింది.

ఢిల్లీ నుండి వచ్చిన వెంటనే ఉభయగోదావరి జిల్లాలలో ఉన్న చిత్రకారులను సమన్వయపరచి వారి పెయింటింగ్స్ సేకరించి, 1989లో ఉగాది రోజున అమలాపురంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అలనాటి కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు కీ.శే. రాజాజీ గారు, శ్రీ జి.యమ్.సి. బాలయోగి (లోక్‌సభ స్పీకర్) ప్రముఖ పారిశ్రామికవేత్త అద్దూరి పద్మనాభరాజు, డా. మెట్ల సత్యనారాయణరావు (మాజీ మంత్రివర్యులు) మొదలగు పెద్దలతో సభ నిర్వహించి 'కోనసీమ చిత్రకళాపరిషత్' అను పేరుతో నామకరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఇది కోనసీమ చరిత్రలోను, చిత్ర కళారంగంలోను ప్రప్రథమమైన కార్యక్రమంగా కీర్తినార్జించింది. ఈ కార్యక్రమములో చిత్రకారులకు మంచి స్పందన, ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్ని ఇచ్చింది. సలహాలు, ప్రసంగాలతో పరిషత్ నిర్మాణానికి పునాదయింది.

డా. మెట్ల సత్యనారాయణరావుగారు అధ్యక్షులుగా కొరసాల సీతారామస్వామి వ్యవస్థాపక కార్యదర్శిగా 11 మంది ప్రముఖులు, చిత్రకారులతో కార్యవర్గం ఏర్పాటు చేసి, వివిధ రంగాల ప్రముఖులతో సలహాబోర్డును ఏర్పాటు చేసి చిత్ర కళాపోటీలు, కార్యక్రమాలు రూపొందించారు. అందాల కోనసీమను ప్రతిబింబిస్తూ నదిలో పడవపై స్త్రీ చిత్రాన్ని చిత్రిస్తున్నట్లు కొబ్బరి ఆకు చంద్రబింబం కెసిపి అక్షరాలతో లోగోను రూపొందించి, కీర్తింపబడినది.



ఒంటరి తీవె

1990 జనవరిలో సంక్రాంతి పండుగ మూడు రోజులు చిత్రకళాప్రదర్శన, బహుమతి ప్రధానోత్సవం నిర్వహించి ఆ మూడు

రోజులు చిత్రకళా సంక్రాంతిగా కళాభిమానులకు, కళాకారులకు చిత్రకళా పండుగగా నిర్వహించారు. అది మొదలు నేటి వరకు సంక్రాంతి నెలలో నిర్వహిస్తూ సుదూర ప్రాంతాలవారు కూడా ఈ ఉత్సవాలకు విచ్చేసి ఈ కార్యక్రమములో పాల్గొని ఇది మన పండుగ, మన అందరి పండుగ అనే భావం కలుగజేశారు కొరసాలవారు.

ప్రతి సంవత్సరం వేలాది బాలలకు స్పాట్ పెయింటింగ్ పోటీలు, స్త్రీలకు ముగ్గులు – మెహిందీ పోటీలు, జాతీయ స్థాయిలో బాలలకు, చిత్రకారులకు పోటీలు నిర్వహించి, లక్షలాది రూపాయల నగదు బహుమతులు ఇస్తూ అంచలంచలుగా బహుమతి విలువలు పెంచుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ప్రకటించిన తేదీకే కార్యక్రమం నిర్వహించి, కళారంగంలో ప్రత్యేక స్థానం తీసుకొచ్చారు. ఆర్టు డెమోలు, వర్కుషాపులు పోర్ట్రైట్ డెమోలు నిర్వహిస్తూ ఈ సంస్థ ఇతర సంస్థలకు మార్గదర్శకమయింది. తెలుగు రాష్ట్రాలలో అనేక సంస్థలు ఈ సంస్థ స్ఫూర్తితో వెలసినవే, కెసిపియే మీకు స్ఫూర్తి అని ప్రకటించిన సందర్భాలు ఉన్నవి. ప్రతి పట్టణంలోను సంస్థలు వెలసి కళాభివృద్ధికి తోడ్పడాలని కొరసాలవారి కోరిక. అందుకు ఆయన సహాయ, సలహాలు ఉంటాయని తెలియజేశారు.

20 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంలో 'ద్విదశాబ్ది ఉత్సవాలు' నిర్వహించి, 100 మంది ప్రముఖ చిత్రకారులకు 'చిత్ర కళా వైజయంతి' బిరుదుతో ఘనసన్మానాలు చేసి, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సు, గ్లోబల్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులతో పాటు అనేక అవార్డులు పొందిన ఘనత ఈ సంస్థకు దక్కింది. బాపు, బాలి, శంకర్, చంద్ర టి.వి., దేవిప్రసాద్, విజయకుమార్, ఉస్మాన్ ఖాన్, వైకుంతం, రాజయ్య, చందనాఖాన్, ఉదయ కుమార్, నగేష్, కళాసాగర్ మొదలగు ప్రముఖ చిత్రకారులు మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రముఖులందరు ఈ సంస్థలో సన్మానం పొందినవారే. నేటి ప్రముఖ చిత్రకారులు అనేకమంది ఈ సంస్థ ద్వారా బహుమతులు పొందినవారే. నేటి ప్రఖ్యాత చిత్రకారులు ఏలే లక్ష్మణ్‌కు ప్యూర్ బంగారు పతకము ఇచ్చిన ఘనత ఈ పరిషత్‌దే. ఈనాటి ప్రముఖ చిత్రకారులు అనేకమంది ఈ సంస్థ ద్వారా మెగా అవార్డు పొందినవారే.



ఇరుల పోరు



యన్. రాజేశ్వర్
(10 వేలు బహుమతి పొందిన చిత్రం)

2015వ సంవత్సరంలో, 25వ సంవత్సర ప్రారంభ రజతోత్సవ కార్యక్రమానికి 25 ప్రముఖ సంస్థలను ఆహ్వానించి ప్రత్యేక జ్యోతిప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించి అద్భుత వేదికపై కళాకారుల బహుమతి ప్రధానోత్సవం జరిగింది. 2016లో జనవరి 22, 23, 24 తేదీలలో సహస్ర చిత్రకారుల సన్మానోత్సవం – రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని గిన్నీసు రికార్డే లక్ష్యంగా నభూతే నభవిష్యత్ అనే విధంగా రూపొందించి 1000 మందికి సన్మానం, 1000 చిత్రాల ప్రదర్శన, 1000 మందితో సభ నిర్వహించి, చిత్రకళా జగత్‌లో నూతన అధ్యాయానికి నాంది పలికింది.

ఇప్పటివరకు ఏ సంస్థా చేయని కొన్ని రికార్డులు ఈ సంస్థ సాధించింది. వందలాది మంది ప్రముఖ చిత్రకారులకు సన్మానం. వేలాదిమంది బాలచిత్రకారులకు అవార్డ్సు, గోల్డ్‌మెడల్స్ – వందలాది మంది చిత్రకళోపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సన్మానాలు – అవార్డులు, లక్షలాది విద్యార్థులకు అవార్డు సర్టిఫికేట్స్ ఇచ్చిన ఘనత ఈ సంస్థదే. మాకు ఎవరూ పోటీ కాదు, మేము ఎవరికీ పోటీ కాదని సగర్వంగా చెప్పగల సమర్థుడు, వినయశీలి కొరసాల సీతారామస్వామి. ఈ రజితోత్సవ సందర్భంలో మొదటి బహుమతిగా ఒక చిత్రానికి 25,000 వేల రూపాయల నగదుతోపాటుగా 2 లక్షల రూపాయల నగదు వివిధ చిత్రకారులకు అందజేశారు.

ఢిల్లీ, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్‌లలో గణేష్ చిత్రకళా ప్రదర్శన చేయబోతున్నారు. న్యూయార్క్‌లో అనేక అంతర్జాతీయ గ్యాలరీలు సందర్శించి, ప్రముఖులను కలుసుకున్న ఈయన త్వరలో మరలా విదేశీ పర్యటనకు వెళ్ళబోతున్న కొరసాలగార్ని అభినందించుదాం.

# ఆలపాకమ్

– పలగాని గోపాలరెడ్డి

గ్రామంలో దొరికిన తమిళ శాసనం క్రీ.శ. నాటిది. అందులో ఒకానొక కల్లపరెడ్డి, వెల్లాసేరి గ్రామానికి అనుబంధించిన 'మేల్ ఆలైపాక'మన్న ఉపగ్రామానికి 'కొణియాలన్' (తమి)లేక పారంపర్య (భోజుడు) హక్కు భుక్తములు కలపాలకునిగా చెప్పబడినాడు. ఆయన తండ్రి పేరు చెజ్జిన్ పోయన్ ముప్పిడిరెడ్డి.

తమిళ భూమిలో 'వేలాన్ సేరి' పేరుతో కొన్ని గ్రామాలున్నవి. వేలన్ (తమి) అంటే (రాజ) దండము పట్టిన పాలకుడన్న అన్వయం గ్రహించి, వేలాన్ సేరి (తమి) అనబడే గ్రామాలు వేలాన్‌ల పాలనా కేంద్రములుగా భావన. కార్తికేయుడు లేక వేలాయుధం లేక దండపాణి శక్తి దండధీరుడు. ఒకపాటి సీమను పాలించెడివాడు వేలన్‌గా పరిగణన. అట్టి నామాంతరంతో కొంతమంది పాలకులు చరిత్రలో తగుల్తారు. ఒఢ్రు దేశ చరిత్రలో 'ఖారవేలుడు' తగుల్తాడు. ద్రావిడ భాషానియమానుసారం, ఏదైనా పదంలో ద్వితీయ స్థానంలోని ద్విత్వమైన (Doubled) హల్లు ఏకత్వాన్ని పొందగా, దాని ముందున్న అక్షరం దీర్ఘత్వాన్ని సంతరించుకొంటుంది (ఉదా: కణ్ణి = కాణి, కమ్మ = కామ, కప్పు = కాపు, పల్ల = పాల, ఇత్యాది). ఈ సూత్రానుసారం వేలాసేరికి వెల్లాసిరి తొలిరూపం.

ఈ మూలరూపమైన వెల్లాసేరి కాటయ వేమారెడ్డి దయచేయించిన అన్నవరప్పాడు (ప.గో. జిల్లా) శాసనంలో కూడతగుల్తుంది. ఆ చెప్పబడిన వెల్లాసేరి 'పణ్ణనాటి' (రాష్ట్రం)లోనిదనిన్నీ, అది కాటయ వేమారెడ్డి గారి పూర్వీకుల కుదురు గ్రామమనిన్నీ, అదొక విఖ్యాత విఫణి (Commercial emporium) అని కూడ చెప్పబడినవి. కొండవీటి రెడ్డి రాజులు తమది 'వెల్లాసేరి' గోత్రమని కూడ చెప్పుకొన్నారు. పణ్ణనాడు (పట్టినాడు) లేక పళై (ఫై) నాడు (పడైనాడు)గా పిలువబడిన ప్రాంతం, నెల్లూరు సీమలోని సువర్ణముఖి నది ఉభయ తీరస్థమైన భూభాగంగా పలు శాసనోక్తం. ఆ పణ్ణనాటలోని ముట్టియం పాకం (నేటి ముట్టెంబాక) ప్రధాన గ్రామంగా కంబిలోని అరువాళ్ పెరుమాళ్ శాసనంలో ఉంది. ఆ ముట్టెంబాక గ్రామం పొరుగునే ఉన్న నేటి ఎల్లసిరి గ్రామమే ఊటుకూరు శాసనంలో చెప్పబడిన వెల్లాసేరిగా నా ప్రతిపాదన. ఇతరత్రా ద్రావిడ దేశంలోనివన్నీ వేలాన్ సేరిలేగాని ఒక వెల్లాసేరి కూడ లేదు. ఈ ఆధారాల మూలంగానే కల్లపరెడ్డి, కాటయ వేమారెడ్డి ముందు తరాలవారి కుదురుగా భావించి, ఈ వ్యాసం వ్రాయబడినది. అంతేగాక, మరొక చూచాయి సాక్ష్యం ఇలా ఉంది.

పణ్ణనాటిలోని పురాతన రేవు పట్టణాలతో దుగరాయ పట్టణం లేక మగరాజపట్టణమొకటి. అది సువర్ణముఖి పాయమొగపైనున్నది. ఈ పాయ పేరు రాయల కాలువ. ఈ పేరు పాలక వంశానికి చెందిన ఎవరో ఒక రాయలవల్ల సంక్రమించలేదు. దాని నైసర్గికాన్ని బట్టి ఆ పేరు వచ్చినది. రచ్చ – రాచ – రాఅ–రాయ – రాయకాలువ సమతలమైన మేరకు నేలపై దొర్లుతూ క్రిందికి నడుస్తూ సాగెడి మెరక కాలువ. అట్టి వాగుల జంట లేక దుగ, దుగ్గరాయ పట్టణపు రేవు కాలువ.

రాయప్రవాహం ముఖద్వారంకు కొలది ముందుగా మెరక పైనుండి లోతు (గర్తం) లోకి దూకి లోతైన మడుగు (Seour)ను సృష్టిస్తూ మొగలోపడి కలుస్తుంది. ఆ లోతు నీరే నౌకల రాకపోకకు, లంగరు వేసికొని ఎగుమతి, దిగుమతి వంటి రేవు కార్యకలాపములకు అనువౌతుంది. పశ్చిమబెంగాల్ తీరంలోని రాయ్‌చౌక్, చెన్నై తీరంపైనున్న రాయపేట, రాయపురం, నెల్లూరు జిల్లాలోని పులికాట్టు సరస్సు ఉత్తరపు మొగ (వేపంజేరి కాలువ) వద్ద నున్న పూడి రాయ దొరువులవంటివన్నీ ప్రాచీన రేవులే. రాయనైసర్గికమే వాటికి ఆయువుపట్టు. అనాది కాలంలో దుగరాయ కాలువ చివరి గర్తాన్ని (tail waters) ఒకానొక చెంగారెడ్డి పూడిక మట్టిని తొలగించి, ఆ రేవులోని ఎగుడుదిగుడులను సరిచేసి వచ్చిపోయెడి నౌకలకు అనువు చేయించినాడని స్థానిక వయోవృద్ధుల జనశ్రుతి ఉంది. వారు సదరు దుగరాయ

కాలువ చివరి అంచెను చెంగారెడ్డి కాలువగా పిలవడమీనాటికిన్నీ నిలిచి వున్నది. రేవు పట్టణాలు, ప్రభుత్వ ఆస్తులు, వాటి నిర్వహణ రాజప్రతినిధులే నిర్వర్తిస్తారు. చెంగారెడ్డి కూడ రాచరికపువాడేననుకుంటే కల్లపరెడ్డి తాతగాని వంశకర్తగాని, ఆ పరంపరలోని చెఙ్గన్ పోయిన్ పేరటివాడుగానీ ఈ (చెంగారెడ్డి) కాలువను లోతు చేయించినాడనుకొనుట హేతుబద్ధం, కాబట్టే, పణ్డనాడులోనిది వెల్లాసేరి అనెందుకొక చూచాయి సాక్ష్యం. కుల్లపరెడ్డి వంశీకులు వెల్లాసేరి కాణియాలన్‌లు కదా. ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థ ఏర్పడే వరకు ఎల్లసిరి గ్రామం ఒక ఫిర్కా కేంద్రంగా ప్రాధాన్యత అనుభవించినది. శాసన కాలం నాటి (యేల్) ఆలైపాకంను నేడు ఆలేటిపాడుగా పిలుస్తున్నారు. అది ఎల్లసిరికి పొరుగు గ్రామం.

ఆలము (తెను) అంటే యుద్ధమని ఒక అన్వయం. కొంకణ తీరంలో ఒంటజాతివారున్నారు. వారీనాటికీన్న వార్షికం (anual) ఈనాటికి ఆలమ్ పండుగ జరుపుకుంటారు. వారివారి గ్రామల దరిదాపులలోని కొండవాగు దరిపై కూడుకొని, రెండు జట్లుగా చీలి, ఆ వాగు పరుపుపైనున్న ఇసుకవాలు (sandy beach) లేక తుర్రై (తమి) పై కుహనా పోరాటం (Maime fighting) చేస్తారు. బంటు (తెను) లేక బంటర్ (కన్న) అంటే సైనికుడుగా చదరంగపు ఆటలో పిలుస్తారు. ఆలైపాకమన్న ఊరి పేరులోనేకాక 'కాణియాలన్' (తమి)లో కూడ 'ఆల' పదమన్నది 'ఆలనపాలన' అనెడి జంట పదం తెలుగువారి వాడుకలో ఇంకా నిలచి ఉంది'. 'ఆలన' అంటే సంరక్షణ, పాలన అంటే రాచరికపు అజమాయిషి. తమ క్రిందనున్న గ్రామాన్ని తలవర్ల సాయతో రక్షిస్తూ, గ్రామంపై పెత్తనం సాగిసస్తూ తరతరాలుగా హక్కు భుక్తములనుభవిస్తూ సాగెడి కాణియాలన్ లేక పోయన్ వ్యవస్థ పల్లవుల పాలనలో ప్రస్ఫుటమైన వ్యవస్థ కనిపిస్తుంది.

ఈ పోయన్ వ్యవస్థ మిథ్యాత్రికి దిగువ దేశమంతటా ఉండినది. కాకుంటే ఆ పేరులో స్వల్పమైన మార్పులు దేశాను గుణ్యంగా ప్రతిబింబించాయి. ప్రభుత్వ ప్రతినిధిగా విధులు నిర్వర్తించి, వారివారి సీమాసంరక్షణ చేస్తూ ప్రభువుకు శిస్తులు వసూలు చేస్తూ, యుద్ధావసరాలకు ప్రభువునకు సాయపడుతూ చేసిన వసూళ్ళలో నిర్దిష్టమైన పాలును తాను అనుభవిస్తూ పాలన సాగించెడివాడా పోయన్ లేక పోయిన్దన్. ఓఢ్ర దేశంలో బుడత (భోక్త)గాను వింధ్య పాదభూమిలో భోజునిగానూ (నేటి) తెలంగాణంలో పోచిన్ లేక బోయన్ లేక బోనగానూ, ద్రావిడ దేశంలో పోసన్ లేక పోయన్‌గానూ తెలుగునాట బోయన్ లేక బోల లేక బోన (ల=న) గానూ, కర్ణాటకలో హోయసళు (ప×హ మరియు క-సమార్పుకు పూర్వం, పోయగళు) గాను దిగువ మహారాష్ట్రలో బోనసలు లేక భోన్స్లేగాను పిలువబడిన వివిధ కులాలవారు లేక పలు వర్గీయులు అట్టి చిట్టి లేక చిరు పాలకులు. నేటి తెలంగాణంలోని పోచంపాడు, బోయినపల్లి, భోన్గీరు (భువనగిరి దుష్టరూపం) బోనకల్లు తీరాంధ్రలోని బొల్లీపల్లి వంటి ఊర్లన్నీ అట్టి చిరుపాలకుల స్మృత్యర్థకాలే.

ఊటుకూరు శాసనంలో తగిలిన చెఙ్గన్ (రెడ్డి)కున్న తగిలింపు 'పోయన్' పదవీ పరమే కానీ, కుల పరం కాదు. అతని పరంపరలోని ముప్పిడిరెడ్డి, కల్లపరెడ్డిల కట్టి తగిలింపు లేదు. అంటే, హరిహయాంలో పోయన్ పదవి పోయిందిగా తోస్తుంది. నెల్లూరు ప్రాంతంలో బోయరెడ్డి ఒక వ్యక్తి నామం. పోయన్‌గా ఒక దేశ విభాగమైన 'కొట్టమ్'నే పాలించిన ఆ పాలకుల పేర్లు కొన్ని నెల్లూరు జిల్లా శాసనాల్లో తగుల్తారు. ఇట్టి పాలనా పరమైన పదవులను నిర్వహించినవారిని, వారి నామాంతములనుబట్టి, ఒక ఆటవిక (బోయ) జాతివారిగా చిత్రించడంలోని ఔచిత్యాన్ని చరిత్రకారులు పునస్సమీక్షించగలరని ఆశిద్దాం. పణ్డనాటిలోని ఆలేటిపాడు జమిలి (దుగ) రాయకాలువల దరిపై ఉన్నత భూమిపై అమరి ఉంది. ఇతరత్రా ఆలంపురు (తుంగభద్ర గట్టు) ఆలమూరు (వశిష్ఠ గోదావరి గట్టు) కర్ణాటకలో ఆలమట్టి (కృష్ణా గట్టు) కేరళలో ఆలువాయి (alwye). అలాగే నెల్లూరు జిల్లాలో ఆలతుర్రు లేక ఆలతిలర్రై (నేటి పేరు ఆల్తూరు) కర్నూలు జిల్లాలో ఆలూరు, కొల్లేటిదరిపై ఆలపాడులు కూడ నీటిగట్లే. ఆలకు పూర్వ రూపమైన 'అల్ల'తో సువర్ణ ముఖిగట్టుపై అల్లంపాడు కోనసీమలో అల్లవరంతోపాటు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలందొక్కొక్కటి వంతున మూడు అల్లూరు ఉన్నవి. వీటన్నిటి నైసర్గికాలు అట్టివే. ఇంకాల - న (తెలుగు - తెనుగువలె) మార్పు స్వీకరిస్తే సువర్ణ ముఖందరిపై అన్నియేడు, పంపానదిపై అన్నవరంతోపాటు మరికొన్ని ఉన్నవి. తమిళనాట తిరువాలంగాడు (తిరు+ఆలంగాడు) తెలంగాణాలో ఆలేటి వాగుపైనున్న ఆలేరు, పంపానదిపై ఆనెగొందిల వంటివి ఈ కోవలోకే వస్తాయి. ఒకానొక శాసనంలో ప్రకాశం జిల్లాలోని అల్లూరు 'అరలూరు'గా

పిలువబడినది. అరల్ (తమి) అంటే పాతాళంవలె లోతైన ప్రాంతం. అల్లసాని ఒక ఇంటి పేరు. 'సాని' అంటే నిండి పొర్లితే తప్ప నీరు పోయే మార్గం లేని స్వతస్సిద్ధమైన జలాశయం. పై తెలిపిన ఆలమూరు, అన్నవరం వంటి ఊర్లన్నీ నమల గట్టుపై, చెప్పుకోదగినంత ఎత్తులో అమరినవే. పైగా నది అంచున్నే ఉంటాయి. ఆలప్రాంతంలో నది గట్టు నొరుసుకొంటూ దిగుతుంది. నది ఎండినా ఆలప్రాంతంలో ఒకింత లోతైన మడుగులో సదా నీరుంటుంది. కాబట్టే ఆల, అల్ల, అన్నీ ఇత్యాదులన్నింటికి నైసర్గికమే మూలం. నెల్లూరు జిల్లాలోని అల్లూరుకు పంటల అల్లూరని వ్యవహార నామం – అంటే పణ్టలలోని పణ్టశాఖకు చెందే రెడ్ల నెలవు. రాజమండ్రి రెడ్డి రాజుల కాద్యుడు 'అల్లాడ రెడ్డి / వారి మంత్రి బెండపూడి అన్నయ్య, కాటయ వేమారెడ్డి, భార్యపేరు అన్నమ. వెల్లాసేరి గోత్రం వారైన కొండవీటి రెడ్ల యింటి ఆడపడుచు. ఆమె పేరు మీదుగా గోదావరి కుడి దరిపై వెలసిన అగ్రహారం అన్నవరపుపాడు. ఆ యింటి మరొక ఆడపడుచు పేరు అన్నమ. ఆమె గుంటూరు సీమలో నెలకొన్న కల్యాణ గోత్రీకులైన వేల్పూరు రెడ్డి దొరల ఇల్లు మెట్టినది. ఆ వేల్పూరు పేరులో 'వెల్ల' ప్రద్యోతం. ఈ పేర్లతో కాశీ క్షేత్రంలో వెలసిన అన్నపూర్ణాదేవి ప్రమేయం లేదు. రాజమండ్రి రెడ్డి రాణులలో 'అని తల్లి' ఒకరు. 'అని' (తెలు) అంటే యుద్ధము. ఆలమువంటి పేరది. కొండవీటి రెడ్లలో అనపోత, అనవేమ పేర్లలో 'అన'కు అన్వయమేమిటి?

నెల్లూరు జిల్లా సువర్ణముఖి చివరిలో ఇరుదరులైన పణ్టనాటిలో కాటయ్య వంటి వ్యక్తి నామాలు ఈనాటికిన్నీ కలవు. కాటేరి అచ్చటి దేవతే. ఎగువనే కాటపాడి, కట్టమంచి వంటి గ్రామాలున్నవి. కాటసాని అచ్చటి ఇంటి పేరు. అల్లసానివలెనే నీటి మడుగుతో సంబంధమున్న పేరది (సానికై ముందున్నది వివరణ). ఆల్తూరు, ఆలెపాకం రెడ్డివారు, అల్లూరు, అల్లంపాటి, అల్లీరెడ్డి, అన్నారెడ్డి, అన్నదేవుల, ఆనంవంటి ఇంటి పేర్లు రెడ్డి కుటుంబాలవారివే. బహుకాలంగా ముత్తరసర్ లేక ముత్తరయర్‌లు కంచి పల్లవ దొరలకు అతి సన్నిహిత సామంతులుగా ద్రావిడ దేశంలో మెలగినవారు. పాండ్యుల చొరబాట్లను సమర్థంగా త్రిప్పికొట్టినవారు. పల్లవులకు వారు దక్షిణ దిశలో పెట్టని గోప వంటివారు. ఆ దిశలో చోళుల పల్లవులకు అంతంతమాత్రపు సామంతులు బాదామి చాళుక్యుల మూల పురుషులు కూడా కడప సీమలోని పెద్ద లేక బ్రాహ్మణ ముడియంలో అజ్ఞాతవాసం చేసినవారే. ఒకానొక తీరంలో ముత్తరయర్ సామంతులు పాండ్యుల పక్షాన నిలిచారు. అంతటితో గతి లేక చోళులపై ఆధారపడవలసిన పరిస్థితి తలెత్తినది. తదాది చోళుల మహర్దశ పెరిగి పల్లవుల దుర్దశ మొదలైనది. క్రమంగా పల్లవులతో రాష్ట్రకూటుల సఖ్యత పెరిగి పెరిగి వియ్యాలందుకునే స్థాయికి చేరింది.

రాష్ట్రకూటులకు వేంగీ (తూర్పు) చాళుక్యులతో తరతరాలుగా తరగని వైరం సాగినది. రాష్ట్రకూటులు పల్లవులు వేంగీవారిపై ద్విముఖ దాడులు చేయసాగిరి. గుణగ విజయాదిత్యుని సర్వ సేనాని పణ్డరంగడు పల్లవుల రాజ్యంపై దండెత్తి, నెల్లూరును కాల్చి, పల్లవుల పాలనలో భాగమైన బోయి కొట్టములను ధ్వంసం చేసి పళైకావేరి (పులికాట్) సరస్సు తగిలి వెనుదిరిగాడు. అంతా తమ మంచికేనన్నట్లు చోళులు తటస్థంగా ఉండి ప్రేక్షకపాత్ర వహించారు. ఈ గాడి పర్యవసానంలో భాగంగా చెజ్జన్ పోయన్, తన కాణియాలన్‌కు నీళ్ళొదిలి వెల్లాసేరిని వీడి సువర్ణముఖి ఎడమ దరిపై పైకి జరిగి వెజ్జడీనికి పొరుగనే ఉన్న కల్లడ సీమ (కొలత్తి) ప్రాంతం చేరి స్థిరపడినాడు. ఆ పరంపరలోనివాడే కల్లపరెడ్డి – ఊటుకూరు శాసనకర్త. ఆ వంశీకులు కల్లడంలో నిలద్రొక్కుకుని రెడ్డికం చేస్తూ ఉత్తరంగా పెన్నా తీరంలోని పాకనాటికి విస్తరిస్తూ తూర్పు కనుమల పాదభూమిలోని బట్టేపాడు (పణ్డవారి గ్రామం) వాసిలి (వాసిరడ్డికం) ఆత్మకూరు, దువ్వూరుల మీదుగా పొదిలి, అద్దంకిల మీదుగా సాగి, కొండవీటికి చేరినారనవచ్చును. అందొక శాఖ చీలి కాటయవేముని ప్రాపుతో రాజమండ్రి కేంద్రంగా గోదావరి తీరస్థ మండలనేవారు. వారి పతనానంతరం కొందరు రెడ్డి వీర కుటుంబాలవారు సువర్ణముఖి తీరభూమికి తిరిగి వచ్చి స్థిరపడినారని కల్లడ సీమలో జనశ్రుతి. ఆలపాకం రెడ్డింటివారు అందులో ఒక కుటుంబం. ఆలము అంటే యుద్ధము. ఆలన పాలన అంటే దేశ సంరక్షణ – పరిపాలన అనెడి అన్వయాలున్నా ఆలప్రాంతమొక నైసర్గిక వైవిధ్యం.

ప్రవాహపు దరిపై, అందునా గట్టు అంచుపై సమున్నతంగా నెలకొన్నవే ఆలమట్టి, ఆలంపూరు, ఆలమూరు అన్న మేడు, అల్లంపాడు ఇత్యాదులు. దరి నొరుసుకుంటూ ప్రవాహం నడుస్తుంది. సవాలోతు నీటిమడుగచ్చట నెలకొని ఉంటుంది. అందుకే అవి 'అరల్' (తమీ) ప్రాంతం. మిగిలిన అన్వయాలు తదనుబంధ వాచ్యార్థములని ప్రతిపాదన.

# వారసత్వం

– సాయి పాపినేని, జయశ్రీ నాయని

క్రీ.పూ. 1400 నాటికి తుది హరప్పా సాంస్కృతిక దశలన్నీ క్షీణించాయి. పురాతత్వ ఆధారాలరీత్యా క్రీ.పూ. 1400, క్రీ.పూ. 800 మధ్యకాలం భారతీయ పురా చరిత్రలో ఒక చీకటియుగం. మళ్ళీ నాగరికత పుంజుకుని ఉత్తర భారతదేశంలో పట్టణాల పుట్టుకకి 600 యేళ్ళు పట్టింది. ఈ రెండు నాగరికతల మధ్య అంతరాయంవల్ల హరప్పా నాగరికత నేపథ్యాన్ని మనం పూర్తిగా మరిచిపోయామని కొందరు చరిత్రకారులు తీర్మానించారు. ప్రధాన స్రవంతికి చెందిన చరిత్రకారులు ఆ రెండవ దశ వలస వచ్చిన ఆర్యులకి చెందినదిగా, వారు వచ్చే మునుపే అంతమైన హరప్పా నాగరికత ద్రవిడ భాషా సముదాయానికి చెందిన మూల వాసులదిగా సిద్ధాంతీకరించారు. ఈ రెండు భాషాస్రవంతులకి చెందిన దేశవాసుల రూపురేఖల్లో, భౌతికపరిమాణాల్లో, శరీరఛాయలో కొన్ని మౌలికమైన తేడాలూ, భారతీయ వర్ణవ్యవస్థలోని అగ్రకులాల్లో ప్రస్ఫుటంగా కనిపించే ఆర్యభాషా ప్రాంతపు ప్రజల లక్షణాలూ ఈ ఊహకి బలాన్నివ్వడమేగాక, వివిధ జాతుల, ప్రాంతాల అస్థిత్వ వాదాలకూ రాజకీయ సిద్ధాంతాలకూ పునాదిగా బిగుసుకుపోయింది. కనులముందు కనిపించే ఈ తేడాలకు కారణాలు వివరించకుండా 'ఆర్యుల వలస' సిద్ధాంతాన్ని తోసిపుచ్చలేము. అయితే, ఇప్పటివరకూ పరిశీలించిన పురాతత్వశాస్త్రం, పురాజన్యుశాస్త్రం, చారిత్రక భాషాశాస్త్రాల్లో వెలుగుచూసిన ఆధారాలు ఇండోఆర్యన్ మూలభాష హరప్పా నాగరికత పుట్టుక మునుపే ఆ ప్రాంతంలో ఉన్నట్లు ఋజువు చేస్తున్నాయి. అంతేగాక సంస్కృతంలో రాయబడిన ఇతిహాస పురాణ వాఙ్మయంలోని చారిత్రకతని, హరప్పా నాగరికత నేపథ్యంలో నిరూపించగలిగాం. కనుక ఆధునిక యుగంలో భారత ఉపఖండంలో వాడుకలో ఉన్న ప్రధాన భాషా కుటుంబాల మూలాలు హరప్పా నేపథ్యంలో వెదకక తప్పదు. హిమాలయ పర్వత సానువుల్లో, ఈశాన్య రాష్ట్రాల ప్రజల్లో, తూర్పు తీరంలోని ఆదివాసుల్లో కనిపించే టిబెటోబర్మన్, ఆస్ట్రోఏసియాటిక్ (ముండా) భాషలకు సమీప భూతకాలంలో తూర్పుఆసియా నుంచి వలస వచ్చిన జనజాతుల సంపర్కం, జన్యుమిశ్రణం కారణంగా ఊహించినా, మిగిలిన ఉపఖండంలో మధ్యహోలోసీన్ (క్రీ.పూ. 4500) తరువాత అటువంటి ఘటనకి ఆధారాలు లేవు.

పురాణాల్లోని సూర్య చంద్ర వంశాలు, దేవాసురులు, దాశ, దశ్యు, పణ్య, వసు, యక్ష, గంధర్వ, రాక్షసాది భిన్న వర్గాలు ఆ కాలాల్లోని భిన్న జనజాతుల ఉనికికి నిదర్శనంగా సూచించాము. హరప్పా నాగరికత నేపథ్యంలోని పురావాస్తు సంస్కృతుల్లో కూడా ఈ భిన్నత్వం కనిపిస్తుంది. ఈ భిన్న జాతుల మధ్య స్పర్థలను, సమీకరణాలను, పురాణ వంశావళు ల్లోని కాలక్రమణికల ఆధారంతో వ్యక్తుల చరిత్రలు, సమాజం, పర్యావరణాల వర్ణనల ద్వారా నిరూపించే ప్రయత్నం చేశాము. హరప్పా క్షేత్రంలో మూడవ వంతు లేని మెసొపొటేమియాలో భిన్న భాషాకుటుంబాల ప్రజలు సహజీవనం చేసినట్లే, హరప్పా నాగరికతను కూడా భిన్న భాషల భాగస్వామ్యంగా ఊహించడం కష్టమేమీ కాదు. భారతదేశంలోని భిన్న భాషల, మతాల, జాతి వారసత్వాల్లో కనిపించే భారతీయత, సాంస్కృతిక ఐక్యతల బీజం హరప్పానాటికే స్థిరంగా నాటబడిందని మాత్రం ఊహించవచ్చు. హరప్పా ముద్రల్లోని లిపిని చదవగలిగితేగాని అమీతుమీ తేలదు. అంతవరకూ పురాణాల్లోని చారిత్రకతే మనకి ఆధారం.

క్రీ.పూ. 1400 ప్రాంతంలో మహాభారత యుద్ధానంతరం, వేదవ్యాసుడు క్షత్రియ చారిత్రక సంప్రదాయాన్ని, సూతుల నుండి గ్రహించి, ఆదిపురాణమనే పేరున సంకలనం చేశాడని చెప్పుకున్నాము. అయితే, వెంటనే వచ్చిన కలియుగమనే చీకటియుగంలో నాగరికత నశించడంతో, రాజాశ్రయం లేక మరుగునపడిన ఇతిహాస పురాణ సంప్రదాయం, గంగామైదానంలో క్రీ.పూ. 1000 తరువాత బ్రాహ్మణ సంప్రదాయంగా పునరుజ్జీవితమయింది (మిసిమి – ఫిబ్రవరి 2015). అంటే తుది హరప్పా యుగం వెంటనే భారత ఖండాంతర భూమిలో వచ్చిన సామాజిక, రాజకీయ, భాషా పరిణామాలను, వలసలను పురాణ వంశావళుల నేపథ్యంలో

వివరించడం సాధ్యపడదు. బ్రాహ్మణ వాఙ్మయంలోని భావజాలంలో వచ్చిన మార్పులూ, వాటి సామాజిక నేపథ్యం, పురాతత్వ ఆధారాలూ కొంతవరకూ సహకరిస్తాయి. గత కొద్ది సంవత్సరాల్లో పర్యావరణ శాస్త్రంలో, జన్యుశాస్త్రంలో వెలుగుచూసిన అంశాలు భిన్న భాషల, కులాల, ప్రాంతాల ప్రజల వారసత్వాన్ని కొంతవరకూ సూచించినా, ఈ దిశలో ఆధునిక పద్ధతుల్లో మరిన్ని పరిశోధనల అవసరం ఉంది.

**ఇనుప యుగం :**

మహాభారత యుద్ధ కాలానికి చెందిన వేదవ్యాసుడు ఆనాటికే ప్రచారంలో ఉన్న ధార్మిక వారసత్వాన్ని స్థిరపరిచాడు. వీటిలో ప్రాచీన స్తరాలకు చెందిన మూలజ్ఞానాన్ని ఋగ్వేద సంహితగా పది మండలాల్లోకి విభజించి, ఆ ఋక్కుల ఉచ్చారణకు, ఆచరణకు సంబంధించిన సంప్రదాయాన్ని మరో రెండు సంహితలుగా చేర్చాడు. అవే మూడు వేదాలయ్యాయి. ప్రముఖ ఇండాలజిస్ట్, మైకెల్ విట్జెల్ అభిప్రాయంలో ఋగ్వేద రచనాకాలం క్రీ.పూ. 1700–1300 మధ్య జరిగింది. చారిత్రక భాషాశాస్త్రం కూడా ఈ తేదీలనే బలపరుస్తుంది. అంటే, మహాభారత యుద్ధానంతరం (క్రీ.పూ. 1400 ప్రాంతంలో) వేదవ్యాసుడు మూడు వేదాలనూ స్థిరపరిచినట్లు చెప్పిన పురాణ ఐతిహ్యం వాస్తవంగా భావించవచ్చు. పురాణాలు చెప్పిన చరిత్ర భాషా పరిణామశాస్త్రం సూచించిన తేదీలను వ్యతిరేకించదు. ఈ సంహితల అనుబంధాలుగా బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు వివిధ ఉపనిషత్తులు, సూత్రాలు కాలగతిలో చేరాయి. నైమిషారణ్యం ఈ పరిణామాలకు నేపథ్యంగా చెప్పబడింది. ఇది శివాలిక్ పర్వతాలకూ, కురుక్షేత్ర ప్రాంతానికి తూర్పుగా గంగా యమునల మధ్య విస్తరించిన అడవి. అటు పురాణ వాఙ్మయాన్ని, ఇటు వైదిక సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వచ్చిన వివిధ పరంపరల ఋషులు ఈ అడవిలోనే ఆశ్రమాలు స్థాపించుకొని జీవించారు. పురాణ వృత్తాంతాలనుబట్టి వారికి పశుసంపద, ఆహారసేకరణ ముఖ్య జీవనాధారంగా కనిపిస్తుంది. ఉత్తర భారతదేశంలో ఇండోఆర్యన్ భాషల విస్తరణకి ఈ ప్రాంతమే కేంద్రంగా కనిపిస్తుంది. సెమెట్రీ H సంస్కృతి పతనానంతరం అడపాతడపా కనిపించే రంగు పులిమిన బూడిదరంగు పాత్రల సంస్కృతి (Painted Gray Ware - PGW) క్రీ.పూ. 1200 నాటినుంచీ ఆ ప్రాంతం కేంద్రంగా విస్తరించసాగింది. అయితే ఈ విస్తరణ క్రమం ఇనుము వాడకం ప్రాముఖ్యంలోకి వచ్చేవరకూ ఊపందుకోలేదు. ఆరావళీ ప్రాంతంలో ఆహార్ సంస్కృతి నేపథ్యంలో క్రీ.పూ. 2000 నాటికే పొడచూపిన ఇనుము పరిజ్ఞానం జనసామాన్యంలోకి విస్తరించలేదు. తుది హరప్పా యుగంలో గుజరాత్, మాల్వా ప్రాంతాల్లో కనిపించే నీలలోహిత సంస్కృతి (Black & Red Ware - BRW) ముందుగా వింధ్యశ్రేణికి ఉత్తరంగా సాగి, ఎగువ గంగా మైదానంలోకి ఇనుము వాడకం పరిచయం చేసింది. అడవులు నరకడం, సాగుభూమి విస్తరణ ప్రక్రియ ఊపందుకుంది. వరి, చిరుధాన్యాల సేద్యం, పశుపాలన జీవనాధారంగా కొత్త గ్రామీణ ఆవాసాలు పుట్టాయి. వీటిలో పోడు వ్యవసాయం, వేట, ఆహార సేకరణలపై ఆధారపడ్డ స్థానిక జనజాతులు కూడా భాగస్వాములయ్యారు. అయితే పశుపాలన, వ్యవసాయంలో పరిజ్ఞానం, ఇనుము వాడకంవల్ల తుదిహరప్పా వసలదారులకు ఆ వ్యవస్థలో ఆధిపత్యం సంక్రమించింది. ఆ నాయకవర్గాలు క్రీ.పూ. 1000 నాటికి భవిష్య పురాణంలోని కలియుగ వంశావళుల మొట్టమొదటి రాచరికాలు ఎదిగారు. అంతవరకూ అరణ్యాల్లో ఆశ్రమవాసులైన వైదిక, పౌరాణిక సంప్రదాయాలను కాపాడుకున్న బ్రాహ్మణ వర్గాలకు రాజాశ్రయం దొరికింది. కొత్త రాచరికాలకు పౌరాణిక సూర్యచంద్ర వంశాల వారసత్వం కల్పించి, వారికి రాజ్యార్హత, క్షత్రియ హోదా హంగులు సమకూర్చారు. పట్టణాలూ నగరాలు పుట్టాయి. వాటికి చరిత్ర జ్ఞాపకాల్లో ప్రాముఖ్యం ఉన్న పాత పేర్లే ఖరారయ్యాయి. క్రీ.పూ. 600 నాటికి ఈ జనపదాలనన్నింటినీ వైదిక సంస్కృతిలో ముడివేదయంలో సఫలమయ్యారు. వారి భాషలు ప్రాముఖ్యం సంపాదించాయి. నాగరికత మరలా ఊపందుకుంది.

**యాదవులు :**

తుదిహరప్పా నాగరికత విస్తరించిన మరో ముఖ్యప్రాంతం గుజరాత్. ఆ నేపథ్యంలో సింధ్, గుజరాత్ మాల్వా ప్రాంతాల్లో కనిపించే రంగ్‌పూర్ సంస్కృతిని ద్వాపర యుగానికి చెందిన యాదవుల నేపథ్యంగా ఊహించటం జరిగింది. క్రీ.పూ. 2500 నాటికే దక్కన్ పీఠభూమిలోని కొత్త రాతియుగపు పశుపాలకులు (బూడిదకుప్ప సంస్కృతులు) హరప్పా నాగరికతా క్షేత్రంలో వాణిజ్య సంబంధాలు నెరపారు. తుదిహరప్పా అనంతరం వలసలకు ఈ స్థావరాలే కేంద్రాలయ్యాయి. ఇతిహాసపురాణ సంప్రదాయంలోని యాదవ సంస్కృతిలో అసుర వ్యవస్థ ప్రభావం ఎక్కువగా




**ముఖ్య భాషా కుటుంబాలు – విస్తరణ**
(క్రీపూ. 1400 – 500)

కనిపిస్తుంది. మధు, అంధకుడు, కంసుడు మొదలైన యాదవ రాజులను అసురులుగా వర్ణించడంలో వారిపై పశ్చిమాసియాకి చెందిన ఈలమో – ద్రవిడియన్ భాషా వారసత్వాన్ని చూడవచ్చు. మహాభారతంలో ద్వారకవాసులు వృష్ణి, అంధక, భోజ జనజాతులుగా చెప్పబడ్డారు. వీరు ద్వారక ముంపు తరువాత వివిధ దిశల్లో వలసపోయారు. హస్తినాపురాన్ని పెళ్ళగించిన బలరాముడు, పాండవుల అనంతరం కురుక్షేత్రంపై సాంబుడి ఆధిపత్యంవంటి వృత్తాంతాలు, వృష్ణి వంశపు వలసలను గంగా మైదానానికి చూపుతాయి. అంతేగాక కలియుగ క్షత్రియ వంశాలను ఛేదీయులుగా సూచించడం, తొలి మగధ వంశాల్లో అసుర వారసత్వం, వింధ్యా పాదపీఠంలో పొడచూపిన బృహచ్ఛిలా స్మశానాలు; గంగామైదానపు రాచరికాల్లో కూడా కొంత యాదవ సంస్కృతుల మూలాలను సూచిస్తాయి. ఇక చారిత్రక యుగంలోని ఆధారాలనుబట్టి, భోజులు మాల్వా, విదర్భ ప్రాంతాలకు, అంధకుల వలసలు దక్షిణ దిశగానూ సాగాయని చెప్పవచ్చు. అయితే, గంగామైదానంలో విస్తరించినంత వేగంగా వ్యవసాయం, నగర నిర్మాణం దక్షిణదేశంలో సాగలేదు. ఈ మధ్యకాలంలో సాగుతున్న జన్యుశాస్త్ర పరిశోధనలు, దక్షిణ దేశంలోని కులసమూహాల్లో, జనజాతుల్లో హరప్పా మూలం నుండి జన్యురూపకాల, శాఖీయ క్రోమోజోమ్ వైవిధ్యాల విస్తరణలో జాప్యం, ఉత్తర దక్షిణ దేశాల ప్రజల రంగురూపుల్లోని భేదాలకు ముఖ్య కారణంగా సూచించాయి. చారిత్రక యుగంలో భారతదేశంలో ప్రవేశించిన యవన, శక, పాహ్లవ, హూణ జాతులు, దక్షిణదేశంలో పశ్చిమాసియా ప్రాంతాల నుండి వచ్చిన వాణిజ్య సమూహాలు, తూర్పు ఆసియా నుండి జనజాతుల వలసలు; ఈ తేడాలకు మరికొన్ని కారణాలుగా ఊహించారు. వివిధ ప్రాంతాల, కులాల, జనజాతుల వారసత్వాల నిర్ధారణకు ఈ దిశలో మరిన్ని పరిశోధనల అవసరం ఉంది. ఉత్తర దక్షిణ దేశాల మధ్య భాషా వైవిధ్యపు మూలాలు ఈ పరిణామంలో చూడవచ్చు.

**భాషామూలాలు :**

ఇంతవరకూ పురాణాల ఆధారంగా హరప్పా సంస్కృతిలో వాడుకలో ఉన్న భాషాకుటుంబాల నేపథ్యంపై కొన్ని సూచనలు ప్రస్తావనలూ చేయడం జరిగింది. హరప్పా తొలితరాల్లోని హక్రా సంస్కృతిని సంస్కృత ప్రాకృతాలకు మూలమైన ఇండోఆర్యన్ భాషాకుటుంబానికి చెందినవిగా; స్థానిక గ్రామీణుల, తెగల భాషలు మూలవాసులవిగా; ద్రవిడ భాషలు పశ్చిమాసియా నుండి సింధ్, గుజరాత్, తీరానికి వలస వచ్చిన అసురులు, వారి ఆశ్రిత వర్గాలకు చెందిన ప్రోటో ఈలమైట్ కుటుంబానివిగా ఊహించాము. ఆర్యభాషలు స్థానిక వ్యవసాయిక సమాజంలోని ఆధిపత్య వర్గాలకు చెందడం వల్లనూ, వాణిజ్యంలో అసురుల ప్రాభవం వల్లనూ వలస పోగా మిగిలిన మూలవాసులు క్రమేణా వారి భాషలను స్వీకరించి ఉండవచ్చు. నేటికీ భారత ఖండాంతర్భూమి అంతటా వ్యవసాయం, పట్టణీకరణ విస్తరించిన

ప్రాంతాలన్నింటిలోనూ ప్రముఖంగా కనిపించే ఆర్య, ద్రవిడ భాషల మూలస్థానం హరప్పా నాగరికతా క్షేత్రమే. గంగామైదానంలోకి, దక్కన్ పీఠభూముల్లోకి విస్తరించిన పురాతత్వ సంస్కృతుల్లో వైవిధ్యం కనిపిస్తుంది. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయానికి చెందిన ద్రవిడ భాషాశాస్త్రవేత్త సౌత్‌వర్త్ ద్రవిడ మూలాలు ఈలం మెసొపొటేమియాల నుంచి క్రీ.పూ. 3000 ప్రాంతంలో సింధ్, గుజరాత్ ప్రాంతాలకు చేరాయని డేవిడ్ మ్యాక్‌ఆల్పిన్ చేసిన సూచనని సమర్థించాడు. ఇది మన పురాణ కాలమానంలోని అగ్రీ సంస్కృతిలో అసురుల రాకకు ఊహించిన తేదీతో సరిపోతుంది. (మిసిమి – ఆగస్ట్ 2015) ఆ సంస్కృతికి చెందిన 'అసురి' భాషనే ప్రాగ్‌పురా ద్రవిడ భాషగా (Pre Proto Dravidian) భావించవచ్చు. అంతేగాక క్రీ.పూ. 2500 ప్రాంతంలో ఎగువ కృష్ణాలోయలో కనిపించే పశుపాలక సమాజాల భాషల్లో కొంత ద్రవిడ సంపర్కం ప్రతిపాదించాడు. దక్కన్‌లో వెలుగుచూసిన కొత్త రాతియుగపు బూడిదకుప్ప సమాజాలతో హరప్పావాసుల వాణిజ్య సంబంధాలకు ఆధారాలు ఉన్నాయి. (ప్రొ. పద్దయ్య తదితరులు) అప్పటికే ఈ నవీన శిలాయుగ స్థావరాలలో తక్కువస్థాయి బృహచ్ఛిలా సంస్కృతి కనిపిస్తుంది. అంటే క్రీ.పూ. 2500 నాటికే ద్రవిడ భాషల బీజం దక్షిణ భారతదేశంలో పడి వుండాలి. మొట్టమొదటిగా క్రీ.పూ. 1500 ప్రాంతంలో దక్కన్ పీఠభూమిలో పెద్దయెత్తున నిలిపిన బృహచ్ఛిలా సమాధులు కనిపిస్తాయి. ఇవి దక్షిణదిశగా చొచ్చుకొచ్చిన నూతన ఆధిపత్యవర్గాన్ని సూచిస్తాయి. జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాల పరిచయం, మెట్టసేద్యం మొదలయింది. సౌత్‌వర్త్ ఈ సంస్కృతులను పురాద్రవిడ భాషాస్తరంగా ఊహించాడు. ప్రముఖ ద్రవిడ భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి కూడా పురాద్రవిడం (Proto Dravidian) తొలి స్తరానికి అదే తేదీ ధృవీకరించారు. వ్యవసాయ విస్తరణలో ఈ బృహచ్ఛిలా స్థావరాలే తొలి చారిత్ర యుగానికి పట్టణాలుగా వృద్ధిచెందాయి. తుదిహరప్పా యుగానాంతరం గుజరాత్ నుండి తూర్పు దక్షిణ దిశలుగా విస్తరించిన సంస్కృతుల నాయక వర్గాల్లో ద్రవిడ భాషల మూలాలను చూడవచ్చు. సింధీ, గుజరాతీ, మరాఠీ భాషల్లో కనిపించే ద్రవిడ భాషాస్తరం ఈ పరిణామాన్ని నిరూపిస్తుంది.

**అంధక – ఆంధ్ర :**

మహాభారత యుద్ధానంతరం దక్షిణ ప్రాంతానికి సాగిన యాదవుల్లోని ముఖ్య శాఖని అంధకులు అని పిలిచారు.



పశ్చిమాసియా మూలాలనుండి ద్రవిడ భాషలను, అసుర సంస్కృతిని దక్షిణ భారతదేశంలో విస్తరింపజేసినవారు ఈ అంధకులే. క్రీ.పూ. 15వ శతాబ్దిలో ఎగువ దక్కన్ ప్రాంతంలోకి విస్తరించిన బృహచ్ఛిలా స్థావరాల ఆధిపత్య వర్గాల భాష వీరిదే కావచ్చు. క్రీ.పూ. 1వ సహస్రాబ్దికి చెందిన సంస్కృత వాఙ్మయంలో ఈ దక్షిణదేశ మూలభాషని అంధక భాష లేక ఆంధ్రి అని సంబోధించారు. బుద్ధఘోషుడు తన బుద్ధచరిత్ర పీఠికలో బుద్ధుని ప్రవచనాలను, అంధక భిక్షువులే పిటకాలుగా సంకలనం చేశారని పిదప అవి పాళీ భాషకి తర్జుమా చేయబడ్డవని సెలవిచ్చాడు. అంటే అంధకులలో క్రీ.పూ. 6వ శతాబ్దికే 'రాత, లిపి' ప్రచారంలో ఉండివుండాలి. ముఖ్యద్రవిడ భాషలేగాక మధ్యదేశంలోని ద్రవిడం మాట్లాడే తెగల భాషలన్నింటిలో కూడా 'వర్' శబ్దం 'వ్రాత'ని సూచిస్తుంది. అందువల్ల ఈ పదం మూలద్రవిడపు తొలిస్తరాల్లో, ఈ భాషాసంస్కృతులు విడివడకముందే వాడుకలో ఉండి వుండాలి. ఇది ద్రవిడమూలాలను హరప్పా నాగరికతా క్షేత్రంలో సూచించడమేగాక, అంధకులు హరప్పా లిపికి, రాయస వృత్తికి కూడా వారసులని తెలుపుతుంది. తమిళ వాఙ్మయానికి 5 శతాబ్దాల పూర్వమే భట్టిప్రోలులో వెలుగుచూసిన బ్రాహ్మిలిపిలో తెలుగు తలకట్టు దక్కన్‌లో ప్రాంతీయ ప్రత్యేకత కలిగిన అక్షరాస్యుల ఉనికిని సూచిస్తుంది. భరతుని నాట్యశాస్త్రం వింధ్యకి దక్షిణాన విస్తరించిన అంధక భాషని 'ఆంధ్రి' అని పిలిచింది. అయితే ఈ రెండు పేర్లూ సంస్కృత తత్సమాలే. దక్షిణాది భాషకి సమానార్థకం 'తెన్‌గ'. భద్రిరాజు కృష్ణమూర్తి ప్రభృతులు వెలుగులోకి తెచ్చిన 'దక్షిణ ద్రవిడ' భాష, ద్రవిడ కుటుంబంలోని తెలుగు, తమిళ స్రవంతులు వేరుపడక ముందు స్తరానికి చెందినది. ఈ వేర్పాటుకి ఆయన సూచించిన తేదీ క్రీ.పూ. 9–8వ శతాబ్ది. అప్పటికే ఆ భాష పేరు తెన్గ లేక తెన్గు అయి ఉండవచ్చు. అదే పేరు నేటి తెలుగు, తెనుగు పదాలలో మిగిలివుంది. అలాగే కళింగ, వంగ భాషలు తూర్పు ఉత్తర దిశల్లో (కిళక్కు, వడక్కు) విస్తరించిన ద్రవిడ భాషాశాఖలుగా ఊహించవచ్చు. ఇండోఆర్యన్ కుటుంబానికి చెందిన ఒరియా, బెంగాలి భాషల కింది స్తరంలో స్పష్టమైన ద్రవిడ మూలాలు దీనికి నిదర్శనంగా చూపవచ్చు.

| దక్షిణ-ద్రవిడ భాషలు<br>చారిత్రక పరిణామం | | | |
|---|---|---|---|
| క్రీపూ. | భాషాస్తరం | సాంస్కృతిక భౌగోళిక నేపధ్యం | వాఙ్మయంలో సూచించిన పేర్లు |
| 3100-2600 | ఈలమో ద్రవిడియస్ | ఈలం, అమ్రీ సంస్కృతి | అసురి |
| 2600-2000 | ప్రాగ్‌పురాద్రవిడం | హరప్పా నాగరికతలో అమ్రీ స్తరం | అసురి |
| 1900-1500 | పురాద్రవిడం | రంగ్పూర్ సంస్కృతి | యాదవ |
| 1400-900 | దక్షిణ ద్రవిడం | ఎగువ గోదావరి, కృష్ణా బృహచ్ఛిలా సంస్కృతి | అంధక |
| 800-500 | మూల తెలుగు గోండి | ఎగువ దక్కన్ | ఆంధ్రి - తెన్‌గ, తెన్గు |
| | మూల కన్నడ-తమిళం | ఎగువ కృష్ణా-పెన్నా | - |
| 500-300 | తెలుగు గోండి | ఎగువ గోదావరి-కృష్ణా | ఆంధ్రం-తెనుగు |
| | ప్రాగ్‌కన్నడ | ఎగువ కృష్ణా-పెన్నా | కరునాటి-కన్నడ |
| | ప్రాగ్ తమిళం | ఎగువ పెన్నా-కావేరి | తిరునాటి-తమిళం |
| 200 | కన్నడ | ఎగువ కృష్ణా-పెన్నా | కర్నాట |
| | తమిళం | ఎగువ కావేరి-పైగై | తమిళం |

సంగం వాఙ్మయంలోని వ్యాకరణ గ్రంథం తోల్‌కప్పియంలో వడుగనాటికి చెందిన ఐదుగురు వీరులు (ఐంబేర్ వేలార్) ద్వారక (తువరకై) నుండి దక్షిణదేశానికి వలస వచ్చిన వృత్తాంతం కనిపిస్తుంది. ఇది యాదవశాఖ వలసలను సూచిస్తుంది. అయితే, నేడు లభ్యమవుతున్న తమిళ సాహిత్యం మూడవ సంఘానికి అంటే క్రీ.శ. 2వ శతాబ్దికి చెందుతుంది. ద్రవిడ భాషల విస్తరణ క్రమంలో మొదటి రెండు సంగాల నేపథ్యాన్ని సౌత్‌వర్త్ ప్రభృతులు సూచించిన కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎల్లల్లో, గోదావరీ కృష్ణా ఎగువ లోయలోని దక్కన్ బృహచ్ఛిలా సంస్కృతుల్లో చూడవచ్చు. క్రీ.పూ. 5వ శతాబ్దిలో ఈ దక్షిణ ద్రవిడ భాష నుంచి ప్రాగ్ కన్నడ, ప్రాగ్ తమిళ భాషలు వేర్పడ్డాయి. ఈ పరిణామానికి సౌత్‌వర్త్ సూచించిన ప్రాంతంలోనే కొంత దక్షిణంగా దక్షిణ మైసూరు, గుత్తి,

కొంగునాడు ప్రాంతాల్లో పెన్నా, కావేరి మధ్యప్రాంతపు నేపథ్యం ఊహించవచ్చు. ఈ మూలతమిళం నుంచి కొడవ, నీలగిరి (తొడ, కోట) భాషలు క్రీ.పూ. 3వ శతాబ్దిలో విడివడి, తమిళ భాష మూలాలు ఏర్పడ్డాయి. అంటే లభ్యమవుతున్న ఆధారాలనుబట్టి సంగం సాహిత్యంలోని తమిళభాష క్రీస్తు శకానికి ముందు పుట్టలేదు. ప్రాచీన ద్రవిడ భాషావృక్షానికి తమిళం చిటారుకొమ్మే కానీ మూలం కాదు. కనుక సంగం వాఙ్మయంలోని మొదటి రెండు స్తరాలకు వరుసగా 'దక్షిణ ద్రవిడ (అంధక లేక తెన్‌గ)', 'మూల కన్నడ – తమిళ' భాషల నేపథ్యాన్ని ఊహించవచ్చు.

అయితే కాల్డ్‌వెల్ దక్షిణ భారత భాషాకుటుంబానికి 'ద్రవిడం' అని నామకరణం చేశాడు. క్రీ.శ. 7వ శతాబ్దిలో సంస్కృత వాఙ్మయంలో మొట్టమొదట కనిపించే ఈ 'ద్రావిడ' పదం తమిళులకు పర్యాయపదంగా వాడబడింది. ఇది ద్రవిడ భాషలకు తమిళమే మూలమనే ప్రాంతీయతా వాదుల ప్రచారానికి, సామాన్య పాఠకుల్లో అదే నిజమనే దురవగాహనకీ దారితీస్తుంది. క్రీ.పూ. 500 నాటికే సమకాలీన సంస్కృత, ప్రాకృత భాషల్లో దక్షిణాది భాషకు అంధక లేక ఆంధ్రి అనే పేరు ప్రచారంలో ఉంది. అంటే ఈ భాషా కుటుంబం పూర్తిగా వేర్పడక పూర్వమే వాడుకలో ఉన్న 'ఆంధ్రి' అనే పేరుతో దక్షిణదేశపు భాషలను పిలవడం ఎంతైనా సముచితం. అయితే నేడు ద్రవిడ పదం ప్రపంచవ్యాప్తంగా వాడబడుతున్నందువల్ల మార్పు సాధ్యంకాదు. కనుక ఈ నామవాచకం భాషా కుటుంబానికి వర్తిస్తుంది కానీ ఏ ఒక్క భాషకీ కాదు అని మనం అర్థం చేసుకుంటే చాలు.

## ముగింపు :

ఇండోఆర్యన్ – ద్రవిడ భాషాకుటుంబాల మధ్య సంబంధాలు ఈనాటివి కాదు. ఋగ్వేదకాలం నుంచీ సంస్కృతంలో ద్రవిడ పదాలు కనిపిస్తాయి. భాషాశాస్త్రజ్ఞుడు స్యోబర్గ్ (Sjoberg 1992) ఆధునిక ద్రవిడ భాషల్లో ఇండోఆర్యన్ (lexical items) పదజాలం యొక్క జొరబాటుకంటే, ఆధునిక ఆర్య భాషలపై ద్రవిడ వ్యాకరణ సూత్రాల (syntax) ప్రభావం ఎక్కువని సూచించాడు. ఇది సంస్కృతం మొదలుగా నేటి ఆర్యభాషలన్నింటి కింది స్తరాల్లో ద్రవిడ భాషల వాడుకని సూచిస్తుంది. సింధీ, గుజరాతీ, మరాఠీ, ఒరియా, బెంగాలీ భాషల్లో కనిపించే ద్రవిడ స్తరం, ఆ రాష్ట్రాల్లోని కొండప్రాంతాల్లో నివసించే తెగల్లో నేటికీ బతికివున్న ద్రవిడభాషలు, ఒకప్పటి ద్రవిడ భాషల భౌగోళిక విస్తృతిని ఈ ప్రాంతమంతా చూపుతాయి. అయితే నేటి ముఖ్య ద్రవిడ భాషలు దక్షిణ దేశానికే పరిమితమై ఉన్నాయి. సాంకేతికపరంగా ఎగువ గంగానది కేంద్రంగా విస్తరించిన సంస్కృతుల్లో వచ్చిన ప్రగతి దక్షిణదిశగా కనిపించదు. క్రీ.పూ. 800 నాటికి ఉత్తర భారతదేశమంతా స్థానిక ఇండోఆర్యన్ సంస్కృతులు మొగ్గతొడిగాయి. ప్రాంతీయ ప్రత్యేకతలతో అనేక వాడుక భాషలు పుట్టాయి. తుది హరప్పా నాగరికత తరువాత పౌరాణిక సంప్రదాయాలను కాపుగాసిన ఋషి పరంపరలు ఈ శైశవ నాగరికతకి సాంస్కృతిక నాయకత్వం వహించారు. వారి భాష వీటన్నింటినీ ఒక తాటన కట్టింది. రాచరికాలు విస్తరించాయి. పరిధుల్లోని జనపదాలు క్రమంగా ఆ నాగరికతకి చెందిన సాంకేతిక, సాంస్కృతిక పదజాలాన్ని, ఆచార వ్యవహారాలనూ స్వీకరించారు.

అయితే ఉత్తర భారతదేశమంతటా ఈ పౌరాణిక సంప్రదాయాన్ని ఒకేవిధంగా స్వీకరించారని చెప్పలేము. పెరుగుతున్న రాచరికాలు తమతమ వంశాల ప్రతిష్ఠని ఇనుమడింపజేసిన బ్రాహ్మణిక వ్యవస్థకి కొంత గొడుగు పట్టక తప్పలేదు. అయితే చిన్నచిన్న జనపదాల్లోనూ, నగరాల్లోని వాణిజ్య వర్గాల్లోనూ వ్యతిరేకత కనిపిస్తుంది. ప్రపంచ నాగరికతలన్నింటిలో క్రీ.పూ. 6–4 శతాబ్దులను మతతత్వ సిద్ధాంతాల వ్యాప్తికి ఇరుసు యుగం (ఆక్సియల్ ఏజ్) అన్నారు. గ్రీక్ తత్వవేత్తల తార్కిక సిద్ధాంతాలు, చైనాలో డావోయిజమ్, కన్ఫ్యూజియనిజమ్; ఇండియాలో ఉపనిషత్తులు, జైన, బౌద్ధ, అజివికాది కొత్త ఆలోచనా పరంపరలు ఈ యుగంలోనే పురుడు పోసుకున్నాయి. ఇండియాలో వాణిజ్య విస్తరణతోబాటూ ఈ నూతన మతస్రవంతుల వ్యాప్తి వివిధ ప్రాకృతాల మాధ్యమంలో సాగింది. ఇండోఆర్యన్ భాషల విస్తరణలో మొదటి అడుగు ప్రాకృతాలదేగాని సంస్కృతానిది కాదు. స్థానికంగా పుట్టిన మౌర్య, శాతవాహన సామ్రాజ్యాల్లో కూడా ప్రాకృతమే మాధ్యమంగా కనిపిస్తుంది. అయితే, క్రీస్తు శకారంభానికి వాయవ్య భారతదేశంలో చొచ్చుకొచ్చిన యవన, శక, పార్థివ రాచరికాల్లో మొట్టమొదటగా సంస్కృతం రాజభాషగా కనిపిస్తుంది. అదే నేపథ్యంలో భాగవత సంప్రదాయం ఊపిరిపోసుకుంది. సంస్కృత మాధ్యమంలో

శిష్టవాఙ్మయం ఈ నూతన స్రవంతికి ఆధారమైంది. గుప్తయుగంలో, రోమ్ సామ్రాజ్య పతనంతో వాణిజ్యం కుంటుపడింది. కొత్తగా పుట్టిన ప్రాంతీయ రాచరికాల పారంపరిక అస్థిత్వాన్ని స్థిరపరిచేందుకు బ్రాహ్మణిక సంప్రదాయం యొక్క ఆవశ్యకత పెరగడంతో ద్రవిడ, ప్రాకృతాలు కూడా క్రమంగా సంస్కృతీకరించబడ్డాయి.

అయితే ఈ పరిణామాలన్నింటిలోనూ, భిన్న మత స్రవంతుల్లోనూ పౌరాణిక సంప్రదాయక స్రవంతి అవిచ్ఛిన్నంగా సాగింది. భారతీయుల తొలి నాగరికతలోని వాస్తవ చారిత్రక వారసత్వం అటు సాహిత్యానికి లలితకళలకు, సామాజిక వ్యవహారాలకు, ఇటు వివిధ మతాలకూ, నమ్మకాలకూ, సంప్రదాయాలకూ పునాది అయ్యింది.



సాయి పాపినేని
బెంగుళూరు.
ఫోన్ : 0 984 503 4442

(ఇంతటితో 'పురాణాలలో చరిత్ర' పరంపర ముగుస్తుంది.)

## తుదిపలుకు

భారతీయ పురాచరిత్ర కాలమానంపై నేడు నడుస్తున్న వివాదాలకూ, విభేదాలకూ కొన్ని మౌలికమైన కారణాలున్నాయి. చారిత్రక భాషాశాస్త్రం సూచించిన తేదీల ఆధారంగా సాంప్రదాయక చరిత్రకి ప్రతిపాదించిన తేదీలలో తొలి భారతీయ నాగరికతను ఏ మాత్రమూ వివరించలేము. వాఙ్మయంలోని అద్భుత వర్ణనలు, జ్యోతిష ఖగోళ వృత్తాంతాల ఆధారంగా చేస్తున్న ప్రతిపాదనలు వైజ్ఞానికంగా చేసే విశ్లేషణలకు నిలవవు.

అంతేగాక తొలి చరిత్రకారులు చారిత్రక వ్యవస్థలకూ, భాషాసమూహాలకూ పెట్టిన పేర్లు, రాజకీయ ప్రాంతీయ మతసిద్ధాంతాలుగా ఘనీభవించి, నేటి చరిత్రకారుల పరిశోధనల్లో సమదృష్టికి అడ్డంకిగా నిలిచాయి. సంస్కృత తమిళ భాషల కోణాల్లో హరప్పా లిపిపై చేస్తున్న పరిశోధనలు సరియైన ప్రతిఫలాన్నివ్వలేదు. నేడు లభ్యమౌతున్న పౌరాణిక వాఙ్మయంలోని ప్రక్షిప్తాలవల్ల వాటిలోని వ్యక్తుల, సంఘటనలపై నిర్దిష్టమైన నిర్ణయాలకు తావులేదు.

అయితే ఈ చారిత్రక సంప్రదాయంలో వాస్తవికతను తృణీకరించడంవల్ల మన పురాచరిత్ర అవగాహనకు మనకున్న అతి ముఖ్యమైన ఆధారాలను నిర్లక్ష్యం చేసుకుంటున్నాం. నేటికి వందేళ్ళ క్రితం పర్జిటర్ పౌరాణిక వంశానిక్రమణికలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిలోని చారిత్రకతని వెలికితీసే ప్రయత్నం చేశాడు. అయితే అతడికి స్ఫురించిన తేదీలను ఆనాటి చరిత్రకారుల్లో అధిక సంఖ్యాకులు ఆమోదించిన ఆర్యుల వలస కాలమానంతో ముడిపెట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ తరువాతి చరిత్రకారులు ఆ దిశలో మరిన్ని లోతైన ప్రయత్నాలు చేయలేదు. సాంప్రదాయకంగానూ శాసనాల్లోనూ కలియుగారంభానికి సూచించబడ్డ తేదీ కూడా వెలుగు చూసిన ఆధారాలతో సరితూగలేదు. అది సంప్రదాయక చరిత్రలోని వాస్తవికతను నిరాకరించేందుకు మరో ముఖ్య కారణమైంది. పర్జిటర్ క్రోడీకరించిన వివిధ వంశవృక్షాల పట్టికలకు కాలక్రమం నిర్ణయించడంలో మేము కొన్ని మౌలికమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

1. ద్వారక ముంపుపై వెలుగు చూసిన ఆధారాలతో కొన్ని పౌరాణిక ప్రస్తావనలను జోడించి మహాభారత యుద్ధకాలం క్రీ.పూ. 1460 ప్రాంతంలో సూచించాము. 2. చారిత్రక రాచరికాలపై ఏ ఎల్ భాషం తదితరుల పరిశోధనలను అనుసరించి వంశావళుల్లోని రాజుల సగటు రాజ్యకాలాన్ని 18 యేళ్ళుగా ప్రతిపాదించాము. ఈ విధంగా నిర్మించిన వంశానుక్రమణికల తేదీలలో పురాతత్వ, పర్యావరణ, భౌగోళిక, పురాజన్యు, చారిత్రక భాషాశాస్త్రాల ఆధారాలను, సమకాలీన నాగరికతల్లో వెలుగుచూసిన కొన్ని అంశాలను, వంశావళుల్లోని వ్యక్తులకూ సంఘటనలకు చెందిన ఆఖ్యానాలతో, గాథలతో సరితూచటం జరిగింది. ప్రతి అంశంలోనూ మాకే ఆశ్చర్యం కలిగించేట్లుగా పురాణ వాఙ్మయంలోని చారిత్రకత కొట్టొచ్చినట్లు కనిపించసాగింది. భిన్న స్రవంతులు పరస్పర వ్యతిరేకంగా చూపిన ఆధారాల్లో సమన్వయం సాధ్యమని తోచింది. మన భారతీయ పురాచారిత్రక యుగంలోని వాస్తవికతను నిరూపించవచ్చనే ధైర్యంతో ఈ ప్రయత్నం చేశాం. కొంతవరకూ సఫలీకృతులమయ్యామనే భావిస్తున్నాం. చారిత్రకులు బిగ్రబిగుసుకున్న అభిప్రాయ స్రవంతులని పక్కనబెట్టి, పర్జిటార్ సూచించిన పథంలో నిర్దిష్టమైన పరిశోధనలకు నడుంకడితే హరప్పా నాగరికత నేపథ్యంపై మరింత అవగాహనకు అవకాశం ఉందని మాత్రం చెప్పవచ్చు.

## పల్నాటి వీరుడు

# కన్నెగంటి హనుమంతు

– వై. హెచ్.కె. మోహన్‌రావు

*కన్నెగంటి హనుమంతు / కదలి వచ్చే కదలి*
*పుల్లరెగ బెట్టించెరో / పలనాట ప్రాణాలు బలిపెట్టెరో*

చీకటిని చీల్చుకుని సూరీడు వచ్చినట్లుగా వైతాళికులు ప్రాపంచిక యవనికపై తమను తాము ఆవిష్కరించుకుంటారు. వ్యక్తిగత ప్రయోజనాలను ప్రక్కకునెట్టి సమిష్టి ప్రజాక్షేమాన్నే జీవిత లక్ష్యంగా ఎంచుకుంటారు. ప్రజోపయోగ ఆశయ సాకారానికై ఆస్థులను, జీవితాన్ని, ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించడానికి ఆనందంతో సిద్ధపడతారు. లక్ష్యసాధనా గమనంలో హరిహరాదులను సైతం ఎదుర్కొనే గుండె ధైర్యంతో ముందుకు సాగుతారు. దేహంలోకి తుపాకి తూటాలు దూసుకుపోతున్నా దేశంకోసం కొండంత గుండె నిబ్బరంతో మునుముందుకే నడుస్తారు. ఈ కోవకు చెందిన వాడే పల్నాటి పుల్లరి ఉద్యమ వీరుడు, భారత జాతీయోద్యమ పల్నాటి నాయకుడు, బ్రిటీషు ముష్కర మూకల తుపాకీ తూటాలకు అమరుడైన కన్నెగంటి హనుమంతు. భారతమాత స్వేచ్ఛకై ప్రాణాలొడ్డిన స్వాతంత్ర్య సమరయోధుడు.

భారతమాత దాస్య విముక్తికోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో తెలుగునేల సాక్షిగా చరిత్ర చెక్కిన మహోద్యమాలు రెండు. ఒకటి పల్నాటి ప్రాంతంలో బ్రిటీషుమూకలను గడగడలాడించిన పుల్లరి ఉద్యమం(అడవి పన్ను). బ్రిటీషు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చికాకు పరిచిన పుల్లరి పోరాటం యిది. ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పన్నులు, శిస్తుల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గ్రామాలలో పర్యటించిన పుల్లరి విప్లవం. రెండవది స్వపరిపాలన కోసం ఉరుకులెత్తిన మన్య విప్లవం. పల్నాటి ఉద్యమానికి కన్నెగంటి హనుమంతు నాయకత్వం వహించారు. గిరిజన మన్యవిప్లవానికి అల్లూరి సీతారామరాజు నేతృత్వం వహించారు. పల్నాటి పుల్లరి ఉద్యమాన్ని, మన్యవిప్లవాన్ని ఉక్కు పాదంతో అణిచి వేసింది కూడా బ్రిటీష్ అధికారి టి.జి. రూథర్‌ఫర్డ్. ఇరువురు కూడా తెల్లవారి తుపాకీ తూటాలకు బలియైన పోరాట యోధులే. గుంటూరు జిల్లా కలెక్టరుగా తెల్లదొర వెర్నన్, జిల్లా ఫారెస్టు అధికారిగా టి. క్లియర్ దొర వుండగానే, కేవలం బ్రిటీష్ ప్రభుత్వానికి ఛాలెంజిగా మారిన పల్నాటి పుల్లరి ఉద్యమాన్ని అణచి వేసేందుకే రూథర్‌ఫర్డ్‌ను ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం గుంటూరు జిల్లాకు పంపింది. పల్నాడులో పుల్లరి ఉద్యమాన్ని విజయవంతంగా అణచివేసిన అధికారిగానే అనంతరం మన్యవిప్లవం అణిచివేతకు గోదావరి జిల్లా కలెక్టరుగా నియమింపబడినాడు రూథర్‌ఫర్డ్.

మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా పరప్రభుత్వంపై కత్తులు నూరిందే పల్నాటి పుల్లరి ఉద్యమం. నిజానికి పుల్లరి ఉద్యమం గురించి సింహావలోకనం చేయడమంటే సమర యోధుడు కన్నెగంటి హనుమంతు పోరాటాన్ని చెప్పుకోవడవే అవుతుంది. సహాయ నిరాకరణోద్యమంలో చౌరీచౌరాలో పోలీసు ఠాణాకి నిప్పు పెట్టి 22 మంది పోలీసులను, ఒక ఎస్సైని దహనం చేయడానికి ముందే గుండ్లపాడు గ్రామరైతులు అటవీ ఉద్యోగులైన పది మందిని వెదురు బొంగులకు తలక్రిందులుగా వ్రేలాడదీసి మోసుకుపోయి అత్యంత లోతుగా ప్రవహించే కృష్ణానదీలో విసిరి హతమార్చారు. చేతులు వెనక్కి విరిచి కట్టివేయడం వలన ఈత వచ్చినవారు కూడా బతికి బట్టకట్టలేకపోయారు. గ్రామానికి చెందిన 90మంది రైతులను మూడు నెలలపాటు జిల్లా కేంద్రంలో నిర్భంధించి హింసించిన సంఘటన గురించి ఒక్కరూ నోరు విప్పలేదు. గ్రామం మొత్తాన్ని ఒక్క చోటకుచేర్చి విచారించినా ఏ ఒక్కరూ ఒప్పగించకపోవడం ఆనాటి పల్నాటి ప్రజల ఐక్యతను బ్రిటీష్ ప్రభుత్వంపై వారు పెంచుకున్న ద్వేషాన్ని వెల్లడించాయి.

అయితే కన్నెగంటి హనుమంతు మహాత్ముని అహింసా మార్గంలోనే ఉద్యమాన్ని నడిపారు. గుండ్లపాడు సంఘటన మాత్రం పుల్లరి ఉద్యమానికి మంచి ఊతమిచ్చింది. పుల్లరి ఉద్యమం మొత్తం హనుమంతు చుట్టూ పరిభ్రమించడం ఒక చారిత్రక వాస్తవం.

కన్నెగంటి హనుమంతు స్వగ్రామం మించాలపాడుకు ఒక ఉత్కృష్ట నేపథ్యముంది. తెలుగులో తొలి వీరగాథ అయిన పల్నాటి చరిత్రలో ప్రముఖ స్థానాన్ని పొదివి పట్టుకుంది. బ్రహ్మనాయుడి కుమారుడు బాలచంద్రుని భార్య మగువమాంచాల పేరిట ఏర్పడిన గ్రామం అది. మించాలపాడును బ్రిటీష్ ప్రభుత్వం ఆంగ్లంలో మాంచాలపాడుగానే ఉటంకించింది. గ్రామం స్థానభ్రంశం చెందినప్పటికీ అదే పేరుతో పునర్నిర్మాణమైంది. ఆనాటి పల్నాటి వీరుల పౌరుషమే కన్నెగంటిని కూడా మొక్కవోని పోరాటపథాన నడిపింది.

కన్నెగంటి వెంకటయ్య, చినఅచ్చమ్మల రెండవ సంతానముగా హనుమంతు జన్మించాడు. పల్నాటి చరిత్రకే మకుటాయమానంగా విరాజిల్లిన రాచమల్లు (అలరాజుకు బిరుదు) పేరిట ఏర్పడిన రచ్చుమళ్ళపాడు గ్రామం నుండి హనుమంతు కుటుంబం మించాలపాడు గ్రామానికి వలస వచ్చింది. మించాలపాడు ప్రస్తుతం గుంటూరు జిల్లా, దుర్గిమండలంలోనే ఉంది. హనుమంతు కుటుంబం 80 యకరాల వ్యవసాయ భూమి కలిగిన సంపన్న కుటుంబం. ఆయన విద్యాభ్యాసం రచ్చుమళ్ళపాడులోని బంధువుల ఇంట్లోవుంటూ సాగింది. బాల్యం నుండి చురుకుగా వుండే కన్నెగంటికి విలువిద్య, వడిశెల విసరడంలో మంచి ప్రావీణ్యత ఉండేది. అడవి జంతువుల వేటపై ఆసక్తి గలిగిన ఆయన రూ. 110/-లు ఖర్చుతో ఒక తుపాకీ చేయించాడు. 1902సం.లో రెంటచింతలను సందర్శించిన అమెరికన్ రోమన్‌కాథలిక్ బిషప్‌కు పులిచర్మం బహూకరించిననందుకు కృతజ్ఞతగా హనుమంతుకు ఆయన విదేశీ రైఫిల్‌ను కానుకగా ఇచ్చాడు. ఆరు అడుగుల రెండు అంగుళాల ఎత్తు ఉండి, కోర మీసం కలిగిన హనుమంతు ఎవరినైనా ఇట్టే ఆకర్షించగల ఆకృతికి గలవాడు. ఆజానుబాహు స్ఫురద్రూపి అయిన హనుమంతు మేనమామ కుమార్తె గంగమ్మను వివాహం చేసుకున్నాడు.

1902 నుండి 1907 వరకు బ్రిటీష్ ప్రభుత్వం పల్నాడులోని భూములన్నింటినీ సర్వేచేయించి, మ్యాప్‌లను రూపొందించి భూమి స్వరూపాన్ని, స్వభావాన్ని బట్టి శిస్తులు నిర్ణయించింది. ఫారెస్టును రెండు శాఖలుగా విభజించి, ఒకటి 'ఆపుదల కూపులు'గా, రెండవది 'మేపుదల కూపులు'గా వర్గీకరించింది. 1882 మద్రాసు ఫారెస్టు చట్టాన్ని అనుసరించి మేపుదలకూపులలో మాత్రమే పశువులను మేత మేపుకోవాల్సి వుంటుంది. అందుకై రైతులు, ప్రజలు పుల్లరి (పన్ను) చెల్లించాలి. అటవీ ప్రాంతంలో మేత మేయుటకు ఆరుమాసములకు ఒకమారు ఆవుకి 12 అణాలు, గేదెకి ఒక్క రూపాయి 8 అణాలు చెల్లించాలని చట్టం చేసింది. ఇక్కడి నుండే రైతాంగ కష్టాలు మొదలయ్యాయి. 01-10-1904న కృష్ణాజిల్లా నుండి గుంటూరుజిల్లాను విభజించి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసింది ప్రభుత్వం. గుంటూరుజిల్లా ఏర్పడిన తరువాత పుల్లరి అగచాట్లు మరింత తీవ్రమయ్యాయి. ఈ దిశలోనే రెవెన్యూ శాఖ నుండి ఆబ్కారి, అటవీశాఖలను వేరుపరచిన బ్రిటీష్ ప్రభుత్వం పుల్లరి వసూళ్ళను కఠినతరం చేసింది.

1920 డిసెంబరు మాసంలో నాగపూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సార్వత్రిక సభల వేదిక పిలుపు అందుకొని వచ్చిన అనేక మంది జిల్లా నాయకులు సహాయ నిరాకరణోద్యమాన్ని ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ మేరకు 1921 మార్చి 31న, ఏప్రిల్ 1న బెజవాడలో ఉద్యమ ప్రచార సభలను నిర్వహించగా పల్నాటి నుండి స్వాతంత్ర్యపోరాట నాయకులు నాళం మట్టపల్లి, ఉల్లి వెంకట్రామయ్య, గోలి మల్లికార్జున శాస్త్రి, నాగార్జునకొండ కనకమ్మ పాల్గొన్నారు. పల్నాటి జాతీయోద్యమ తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులైన మల్లికార్జున శాస్త్రి నాయకత్వంలో పల్నాడునందు సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైంది. ఈ దశలోనే తాలూకా జాతీయోద్యమ నాయకులుగా వారు ఒక ఆలోచన చేశారు. జాతీయ కాంగ్రెస్ నిర్వహించు సహాయ నిరాకరణోద్యమం గురించి పల్నాట విస్తృత ప్రచారం గావించి, ప్రభుత్వాన్నెదుర్కొనుటకూ, ప్రజలను సమాయత్తపరచుటకు సమర్థుడైన వ్యక్తికోసం అన్వేషించారు. ఈ సందర్భంగా చర్చావేదికలో పాల్గొన్న నాయకులందరూ ఏకోన్ముఖంగా అందుకు అసహాయశూరుడైన కన్నెగంటి హనుమంతే అన్ని విధాల సరితూగే నాయకుడని నిర్ణయించారు. అప్పటికే జాతీయోద్యమంలో ఆసక్తిని ప్రదర్శించే హనుమంతు

ఒక్కసారిగా సహాయనిరాకరణోద్యమ సారథిగా పల్నాటి శిరసున రెపరెపలాడే కేతనంలాపైకి లేచాడు. సహాయ నిరాకరణ ఉద్యమ నాయకత్వాన్ని హనుమంతు తన భుజస్కందాలపై వేసుకొని అశ్వారూఢుడై పల్నాడు ప్రాంతమంతా తీవ్రంగా ప్రచారం గావించాడు. అక్కడి నుండి హనుమంతులో తీవ్రమైన మార్పులు వచ్చాయి. పరిపూర్ణమైన నాయకుడిగా తనంత తాను ఆవిష్కరించుకున్నాడు. అనేక గ్రామాలు పర్యటించి వేలాది మంది ప్రజలను కలసి వారిని ఉత్తేజపరిచి వారిని ఉద్యమ దిశగా మళ్ళించాడు. పల్నాడులో సహాయనిరాకరణ ఉద్యమానికి పర్యాయం పుల్లరి ఉద్యమమే. హనుమంతు ఉద్యమ పగ్గాలు చేపట్టిన తరువాత పల్నాడులో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ఉద్యమం ఊపందుకుంది. ప్రజలు గ్రామాలలో ప్రభుత్వ అధికారులపై, ఉద్యోగులపై తిరగబడే స్థాయికి చేరుకున్నారు. శిస్తులు, పుల్లరి చెల్లించడం మానివేశారు. ప్రభుత్వ సిబ్బంది, అధికారులు గ్రామాలు వెళ్ళాలంటే జంకుతున్నారు. 1921 జూన్ 17న గుంటూరుజిల్లా కలెక్టరుగా షీల్డు అనే తెల్లదొర బదిలీపై వచ్చారు. ఈయన వచ్చినప్పటి నుండి అటవీ నిబంధనలను మరింత పదునెక్కించాడు.

మించాలపాడు గ్రామం కోలగుట్ల గ్రామానికి రెవెన్యూ శివారు గ్రామం కోలగుట్ల, మించాలపాడు, కాకిరాల ఈ మూడు గ్రామాలకు కరణంగా యండ్లపల్లి సదాశివయ్య వ్యవహరించేవాడు. జిత్తులమారి కరణం ప్రజలపట్ల కంఠకునిగా మారాడు. పన్నులు వసూలు నిమిత్తం మించాలపాడు గుఱ్ఱంపై వచ్చిన కరణం సదాశివయ్యను హనుమంతు ఇంటి వద్దకు చేరగానే గుఱ్ఱం కళ్ళెం పట్టుకుని నిలిపివేశాడు. ఉద్యోగ విధులపై వచ్చిన వారెవరూ మించాలపాడులో నడిచే వెళ్ళాలని హుకుం జారీచేస్తూ గుఱ్ఱాన్ని పశువుల కొష్టంలో కట్టి వేయాలని పాలేరును ఆదేశించాడు. అప్పటికే ఉద్యమకారుడైన హనుమంతుపై కంటగింపుగా వున్న కరణం మనసులో కారాలు మిరియాలు నూరి కక్షగట్టాడు. విపరీతమైన ద్వేషం పెంచుకున్నాడు. అహాన్ని దెబ్బతీసిన హనుమంతు అంతం చూడాలని కుట్ర పన్నాడు. అదును కోసం చూడసాగాడు.

కన్నెగంటి నాయకత్వంలో పుల్లరి, శిస్తుల చెల్లింపు నిరాకరణ తీవ్రస్థాయికి చేరింది. బ్రిటీష్ ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు ఊపిరి సలుపకుండా ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ఫారెస్టు ఉద్యోగులను, కొందరు కరణాలను సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఇందుకు తోడుగా 1919, 1920, 1921వ సంవత్సరాలలో తీవ్రక్షామ పరిస్థితులేర్పడినాయి. పుల్లరి చెల్లించే స్తోమతను ప్రజలు కోల్పోయారు. పుల్లరి చెల్లించడం లేదని పశువులను స్వాధీన పరుచుకుంటూ అధికారులు వేలం వేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పుల్లరి చెల్లించలేదని పాలువాయి గ్రామానికి చెందిన 50 పశువులను గురజాలకు తరలించి వేలం వేయప్రయత్నించారు. వేలం ప్రచారానికి తండోపతండాలుగా ప్రజలు వచ్చినప్పటికీ స్థానిక కాంగ్రెస్ నాయకుల ప్రభోదంతో వేలంపాటలో పాల్గొనుటకు ఒక్కరూ ముందుకురాలేదు. పుల్లరి చెల్లించని కారణంగా బందెల దొడ్లో బంధించిన పశువులను జెట్టిపాలెం గ్రామస్థులంతా మూకుమ్మడిగా దాడిచేసి దొడ్డిని ధ్వంసంచేసి పశువులను విడిపించుకొని వెళ్ళారు. జంగమహేశ్వరపురం గ్రామంలో శిస్తు చెల్లించలేదని ఎద్దులను జప్తు చేసిన తహశీల్దారు, మునుసబు, కరణం, మొహతాదు, వెట్టివాండ్రపై ఎద్దుల యజమానులు ఐదుగురు, గ్రామ యువకులతో కలిసి కర్రలు, బరిసెలు, నాటుకొయ్యలతో దాడికి ప్రయత్నిస్తే మొత్తం యంత్రాంగం కాలికి బుద్ధి చెప్పి బతుకు జీవుడా అంటూ పారిపోయారు. గురజాల తహశీల్దారు దైద గ్రామంలో ఒక రైతుకు చెందిన ఎడ్లబండిని పుల్లరి బకాయి కోసం స్వాధీన పరుచుకొని తేలుకుట్ల గ్రామం తోలుకొచ్చి వేలానికి ప్రయత్నిస్తే రెండు గ్రామాల ప్రజలు హాజరయ్యారుగానీ ఒక్కరూ వేలానికి ముందుకు రాలేదు. బండిని తాలూకా కేంద్రమైన గురజాలకు తరలించే ప్రయత్నాన్ని రెండు గ్రామాల ప్రజలు కలసికట్టుగా అడ్డుకుంటే తహశీల్దారు, సిబ్బంది వెనుతిరిగారు. గంగలకుంట బందెలో నిర్భంధించిన పశువులను గొట్టిపాళ్ళ గ్రామస్థుల సహకారంతో ఆ గ్రామప్రజలు ఆగ్రహించి కర్రలు, గొడ్డళ్ళు, రాళ్ళతో దాడిచేసి పశువులను విడిపించగా భయంతో ప్రాణాలను చేతబెట్టుకుని అటవీ ఉద్యోగులంతా పారిపోయారు. ఈ సంఘటనా సమాచారానందుకున్న వెల్దుర్తి ప్రజలు కోపంతో ఊగిపోయారు. అప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వ దమనకాండను మునిపెదవిపై వొత్తి పెట్టుకుని భరాయిస్తూ వచ్చిన ఆ గ్రామస్థుల ఆవేశం కట్టలు తెంచుకుంది. గ్రామం గ్రామం మొత్తంగా ఏకమై పోలీసు ఠాణాని ముట్టడిస్తే, ఆ రాత్రి వేళ పోలీసులు వారివారి ఆయుధాలు, అందుబాటులోకి

వచ్చిన రికార్డులతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తలా ఒకదిక్కునపడి మాచర్లకు పరుగుతీశారు. ఈ సంఘటనకు కొనసాగింపుగా నాగులవరం పోలీసు అవుట్‌పోస్టుపై ఆ గ్రామ ప్రజలు తిరగబడితే రక్షక భటులు పలాయనం చిత్తగించారు. వరుస సంఘటనలతో ఉక్కిరిబిక్కిరై ఓర్పు నశించిన బ్రిటీష్ వున్నతాధికారులు వెల్దుర్తి పోలీసు ఠాణాపై దాడిని సహించలేకపోయారు.

ఈ పూర్వరంగంలో జిల్లాకలెక్టరు, అటవీశాఖ జిల్లా అధికారి బలగాలతో వెల్దుర్తికి వచ్చారు. గ్రామంలో కనపడిన వ్యక్తులందరినీ నిర్భందించారు. గ్రామంలో ముఖ్యులు తప్పుకున్నప్పటికీ నిమిషాల్లో ఊరిజనమంతా అధికారులను చుట్టుముట్టారు. ప్రాణాలతో తిరిగి వెళ్ళాలంటే నిర్భంధించిన వారిని వదిలివేయాలని హెచ్చరించారు. ఈ సందర్భంలో గ్రామస్థులను బెదిరించడానికి పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అయినా జనం జంకలేదు. ఎట్లా వచ్చారో అట్లాగే వెళ్ళండి ! లేదా ! మాతోపాటు మీలో ఎవ్వరూ మిగలరని గ్రామప్రజలు చేసిన హెచ్చరికకు అధికారులు తోకముడిచారు. ప్రభుత్వ యంత్రాంగ అసహాయత, ఉరకలెత్తుతున్న ప్రజల ఉత్సాహాన్ని గమనించిన తాలూకా జాతీయోద్యమ కాంగ్రెస్ నాయకులు తాలూకా కేంద్రం గురజాలలో పుల్లరి సత్యాగ్రహం నిర్వహించారు. పాల్గొన్న అనేకమంది యువకులు తాలూకా కార్యాలయంలోకి చొరబడి స్వాతంత్ర్య పోరాట నినాదాలు చేస్తూ తహశీల్దారునుద్దేశించి తమను అరెస్టు చేసుకోవచ్చుని, మీ జైళ్ళు నింపడానికి సిద్ధంగా వున్నామని చెప్పారు.

ఇక్కడే ప్రవేశించాడు గుంటూరు జిల్లాకు ప్రత్యేక అధికారిగా టి.జి. రూథర్‌ఫర్డ్. వెల్దుర్తిలో ఠాణాపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఏ విధంగానైనా పుల్లరి ఉద్యమాన్ని అణచివేయాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టరు, అటవీశాఖ అధికారిని కలుపుకొని రూథర్‌ఫర్డ్ గురజాలకు చేరుకున్నారు. వివిధ అధికారులతో పుల్లరి ఉద్యమ సమీక్షలో రూథర్‌ఫర్డ్ కన్నెగంటి హనుమంతుపై తీవ్రవాదిగా ముద్రవేశాడు. పల్నాడులో ఈ మొత్తం ప్రభుత్వ వ్యతిరేక సంఘటనలకు కన్నెగంటే కారణమని నిర్ధారించారు. పుల్లరి ఉద్యమానికి హనుమంతు ఆద్యుడని, ప్రభుత్వం స్థిరంగా వుండాలంటే హనుమంతును నిర్మూలించడమే ఏకైక మార్గమని తలపోసిన రూథర్‌ఫర్డ్ మరో దుష్టఆలోచనకు కూడా తెర తీశాడు. విభజించిపాలించు అనే తెల్లవాని నీతిబాహ్యమైన నైజానికి శ్రీకారం చుట్టాడు. పథకం అమలు వేగవంతం చేశాడు. కుటీల నీతికి దారులు వేశాడు. కన్నెగంటిని ప్రలోభపెట్టి ఉద్యమానికి తూట్లుపొడవాలని ఆశించాడు.

అనుకున్నదే తడవుగా రూథర్‌ఫర్డ్ జిల్లాకలెక్టరు వెర్నెన్ కలిసి ఒక ఎత్తుగడ వేశారు. కోలగుట్ల కరణం సదాశివయ్యతో ఒక కపట ప్రతిపాదనను హనుమంతుకు చేరవేశారు. ఈ ప్రాంతమంతా ఎస్టేట్‌గా మార్చి హనుమంతును జమిందారుగా నియమిస్తామన్నారు. పేష్కస్ (కప్పం) తను ఇష్టమొచ్చినంత ప్రభుత్వానికి చెల్లించవచ్చని, ప్రజల నుండి తను ఎంతైనా శిస్తు రాబట్టుకోవచ్చునని ఆశజూపారు. అయితే హనుమంతు వారి ఉచ్చులో పడలేదు. అధికారుల పన్నాగానికి లొంగలేదు. వారి నీతిమాలిన ప్రతిపాదనను తిప్పికొట్టాడు. తన ఒక్కడి సుఖంకోసం మహోద్యమానికి ద్రోహం చేయలేనన్నాడు. రాక్షసుడిలా ప్రజలను దోచుకోవడం కుదరదన్నాడు. ఈ దుర్మార్గమైన ప్రతిపాదనను తుచ్ఛమైన ఆశగా పేర్కొన్నాడు. ప్రజలకు ద్రోహం చేయనంటూ ఇక్కడి నుండి తక్షణమే వెనుదిరిగి వెళితే వంటికి మంచిదంటూ గర్జిస్తూ కరణానికి బుద్ధి చెప్పాడు.

సంధి వైఫల్యంతో తిరిగివచ్చిన కరణం నుండి హనుమంతు నిర్ణయాలను ఆకళింపు చేసుకున్న రూథర్‌ఫర్డ్ రెచ్చిపోయాడు. ఇక ఉపేక్షించేది లేదన్నాడు. హనుమంతు బందిపోట్లకు ఆశ్రయం కల్పిస్తున్నాడని, మించాలపాడు దట్టమైన అడవుల్లో అక్రమ మద్యం ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాడని, ప్రభుత్వ తిరుగుబాటుదారులకు అడవులలో ఆసరాయిస్తూ సంరక్షకుడిగా వున్నాడని నేరాలుమోపుతూ అమానుషమైన కుట్ర చిత్రించాడు. ఈ నేరాలన్నింటిపై అభియోగ పత్రాన్ని రూపొందించడానికి కోలగుట్ల కరణం సహకరిస్తాడని ఆశించారు. హనుమంతుపై వ్యక్తిగత కసితో ద్వేషం పెంచుకున్న కరణం సదాశివయ్య అందుకు సంతోషంతో అంగీకరించాడు. అనుకున్న విధంగా కరణం తప్పుడు రిపోర్టులను సిద్ధం చేశాడు. హనుమంతు అనుమతులు లేని రైఫిల్ కూడా కలిగి వున్నాడని పొందుపరిచాడు. ఈ ఆక్రమకేసులను వక్రగతిన గుదిగుచ్చి హనుమంతును ఒక తీవ్రమైన నేరస్థుడుగా ముద్రవేసి హతమార్చడానికి దుష్ట పథకాన్ని సిద్ధం చేశారు.

చౌరీచౌరా హింసా సంఘటనతో మహాత్ముడు సహాయ నిరాకరణోద్యమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు.

హనుమంతు కూడా బాపూజి నిర్ణయాన్ని అనుసరించాడు. ఈ విషయాన్ని రూథర్‌ఫర్డ్ పరిగణించలేదు. ఇవాళ కాకపోయినా మరొకనాడు హనుమంతు బ్రిటీష్ ప్రభుత్వానికి ప్రమాదకరమేనని, కంటగింపేనని నిర్ధారించాడు. హనుమంతు లేని పల్నాట, పుల్లరిఉద్యమం తిరిగి మొలకలెత్తడం అసాధ్యమని నమ్మాడు. అనుకున్నంతనే కుట్ర అమలును ఆచరణలోకి తీసుకొచ్చాడు.

1922 ఫిబ్రవరి 2వ తేదీన పల్నాట పుల్లరి ఉద్యమ అణచివేతకు రూథర్‌ఫర్డ్ నేతృత్వంలో సాయుధ సైనిక పటాలం, అశ్వికదళం తాలూకా కేంద్రమైన గురజాలకు చేరింది.

ఫిబ్రవరి 22వ తేదీన దుర్గి పోలీసుస్టేషన్ నుండి అశ్వికదళము, రిజర్వ్‌డ్ పోలీసు దళం, సైనికపటాలం, 20 మంది కానిస్టేబుల్స్, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, దుర్గి ఎస్సై జి.వి. రాఘవయ్య నేతృత్వంలో కోలగుట్ల గ్రామం చేరారు. హనుమంతును గుర్తించేందుకు కరణం యండ్లపల్లి సదాశివయ్యను వెంటబెట్టుకొని సాయంత్రం 4గంటలకు మించాలపాడు చేరుకున్నారు. ముందుగా ఫారెస్టు ఉద్యోగులు పుల్లరి చెల్లించని రైతుల పశువులను అదుపులోకి తీసుకుని మందగా కట్టడి చేస్తున్నారు. అడ్డుకునే రైతులను తుపాకీ మడమలతో కుమ్ముతూ గాయపరస్తున్నారు. ఈ హింసకు రైతులు కుప్పకూలుతున్నారు. ఈ వార్తను యింట్లో నిద్రిస్తున్న హనుమంతుకు చేరవేశారు. మహాత్ముడు సహాయనిరాకరణ ఉద్యమ నిలిపివేత నేపథ్యంలో అధికారులను కలిసి వారితో చర్చించి శిస్తులు, పుల్లరి చెల్లించి సాదరంగా పంపాలని భావిస్తూ, అధికారులున్న గ్రామ తూర్పువీధిలోకి అడుపెట్టాడు హనుమంతు. అధికారులను సమీపిస్తున్న హనుమంతును కరణం చూపుడువ్రేలితో చూపిస్తూ అతడే హనుమంతు, అతను మనదగ్గరికి వస్తే ఎవరినీ ప్రాణాలతో బ్రతకనీయడు, అతని వద్ద రైఫిల్ వుందంటూ ఎస్సైని రెచ్చగొట్టి భయభ్రాంతులను చేశాడు. ఎస్సై వెంటనే కాల్పులకు సంకేతమిచ్చాడు. సాయుధ దళాలు తుపాకులెత్తి పట్టడం గమనించిన హనుమంతు తను చర్చలకు వస్తున్నానని సైగలుచేస్తూ చేతినెత్తినా ఫైర్ అంటూ ఎస్సై మరోమారు ఉత్తర్వులు వెలువరించడంతో ఒక్కసారిగా తుపాకులన్నీ పేలాయి. హనుమంతుతోపాటు వెంటవస్తున్న పాలేరు యల్లంపల్లి శేషయ్య కూడా తుపాకీ తూటాలకు బలైై నేలకొరిగారు. సాయంత్రం 4-5 గంటల మధ్య ఈ కాల్పులు జరిగితే ఆ రోజు అర్ధరాత్రి వరకూ కొనఊపిరితో కొట్టుమిట్టాడిన హనుమంతు తుదిశ్వాస విడిచారు. రాళ్ళు రప్పలతో తిరగబడిన గ్రామప్రజలను బలగాల సమూహం అధికంగావుండి తిప్పికొట్టడంతో పాటు దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనుమంతు మృతదేహం వద్దకు కనీసం భార్య గంగమ్మను కూడా అనుమతించలేదు నిర్దయులు. ఫిబ్రవరి 23వ తేదీన మృతదేహానికి మాచర్ల లోకల్‌ఫండ్ డిస్పెన్సరీలో శవ పంచాయతీ, శవపరీక్ష జరిపించిన బ్రిటీష్ మృగాలు శవాన్ని కూడా కుటుంబసభ్యులకు అప్పగించలేదు. కోలగుట్ల వూరి వెలుపల లోకల్‌ఫండ్ రోడ్డు బ్రిడ్జికి దగ్గరగా దంతెవాగు ఒడ్డున పోలీసులే పాతిపెట్టారు. ఆ విధంగా పుల్లరి ఉద్యమ నాయకుని ఆత్మత్యాగం పల్నాటి మోమున రక్త తిలకమై మెరిసింది. హనుమంతు మరణం పల్నాటిని అతలాకుతలం చేసింది. హనుమంతు మరణం పల్నాడు ఉద్యమాన్ని మరింత మండించింది. ఆయన ఆశయాన్ని ఉధృతంగా కొనసాగించింది. హనుమంతు త్యాగం భారత స్వాతంత్ర్య కాంక్షకు ప్రతీక. ఒక స్వేచ్ఛాయుత జీవనం కోసం పైకి లేచిన పతాక. ఇదే రోజున మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు అడ్డతీగల పోలీసుఠాణాపై దాడిచేసి ఆయుధాలను స్వాధీన పరచుకున్నారు. 1924 అక్టోబరు 19న జరిగిన ఆంధ్రకాంగ్రెస్ కమిటీ సమావేశం హనుమంతు హత్యను ఖండిస్తూ ఆయనకు జోహార్లర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు సంతాప, సానుభూతులు ప్రకటిస్తూ తీర్మానించింది. సమాధివద్ద హనుమంతు జీవితవిశేషాలతో ఏర్పాటైన ఫలకాన్ని బ్రిటీష్ ముష్కరులు ధ్వంసం చేయడాన్ని గర్హిస్తూ తిరిగి నెలకొల్పాలని డిమాండ్ చేసింది. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ నేతృత్వంలో హనుమంతు సమాధి ఒక స్మారక చిహ్నంగా రూపొందింది.




వై.హెచ్.కె. మోహన్‌రావు

అధ్యక్షులు పల్నాటి రచయితల సంఘం,

పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా.

ఫోన్ : 944 015 4114



ఐక్యరాజ్య సమితిలో మలాలా

# నేను.. మలాలా

మార్చి నెలలో మేము బర్మింగ్‌హాం, లీఫీ వీధిలో ఒక అద్దె ఇంట్లోకి మారాం. మాకు చెందిన సమస్త వస్తువులు స్వాత్ లోయలోనే ఉండిపోయాయి. ఇల్లంతా నేను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జనం పంపిన ఉత్తరాలు, గ్రీటింగ్‌లతో నిండిపోయిన అట్టపెట్టలమయం అయిపోయింది. ఒక గదిలో పియానో ఉంది. అది ఎలా వాయించాలో మాకు తెలీదు. అమ్మ ఏమో ఆ గోడలకి, సీలింగ్‌లకి ఉన్న గ్రీకు బొమ్మలు బాలేదు, మనల్నే చూస్తున్నట్లున్నాయి అని గొణుగుతూనే ఉంది.

ఇప్పుడు దిగిన ఇల్లు చాలా పెద్దది. చాలా మటుకు ఖాళీగా దర్శనమిస్తుంది. కరెంటు పెట్టిన పెద్ద ఇనుపగేటుకి ఇవతల మా ఇల్లు ఉంటుంది. దీన్ని చూస్తే మాకు మా పాకిస్థాన్‌లో సబ్‌జైలు గుర్తుకు వస్తుంది. కాకపోతే ఇది ఒకరకంగా కాస్తంత విలాసవంతమైన జైలు జీవితంలాంటిది. వెనక పెరట్లో పెద్ద గార్డెను, రకరకాల చెట్లు ఉన్నాయి. పచ్చటి ఆ లాన్ మీద నేను తమ్ముళ్ళతో కలిసి క్రికెట్ ఆడుకుంటున్నా. ఇక్కడ మిద్దెమీద ఆటలు ఉండవు. వీధుల్లో పోటీలు పడి పతంగులు ఎగరేసుకోవడం ఉండదు. ఇరుగుపొరుగు అమ్మలక్కలు వచ్చి ఓ సోలెడు బియ్యం ఉంటే ఇయ్యమ్మడూ, రెండు బంగాళాదుంపలిచ్చి పుణ్యం కట్టుకుందూ, నాలుగు టమాటాలిద్దూ రేపు తెప్పించిస్తా అంటూ అరువులు అడగడాలు ఉండవు. పొరుగింటికి మా ఇంటికి మధ్యన కేవలం ఒక గోడే అడ్డం. కానీ రెండిళ్ళ మధ్యన వేలమైళ్ళ దూరం ఉన్నట్లు ఉంటుంది.

అమ్మ రోజూ తలమీద షాల్ కప్పుకుని తోటలో తిరుగాడుతూ పక్షులకి మేత వేస్తుంటుంది. రాత్రి మిగిలిపోయిన అన్నం మెతుకులు వేస్తుంటే తన కళ్ళలో అప్పుడప్పుడు కన్నీటి పొరలు కనిపించేవి. తను ఆ పని మౌనంగా చేస్తున్నా, మనసులో తనకి ఇష్టమైన పాట పాడుకుంటూ ఉంటుందని నాకు తెలుసు. ఇక్కడ కూడా మేం మింగోరాలో తినేమాదిరే మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో అన్నం ఏదన్నా నీసుకూర, ఉదయంపూట టిఫిన్‌గా చపాతి, గుడ్డుపొరుటు, అప్పుడప్పుడూ కాస్తంత తేనె తీసుకునేవాళ్ళం. అప్పుడప్పుడూ చిన్న తమ్ముడు బర్మింగ్‌హామ్ 'బెస్ట్' అని కనిపెట్టిన న్యూటెల్లా శాండ్‌విచెస్ తీసుకునేవాళ్ళం. ఆ రోజున అందరి ప్లేట్లలో శాండ్‌విచ్ మిగిలిపోయేది. అలా తినేది వేస్ట్ చెయ్యడం అమ్మకి నచ్చేదికాదు. అక్కడ ఇంట్లో ఉన్నప్పుడు చుట్టుపక్కల ఇళ్ళలో స్కూలుకు పోయే పిల్లల్ని పిలిచిమరీ తలా అంత చపాతీ కూర పెట్టేది. రాత్రిళ్ళు మేం తినగా మిగిలిన అన్నం కూరలు తినిపించేది. 'ఇప్పుడా పిల్లలు ఆకలితో స్కూలుకి పోతున్నారో ఏం పాడో' అని తలచుకుని బాధపడేది.

మింగోరాలో నే స్కూలు నుండి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా ఇరుగుపొరుగు అమ్మలక్కలతో తొక్కిడి తొక్కిడిగా ఉండేది. ఒక్కోసారి 'నేను స్కూల్‌వర్క్ చేస్కోవాలి, కాస్తంత ప్రశాంతత కావాలి మాం. మీ మీటింగ్‌లు ఇవాళ ఇంట్లో పెట్టకండి' అని అమ్మని బతిమాలిన రోజులు ఉండేవి. ఇప్పుడు ఈ ఇంట్లో అలాంటి సందడే లేదు. భరించలేనంత ప్రశాంతత దొరుకుతుంది ఈ ఇంట. నేను గదిలో ఒంటరిగా కూచుని జిగ్సా ఫజిల్ ఆడుకుంటూ, ఇంతకు ముందులా ఇల్లంతా చుట్టాలు, పక్కాలు, ఇరుగుపొరుగులతో మళ్ళీ కళకళలాడేరోజు ఎప్పుడు వస్తుందా అని పరితపిస్తూ ఉండేదాన్ని.

మాదేమంత కలిగిన కుటుంబం కాదు. ఆకలి బాధ ఎలా ఉంటుందో ఎరిగిన కుటుంబమే. అందుకే ఇంటికి ఎవరొచ్చి అంత ముద్ద పెట్టు తల్లీ అనడిగినా అమ్మ కాదనకుండా లేదనకుండా ఉన్నంతలోనే ఏదన్నా పెట్టి పంపించేది. ఒకసారి మిట్టమధ్యాహ్నంపూట ఒక ఆడమనిషి దీనంగా అంత ముద్ద పెట్టు తల్లీ, చెంబెడు నీళ్ళన్నా ఇచ్చారు కాదు ఎవర్నా' అనేసరికి అమ్మ ఆ మనిషిని ఇంట్లోకి పిలిచి మరీ అన్నం పెట్టి దాహానికి నీళ్ళిచ్చి పంపింది. ఆ ఆడమనిషి వెళ్తూ వెళ్తూ 'పదైదు వీధులు తిరిగా తల్లీ అంత ముద్ద పెట్టమని. ఎవరూ కరుణించారు కాదు. కడగట్టుకు పోతున్న పేణాన్ని బతికించావు. నీ ఇల్లు పదికాలాలపాటు చల్లగా ఉండాలి తల్లీ' అని అమ్మని దీవించి వెళ్ళింది.

అమ్మ ఇక్కడ ఒంటరితనంలో సుక్కిపోతుంది. తను బాగా కలివిడిగా ఉండే మనిషి మధ్యాహ్నం పూట ఇంటి వెనుక ఉన్న బాదం చెట్ల నీడన ఇరుగమ్మ పొరుగమ్మలతో చేరి వాళ్ళ కష్టసుఖాలు వింటూ గడిపేది. తనకి తోచిన సాయం చేసేది. అలాగా చుట్టుపక్కల ఇళ్ళలో పని చెయ్యడానికి వచ్చిన ఆడవాళ్ళు కూడా మధ్యాహ్నానికి అక్కడికి చేరి నడుం వాల్చి సేద తీర్చేవాళ్ళు. అంతలా జనం మధ్యన మసిలే అమ్మ పరిస్థితి చెరువులో నుండి ఒడ్డున పడ్డ చేప పిల్లలా తయారయింది. అందుకే ఎప్పుడు చూసినా చుట్టాలు, పక్కాల్లో ఎవరో ఒకరికి ఫోన్ చేసి మాట్లాడతా కాలం పొద్దు పుచ్చేది. తనకి, ఇంగ్లీష్ రాకపోవడంతో ఇరుగుపొరుగు స్నేహాలు లేకుండా పోయాయి. ఇక్కడ ఇంట్లో సకల సౌకర్యాలూ –ఓవెన్, వాషింగ్ మిషను సహా అన్నీ ఉన్నాయి. అవి ఎలా వాడాలో అమ్మకి నేర్పించేదాకా అవన్నీ చాలా చిత్రంగా ఉన్నాయంటూ ఆశ్చర్యపోయేది.

ఇక్కడ కూడా నాన్న అమ్మకి వంటపనిలో వీసమెత్తు సాయం చేసేవాడు కాదు. 'అబ్బాజాన్ నువ్ బయటేమో ఆడవాళ్ళ హక్కులంటూ లెక్చర్లు దంచుతావ్. ఇంట్లో తాగిన టీకప్పులు కూడా ఇటువి తీసి అటు పెట్టవ్. అమ్మీజాన్‌కు ఆ హక్కులు ఉండొద్దా' అని నాన్నని ఉడికించడానికి అడిగేదాన్ని.

ఇక్కడ ఎక్కడికి వెళ్ళాలన్నా చేరువలో రైళ్ళూ, బస్సులూ అందుబాటులో ఉన్నాయి. కానీ వాటిని ఎక్కడ ఎక్కితే ఎక్కడ దిగుతామో తెలీదు కాబట్టి వాటి జోలికి పోయేవాళ్ళం కాదు. చీనా బజార్‌లో షాపింగ్‌కి వెళ్ళి ఒకసారి అమ్మకి తప్పిపోయినంత పనయింది. మా కజిన్ షా మాతో ఉన్న దగ్గర నుంచి అమ్మ కాస్త తెరపిన పడింది. తనకి కారు నడపటం వచ్చు. కాబట్టి షాపింగ్‌కి అమ్మని కార్లో తీసుకువెళ్ళేవాడు. షాపింగ్‌కి హుషారుగానే వెళ్ళినా తిరిగి వచ్చాక అంత హుషారు ఉండేది కాదు. మా ఊళ్ళో మాదిరి ఇక్కడ ఇరుగమ్మలని పొరుగమ్మలని పోగేసి ఏ బట్ట ఎంతకి కొన్నదీ, ఎట్లా బేరం చేసిందీ, ఎంత నాణ్యమైనదీ కబుర్లుగా చెప్పుకునే దానికి లేకపోవడం వెలితిగా ఫీల్ అవుతున్నట్లుంది అమ్మ.

ఇంట్లో ఏ తలుపు కాస్త గట్టిగా శబ్దమయినా అమ్మ ఉలిక్కిపడేది. పక్కన ఎక్కడన్నా ఉంటే పరుగులు తీసుకుంటూ నా దగ్గరికి వచ్చేసి నన్ను కావలించుకుని 'నా తల్లీ, నా బిడ్డా' అంటూ కన్నీరు పెట్టుకునేది. ఇంట్లో పిల్లలు అందర్లోకీ నేనే పెద్దదాన్ని అయినా అందర్లోకీ నేనే చిన్నపిల్లని అన్నంత ముద్దుగా నన్ను సాకుతుంది అమ్మ.

నేను ఎప్పుడైనా నా జుత్తుని ఎడంవైపుకి వెనక్కి తోసుకుంటే నా తలమీద ఆపరేషన్ గంటు చూసి నాన్న కన్నీళ్ళు పెట్టుకునేవాడు. ఒక్కోసారి మధ్యాహ్నంపూట నిద్ర నుండి ఉలికిపాటుతో కన్నీళ్ళతో లేచి కూచునేవాడు. తోటలో ఆటలాడుకుంటున్న పిల్లల్లో నా గొంతు విన్నాక స్థిమితపడేవాడట. అసలు నాకీ పరిస్థితి ఎదురవడానికి నాన్నే కారణం అని చాలామంది తన మొహానే అనేశారట. 'ఏదో టెన్నిస్ ఛాంపియన్‌ని తయారు చేస్తున్నట్లు ఆ పిల్ల మెదడులో నీ ఆలోచనలు కూరిన మూలానేగా మలాలా అలా చావు అంచులవరకూ వెళ్ళొచ్చింది. ఆ పిల్ల ఆలోచనలు ఆ పిల్లకి ఉండవా. ఏవైనా నువ్ చేసింది మాత్రం సరైంది కాదు జియా. నువ్వేమైనా అనుకో' అనేవారట. దాంతో నాన్నకి చాలా కష్టం కలిగేది. ఆత్మన్యూనతకు లోనయ్యేవాడు. తను ఇరవై ఏళ్ళపాటు తన రెక్కల కష్టంతో నిర్మించినదంతా వదులుకుని ఇలా దేశంకాని దేశంలో తలదాచుకోవాల్సి వచ్చింది. సున్నా నుండి మొదలుపెట్టాడు నాన్న. ఇప్పుడు మూడు బిల్డింగ్‌లలో 1,100 మంది విద్యార్థులు, 70 మంది టీచర్లతో మూడు స్కూళ్ళు నడుస్తుండేవి. ఎక్కడో కొండ కోనల్లో ఉండే ఒక మారుమూల పల్లె నుండి చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా వచ్చి స్వయంకృషితో తను సాధించిన ఈ విజయంపట్ల తనకి గర్వంగా ఉండేది కూడా. 'విత్తునాటి, నీరుపోసి, పెంచి పెద్దది చేసిన చెట్టు నీడ విశ్రాంతి తీసుకుంటున్నంత హాయిగొలుపుతుంది మనసుకి' అని తరచూ చెబుతుండేవాడు నాన్న ఆ స్కూళ్ళని

గుర్తు చేసుకుంటూ. స్వాత్ లోయలోనే అత్యున్నత విద్యాప్రమాణాలతో కూడిన పెద్ద స్కూలు నిర్మించడం, ప్రశాంతంగా జీవించడం, ఏ నాటికైనా తన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి అనేవి నాన్న జీవిత కాలపు కోర్కెలు. స్వాత్ లోయలో తన కార్యకలాపాల ద్వారా పదిమందికి సాయపడటం ద్వారా నాన్న మంచి పేరే తెచ్చుకున్నాడు. ఇవన్నీ వదులుకుని విదేశంలో తలదాచుకోవడానికే ఇదంతా చేశాడని నాన్నమీద నిందలెయ్యడం అసహజంగా, అసమంజసంగా అనిపిస్తుంది నాకు. పద్దెనిమిదేళ్ళ పాటు మంచి విద్యావేత్తగా పేరుగడించి, చింతలేని కుటుంబంతో గడుపుతూ కేవలం ఆడపిల్లలకు చదువుకునే హక్కు గురించి మాట్లాడినందుకు నాన్నకి, మాకు ఇలా దేశాంతరం పట్టి పోయే పరిస్థితులు కల్పించినందుకు ఎవర్ని నిందించాలి?

ఒక్కోసారి నాన్న బాధపడుతూ అంటుండేవారు – "కాందిశీకులుగా బతకడం మన జీవితంలో భాగం అయిపోయింది. ఒక్కోసారి స్వంత గడ్డమీద ఇప్పుడు పరాయి గడ్డమీద. ఈసారి వెనక్కి తిరిగి వెళ్తామో, లేదో. మన ఊరి మొహం చూస్తామో లేదో" అని అలా అంటూనే మా ఊరి జ్ఞాపకాల్లోకి జారిపోయేవాడు. 'మహమ్మద్ ప్రవక్త లాంటి వానికే మక్కా నుండి మదీనాకు వలసపోక తప్పలేదు' అని నిట్టూర్చేవాడు. ఇప్పుడు స్వాత్ లోయకు చెందిన కబుర్లు మాకు దూరదేశపు కథలు వింటున్నట్లుగా మారిపోయాయి.

నాన్న ఎక్కువ సమయం విద్యావ్యాప్తికి సంబంధించిన సమావేశాలు, సెమినార్లకు హాజరు కావడంతోటే గడిపేస్తున్నాడు. గతంలోనూ నాన్న ఎక్కువ సమయం ఇలానే వెచ్చించేవాడు. అయితే ఇక్కడ ఎక్కువగా తను నా తండ్రిగా గుర్తింపబడడం మరి నాన్నకు ఎలా ఉందో ఏమో మరి. నా తరఫున అవార్డ్ అందుకోవడానికి ఫ్రాన్స్ వెళ్ళినపుడు ఆ సమావేశంలో ప్రసంగిస్తూ "మా దేశంలో ఎక్కువగా కొడుకుల మూలంగా తండ్రులకు గుర్తింపు వస్తుంది. కానీ నా విషయంలో నా కూతురి మూలంగా నాకు అలాంటి గుర్తింపు రావటం నా అదృష్టంగా భావిస్తున్నా" అని చెప్పాడు శ్రోతల హర్షధ్వానాల మధ్యన.

ఇప్పుడు నా బెడ్రూం తలుపుకి కొత్త స్కూలు యూనిఫారం వేలాడతా ఉంది. మా స్కూల్లో వాడే రాయల్ బ్లూకి బదులుగా బాటిల్‌గ్రీన్ రంగులో ఉంటుంది ఈ స్కూలు యూనిఫారం. ఆడపిల్లలు స్కూలు యూనిఫారం తొడుక్కుని చదువుకునేందుకు వెళుతుంటే వాళ్ళమీద దాడులు చెయ్యడం, స్కూళ్ళని పేల్చివెయ్యడం, ప్రపంచంలో ఎక్కడన్నా జరుగుతుందా అసలుకి?

ఏప్రిల్ నెల నుండి నేను బర్మింగ్‌హామ్‌లోని కొత్త స్కూలుకి హాజరవ్వసాగాను. మళ్ళీ స్కూలుకి వెళ్ళి చదువుకోవడం అన్న ఊహే నాకు గొప్ప సంతృప్తినిచ్చింది. ఇక్కడ నిర్భయంగా, ఏ మూల నుండి ఏ తాలిబాన్ వచ్చి దాడి చేస్తాడో అన్న జంకు లేకుండా హాయిగా స్కూలుకి వెళ్ళివస్తున్నా.

మంచి స్కూల్లో చేరాను అనిపించింది. చాలా సబ్జెక్టులు మా స్కూల్లో ఉన్నట్లు ఉన్నాయి. కాకపోతే ఇక్కడ టీచర్లు మా ఊళ్ళోలాగా చాక్‌పీసు, బ్లాక్‌బోర్డు వాడకుండా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు, కంప్యూటర్ల ద్వారా పాఠాలు నేర్పుతుంటారు. అయితే ఇక్కడ ఇంకా కళలు, సంగీతం, హోమ్‌సైన్స్, కంప్యూటర్ క్లాసులు అదనంగా నేర్పుతారు. ఇక్కడ సైన్స్ అంతా ప్రాక్టికల్స్ రూపంలో నేర్పుతారు. ఈ రెండూ మా దేశంలో లేవు. ఈ మధ్య రాసిన ఫిజిక్స్ పరీక్షల్లో నాకు వచ్చింది 40 శాతం మార్కులే అయినా అదే నాకు బాగా ఇష్టమయిన సబ్జెక్ట్. ఈ విశ్వం మొత్తం నడిచే న్యూటన్ గమన నియమాలు తదితర మౌళిక సూత్రాలను నేర్చుకోవటం అంటే మా చెడ్డ ఇష్టం నాకు.

నేను అమ్మ ఒంటరితనం గురించే చెప్పాగానీ, నిజానికి నేనూ ఇక్కడ ఒంటరితనాన్నే అనుభవిస్తున్నాను. కుశాల్ స్కూల్లో నాకు ఉన్నంత బెస్ట్ ఫ్రెండ్స్‌ని ఇక్కడ కూడా చేసుకోవాల్సి ఉంది. అయితే ఇక్కడ నా సహవిద్యార్థులు నన్ను ప్రత్యేకంగా చూస్తున్నారు. 'ఓ మలాలానా! ఆడపిల్లల హక్కుల కార్యకర్తవి కదూ' అని పలకరిస్తుంటారు. కాని మా కుశాల్ స్కూల్లో నేను కేవలం మలాలానే. స్కూలు మా నాన్నదే అయినా నన్ను స్పెషల్‌గా చూసేవాళ్ళు కాదు. మిగతా అందరితోపాటే నేనూను. నాకు జోకులెయ్యడం, నాకు అర్థంకానివి బొమ్మలేసి వివరించటం, నన్ను ఏడిపించటం, నాతో పచ్చి కొట్టటం, నాల్రోజులకే మళ్ళీ జట్టుకట్టటం ఇలా సరదాగా ఉండేవి. తమ్ముళ్ళతోనూ, తోటి ఆడపిల్లలతోనూ చిన్నచిన్న పోట్లాటలు, అలకలు లేని ఆడపిల్లని ఊహించటం కష్టం. మా దగ్గర క్లాసులో రకరకాల జగజ్జెంత్రీలు ఉండేవాళ్ళు. ఒకళ్ళ మంచి నడవడికి, ఒకళ్ళు తెలివికి, ఇంకొకళ్ళు అందానికి, మరొకరు గిల్లికజ్జాకోరుతనానికి, ఇంకొకరు పేరుకి,

మరొకరు చాడీలు చెప్పడానికి ఫేమస్‌గా ఉండేవాళ్ళు. కానీ ఇక్కడ క్లాసులో ఎవరెవరు ఏమిటో నేనింకా అర్థం చేసుకోవాల్సే ఉంది.

ఇక్కడ జోక్‌లు వేసుకునేంత ఫ్రెండ్స్ ఎవరూ దొరకలా నాకింకా. అందుకే మోనిబాతో స్కైప్ చేసేటపుడు తనతో ఆ పని చేస్తుండేదాన్ని. హాయ్ చెప్పగానే ముందు తనని నే అడిగే మొదటి ప్రశ్న 'స్కూల్లో కబుర్లేంటే' అని. తను చెప్తున్నకొద్దీ నేను ఇంకా ఇంకా తినేంటి, తనేంటి, ఆ టీచరు ఏమన్నారూ – ఇలా ఆరాగా ప్రశ్నలు అడిగేదాన్ని. ఈ మధ్య జరిగిన పరీక్షల్లో కూడా మళ్ళీ మోనిబాయే ఫస్టొచ్చింది. ఇప్పటికీ క్లాస్‌లో ఒక ఖాళీ కుర్చీ, దానిమీద నా పేరు రాసి మరీ క్లాసులో అట్టే పెట్టారట నాకోసం. బాయ్స్ స్కూల్లో అమ్జాద్ సార్ ఎంట్రన్స్‌లో నాది పెద్ద పోస్టరు అతికించి, రోజూ స్కూలుకి వచ్చేప్పుడు, వెళ్ళేప్పుడూ నన్ను విష్ చేస్తుంటారట.

తనకి నేను ఇంగ్లాండ్ కబుర్లు చెప్పేదాన్ని. ఇక్కడ ఇళ్ళు, వీధులు ఒకేతీరుగా ఎలా ఉంటాయో చెబుతుంటే తను అబ్బురపడుతూ వినేది. 'మన ఊళ్ళోలా తుపానులు, వరదలు, భూకంపాలు వచ్చినా ఇక్కడి ఇళ్ళు చెక్కుచెదరవు. కాకపోతే మన ఊళ్ళోలా ఇక్కడ డాబా ఎక్కి ఆడుకోవడానికి ఉండదే, ఇక్కడ జనం అంతా రూల్స్ పాటిస్తారు. పోలీసులంటే గౌరవం ఉంటుంది. అంతా టైం ప్రకారం జరిగిపోతుంటుంది. అంతేకాదు.. ఇక్కడ మనదగ్గర్లా కాదు.. జనానికి ఏ మినిస్టరు పేరేంటో తెలుసుగానీ, సైనిక జనరల్స్ పేర్లనేవి ఎవరికీ తెలియవు పెద్దగా. మన స్వాత్ లోయలో నువ్ ఊహించను కూడా లేవు. ఇక్కడ ఆడవాళ్ళు చాలామంది ఉద్యోగాలు చేస్తుంటారు. పోలీసుల్లో, సెక్యూరిటీ గార్డుల్లో ఆడవాళ్ళున్నారు. పెద్దపెద్ద కంపెనీలు కూడా నడుపుతుంటారు. వాళ్ళకి నచ్చిన డ్రెస్ వేసుకుంటారు. అంత స్వేచ్ఛగా ఉంటారు ఇక్కడ ఆడవాళ్ళు' అని చెపుతుంటే మోనిబా నోరు తెరుచుకొని వినేది అన్నీ.

నామీద తుపాకీ కాల్పులు జరిగిన సంగతి నేను అంతగా గుర్తుకు తెచ్చుకునేదాన్ని కాదు. అయితే నేను అద్దం ముందు నిలబడిన ప్రతిసారీ, నా ప్రతిరూపం నాకా విషయాన్ని గుర్తుకు తెస్తుండేది. డాక్టర్లు నరం ఆపరేషన్ చేసి, వాళ్ళు చెయ్యగలిగినంతా చేశారు. కానీ నేను మునుపటి మనిషిలా లేను. నేను నా ఎడమ కన్ను పూర్తిగా మూయలేను. అలాగే నే మాట్లాడేటప్పుడు ఆ కనురెప్పలు టపటప కొట్టుకుంటూ ఉంటాయి. నాన్న స్నేహితుడు హిదయుతుల్లా అంకుల్ ఎప్పుడూ 'మన మలాలా మొహానికి ఆ నిండైన కళ్ళే అందం' అని అంటుండేవాడు. ఇప్పుడేమో 'అవి తన అందమైన త్యాగానికి గుర్తు' అని నాన్న వాళ్ళకి ధైర్యం చెబుతుంటారు.

నన్ను కాల్చింది ఖచ్చితంగా ఫలానావాళ్ళు అని తెలియదు కానీ సైన్యం బయటపెట్టిన పేరు అతావుల్లా ఖాన్. పోలీసులు అతన్ని ఇప్పటికీ పట్టుకోలేకపోయారు కానీ నన్ను విచారించాలని అడుగుతా ఉన్నారు.

ఆరోజు సరిగ్గా ఏం జరిగింది అనేది నాకు పూర్తిగా గుర్తులేదు కానీ, ఒక్కోసారి ఫ్లాష్‌బ్యాక్‌లా గుర్తుకు వస్తుంటుంది. వాళ్ళు అంత హఠాత్తుగా వచ్చారు. తమ పనికానిచ్చి వెళ్ళిపోయారు.

జూన్ నెలలో మళ్ళీ ఎందుకో నన్ను అలాంటి భయం వెంటాడింది. సౌదీ అరేబియాలో 'ఉమ్‌రాహ్'లో పాల్గొనడానికి గాను మేం అబూదాబి వెళ్ళినపుడు అలాంటి సంఘటన పునరావృతం అవుతుందా అనిపించింది. మక్కాలో ప్రార్థనల కోసం ప్రత్యేకంగా ధరించడానికి బురఖా కొనడానికి అమ్మతో కలిసి షాపింగ్‌మాల్‌కి వెళ్ళాను. 'నాకు షాల్ చాలు. బురఖా కొనమాకు. ఆడవాళ్ళు బురఖా ధరించే రావాలని ఖురాన్‌లో ఎక్కడా లేదు అన్నా నేను అమ్మతో. మేం షాపింగ్‌మాల్‌లో నడుస్తూ ఉండగా హఠాత్తుగా నా చుట్టూ చాలామంది మగవాళ్ళు మూగినట్టు అనిపించింది. వాళ్ళంతా గన్నులు తీసి నన్ను కాల్చేయ్యడానికి సిద్ధంగా వేచి వున్నారనిపించింది. నాకయితే భయంతో గొంతు పొడారి పోయింది. కానీ మనసులో నాకు నేనే సర్దిచెప్పుకోసాగాను. 'మలాలా నువ్ చావు అంచులదాకా వెళ్ళివచ్చావ్. ఇది నీకు పునర్జన్మ. ఏం భయపడకు. భయం చావుకన్నా ఘోరమైంది' అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నా.

మక్కాలో ఉన్న నల్లరాతి మసీదు, కాబాను సందర్శించి – మాకు అత్యంత పవిత్రమైన ఆ చోటులో అల్లాని ఏం కోరుకొంటే అది జరుగుతుందని ప్రతీతి – నేను కాబా దగ్గర ప్రార్థన చేస్తూ పాకిస్థాన్‌లో శాంతి నెలకొనాలని, ఆడపిల్లలకు చదువుకునే అవకాశాలు కలగాలని ప్రార్థించా. విచిత్రంగా ఆ సమయంలో నా కంట కన్నీరొలికింది. ఆ తరువాత మక్కాలోని ఇతర ఎడారి ప్రాంతాలలో ప్రవక్త నివసించిన స్థలం, ఆయన బోధనలు చేసిన స్థలం వంటి దర్శనీయ ప్రాంతాలకు వెళ్ళినపుడు ఆ ప్రాంతంలోని తిని పారేసిన

బిస్కెట్ ప్యాకెట్ కాగితాలు, తాగి పారేసిన నీళ్ళ బాటిళ్ళు చెల్లాచెదురుగా పడి ఉండడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ప్రజలకి చారిత్రక ప్రదేశాల పవిత్రతను కాపాడుకోవడంలో శ్రద్ధ లేనందుకు తిట్టుకున్నా. పరిశుభ్రత అనేది విశ్వాసంలో సగం భాగం అన్న ప్రవక్త ప్రవచనాన్ని వీళ్ళెలా మర్చిపోయారా అనిపించింది.

ఇప్పుడు నా ప్రపంచం చాలా మారిపోయింది. మా అద్దె ఇంట్లో ఉన్న షెల్ఫ్‌లు ప్రపంచవ్యాప్తంగా అమెరికా, ఇండియా, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, ఆస్ట్రియా వంటి దేశదేశాల నుండి నాకు వచ్చిన అవార్డులతో నిండిపోయాయి. నోబెల్ శాంతి బహుమతికి నా పేరు నామినేట్ చేశారు. ఆ బహుమతికి నామినేట్ చెయ్యబడిన వారందరిలో నేనే పిన్న వయస్కురాలిని. స్కూల్లో ప్రైజులు అందుకోవడం వేరు నే కష్టపడి చదివిన దానికి వచ్చిన బహుమతులు అవి. ఈ బహుమతుల వెనుక ఉన్న కష్టం వేరు. ఇవి నాకు ప్రదానం చేసిన వారందరికీ నేను కృతజ్ఞురాలిని. ప్రతి బాలికా, ప్రతి బాలుడూ చదువుకోవాలనే లక్ష్యాన్ని సాధించడానికి నేను ఇంకెంత కృషి చెయ్యాలో ఈ బహుమతులు గుర్తు చేస్తుంటాయి. ఇహ మీదట ఈ ప్రపంచం నన్ను 'తాలిబాన్ కాల్పులకు గురయిన ఆడపిల్ల' అని గుర్తించేదానికన్నా, 'చదువుకునే హక్కు కోసం పోరాడిన ఆడపిల్లగా గుర్తింపబడడమే నాకు ఇష్టం, అందుకోసం నా జీవితాన్ని పూర్తిగా అంకితం చేస్తాను.

నా పదహారవ పుట్టిన రోజున నేను ఐక్యరాజ్యసమితి సమావేశంలో ప్రసంగించడానికి న్యూయార్క్‌లో ఉన్నాను. అంత పెద్ద హాల్‌లో అంతమంది ప్రపంచ నాయకుల ముందు నిలబడి మాట్లాడమంటే నేను ముందు తత్తరపడ్డా. కానీ నాకు నేనే 'మలాలా నీకు ఇంతకంటే గొప్ప అవకాశం రాదని' సర్దిచెప్పుకున్నా. ఆ మీటింగ్‌లో ఉన్నది సుమారు 400 మంది. కానీ ఎదురుగా లక్షమంది జనం ఉన్నట్లు నే ఊహించుకున్నా. కేవలం ఆ సమావేశానికి వచ్చిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడడం మాత్రమే కాదు, ఈ ప్రపంచంలో మార్పు కోరుకునేవారందరినీ, మార్పుకోసం కృషి చేసేవారందరినీ ఉద్దేశించి నా భావాలు పంచుకోవాలని నిర్దేశించుకున్నా – పేదరికంలో మగ్గుతున్న ప్రజానీకాన్ని, ఆ పేదరికం మూలాన తమ పిల్లలకి చదువు చెప్పించలేని తల్లిదండ్రులని ఉద్దేశించి, పేదరికం మూలంగా పనిలోకి వెళ్ళాల్సి వస్తున్న పిల్లల్ని ఉద్దేశించి, ఉగ్రవాదం మూలంగా చదువుకోలేకపోతున్న పిల్లల్ని ఉద్దేశించి నే మాట్లాడాలని నిర్ణయించుకున్నా. పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు తమ హక్కుల కోసం ధైర్యంగా కొట్లాడే స్ఫూర్తిని ఇచ్చేలా మాట్లాడాలని నిర్ణయించుకున్నా.

పింక్ కలర్ సల్వార్ కమీజ్ మీద నాకు ఇష్టమైన బెనజీర్ భుట్టో తాలూకు తెల్లటి షాల్ కప్పుకుని ప్రసంగానికి ఉపక్రమించా, 'ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి పిల్లవాడూ, ప్రతి ఆడపిల్లా చదువుకునే అవకాశాలు కల్పించాలని' ప్రపంచ నాయకులని కోరాను. 'మా పుస్తకాలు, మా పెన్నులు మమ్మల్ని తీసుకోనియ్యండి. ఆ రెండే శక్తివంతమైన ఆయుధాలు. ఒక విద్యార్థి, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం – ఇవే ఈ ప్రపంచాన్ని మార్చే ఆయుధాలు' అని చెప్పా. నా ఉపన్యాసం వాళ్ళకి నచ్చుతుందో, లేదో అనుకున్నాగానీ – నా ప్రసంగం పూర్తికాగానే హాల్‌లో ప్రతినిధులందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో తమ హర్షం వ్యక్తం చేశారు. అది చూసి అమ్మ కన్నీటి పర్యంతం అయిపోయింది. నాన్నేమో 'మలాలా ఇవాల్టి నుంచి నువ్ మా ఒక్కరి కూతురివేకాదు. మాలాంటి తల్లిదండ్రులు అందరికీ చెందిన ఆడపిల్లవిరా' అని మెచ్చుకున్నాడు.

ఆ రోజునే తొలిసారిగా అమ్మ మాతోపాటు కలిసి ఫోటో తీయించుకోవడానికి ఒప్పుకుంది. ఇప్పటిదాకా తను బురఖా వెనుకే తన జీవితాన్ని గడిపింది. తొలిసారిగా కెమెరా ముందు మొహం మీది బురఖా తొలగించి నిలబడింది.

మరుసటిరోజు అందరం కలిసి టిఫిన్ చేస్తుండగా చిన్న తమ్ముడు అటల్ 'అక్కా, నువ్వెందుకు ఇంత ఫేమస్ అయిపోయావ్. ఇంతకీ నువ్వేం చేసావ్' అని అడిగాడు. వాడు న్యూయార్క్ నగరంలోని 'లిబర్టీ స్టాట్యూని' చూసి చాలా ఆశ్చర్యపోయాడు. చాలాచాలా ఇష్టపడ్డాడు. అదే ఆశ్చర్యం కనబడింది నాకు వాడి కళ్ళల్లో ఆ ప్రశ్న అడుగుతున్నప్పుడు.

నా ఐక్యరాజ్యసమితి ప్రసంగం తర్వాత దేశ విదేశాల నుండి నాకు ఎన్నో సంఘీభావ సందేశాలు వచ్చాయి. కానీ నా దేశంవాళ్ళు ఎందుకో మౌనం వహించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో రాసిన కొద్దిమందీ నాకు వ్యతిరేకంగా కామెంట్లు రాశారు. 'నేను పేరు కోసం పాకులాడుతూ ఇదంతా చేస్తున్నానట!' ఇంకెవరో ఇలా పోస్ట్ చేశారు. 'నీ దేశ ప్రతిష్ట నీకు లెక్కలేదు. ఇక్కడ నువ్ చదువుకున్న స్కూల్ గురించి

నీకు పట్టదు. నీకు కావల్సిందల్లా విదేశాల్లో కులాసాగా, విలాసంగా బతకడం. అది నీకు దక్కిందిగా.'

ఇలాంటి వ్యాఖ్యానాలు చూసి నేను మనసు కష్టపెట్టుకోలేదు. మా దగ్గర నాయకులు, రాజకీయవేత్తలు వాగ్దానాలు చేసీచేసీ వాటిని గాలికి వదిలేసిన, వదిలేస్తున్న అనుభవం వాళ్ళతో అలా మాట్లాడింప చేస్తుంది. మా దేశంలో పరిస్థితులు ఇప్పుడు ఇంకా దిగజారిపోతున్నాయి. రోజూ ఎక్కడో అక్కడ జరుగుతున్న ఉగ్రవాద దాడులు నా జాతిని దిగ్భ్రమకు గురిచేస్తున్నాయి. ప్రజలు పరస్పర విశ్వాసాన్ని కోల్పోతున్నారు. నా మీద ఇంత అసహనం వ్యక్తం చేస్తున్న వారందరికీ నే చెప్పేది ఒకటే మాట – నేను చేస్తున్న కృషి మన పిల్లల చదువుల కోసమే. మన దేశంలో శాంతి నెలకొనడం కోసమే. అది అర్థం చేసుకుంటే చాలు.

ఇవన్నీ అలా ఉంచితే అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన ఉత్తరం నాకు ఒక తాలిబాన్ కమాండర్ నుండి అందింది. అతని పేరు అదాన్ రషీద్. పాకిస్థాన్ వాయు విమాన దళంలో పనిచేశాడు. ముషారఫ్ మీద హత్యాప్రయత్నానికి ఒడిగట్టాడనే అభియోగం మీద 2003లో అరెస్టు చేసి జైల్లో పెట్టారు అతన్ని. తను ఇప్పుడు జైలు నుండి తప్పించుకున్నాడు. అతను నాకు రాసిన ఉత్తరంలో "తాలిబాన్లు నీ మీద దాడి చేయడానికి కారణం నువ్ ఆడపిల్లలకు చుదువుకునే హక్కుకోసం కొట్లాడుతున్నావ్ అని కాదు. నువ్ ఇస్లామిక్ రాజ్యస్థాపనకు వ్యతిరేకంగా ఉన్నావని. నీ మీద కాల్పులు జరిగాయని తెలియగానే నేను చాలా షాకయ్యాను. నాకు గనక అవకాశం ఉండి ఉంటే ముందే నిన్ను హెచ్చరించేవాడిని. జరిగింది ఏదో జరిగిపోయింది. నిన్ను క్షమించేస్తున్నాం. నువ్ పాకిస్థాన్‌కు తిరిగి వచ్చేయ్. బురఖా ధరించి ఏదన్నా మదరసాలో చేరి చదువు నేర్చుకో" అని కోరాడు.

ఆ ఉత్తరానికి తగిన జవాబు ఇమ్మనమని చాలామంది జర్నలిస్టులు నన్ను అడిగారు. వాళ్ళతో నేను – "ఇదంతా చెప్పడానికి అతనెవరు. తాలిబాన్లు మేం ఎన్నుకున్న పాలకులు కాదే. ఇది నా జీవితం. నా జీవితాన్ని నేను కోరుకున్నట్లు జీవిస్తా" అని అన్నాను. మొహమ్మద్ హనీఫ్ అనే జర్నలిస్టు ఈ ఉత్తరాన్ని ఆధారం చేసుకొని "అసలు మలాలా మీద కాల్పులే జరగలేదు. తాలిబాన్లు ఆ పని చేసి ఉండరు" అని ఇంతకాలం జరిగిన ప్రచారానికి ఇహ ఫుల్‌స్టాప్ పడినట్టే. తాలిబాన్‌లే స్వయంగా ఈ దాడికి బాధ్యత వహిస్తూ రాసిన ఉత్తరమే దానికి తిరుగులేని సాక్ష్యం అని ఒక వ్యాసం రాశాడు.

నాకు మా దేశానికి తిరిగి వెళ్ళాలనే ఉంది. నాన్నతో ఎప్పుడూ ఆ మాట అన్నా "లేదు జానీ నీ ట్రీట్‌మెంట్ ఇంకా పూర్తికాలేదు. అదీగాక ఇక్కడ స్కూల్లో చదువు బాగానే వుందిగా. ఇక్కడే చదువుకో. ఇంకా పైకి రావడానికి, నువ్ అనుకున్నది సాధించడానికి పనికివస్తుంది" అంటూ ఆ ఆలోచన విరమింపచేస్తున్నాడు.

ఒకరకంగా చూస్తే నాన్న చెప్పేదీ నిజమే అనిపిస్తుంది. ఇక్కడ చదువు బాగానే చెప్తున్నారు. చక్కటి విజ్ఞానం అబ్బుతుంది. జ్ఞానమే మనిషిని పదును తేల్చే ఆయుధం కదా. నా భవిష్య పోరాటం మరింత పదునెక్కడానికి ఇక్కడి చదువు ఉపకరిస్తుందనే నమ్మకం నాకు ఉంది.

చదువుకోవడం అనేది మనిషి ప్రాథమిక హక్కు. ఇది కేవలం పశ్చిమ దేశాలకు సంబంధించినందుకే కాదు. ఇస్లాం కూడా మనిషికి అలాంటి హక్కునిచ్చింది. బాలబాలికలందరూ స్కూలుకు వెళ్ళాలనే ఇస్లాం ప్రబోధిస్తుంది. అల్లా మనలని జ్ఞానవంతులు కావాలని కోరుకుంటాడు అని ఖురాన్‌లో రాయబడింది. ఆకాశం నీలంగా ఎందుకుంది? సముద్రాలు, నక్షత్రాలు ఎట్లా పుట్టాయి. వాటి చరిత్ర ఏమిటో తెలుసుకోవాలని ఖురాన్ చెబుతుంది.

అయితే ఇదేమంత తేలికయిన వ్యవహారం కాదు. ఈ హక్కుకోసం చాలా పెద్ద పోరాటమే జరగాలి. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 5 కోట్ల 70 లక్షల మంది పిల్లలు ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ఇందులో 4 కోట్ల 2 లక్షల మంది ఆడపిల్లలు. మా దేశం విషయానికొస్తే 51 లక్షల మంది పిల్లలు ప్రాథమిక విద్యకు నోచుకోవడంలేదు. పైపెచ్చు మా రాజ్యాంగంలో చదువుకోవడం పిల్లల హక్కు అని రాయబడి ఉంది. వయోజనుల్లో 50 లక్షల మంది నిరక్షరాస్యులే. అందులోనూ మూడింట రెండువంతుల మంది ఆడవాళ్ళే. మా అమ్మలాగా.

అయినా ఈ రోజుకీ మా దేశంలో స్కూళ్ళని పేల్చేస్తున్నారు. చదువుకోవడానికి వెళ్తున్న ఆడపిల్లల్ని అన్యాయంగా హతమారుస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో ఇంతకు ముందు ఒకసారి నే చూసి వచ్చిన కరాచీలోని ఆడపిల్లల స్కూలు మీద దాడి జరిగింది. బహుమతి ప్రదానోత్సవం జరుగుతున్న స్కూలు ఆవరణలోకి ఒక గ్రెనేడు, ఒక బాంబు విసిరారు. ఆ దాడిలో స్కూలు హెడ్మాస్టరు అబ్దుల్

రషీద్ మరణించారు. ఎనిమిదిమంది పిల్లలు – అందరూ ఐదునుండి పదేళ్ళలోపు వయసువాళ్ళే గాయపడ్డారు. ఆ రోజున ఆ వార్త చూసి అమ్మ కన్నీరు పెట్టుకుంది. “అయ్యో ఇంట్లో పసిబిడ్డలు నిద్దరపోతుంటే వాళ్ళెక్కడ లేచిపోతారో అని నుదుటిమీద పడ్డ ముంగురులు కూడా సరిచెయ్యను వెనక ముందులాడతారే తల్లులు. అలాంటిది ఈ తుపాకులకి, బాంబులకి బలయిపోతున్న పిల్లల తల్లులు గర్భశోకంతో ఎంతలా తల్లడిల్లిపోయి ఉంటారోగదా. పసిబిడ్డల మీద బాంబులు వేసేదానికి పాపిష్టోళ్ళకి చేతులెలా వచ్చాయో” అని గొణుక్కొంటూ ఏడ్చుకుంది కాసేపు.

ఇంతకన్నా ఘోరమైన దురాగతం జూన్‌లో జరిగింది. క్వెట్టా నగరంలో ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు తనతో సహా ఒక బస్సుని పేల్చివేసిన దుర్ఘటనలో మొత్తం 14 మంది ఆడపిల్లలు చనిపోయారు. అందరూ కాలేజీలకు వెళ్ళే ఆడపిల్లలే. ఇంకో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారికి చికిత్స చేస్తున్న నర్సుల మీదా తాలిబాన్లు కాల్పులు జరిపారు. కేవలం తాలిబాన్లు చేసే ఈ ఘోరాలే కాదు. ఒక్కోసారి డ్రోన్ దాడులలో అమాయక పౌరులు, పిల్లలు చనిపోతున్నారు. కొన్నిసార్లు యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు ఆకలికి ప్రాణాలు వదుల్తున్నారు. ఒక్కోసారి స్వంత కుటుంబీకులే పరువు కోసం హత్యలకు ఒడిగడుతున్నారు. స్వాత్ లోయకి ఉత్తరంగా ఉండే గిల్‌గిత్ అనే పట్టణంలో నా ఈడు ఆడపిల్లలు ఇద్దరు సంప్రదాయబద్ధమైన దుస్తులు, తలకి స్కార్ఫ్‌లు ధరించి, వానలో ఆనందంతో చిందులు వేస్తూ తీసిన వీడియోని పోస్ట్ చేశారని వాళ్ళ అన్నయ్యే ఆ ఇద్దరినీ హత్య చేశాడు. పాకిస్థాన్‌లో మిగతా ప్రాంతాలలో పోలిస్తే మా స్వాత్ లోయ ప్రశాంతంగా ఉందనే చెప్పాలి. అయితే ఈ రోజుకీ స్వాత్ లోయలో పెద్ద ఎత్తున సైనిక దళాలు మోహరించి ఉన్నాయి. అంతకు నాలుగేళ్ళ క్రితమే తాలిబాన్లను ఆ లోయనుండి తుడిచిపెట్టేశాం అని సైన్యం ప్రకటించింది. ఫజలుల్లా ఇప్పటికీ తప్పించుకు తిరుగుతానే ఉన్నాడు. మా బస్ డ్రైవర్ మాత్రం ఇప్పటికీ గృహ నిర్బంధంలోనే ఉన్నాడు. ఒకప్పుడు పర్యాటకులకు స్వర్గధామంగా విలసిల్లిన ఈ ప్రాంతం ఇవాళ చావుల మదుంగా కనబడుతుంది. ఎవరన్నా విదేశీయులు ఇక్కడికి రావాలంటే ఇస్లామాబాద్ నుండి నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉంటుంది ముందు. స్వాత్ లోయలో హోటళ్ళూ, చేతివృత్తులు, కలంకారీ బొమ్మల షాపులు వెలవెలబోతున్నాయి. పర్యాటకులు మళ్ళీ ఇక్కడికి ఇంతకు ముందులా రావడానికి ఇంకెన్నేళ్ళు పడుతుందో? ఈ ఏడాది కాలంలో నేను చాలా ప్రదేశాలు సందర్శించాను. అన్నింటిలోకి మా స్వాత్ లోయే నాకు అద్భుతమైన, సుందరమైన ప్రదేశంగా అనిపిస్తుంది. స్వాత్ లోయని మళ్ళీ నే ఎప్పుడు చూస్తానోగానీ, నే అక్కడికి వెళ్ళడం మాత్రం ఖాయం. రమదాన్ రోజున మా పెరట్లో నాటిన మామిడి టెంక మొక్క మొలిచిందో, లేదో మరి. భవిష్యత్ తరాల వాళ్ళ కోసమైనా ఆ మొక్కకి ఎవరన్నా నీళ్ళు పోస్తూ ఉండి ఉంటే ఎంత బావుండు.



నోబుల్ పురస్కారంతో మలాలా

ఇవాళ మళ్ళీ మరోసారి అద్దం ముందు నిలబడి నేను చూసుకున్నా. ఒకప్పుడు ఇలానే అద్దం ముందు నిలబడి ‘నన్ను ఇంకొక్క అంగుళం పొడవు పెరిగేలా చూడమని’ అల్లాని ప్రార్థించా. అదే జరిగితే వందసార్లు ప్రత్యేక ప్రార్థనలు చేస్తా అని మొక్కుకున్నా. ఇవాళ నే ఆకాశమంత ఎత్తుకి ఎదిగేలా దీవించాడు అల్లా. అందుకే అల్లాకి నా మొక్కు చెల్లించుకున్నా. నాకు దేవుడంటే నమ్మకం ఉంది. అల్లా దయకు నే కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉంటాను. నన్ను ఇంత ఎత్తుకు ఎదిగేలా చెయ్యడంతోపాటు నా మీద మరిన్ని బాధ్యతలు కూడా మోపాడు. ప్రతి ఇంట్లో శాంతి, ప్రతి వీధిలో, ప్రతి పల్లెలో, ప్రతి పట్టణంలో, ప్రతి దేశంలో శాంతి నెలకొనాలి. ఇది నా కల. ఈ భూప్రపంచంలో ఉన్న బాలబాలికలు అందరూ చదువుకోవాలి. బల్లమీద నా స్నేహితులతో కలిసి కూచుని పాఠాలు చదువుకోవడం అనేది నా హక్కు నాలాంటి పిల్లలందరి హక్కు కూడా. ఈ భూమ్మీద నివసించే ప్రతి మనిషీ మొహాన చిరునవ్వుతో ఆనందమయ జీవితం గడపాలనేది నా ఆశా, నా ఆకాంక్ష.

నేను మలాలాని, నా ప్రపంచం మారిపోయిందేగానీ నేను మారలా – అదే మలాలాని.

**(ఐద్వ, ఆంధ్రప్రదేశ్ వారు ప్రచురించిన పుస్తకం నుంచి)**

# గదబ సంస్కృతి

– శ్రీమంతుల దామోదర్

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజనులలో ఎక్కువ తెగలు విశాఖ పట్టణం అటవీప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో మాలి, ఖోండ్, నూకదొర, కొండదొర, ఖోటియా, భగత, గౌడ, వాల్మీకి పోర్జ, కమ్మర, గదబ మొదలైన తెగల వారు ఉన్నారు. గదబలు జిల్లాలోని జి.మాడుగుల, ముంజింగ్‌పుటు, పెద్దబయలు, హుకుంపేట, అనంతగిరి, అరకు, పాడేరు, చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లోను, పొరుగు జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరు తమను తాము గదబ భాషలో మొదలి, మొగిలిగా పిలుచుకుంటారు. గదబల్లో ఎనిమిది రకాల వారు ఉన్నట్లు తెలుస్తుంది. వీరి మాతృభాషైన గదబతో పాటు, తెలుగు, ఖోండ్ భాషను కూడ మాట్లాడుతారు.

గదబల ఇంటి పేర్లలో కొర్ర, వంతల, పాంగి, కిల్లో, గుంట పాతర, చెదల మొదలైనవి కలవు. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం. కాబట్టి వ్యవసాయానికి అనుకూలంగా నీటి సదుపాయం ఉన్న అటవీప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తుంటారు. ప్రవృత్తి మాత్రం వేట, జీలుగు కల్లు తీయడం; గదబలు పూర్వ కాలంలో నేత నేసేవారు. కాలక్రమేణా ఆ వృత్తి అంతరించిపోయింది. తర్వాత బ్రిటిషుకాలంలో బోయిలుగా ఉండేవారు. రవాణా వ్యవస్థ విస్తరించడంతో బోయిల వృత్తి కూడ కనుమరుగైపోయింది.

ఏ గిరిజన తెగల్లోనైనా మనకు కనబడేది ప్రకృతిని ఆరాధించడం. వీరికి అన్ని విధాల జీవనం సాగించుటకు ప్రకృతియే ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమవుతూ ఉంటుంది. కాబట్టి వీరు ప్రకృతితో మమేకం కావడం దానిని కాపాడుకోవాలనే తపన వీరిలో ఉంటుంది. గదబలకు కులపంచాయతీ ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. వీరికి సంబంధించిన మత, సాంఘిక, ఆచార సంబంధాలు, పండుగలు నిర్వహించే రోజులను నిర్ణయించడం, వ్యక్తిగత వివాదాలు పరిష్కరించడం వంటి విషయాల్లో కుల పంచాయితీ సభ్యుల నిర్ణయానికి ప్రధాన పాత్ర ఉంటుంది. దీని కోసం వారసత్వంగా వస్తున్న వారినే కులపెద్దలుగా ఎన్నుకుంటారు. వీరిలో 'మున్సబ్' ఒకరు. ఇతను గ్రామ పెద్దగా ఉంటూ వివిధరకాల సమస్యలను 'చదురు' దగ్గర పరిష్కరిస్తాడు. ఇతనికి సహాయంగా 'దీశారీ' కూడ ఉంటాడు. వివాహాది శుభకార్యాల్లో ఇతని పాత్ర ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా శుభకార్యాలకు ముహూర్తాలు చెప్పేవాడు 'గురువడు'. దేవతల ఉత్సవాల్లో, పండుగల్లో పూజలు చేసేవాడు 'పూజారి'. గూడెం వారికి వచ్చే వ్యాధులను నయం చేసి ప్రాణాలు కాపాడేవాడు 'గుణ్యా'. మున్సబ్ చెప్పిన విషయాలను ప్రజలందరికి తెలియజేసే బాధ్యత 'చల్లాన్' (బంట్రోతు)కు ఉంటుంది ఈ విధంగా గూడెంవారికి ప్రయోజనాలు కల్గేవిధంగా వీరందరు వ్యవహరిస్తారు. గదబలు ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారంతా ఒకే కుటుంబం వలె కలిసి ఉంటారు. సంపాదనకు ప్రాధాన్యత ఇవ్వరు. వీరు అడవిలో నివసిస్తున్నప్పటికీ పరిసరాలను అవసరమున్నంత వరకే ఉపయోగించుకుంటారు.


గదబ స్త్రీ

గదబల జీవన విధానంలో ప్రతి అంశం ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకుంటుంది. వీరు పెట్టుకునే పేర్లలో పుట్టిన వారాన్ని బట్టి, నక్షత్రాలను బట్టి, రాశులను బట్టి, పూర్వీకుల పేర్లు మొదటి అక్షరం ఉండేవిధంగా పెట్టుకుంటారు. ఈ పేర్లు గురువడు నిర్ణయించిన ముహూర్తానికి పెడతారు. వీటితో పాటు వ్యక్తుల ప్రవర్తనను బట్టి, వారు చేసే పనులను బట్టి, సంఘటనలను బట్టి ఇతరులు ఎట్కారం (వెటకారం, ఎగతాళి) పేర్లతో పిలుస్తుంటారు.

గదబల ఇంటి నిర్మాణాలు కూడ ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి ఇల్లు విడివిడిగా, ఎదురెదురు వరుసల్లో నిర్మించుకుంటారు. ఈ నిర్మాణాల వలన ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకునేందుకు వీలు ఉంటుంది. ఇల్లు ప్రారంభంలో నేలను చదును చేసుకొని ఆ స్థలం నివాసయోగ్యంగా ఉందో లేదో తెలుసుకొనుటకు 'కోటి' వేసుకుంటారు. ఇది ఒకరకమైన ఎన్నిక పద్ధతి. ఆ స్థలంలో రాత్రి ఆకులో బియ్యం పోసి గంగదేవుడి పేరుమీద పెడతారు. తెల్లవారి ఆకులోని బియ్యం పెచ్చు (ఎక్కువ) ఐతే ఆ ఇంటివారు సుఖంగా ఉంటారని, ఒక వేళ బియ్యం తక్కువైతే కష్టాలు వస్తాయని ఆ స్థలాన్ని

వదులు కుంటారు. ఇంటి నిర్మాణ ప్రారంభంలో మధ్యలో నేరేడు రాటను పాతి, దానిని సంకు దేవుడిగా పూజిస్తారు. దీనిని ప్రతి పండుగలో కూడ పూజిస్తారు. నేరేడు రాటను ఇంట్లో పాతడం శుభసూచకంగా భావిస్తారు. ఇది ఆరోగ్యపరంగా మేలు చేస్తుందని విశ్వసిస్తారు. వీరు ఇంటిని అందంగా శుభ్రంగా ఉంచుకుంటారు. కొత్తగా ఇంట్లోకి వెళ్లేముందు అడవిలో దొరికే దుంపలు, వెదురు కొమ్ములతో ప్రత్యేకంగా వంట చేస్తారు. ఇంట్లో మట్టితో చేసిన కుండలను, కాగులను వాడుతున్నారు. మాను తిరుగలి, రోళ్లు, తిరుగలి, వెదురు బుర్కిలు (గంపలు) గరిసెలతో పాటు వివిధ రకాల దినుసులు, పొయ్యి మీద ఎండ బెట్టుకునేందుకు డంగీరను (వెదురు చాప) ను వేలాడతీస్తారు. వంట చేసుకొనేందుకు మట్టి తపాలాలు మరియు నూరేరాయి, తవ్వ, చేట వంటి వస్తువులే వీరి ఆస్తి.

గదబలు పూర్వం వస్త్రాలను నేసే వారు. స్త్రీలు ప్రత్యేకంగా 'కేరంగి' వస్త్రాలను నేసి కట్టుకునేవారు. పెండ్లిలో నూతన వధువు ఈ వస్త్రాన్ని ధరించే ఆచారం ఉండేది. ఆడవారు చీర కట్టుకునే విధానమే వీరిని గదబలుగా గుర్తుపట్టుతారు. ఆభరణాల్లో ముక్కుకు కమ్మితో పాటు, ముక్కు మధ్యలో 'దుండి' ఆభరణం వీరికి ప్రత్యేకమైంది. గదబ స్త్రీలు నుదిటిపైన, కణతల పైన గొదినే (పచ్చబొట్టు) ను చుక్కల రూపంలో నెలవంక రూపంలో అలంకరించు కుంటారు. ఈ పచ్చబొట్టును చెరిపేయాలనుకుంటే బంగారు చెట్టు తీగను మెత్తగా నూరి దానిపైన పెడితే అది మలిగి పోతుంది. ఇలాంటి ఎన్నో రకాల చిట్కాలు వీరికి కొట్టిన పిండిలాంటివి. గదబలు ఇంటిల్లిపాది మడ్డికల్లు, జీలుగు కల్లు, బుడుగు కల్లు తాగడం, ఆడ, మగ తేడా లేకుండా చుట్ట కాల్చడం వీరికి అలవాటు. ఆముదాలు, గానుగ పిక్కలతో నూనె తయారు చేసుకొని అడవిలోని దోమలు శరీరానికి కుట్టకుండా రాసుకుంటారు.

గదబల జీవిత చక్రపు ఆచారాల్లో పుట్టుక, పేరు పెట్టడం, వెంట్రుకలు తీయడం, సమర్త, పెళ్లి, మరణం లాంటివి ప్రధానంగా కనబడుతాయి. ఈ కార్యక్రమాల్లో 'దీశారీ' పాత్ర ఎక్కువగా ఉంటుంది. సమర్త అయిన అమ్మాయికి ప్రత్యేకంగా నేరేడు రాటలతో పాక వేసి అందులో కూర్చోబెడతారు. ఈమెకు వెదురు కొమ్ములు, మినపప్పులతో చేసిన వంటకాలు పెడతారు. వీరి పెళ్ళిళ్ళు ఎక్కువ మేనరికం సంబంధాలకే ఎక్కువ ఇష్టపడుతారు. పెళ్లి తంతు అబ్బాయి ఇంటి దగ్గరే జరుగుతుంది. అమ్మాయి, అబ్బాయిలకు దిశారీ పసుపు నీళ్లు పోస్తారు. దీనినే 'బిషా' పోసుకోవడం అంటారు. తరువాత పసుపు కొమ్ముతో ఉన్న తాళిని అమ్మాయి మెడలో కట్టిస్తారు. వీరికి సంప్రదాయ సిద్ధంగా వున్న వాద్యాలు డక్కి, డప్పు, కిడ్డి, మోరి, లాంటివి వాయిస్తూ, ధింసా ఆడుతూ అమ్మాయిని అబ్బాయిని ఊరేగిస్తారు. గదబలు ఏ శుభకార్యాలకు అయిన బంధువుల – ఇంటికి వెళ్తున్నప్పుడు, తమవంతు బాధ్యతగా, బియ్యం, పప్పులు, కూరగాయలు, మేక, గొర్రె వంటివి వారి వారి ఆర్థిక స్థోమతను బట్టి తీసుకు వెళ్తారు. దీని ద్వారా ఆ కార్యక్రమానికి వీరు సహాయపడినట్లుగా భావిస్తారు.

సంకుదేవుడిని,పెద్ద దేవుడిని, కుమ్మరమ్మ తల్లి, మోదకొండమ్మ, గనికాలమ్మ దేవతలను పూజిస్తారు. వీరు జరుపుకునే పండుగల్లా సంక్రాంతి పండుగ. ఈ రోజు పశు వులను పూజిస్తారు. ఈటింగ్ పండగకు వ్యవసాయ పనిముట్లు పూజ చేసి, విత్తనాలను పూజించి వాటిని చేలో విత్తుకుంటారు. గదబలు పండుగలకు, సంతోష సమయాల్లో బుడుగు కల్లు తాగడం, ధింసా నృత్యం చేయడం తప్పని సరి. చలి కాలంలో జీలుగు కల్లు తీయడంతో పాటు అటవి ఉత్పత్తులైన కొండ చీపురు, వెదురు, అడ్డపిక్కలు, చింతపండు, తేనె, నరమామిడి చెక్క, జిగురు, పనసపండ్లు లాంటివి సేకరించి సంతలో అమ్ముకుంటారు. వీటన్నింటి కంటె ముఖ్యమైనది వ్యవసాయం. కొండ ప్రాంతం నుండి వచ్చే నీటిని పంట పొలాలకు ఉపయోగించుకుంటారు. అదే విధంగా పోడు వ్యవసాయానికి కూడ అధిక ప్రాధాన్యత ఇస్తారు. గదబలు వీరికి వచ్చే వ్యాధులకు వీరే నయం చేసుకోవడంలో నేర్పరులు. పాము, తేలు, వంటి క్రిమి కాటకాదులవల్ల వచ్చే ప్రమాదాలను నివారించుకునేందుకు అడవిలో దొరికే వన మూలికలతో, ఆకులతో వైద్యం చేసుకుంటారు. వీరికి వైద్యంలో సహాయం చేసేందుకు 'గుణ్యా' అనే వ్యక్తి అందరికి అందుబాటులో ఉంటాడు. జ్వరం, కడుపు నొప్పి లాంటి వాటికి కస్తూరి దుంప, వస దుంప, డక్కిచెక్క, పతాల గడ్డలను నీటిలో ఉడికించి నూరి తింటె తగ్గిపోతుంది. దుస్సా ఆకును మెత్తగా నూరి శరీరానికి రాసుకుంటె జ్వరం తగ్గిపోతుంది. ఉమ్మెత్త దుంప ఆకురసం తీసి తలనొప్పి, ఉన్న చోట రాస్తే తగ్గిపోతుంది. ఇదే రసంను కురులున్న చోట, పాము, తేలు కాటు వేసిన చోట రాస్తే విషం శరీరానికి పాకదు. ఇలాంటి ఎన్నో రకాల వ్యాధులను తగ్గించుటలో వీరికి గొప్ప ప్రావీణ్యం ఉంది.

శ్రీమంతుల దామోదర్
వరంగల్.
ఫోన్ : 998 913 9136

# గీతం – సంగీతమ్

అనురాధ, అవును – పాట ఆగిపోయింది. గానా కతమ్ హోగయి.

జీవితంలో మనకు కావలసినదేదో గుర్తించటం చాలా కష్టం! మన ప్రతిభ, మన తపన, వీటి ఆంతర్యం అంతిమ విలువలు ఏమిటో తెలియకపోవటం విచారకరం.

ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తీ తన చిన్న ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు. దురదృష్టం, అది మొదటిదానికి భిన్నంగా ఉండటమే.

అలాగే ప్రతివ్యక్తీ తన చిన్న ప్రపంచంలోనే ఉండిపోలేదు, మరో వ్యక్తితో కలసి జీవించవలసి వస్తుంది. ఉదాహరణకు జీవిత భాగస్వామి. ఇక్కడ ఎవరి ప్రతిభ వారిది. ఘర్షణకు, త్యాగానికి తావున్న ప్రపంచాలివి. ఏది ముఖ్యమో తేల్చుకోవటమే వివేకమూ, విషాదము కూడా. ఇందుకు చక్కని ఉదాహరణ హృషికేశ్ ముఖర్జి *అనురాధ*. ఇందులో విషాదం 'లేక'పోవటం కాదు. వ్యక్తిగత ప్రతిభను, భర్త నిర్వర్తించే సమాజ – ప్రజల సేవ కోసం త్యాగం చేయగలగటం. ఇంతటి సున్నితమైన కథకు విషాద సంగీతాన్ని రవిశంకర్ అందించటం మరింత విషాదాన్ని సృష్టించింది.

విషాదమంటే ఏడుపులు, పెడబొబ్బలు కాదు. మనకు కావలసినది అందుబాటులో ఉండీ అందకపోవటం. అలాగే ఆనందం అంటే కారులు షికారులు కాదు. తన ప్రతిభను సంసారం కోసం, సమాజం కోసం వినియోగించటం.

ఇప్పటి దురదృష్టం ఏమిటంటే ఈ విలువలు మారిపోవటం. సంపద వెనక వెర్రిగా పరుగులు పెట్టటం. ముఖ్యంగా వైద్యవృత్తి నిర్వచనం మారిపోవటం. సరే! విలువలు కాలంతోపాటు మారిపోతాయి కదా!



ఆంద్రీ రూయి

భావసౌందర్యాన్ని, స్వరమాధుర్యాన్ని ఆస్వాదించటానికి రాగవ్యాకరణం తెలియాలా? ఆంద్రీ రూయి వయొలిన్ సోలో, కన్సర్ట్ వినండి (ఫ్రాంక్ సినాత్రా – 'మై వే'; రోమియో జూలియట్ – 'లవ్ థీమ్')... మీకు సంగీతంలో సరిగమలు, రాగాలు తెలియవలసిన పని లేదు. మీ హృదయం ద్రవిస్తుంది, కళ్ళు తడిసిపోతాయి.



సారా షాంగ్

అంతటి క్లాసికల్ సంగీతం, రసాస్వాదన పొందగలుగుతున్నాం మనలాంటి సామాన్యులం.

సారా షాంగ్ ఫిల్‌హార్మోనిక్ పెర్‌ఫార్మెన్స్ (అలెగ్రో మోడరేటో..) కళ్ళతో వినండి. మిమ్మల్ని మీరు మరచిపోతారు. దీనికి ఏ సంగీత జ్ఞానం అవసరంలేదు. అలాగే పావ్‌రోటీ, ఒపేరా వినండి. భాష, గీతాలు అర్థం కావలసిన అవసరమే లేదు. మీరు కరిగిపోతారు. ఇవన్నీ ఎలా సాధ్యం?

మనం దురదృష్టవంతులం. త్యాగరాజు, అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య వంటి మహామహులు మనకు అమరమైన సంగీతాన్ని వదలి, అద్భుతమైన గీతాల్ని అందించి వెళ్ళిపోయారు. కానీ, మన 'సంగీత పండితులు' వాటిని సామాన్య జనానికి, అంటే మీకు నాకు అందుబాటులో లేకుండా చేశారు. అదేదో 'బ్రహ్మపదార్థం'లా, సామాన్యులు అందుకునే అర్హత లేనంతగా 'తీర్చిదిద్దారు'. సరిగమల గమకాలు తెలియకుండా మన 'శాస్త్రీయ సంగీతా'న్ని ఆస్వాదించలేకపోతున్నామే – ఈ కిటుకు ఎక్కడ ఉంది?

ఇది అన్యాయమని అనుకుంటూనే మనం దీనికి దూరంగా జరిగిపోయి, సినిమా సంగీతమే సంగీతమని సంతృప్తి పడుతున్నాం. మన అదృష్టం ఘంటసాల వంటి పునీతుడు మనకు అమరమైన గీతాలను ముఖ్యంగా ప్రత్యేక (ప్రైవేట్ సాంగ్స్) గీతాలను అందించి, చివరిగా భగవద్గీతను వినిపించి వెళ్ళిపోయారు. మన మూర్ఖత్వం ఆయన గీతను 'మంచుపెట్టెల'కు వాడుతున్నాం. ఘంటసాల, మహ్మద్ రఫీ ఎంతటి ప్రతిభావంతులో అంతకంటే ఉన్నతమైన వ్యక్తిత్వం గలవారు. ఏమాత్రం అహం, కీర్తికాంక్షలూ లేని నిగర్వులు.

మరోవిషయం! 1950 నుంచి 1970 వరకు మన కవులే సినిమా గీతాలు రాశారు (దేవులపల్లి, శ్రీశ్రీ, కరుణశ్రీ,

సముద్రాల, మల్లాది వగైరా). వాటికి బాణీలు కట్టి, పాడించారు సంగీత దర్శకులు. ఇక్కడ కూడా మనకు దురదృష్టం మరోరూపంలో దర్శనమిచ్చింది. ఫక్తు వ్యాపారమయిపోయిన సినిమాని ఇళయరాజా, రెహమాన్‌లు ఆక్రమించి, గీతానికి చరమగీతం పాడారు. విడ్డూరం వీరు ఆస్కార్ వెలుగుల్లో మెరిసిపోవటం. ఇంకా తరువాత మిమిక్రీ గాయకులు, సంగీత దర్శకులు తయారుగా ఉండటం. స్టేజి షోలు, 'సాంస్కృతిక కార్యక్రమా'లుగా ప్రముఖ దినపత్రికలు వర్ణించటం. పొట్టకూటి కోసం ఎడ్లబండి వేదికమీద నాలుగు పాటలకు చిందులు వేసే వారి పొట్ట కొట్టి, తమ చానళ్ళలో సెలబ్రెటీలు అనేవారితో అవే స్టెప్పులు నిస్సిగ్గుగా వేయించటం ఈనాటి సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వచనం.

ముందు చెప్పిన అనురాధ 'గానా కతం హోగయి' దగ్గరకు వస్తే అప్పుడే 'తారల మిలమిలలు చూసి ఎన్నాళ్ళయింది' అంటుంది అనురాధ. పూర్ణచంద్రుని పూర్తిగా చూడలేకపోతున్నామే అని వాపోతుంది. ఇప్పుడే ఐసన్ హోవర్ మాటలు గుర్తుకువస్తాయి – 'రండి, గ్లాసు, ప్లాస్టిక్ గదులు వదలి బైటికి రండి. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి చూడండి' అంటాడు అమెరికా అధ్యక్షుడు.

నేను, నాగేశ్వరరావుగారు అమలాపురం వెళ్ళి, అక్కడ సమీపంలోని సముద్రతీరంలోని అమావాస్య రాత్రి చుక్కల పందిరి క్రింద కాళ్ళు రెండూ అలల తాకిడికి వదలి, మోరలు పైకెత్తి కూర్చుంటాం. పైన నల్లని ఆకాశం, తారల లోకంతో మా చుట్టూ వంగి, గొడుగు పడుతుంది. అనంతాకాశంలోని నిశ్శబ్ద సంగీతం వింటాం. అలలు చిన్నగా లయవేస్తుంటాయి.

## మోగేతంత్రులు

ఆలాపనకు తలలూపనిదెవరు ?

సంగీతానికి తాళమెవరు వేయరు?

సకల జీవరాశులను కదిలించే ఈ సంగీతం ఏమిటి? ఎక్కడిది?

సంగీతం మనల్ని కాలగతినుంచి కాపాడుతుంది.

అంటే మనకు వయస్సు మళ్ళకుండా ఆయుష్షు పెంచుతుంది.

ప్రకృతిలో రంగులున్నట్లు – రాగాలూ ఉన్నాయి!

గాలి ఈల వేస్తుంది. కోయిల పాట పాడుతుంది. ఉరుములు దరువులూ వేస్తాయి! ఒళ్ళు పులకరిస్తుంది. ఏమిటా బంధం? ఎక్కడున్నాయి ఈ తంత్రులు? సంగీత సాధన చేసి సప్తస్వరాలు – ఆరోహణావరోహణలు అలవోకగా పలికే విద్వాంసులను ఎవరైనా ఆదర్శంగా తీసుకుంటున్నారా? పోనీ, లలిత సంగీతకారులైనా, ఎవరూ ఆదర్శంగా పెట్టుకోరు – ఎందుకని?



అనురాధ

ప్రపంచ వ్యాప్తంగా గాయకులన్నా – సంగీతకారులన్నా మత్తుమందులకు – మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారుగా – విశృంఖల జీవితానికి నిదర్శనంగా దేశదిమ్మర్లుగానే అర్థమవుతున్నారు!

కాని ఒక్కసారి ఈ సంగీతకారుడు – తన సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టగానే – ఓ అమాయకుడైన, ఔత్సాహికుడైన బాలునిగా దర్శనమిస్తాడు!

తనతోపాటు – మిమ్ములను కూడా సుఖదుఃఖాలు కలబోసిన ఓ కాల్పనిక ప్రపంచంలోనికి తీసుకుపోతాడు. మార్మికమైన మాధుర్యంతో మంత్రముగ్ధుల్ని చేస్తాడు!

అలా ఎన్ని గంటలు – ఎన్ని రోజులు – సంవత్సరాలైనా అదే జీవితంగా గడుపుతాడు! దేనికోసం?

పేరుప్రఖ్యాతులు కోసమా? పెన్నిధికోసమా లేక ఇంకా లోతైన కారణం ఏదయినా ఉందా?

ఎందరో పాటలు రాస్తారు – బాణీలు కూరుస్తారు. ఎప్పుడైనా ఇంత మంచి పాట ఎలా రాశారు?

ఇంత శ్రావ్యమైన స్వరం ఎలా కూర్చారు? అని అడిగితే "అదా? ఏమో..." అనే చెప్పగలరు?

అంటే ప్రతి పాట... ఎక్కడనుంచో రావాలి! ప్రతి బాణీ 'ఎవరో' కూర్చాలి! ఏమిటా మర్మం?

ఇటాలియన్ ఒపేరా గాయకుడు పావరోటిని 'ఏమిటి మీ రహస్యం' అని అడిగితే–

"ఒపేరా ముందు రాత్రి నా గది కిటికీలు తీసి కూర్చుంటాను. చల్లని మలయమారుతం కిటికీలోనుంచి వస్తుంది. గుండెలనిండా పీలుస్తాను అప్పుడే తెలుస్తుంది మర్నాడు సరిగా పాడగలనో లేదో – ఎక్కువగా దేవతలే వస్తారు. ఎప్పుడైనా – "ఈవిల్ స్పిరిట్" కూడా తలుపు తడుతుంది – అప్పుడు – పాడటం నా వల్ల కాదు.." అంటే ఇదొక వరం! ఈ వరాలు ఎవరిస్తున్నారు?

తేనెలు వానలు కురిసి, వీనుల విందులు చేసే 'చిత్ర' స్వరంలో ఏ గంధర్వులు దాగి ఉన్నారు? కారుమబ్బుల్లో తటిల్లత మెరిసినట్లు వెండి తీగలా సాగే 'లత' గళంలో మధురిమలు ఎవరు నింపారు? ఒక స్థాయి, ఒక లోతుకు వెళ్ళిన తర్వాత అన్ని సంగీతాలు ఒక్కటే!

అంటే, అవి మనలను తీసుకువెళ్ళే తీరు – దారి ఒక్కటే! ఆనంద తీరం ఒకటే! అవి కలిగించే పారవశ్యం ఒకటే! మనలను అంతర్ముఖులను చేసి, అంతరంగపు లోయల్లో ప్రతిధ్వనులను వినిపించేవే...!

మధురమైన సంగీతం – ఒక శ్రావ్యమైన గీతం – మిమ్ములను ఒంటరితనంలో నుంచి – ఏకాంతంలోనికి, ఏకాంతంలో నుంచి అస్పష్టమైన కాల్పనిక లోకాలకు రహస్యంగా మోసుకుపోతుంది!

ఓ విషాద గీతం – మీ కర్ణేంద్రియాలలో శబ్ద తరంగాలుగా ప్రవేశించి, గత జ్ఞాపకాలను రేపి – హృదయాన్ని మధురమైన బాధతో ఆర్ద్రంగా నింపితే, మీకు కలిగే రసానందం, సుఖదుఃఖాలకు అతీతమైనదే! చెవులతో విన్నపుడు, కనులకు కనపడే సంగీతం, ఒక ఆవేదనా గీతం ఆస్వాదించినపుడు కలిగే 'ఆనందం' హేతు జగతికి అతీతం! మీరెప్పుడైనా 'బెతోవెన్' విన్నారా? అయిదో సింఫనిలో మొదటి నాలుగు 'నోట్సు' తర్వాత ఒక్కసారిగా ఆవహించే 'నిశ్శబ్దాన్ని' విన్నారా? నాటకీయంగా, నిగూఢమైన నిశ్శబ్దాన్ని ఎలా బంధించాడు? సరిగ్గా ఇప్పుడే నిశ్శబ్దానికి ఉన్న ప్రాముఖ్యత తెలియవస్తుంది. సంగీతం, నిశ్శబ్దానికి ఓ గదిలా దర్శనమిస్తుంది.

ఇప్పటి ఆధునిక జీవన సరళిలో, నిజమైన నిశ్శబ్దం వినబడకుండాపోతోంది. మనం ఏదో కుట్రచేసి నిశ్శబ్దాన్ని తప్పించుకుంటున్నట్లు – ఏకాంతం నుంచి పారిపోతున్నట్లు!

బహుశా – ఏకాంతం, నిశ్శబ్దం, మనలను గుండె చప్పుడు వినమని, అక్కడ చెలరేగే భావావేశాలకు అనుభూతి చెందమని ప్రోత్సహిస్తాయి కదా. మనకు అంత సమయమేది! నిశ్శబ్దం, అంతరాత్మభాష! సంగీతపు లోలోతులో, నిశ్శబ్దం నిబిడీకృతమై ఉంటుందేమో – నీటిలో మంచుగడ్డలా!

ఎప్పుడైనా, దూరదూరంగా, మావితోటలో ఎలుగెత్తి కూసే ఎలకోయిల పాట – గాలిలో తేలివచ్చి – మీ హృదయాన్ని తాకితే, మీలో మ్రోగే తంత్రులను ఆలకించండి! ఇంకా, సుదూర ఆకాశ తీరాలలో, ఓ కాలమేఘం ఘూర్ణిల్లితే వినిపించే ఘట వాయిద్యం – మీ గుండె గోడుకు లయవేస్తే – మబ్బు చిలకరించిన రెండు చినుకులూ మీ కన్నుల్లో పొంగిన తడీ ఒక్కటేనని గుర్తించండి!

ఓ మంచు కురిసే రాత్రి, పల్లెటూరు అంచున, చలిమంట వేడికి ఒళ్ళు వెచ్చబెట్టుకుంటున్న డప్పు చేసే చప్పుడు విన్నారా? బ్రతికి ఉన్నప్పుడు, కప్పుకున్న ఓ ప్రాణిచర్మం, మీకేమి వినిపిస్తుంది? మృత్యుగహ్వారాలను దాటి వస్తున్న ఈ శబ్దాలు, ప్రకృతి సంగీతం కాదా? కాలానికీ, స్థలానికీ అతీతమైన సందేశం కాదా? ఓ సంగీతకారుడు సాధించేది ఏముంటుంది? వేయిమంది సమక్షంలో తన పాండిత్యాన్ని ప్రదర్శించినా, పదిమందికీ తన పాట వినిపించినా లేదా తన పెంపుడు పిల్లి కూనిపాట్లకి తను కూనిరాగం తీసినా, తను సాధించేది....

గాయపడిన హృదయాలకు సాయపడి ఊరట కలిగించటమే! అలసిన అంతరంగాలకు సాంత్వన పలకడమేకదా!





# వెండితెరపై తెలుగుతేజం లీలానాయుడు

**భా**రతీయ చిత్రసీమలో మెరుపు వేగంతో తళుక్కున మెరిసి, అంతలోనే అదృశ్యమైన విద్యుల్లత లీలానాయుడు. తండ్రి డా. పత్తిపాటి రామయ్యనాయుడు. పదహారణాల తెలుగువాడు, న్యూక్లియర్ శాస్త్రజ్ఞుడు. తల్లి పేరు మార్తా మెంజీస్. ఈమె స్విస్, ఫ్రెంచ్ సంబంధించిన వారసత్వం కలిగినది. ఈమె ఐరిష్ ఇండాలజిస్ట్‌గా పనిచేసింది. తల్లిదండ్రులిద్దరి నుంచి సంక్రమించిన ఉత్తమ జాతి లక్షణాలు ఆమెలో మెండుగా ఉన్నాయి. నటనపరంగా పాశ్చాత్యపరమైన సున్నిత భావ ప్రకటన, దక్షిణ భారతీయమై తెలుగువారి ప్రత్యేకతగా చెప్పబడే తులనాత్మకమైన భావోద్వేగం ఆమెలో మెండుగా ఉన్నాయి.

చిన్నతనంలో బొంబాయిలో నివాసం, అక్కడే చదువు. 1954 వ సంవత్సరంలో మిస్ ఇండియాగా ఎంపికైంది. ఆ కాలంలో భారతదేశంలోని అందమైన పదిమంది స్త్రీలలో ఒకరిగా, మహారాణి గాయత్రీదేవితో పాటు లీలానాయుడు పేరును ఉదహరించింది, *వోగ్* అనబడే ఇంగ్లీష్ ఫ్యాషనబుల్ పత్రిక. ఒక ఒంటరి వివాహ స్త్రీ వ్యథను మనోజ్ఞంగా మలచిన *అనురాధ* చిత్రానికిగాను కథానాయిక అన్వేషణలో ఉన్న హృషికేశ్ ముఖర్జీ, కమలా ఛటోపాధ్యాయ తీసిన లీలానాయుడు ఛాయాచిత్రాలను చూసి ఆమెను ఎంపిక చేశారు. 1959లో విడుదలైన అనురాధ చిత్రాన్ని చూసి, ఆమె నటనను విమర్శకులతో పాటుగా పండిత పామర జనం ముక్త కంఠంతో ప్రశంసించారు. ఆ చిత్రం ప్రెసిడెంట్ బంగారు పతకం పొందింది. తరువాత బెర్లిన్ గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు నామినేట్ అయింది.



ఒబెరాయ్, పిల్లలతో...

1959వ సంవత్సరంలో నానావతి అనే పేరుగల ఒక నావల్ అధికారి తన భార్యతో వివాహేతర సంబంధం కలిగిన అహూజాను హత్యచేసి, పోలీసులకు లొంగిపోయాడు. ఈ సంఘటన దేశమంతా అలజడి కలిగించింది. ఆ వాస్తవ గాథకు వెండితెర రూపమిచ్చాడు నటుడు సునీల్‌దత్. ఆ చిత్రం పేరు *ఏ రాస్తే హై ప్యార్‌కి*. భారతీయ సినిమాలలోని స్త్రీ పాత్రలు పాతివ్రత్యానికి, గ్లామర్‌కు మాత్రమే పరిమితమైన ఆ రోజులలో ఇటువంటి పాత్ర రావటం, దాన్ని భావోద్వేగంగా తెరపై మనం నమ్మదగ్గంతగా, అదే సమయంలో జాలిగొలిపేటంతగా నటించటం లీలానాయుడుకే చెల్లింది. హిందీసినిమా మూసపాత్ర కథానాయిక కోవలో ఆమె ఇమడలేకపోయింది. దీని కారణంగా దేవానంద్ నిర్మించిన *గైడ్* చిత్రంలో రోజీ పాత్రను ఒదులుకోవలసి వచ్చింది, నాట్యం రాకపోవడం కూడా ఒక కారణం. ఆమె నటించిన చిత్రాలు తక్కువైనా అన్నీ ఆణిముత్యాలే. సత్యజిత్‌రాయ్ ఆమె నటనకు ముగ్ధుడై మార్లిన్ బ్రాండో, శశికపూర్‌లతో కలిపి లీలానాయుడుతో ఒక చిత్రం తీయాలి అనుకున్నాడుగాని అదీ కార్యరూపం దాల్చలేదు.

లీలానాయుడు మొదటి వివాహం ఒబెరాయ్ హోటల్స్ యజమాని టిక్కీ ఒబెరాయ్‌తో జరిగింది. ఇద్దరు సంతానం కూడా కలిగారు. కానీ, ఒబెరాయ్ నుంచి విడిపోయింది. ఆ తరువాత సినిమాలలో నటించి, పేరుగడించింది. ఈ కాలంలోనే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక సంపాదకుడైన ఫ్రాంక్ మోరిస్ కొడుకు డామ్ మోరిస్‌ను వివాహమాడింది. కానీ ఈ వివాహం కూడా నిలబడలేదు. తన సంతానాన్ని చట్టపరంగా తీసుకోలేక, మానసిక ఆందోళను గురైంది. ఆ సమయంలో ఇంగ్లాండు వెళ్ళి అధ్యాపకురాలిగా పనిచేసింది. అక్కడ కూడా ఎక్కువకాలం ఉండలేక, బొంబాయి తిరిగి వచ్చి, శేషజీవితాన్ని గడిపింది. తన 69 వ యేట తనువు చాలించింది. తెలుగువారి ప్రతిభకు మరో ఉదాహరణ ఈ విద్యుల్లత.

మి

# బొమ్మలాట

– *వేమలి త్రినాథరావు*

విద్య విజ్ఞాన సముపార్జనకు తొడ్పడుతుంది. కళ జీవితాన్ని సౌందర్యమయం చేస్తుంది. విద్యకు, కళకు ఉన్న తేడా అదే. తోలుబొమ్మలాట జానపద కళారూపం. ఈ ఆట తెల్లని తెరవెనుక దీప కాంతిలో ప్రదర్శింపబడుతుంది. అందుచేతనే మానవుడు ఎరిగిన తొలి చలనచిత్రంగా చెప్పబడింది. ఈ కళారూపం ఆంధ్రప్రాంతంలోనే కాక తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా వ్యాపించియున్నది.

నా చిన్ననాడు పల్లెప్రజలను అలరించి ఆనందపరిచి ఆనందడోలికలలో ఊగిలాడించి ఈనాడు కాల గర్భంలో కలసిపోతున్న నాటి జానపద కళారూపాలు నన్ను ఉత్తేజపరిచి ప్రభావితుడిని చేసాయి. ఒకనాడు జాతినంతా ఉర్రూతలూగించిన (తోలుబొమ్మలాట) జానపద కళారూపాలు ఈ నాడు అంతరించిపోతున్నాయి. ఆ కళాకారులు "అన్నమో రామచంద్రా" అంటూ గ్రామల్లోనూ, పట్టణాల్లోనూ, రైళ్ళలోనూ, బస్సుల్లోనూ ముష్టి ఎత్తుకుంటున్నారు. వందలాది జానపద కళారూపాలు ఆనాడు పల్లెప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగించాయి. జానపద కళారూపాలంటే అవి శాస్త్రీమైనవి కావని కేవలం పామరుల కళారూపాలని, పనికిమాలినవని ఏమాత్రం శాస్త్రీయత లేనివని కొంతమందిలో దురాభిప్రాయం ఉంది. కానీ సంగీతానికి నృత్యాన్ని ఎలాంటి శాస్త్రీయత ఉందో అలాంటి శాస్త్రీయత వీటికీ ఉంది. జానపద కళారూపాలలో సంగీతం, తాళం, లయ, నృత్యం, అభినయం, ఆహార్యం, వాద్యం ఇవన్నీ పుష్కలంగా ఉన్నాయి. లయ బద్ధమైన కలయిక క్రమశిక్షణ కూడా ఉంది. శతాబ్దాలుగా రాజులు పోయినా రాజ్యాలు మారినా, జానపద కళలు మాత్రం ప్రజా హృదయాలలో అలాగే నిలిచివున్నాయి. ఎన్ని ఆటుపోటులు వచ్చినా ప్రజలు వాటిని పోషించారు. కళలను, కళాకారులను కన్నబిడ్డలుగా చూసుకున్నారు. నాటకం, సినిమా, రెడియో, టెలివిజన్ లాంటి ఆధునిక సాంకేతిక ప్రక్రియలు రావడంతో ఈ నాడు వీటికి ఆదరణ తగ్గింది.

ఆంధ్రదేశంలో ఆబాలగోపాలన్ని అనందింపజేసి, అన్ని కళారూపాలతో పాటు దీర్ఘకాలం దివ్యంగా వర్ధిల్లిన కళారూపం తోలుబొమ్మలాట. మన లలితకళకు ఈ కళ ఉపాంగంగా ఉన్నా, లలితకళలు అన్నీ ఈ ప్రదర్శనంలో మూర్తీభవించి ఉన్నాయి. కావలసినంత కవిత్వం ఉంది. సాహిత్యం ఉంది. సంగీతం ఉంది. శిల్ప, చిత్ర కళలు తొణికిస లాడుతూ ఉంటాయి. కడుపుబ్బ నవ్వించే హాస్యరస ఘట్టాలున్నాయి. లలితకళన్నిటిలోనూ ఈ ప్రదర్శనం ఎంతో కన్నులపండువుగా ఉంటుంది. తోలుబొమ్మలతో చక్కగా నాట్యం ఆడిస్తారు. ఆ పైన వెనుకనుంచి సూత్రధారుడు ఎంతో చాకచక్యంగా పాత్రాభినయం చేయిస్తూ ఉంటాడు. నాటకప్రదర్శనానికి ఎన్ని హంగులుండాలో దాదాపు అన్ని హంగులూ బొమ్మలాటలోనూ ఉండాలి. భర్త శ్రీరాముడిగా వాచికం చెప్పి పాటపాడితే, భార్య సీతగా వాచికం చెప్పి వంతపాడుతుంది. ఇక వారి బిడ్డలు బాలబాలికల పాత్రలకు అభినయాన్నిస్తారు. ఈ విధంగా ఆయా పాత్రల బొమ్మలు పుచ్చుకొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడుపుతారు. తెరమీది బొమ్మలు ఎంత ఉదృతంగా నాట్యం ఆడుతూ ఉంటాయో, లోపలి భాగంలో వున్న వ్యక్తులు కూడా దాదాపు అంతటి అభినయాన్నీ వ్యకం చేస్తూ ఉంటారు.

**దేశవ్యాప్తంగా బొమ్మలాటలు :** ఈ బొమ్మలాటలు – ఒక్క ఆంద్రదేశంలోనే కాకుండా పరిసరప్రాంతాలైనా మహారాష్ట్రం, మళయాళం, తమిళం, బెంగాల్ మొదలైన ప్రాంతాల్లోనూ వ్యాపించి ఉన్నాయి. ఉత్తర దేశంలో "కట్‌పుత్లీ" అనే కొయ్యబొమ్మ లాటలూ, దక్షిణదేశంలో "కీలుగుఱ్ఱపు బొమ్మలాటం" అనబడే కొయ్యబొమ్మలాటలూ ప్రచారంలో ఉన్నాయి. తోలుబొమ్మలాటలు ప్రదర్శించేవారు చాలావరకు మరాఠీవారు. వీరిని కన్నడంలో 'కిషెషిక్యాత' జాతివారని, తమిళదేశంలో 'కిల్లెక్యాతవా'రని, తెలుగుదేశంలో బొమ్మలాటవారని, చర్మనాటకులని వ్యవరిస్తున్నారు. బొమ్మలాటలవారు బెల్గాం, కొల్హాపూర్, సతారా, పూనా, బిజాపూర్ ప్రాంతాల నుండి, పరిపాలకుల జైత్రయాత్రల్లోనూ, ఆయాదేశాలలో వచ్చిన విప్లవోద్యమాల మూలంగానూ వలసవచ్చారు. శ్రీశైలం శివరాత్రి మహోత్సవాలలో

తోలుబొమ్మలాటలు ప్రదర్శించినట్లు పండితారాధ్యచరిత్ర పర్వతప్రకరణంలో పాల్కూరికి సోమనాథుడు వివరించాడు. తోలుబొమ్మలాటల గురించి ఒక శాసనంలో ఉదహరింపబడి వుంది. బొమ్మలాటవారిని గురించి చాగంటి శేషయ్యగారు ఒక శాసనాన్ని బయట పెట్టారు. కడపజిల్లా కమలాపురం తాలూకా "చిడిపిరాల" అన్న గ్రామాన్ని చంద్రయ్య, బొమ్మలాట అమృతకవీ అనే వారిద్దరూ, తెరనాట కాలాడడానికి పెద చిట్టెయ్య అనే బొమ్మలాట కళాకారుడికి దానం ఇచ్చినట్లు శాసనంలో ఉంది.

**ఆరెకాపులు, గంధోళీలు :** ఈ బొమ్మలాటలాడేవారిని ఆరెకాపులంటారు. ఈ ఆరెకాపులు ఈ నాటికీ మహారాష్ట్రంలో ఉన్నారు. అక్కడ వారి పేరు గంధోలీ లంటారు. ఈ నాడు తెలుగుదేశపు బొమ్మలాటల వారందరూ ఒక నాడు మాహారాష్ట్రులే. అంతేగాక మరాఠీ బొమ్మలాటలో ఉండే హాస్యపాత్రధారి గంధోలిగాడికీ, మన జుట్టుపోలిగాడికీ చాలా దగ్గర సంబంధముంది. ఒకేరకమైన హాస్యమూ వేషధారణలో పోలికలు ఉన్నాయి.

**బొమ్మలాటలవారి కేంద్రాలు :** ఈ బొమ్మలాటలు కుటుంబాలవారి నివాసాలు ఆంధ్రదేశంలో విశాఖపట్నం జిల్లాలో సర్వసిద్ధి, శృంగవరపుకోట, కళ్ళేపల్లి అగ్రహారం, గోదావరిజిల్లాలో మండపేట, అంగర, ఎలమంచిలి, తణుకు, నెల్లూరు జిల్లాలో సింగరాయకొండ, కర్నూలు జిల్లాలో రాయదుర్గం, బెళగల్లు, అనంతపురం జిల్లాలో కడమలకుంట, ఆవులన్న జరుట్ల రామపురం, బళ్ళారిజిల్లా సౌండూరు, తోరణగల్లు, బొమ్మలాటపల్లి మొదలైనవి. ఆ ప్రాంతాలలో బొమ్మలాటల వారు ఎక్కువగా ఉన్నారు. కాకినాడ వద్ద మాధవపట్నంలో మాత్రం ఈ కుటుంబాలవారు చాలామంది ఉన్నారు. ముఖ్యంగా వీరు ప్రదర్శించే కథా ఇతివృత్తాలు భారతరామాయణ గాథలకు సంబంధించినవి. లంకాదహనం, మైరావణ చరిత్ర, ఇంద్రజిత్తు వధ, యయాతికథ, కీచకవధ దుశ్శాసన కథ, ప్రహ్లాద చరిత్ర, రంగనాథ రామాయణం మొదలైనవే కాక, దేశీయకథలైన దేశింగురాజు కథ, పల్నాటి వీరచరిత్ర, కరెభంటన కథ, కుమార రాముని కథలను కూడా ప్రదర్శిస్తూ ఉంటారు.

**రామ, బాణాసుర నాటకాలు :** తోలుబొమ్మల ఆటలు ఆడేవారి సాహిత్యమంటూ మనకు ఈనాడు ఏదీ లభ్యం కాదు కాని వారు యక్షగానాలనే బొమ్మలాట సాహిత్యంగా కూడా ఉపయోగించుకున్నాము. క్రీ॥శ. 850 ప్రాంతాల్లో గంజాం జిల్లా, గుజ్జువాడ నివాసి మరింగంటి భట్టరు రామానుజాచార్యులు శ్రీరామనాటకం బొమ్మలాటగా ప్రసిద్ధిజెందింది. ఇందులో కథ ముఖ్యంగా లక్ష్మణమూర్ఛ ఇందులో పాటలూ, పద్యాలూ, దరువులూ మొదలైనవి మాధవపట్నం బొమ్మలాటవారి లక్ష్మణమూర్ఛలో కనబడతాయి. భట్టరు రామానుజాచార్యులు వ్రాసిన తాళపత్రం చెన్నపురి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. 1893 లో కోట వెంకటప్పయ్య శాస్త్రిగారనే ఆయన బాణాసుర నాటకాన్ని రచించాడు. వీరి నివాసస్థలం పర్లాకిమిడికి దగ్గరలో ఉన్న పాతపట్నం గ్రామం. వీరు బాణాసుర నాటకంలో తోలుబొమ్మలు జుట్టుపోలిగాడి మాదిరి లొట్టకిత్తడు రత్నాల పోలిగాడు అనే రెండు హాస్యపాత్రల్ని సృష్టించారు. ఈ బొమ్మలు మేక చర్మంతోను, జింక చర్మంతోనూ, దుప్పి చర్మంతోనూ తయారుచేస్తారు.

**పాత్రలకు తగిన ప్రతిమలు :** బొమ్మలాట కథావిధానంలో వచ్చే ఉదాత్తమైన పాత్రలన్నింటికీ రాముడు, కృష్ణుడు, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, సీత, సావిత్రి, ద్రౌపతి మొదలైన పాత్రలన్నింటకీ జింక చర్మాన్ని ఉపయోగిస్తారు. రాక్షసపాత్రలకు, దుష్టపాత్రలకు మేక చర్మాన్ని ఉపయోగిస్తారు. ఈ విధంగా పాత్రల పవిత్రతనుబట్టి చర్మాలను ఉపయోగిస్తారు. ముఖ్యపాత్రలు అంటే ప్రదర్శనంలో చివరివరకూ వచ్చే పాత్రలు. ఆయా రంగాలలో ఘట్టాల ననుసరించి ఒకే పాత్ర నాలుగు రకాలుగా తయారు చేసుకుంటారు. ఉదాహరణకు బాల్యంలో రాముడు, అడవిలో రాముడు, యుద్ధంలో రాముడు, పట్టాభిరాముడు, ఈ విధంగా ఆయా దశల ననుసరించి చిత్రాలను తయారు చేసుకుంటారు.

హంగులన్నింటిని కూడా తయారు చేసుకుంటారు. రథాలు, గుఱ్ఱాలు, అంబులు, బాణాలు, గదలు, ఈటెలు, సైన్యం మొదలైనవాటి నన్నిటినీ కూడా తయారుచేసుకుని ప్రదర్శనం రోజున వివరంగా విడదీసి ప్రదర్శన గమనాన్నిబట్టి ఈ బొమ్మలన్నిటినీ సక్రమంగా, సిద్ధంగా అమర్చిపెట్టుకుని, ఒక బొమ్మ తరువాత మరొక బొమ్మను తెరమీదకి ఎక్కించి కథను ముందుకు నడుపుతారు. ఒక్కసారి ఈ బొమ్మల్ని తయారుచేసుకుంటే ఇంక అవి 20 సంవత్సరాలవరకూ చెక్కుచెదరకుండా ఉంటాయి.

**బహిరంగ ప్రదర్శనశాల :** గ్రామంలో ప్రవేశించి పెద్దల్ని, పిన్నల్ని కలుసుకొని పరిచయం చేసుకుంటారు.

అందరూ కూర్చోవడానికి అనువుగా వున్న బహిరంగస్థలంలో పందిరి ప్రారంభించి, మూడు ప్రక్కలూ మూయబడి ఒక ప్రక్కన తెరకట్టడానికి వీలుగా పందిరి వేస్తారు. పందిరి లోపలిభాగంలో వారి మొత్తం సామాగ్రీ, పిల్లలూ, భార్యలూ సంసారమంతా అందులోనే ఉన్నదా అనిపిస్తుంది. వెనుకప్రక్క కూడా మూతతో అందరూ లోపలే ఉంటారు. లోపలి ప్రక్క తెరను ఆనుకొని ఒక పెద్ద బల్లను వేస్తారు.

**ప్రదర్శన ప్రారంభం, విఘ్నేశ్వర పూజ :** ప్రదర్శనం ప్రారంభించే రోజున ఈ రాత్రికి బొమ్మలాట ఉందహో అని చాటింపు ద్వారాగాని, ఇంటింటికీ వెళ్ళి చెప్పడం ద్వారాగాని అందరికీ ఈ వర్తమానం తెలియజేయబడుతుంది. బొమ్మలాటకు తెర సిద్ధం చేసిన తరువాత ప్రప్రథమంగా విఘ్నేశ్వరుని బొమ్మను తెరకు మధ్యగా ఎక్కించి ఉంచుతారు. ఒక ప్రక్క మాత్రం దిష్టిబొమ్మ నొకదానికి, రెండువ ప్రక్క జుట్టుపోలిగాడు బొమ్మను ఎక్కించి ఉంచుతారు. ప్రదర్శన ప్రారంభంలో తోడిరాగాలుతో కూడిన మంగళ హారతి పాడుతారు. ఏ విఘ్నాలు కలగకుండా విఘ్నేశ్వరిని ప్రార్థిస్తారు. అందరూ వచ్చారా, కర్ణంగారొచ్చారా, మునసబుగారొచ్చారా అంటూ హెచ్చరించి ప్రేక్షకుల్ని అదుపులో పెట్టుకుంటారు.

**ఆటగాండ్ల అష్టావధానం :** ఏ వ్యక్తి బొమ్మలన్ని ఆడిస్తాడో ఆ వ్యక్తి నోటితో పాటపాడుతూ పాటకు తగిన విధంగా బొమ్మను ఆడిస్తాడు. సంభాషణలకు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాడు. ఇక రెండు బొమ్మల్ని ఆడించే సమయంలో బొమ్మల మధ్య వచ్చే పోరాటంలో రెండుబొమ్మల్ని రెండుచేతుల్ని కొట్టిస్తాడు. ఒక యుద్ధ ఘట్టం వచ్చిదంటే, డోళ్ళు, డబ్బాలు, ఈళలూ, కేకలతో వానకురిసి వెలసిపోయినట్లు చేస్తారు. ఈ విధంగా ప్రదర్శనను జయప్రదం చేసి ప్రేక్షకుల్ని మెప్పిస్తారు. నాటకానికి దర్శకుడు ఎంత అవరసరమో అలాగే ఈ బొమ్మలాటకు బ్రహ్మలాంటివాడు సూత్రదారుడు. తెర లోపలనుండి ప్రదర్శనాన్ని వరుస క్రమంలో నడిపే బాధ్యతలన్నీ ఇతని మీదే ఉంటాయి. మిగతావారు అందరూ ఇతనినే అనుసరిస్తూ ఉంటారు. బొమ్మలాట సూత్రధారుడు కథను చాలా వివరంగాను, చాకచక్యంగాను చెప్తాడు.

**ప్రదర్శనం - ప్రేక్షకుల హడావిడి :** బొమ్మలాట ప్రదర్శిస్తున్నారని తెలిస్తే చాలు గ్రామంలో ఉన్న పిల్లలు, పెద్దలు, స్త్రీలు, వయోబేధం లేకుండా ఒకరంటే ఒకరు ముందుకు వచ్చి కూర్చొంటారు. ప్రతీ ఘట్టంలోనూ స్పందిస్తారు. హాస్యఘట్టాలలో ఎంతగా పగలపడి నవ్వుతారో కష్టాలుతో కూడుకున్న ఘట్టాలులో కళ్ళవెంట నీరు కార్చుతారు. దుర్మార్గపుసన్నివేశాల్లో ఆ పాత్రలు మీద కోపం తెచ్చుకుంటారు.

**హాస్యపాత్రలు :** బొమ్మలాట ప్రదర్శనలో విచిత్రమైన హాస్యపాత్రలను మనం చూడవచ్చు, ఈ పాత్రలు కథా ప్రారంభం నుండి కథాంతము వరకు అడుగడుగునా ప్రత్యక్షం అవుతూ ఉంటాయి. ఆ పాత్రలనే జుట్టుపోలిగాడు-బంగారక్క, కేతిగాడు, అల్లాటప్పయ్య అంటారు. ఈ పాత్రలు ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించి నిద్రమత్తు వదలగొడుతూ ఉంటాయి. బొమ్మలాటల్లో హాస్యం ఎంతవరకు వెళ్ళినదో అల్లాటప్పగాడిని గురించి తెలుసుకుంటే బోధపడుతుంది. జుట్టుపోలిగాడు, బంగారక్కకాక వీడు మూడువ వాడు. వీడి పాత్ర ఎటువంటిదంటే "తాడెక్కేవాడే వుంటే వాడి తలదన్నేవాడుంటాడనే" సామెత ప్రకారం పై రెండు పాత్రలను తలదన్నినవాడు ఈ అల్లాటప్పగాడు. ప్రదర్శనలో బంగారక్కను గడుసరి పెళ్ళాంగా సృష్టిస్తాడు. ఈమెకు పోలిగాడికి నిరంతరం కయ్యం నడుస్తూ ఉంటుంది. కొంచెసేపు పోట్లాడుకోవడం మళ్ళా రాజీ పడిపోవడం ఇలా నడుస్తూ ఉంటుంది. కేతిగాడు పాత్ర అతి విచిత్రమైనది. అన్ని బొమ్మలు కన్నా కేతిగాడి బొమ్మ చిన్నది. ఎక్కడబడితే అక్కడ ఎప్పుడు బడితే అప్పుడు పానకంలో పుడకలా తెరమీద ఒక అడుగు చోటు వుంటే హఠాత్తుగా ప్రవేశిస్తాడు. శృంగార ఘట్టంలో ఉన్న అల్లాటప్పగాడ్ని టపీమని ఒక దెబ్బకొట్టి హాస్యాన్ని సృష్టిస్తాడు. కేతిగాడు బంగారక్కను కూడా ఏడిపిస్తాడు. ప్రేక్షకులు కథకంటే హాస్యపాత్రల ప్రవేశం కొరకే ఎదురుచూస్తూ ఉంటారు. అందువలనే ఎంతసేపూ ప్రదర్శించినా ప్రేక్షకులు విసుగు చెందరు. బొమ్మలాటలు ప్రదర్శించడంలో జానపదులకు కొన్ని నమ్మకాలు కూడా ఉన్నాయి. ఉత్తర గో గ్రహణం కథ ఆడిస్తే వర్షాలు కురుస్తాయని. వర్షాలు లేని ప్రాంతంలో బొమ్మలాటను ఆడిస్తూ ఉంటారు. ఈ నాటికి కాకినాడ ప్రాంతంలో ఈ ఆటలను ఆడిస్తూ ఉంటారు. ఈ నాటికి కాకినాడ ప్రాంతంలో వర్షాలు కురవనప్పుడల్లా దగ్గరలో ఉన్న మాధవ పట్నం బొమ్మలాట వారిని ఆహ్వానించి శ్రీదేనువు కొండ వెంకయ్యగారు రచించిన ఉత్తర గో గ్రహణాన్ని, విరాట పర్వాన్ని ప్రదర్శిస్తారు.

**సంచార జీవనం :** బొమ్మలాట ఆడేవారు ఒక

ఊరినుంచి ఒక ఊరు సంచారం చేసుకుంటూ ప్రదర్శనలిచ్చుకుంటూ ఉంటారు. చావులు పుట్టుకలు, వివాహాలు, వేడుకలు అన్నీ సంచారంలోనే జరిగిపోతూ ఉంటాయి. వీరిలో ఒక్కొక్కరికి ఇద్దరు ముగ్గరు భార్యలు ఉంటారు. ఇలా ఉండటం వారికేమి తప్పుకాదు. కారణం ఈ స్త్రీలందరూ ప్రదర్శనలో పాటలు పాడటానికి, బొమ్మలను ఆడించడానికి ఉపయోగపడతారు. దీనివలన బయట నుండి కిరాయికి నటులని తెచ్చుకోవలసిన అవసరం ఉండదు. అంతేకాక ప్రదర్శనరోజున ఒకరికి జబ్బుచేసిన, గొంతు పోయినా ప్రదర్శనకు ఆటంకం ఉండదు. ఈ బాధ్యతలు అదనంగా ఉన్న స్త్రీలు పంచుకుంటారు. బొమ్మలాటలో పురుషులు కంటే స్త్రీలు ఎక్కువ మంది ఉంటారు.

**ఆధునికత :** శిథిలమైన తోలుబొమ్మలాటలను ఆధునికరీతిలో పునరుద్ధించటానికి కాకినాడ వాస్తవ్యులు యం.వి. రమణమూర్తిగారు ఎంతో కాలం కృషి చేశారు. వీరికి భారత ప్రభుత్వం రెండు సంవత్సరాలు స్కాలర్‌షిప్ ఇచ్చి, తోలుబొమ్మల పరిశోధనకు అవకాశం కల్పించారు. రమణ మూర్తిగారు దాదాపు 15 సంవత్సరాలు ఈ కృషిలో ఉండి అనేక మహాసభల్లోనూ ప్రముఖుల మరియు విదేశీ రాయబారుల సమక్షంలోనూ ప్రదర్శించి ఆ నాటి తోలుబొమ్మలాట విశిష్టతను చాటారు. బొమ్మల ప్రదర్శనలో పూర్వం ఉపయోగించే ఆముదపు దీపాలను తొలగించి లైట్ల ద్వారా ప్రదర్శింపజేసారు. తెరకు కూడా ఇనుప గొట్టాల ఫ్రేమును తయారుచేసి అవలీలగా ప్రదర్శనను ఏర్పాటు చేసారు. ఎక్కువ మంది హంగు దారులు అవసరం లేకుండా కథా వృత్తాంతంతో టేపురికార్డుల్లో రికార్డు చేసి బొమ్మలను ఆడించడానికి మాత్రం ఇద్దరు, ముగ్గురు మనుషులతో ప్రదర్శనను సాగించారు. కథల్లో లంకా దహనం మొదలైన పౌరాణిక గాథలతో పాటు, పంచతంత్ర కథలు, కుటుంబ నియంత్రణ మొదలైన బొమ్మలను తయారు చేసి ప్రదర్శింపజేసారు.

**ప్రయోగం :** ఈ బొమ్మలాట జానపద కళారూపాన్ని ఆదారం చేసుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టనానికి చెందిన ప్రముఖ నటులు, దర్శకులైన స్టార్‌మేకర్ లంకా సత్యానంద్, బొమ్మలాట అనే ప్రయోగాత్మక నాటకాన్ని రూపొందించారు. దీని రచన నాటక సినీ రచయిత నడిమింటి నర్సింగరావు రచించారు. ఈ నాటక ఇతివృత్తం పౌరాణిక మరియు సాంఘిక అంశాల మేలు కలయికగా ఉంటుంది. మనుషులు బొమ్మలుగా నటించడం, ఆడటం, ఈ నాటకంలోని గొప్ప ప్రయోగం నటీనటులు ముఖ కవళికలు, నటన బొమ్మలు మాదిరిగానే ఉంటుంది. వినాయకుడు, బంగారక్క, కేతిగాడు, అల్లాటప్పయ్య, మోహిని, భస్మాసురుడు, బ్రహ్మ, శివుడు వంటి పాత్రలు "మోహిని భస్మాసుర" అనే ఘట్టంలోనూ, పెళ్ళికూతురు, పెళ్ళికూతురు తండ్రి, పెళ్ళికొడుకు, పెళ్ళికొడుకు తండ్రి (రాజకీయ నాయకడు) "వరకట్న భాగోతం" అనే అంతర్‌నాటకంలో పాత్రలుగా ఉంటాయి.

బొమ్మలను ఆడించడానికి తెల్లటి తెర కాకుండా ఇనుప గొట్టాల ఫ్రేమును తయారు చేసి సాధారణ విద్యుత్ దీపాలను అలంకరించి నాటకంలోని బొమ్మల యొక్కపాత్రల సంభాషణలను పాటలను టేపురికార్డులో రికార్డు చేయించి ప్రదర్శించేవారు. మనుషులే బొమ్మలుగా నటించడం వలన ఈ నాటకం జాతీయ స్థాయిలో గొప్పపేరు తెచ్చుకోవడమే కాకుండా 1993 వ సంవత్సరంలో విశాఖపట్నంలో 102 రోజులు పాటు టిక్కెటు ప్రదర్శన జరిగింది. దాదాపు గంటన్నర నిడివి ఉన్న ఈ నాటక ప్రదర్శనను ఆసాంతం ప్రేక్షకులు తన్మయులై తిలకించి ఆనందించేవారు. ముఖ్యంగా కేతిగాడు, బంగారక్క, అల్లాటప్పయ్యపాత్రలు రంగ స్థలంపైకి వచ్చాయంటే ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుకొనేవారు. ఈ బొమ్మలాట నాటకం దర్శకులు సత్యానంద్‌గారికి, అందులోని నటీనటులకు బొమ్మలాట ఇంటిపేరుగా చేరిపోయింది. ఈ నాటకాన్ని చాలా కాలం తరువాత ఇటీవల నేను నిర్వహించిన "రసజ్ఞ జాతీయనాటకోత్సావాలు - 2015" (అక్టోబర్ 26 నుంచి 29) తొలిప్రదర్శనగా నిర్వహించడం జరిగింది. ఇటువంటి పురాతన కళారూపాలను ఉపయోగించుకొని మలచిన నాటకాలు ఇతర ప్రక్రియలు అనేకం ఉన్నా, బొమ్మలాట నాటకానికి మాత్రం ఇంతటి ఖ్యాతి రావడానికి ముఖ్య కారణం రచయిత దర్శకులు ఎంచుకున్న తోలుబొమ్మలాట అనే కళారూపం వలనే వచ్చిందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను. కాబట్టి పురాతనమైన కళారూపాల్ని మరలా పునరుద్ధింపచేయడానికి, వాటి వికాసం కోసం మనమంతా కృషి చేయాలని అభ్యర్ధిస్తూ....

డా॥ వేమలి త్రినాధరావు

అతిథి అధ్యాపకులు, రంగస్థల కళల శాఖ, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం. ఫోన్ : 939 104 0081



జుజ్జవరపు చంద్రమౌళి

# సాహితీ బంధువు

*- అవిజ వెంకటేశ్వర రెడ్డి*

ఒక్కో ఉద్యమానికి ఒకరు బాధ్యత వహించి సమాజ సంస్కరణకు పూనుకుంటారు. ఆయా కాలాల అవసరాలను బట్టి ఈ ఉద్యమాలు పుట్టుకొస్తాయి. సమాజంలోని అనేకులు వారి వారి వ్యక్తిగత ఆసక్తులు నమ్మకాలనుబట్టి ఈ ఉద్యమాలలో భాగస్వాములౌతూ వుంటారు. అలాంటి సాంస్కృతికోద్యమ కార్యకర్త నాకు పరిచయం కావడం నా భాగ్యంగా భావిస్తూ ఆయనను 'మిసిమి' పాఠకులకు పరిచయం చేయడం భావ్యమని భావిస్తున్నాను. 2015 నవంబరులో ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్లినా, ఆయన మిత్రుల జ్ఞాపకాల నుండి వీడి వెళ్ళలేదు. ఆయన పేరు జుజ్జవరపు శ్రీరామచంద్రమౌళి వృత్తిరీత్యా రహదారులు మరియు భవనముల శాఖలో చీఫ్ ఇంజనీరుగా పనిచేసి పదవీ విరమణ పొంది శేషజీవితాన్ని హాయిగా ఆర్థవంతంగా గడిపారు. వీరి ప్రవృత్తి ఉత్తమ సాహిత్య పఠనం; అంతేగాదు, తాను మంచిగా భావించిన సాహిత్యాన్ని పలువురికి పరిచయం చేయడమే కాకుండా ఆయా ప్రతులను అనేకం కొని రాష్ట్రంలోని నలుమూలలనున్న మిత్రులకు పంచి పెట్టడమన్నది సామాన్య విషయం కాదు. ఇంతటితో సరిపెట్టుకోకుండా ఆంధ్ర సాహిత్యంలో 'క్లాసిక్' అని చెప్పుకోదగిన అనేక రచనలను వారి సోదరుని కొడుకైన దుర్గాప్రసాద్ గారు స్థాపించిన 'రాజాచంద్ర ఫౌండేషన్' ద్వారా అనేక పుస్తకాలను ప్రచురించి అత్యధిక శాతం పుస్తకాలను ఉచితంగా పంచిపెట్టడం ఊహకందని విషయం. ఈ సందర్భంగా చంద్రమౌళి గారికి ఆంధ్ర పాఠక లోకం తరపున హృదయపూర్వక నివాళులర్పిస్తున్నాను.

చంద్రమౌళి గారు 20.08.1932న తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకా ఆత్రేయపురం మండలం 'వద్దిపర్రు' గ్రామంలో శ్రీమతి వెంకటరమణమ్మ శ్రీ వీరన్న చౌదరి గారలకు జన్మించారు. వద్దిపర్రులో ప్రాథమిక విద్యానంతరం రాజమండ్రిలో ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం మరియు ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. సాంకేతిక విద్యాభ్యాసం కోసం బెంగుళూరులోని గవర్నమెంటు ఇంజనీరింగు కళాశాలలో చేరి సివిల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ పట్టా పుచ్చుకున్నారు. పిమ్మట ప్రభుత్వ ఉద్యోగిగా చేరి రహదారులు మరియు భవనములు శాఖలో చీఫ్ ఇంజనీర్ స్థాయిలో పదవీ విరమణ పొంది భార్య శ్రీమతి ఝాన్సీ గారితో హాయిగా గడిపారు.

భారతీయ సాంప్రదాయం ప్రకారం ఎవరైనా ఆడపడుచులు యింటికి వస్తే బొట్టుపెట్టి ఆహ్వానించడం, వెళ్లేటప్పుడు చీర, రవికలను కానుకలుగా యివ్వడం ఆనవాయితీ. ఈ స్ఫూర్తితోనే చంద్రమౌళిగారు తాను చదివిన మంచి పుస్తకాన్ని పరిచయం చేస్తూ అతిథులకు, బంధువులకు, స్నేహితులకు యివ్వడం ఆయన నిత్యకృత్యం; ఇతర భాషా సాహిత్యాన్ని కూడా అనువదింప జేసి తానే స్వయంగా ప్రచురించి పంచడం మామూలు విషయం కాదు. ముఖ్యంగా హెచ్.బి.టి. మరియు రామక్రిష్ణ మిషన్ వారి సాహిత్యాన్ని కూడా పలువురికి పంచుతూ సంతృప్తి చెందేవారు. పరిచయమైన నాలుగు సంవత్సరాలలో నాకే రెండు వందలకు పైగా పుస్తకాలను పంపారంటే రాష్ట్రం నలుమూలలున్న మిగతా మిత్రులకు, బంధువులకు హితులకు మరెన్ని పుస్తకాలు పంపించి వుంటారో ఊహించుకోవచ్చు. ఆయన చాలా నిరాడంబరుడు. ముఖస్తుతులు నచ్చవు. తాను మంచి పుస్తకాన్ని పదిమందికి పంచినట్లే తన మంచితనాన్ని, మనిషితనాన్ని సమాజానికి చూపించి మరెంతో మంది సాహితి వేత్తలకు, సాహితీ ప్రియులకు మార్గదర్శకం కావాలనే తపన తప్ప మరో ఉద్దేశ్యం లేదని విన్నవించుకుంటున్నాను. సంస్కారం ఆయనకు బాల్యం నుంచే అబ్బినట్లు మాజీ మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారు తన స్వీయచరిత్ర "స్వేచ్ఛా భారతం" పేజినెంబరు 58లో ఈ విధంగా ప్రస్తావించారు. "ఇక్కడ మా యింటి ముందు వుండే చంద్రమౌళి గురించి చెప్పుకోవాలి. చిన్నపిల్లాడు, నిలువెల్లా తెలివితేటలే! అతని చెలిమే మా వివాహ బంధానికి బలిమి అనిపించింది. అతడు గుమ్మంలో అడుగుపెడితే ఇల్లు కళకళలాడేది ఇప్పుడతను పెద్దవాడయ్యాడు రహదారులు మరియు భవనముల శాఖలో చీఫ్ ఇంజనీరుగా రిటైరయి తన సహధర్మచారిణితో ప్రశాంత జీవితం గడుపుతున్నాడు.. హైదరాబాద్‌లోనే-గొప్పమనిషి-మంచిమనసు'.

## పుస్తకాల సాక్షిగా

'జొజ్జరపు చంద్రమౌళి' ఆ పేరు వింటూనే గుర్తొచ్చేది పుస్తకాలు; వాటి మధ్యలో ఒక స్ఫుర ద్రూపి రూపం.

పక్షుల కిలకిల రవళులతో, కిశోరప్రాయపు అమ్మాయిల నవ్వులతో, కేరింతలతో, నిండిపోయే కాలేజీ రోడ్డు. పక్కనే ఋషి వాటికను తలపింపజేసే అందమైన ఆధునిక కుటీరం. పచ్చనాకు సాక్షిగా అని పలకరిస్తున్న పచ్చని చెట్ల నీడ. దానిని ఆనుకుని వున్న అర్ధచంద్రాకారపు వరండా...

...ఇవన్నీ మదిలో దర్శనమిస్తాయి. స్నేహితులను, పుస్తకాలను ఎన్నుకోవటమంటే సంస్కారాన్ని ఎన్నుకోవటమే! ఆ ఉన్నత సంస్కారం ఆయనలో పుష్కలంగా ఉంది. ఆంగ్లేయ సాహిత్య విమర్శకులలో పేరుగాంచిన ఫ్రాన్సిస్ బేకన్ పుస్తకాల గురించి ఒక మాటంటాడు...

Some books are to be tasted...

Some are to be swallowed..

and some to be chewed and Digested.

బేకన్ అంతవరకూ చెప్పి ఆగిపోయాడు. ఎంతైనా 17వ శతాబ్దపువాడుకదా! మరి 20-21 వ శతాబ్దానికి చెందిన జు. చంద్రమౌళి అంతటితో ఊరుకుంటారా? ఆయన మరింత ముందుకెళ్ళి 'Good books, are to be xeroxed... మంచి పుస్తకాలను 'జిరాక్స్ చేయాలి. Copies to be sent to Book Lovers.. వాటిని పుస్తక ప్రేమికులకు అందజేయాలి అంటారు. అప్పుడప్పుడు నచ్చిన రచనలకు మనం ఆ పనే చేస్తాం. కానీ చంద్రమౌళిగారికిది ఒక చిన్న సైజు కుటీర పరిశ్రమ. అది నిత్యం నడుస్తూ ఉంటుంది. ఇక్కడ కథ జిరాక్స్ కాపీలతో ఆగదు. రెండు రోజుల తరువాత మనకు ఆయన నుంచి ఫోను వస్తుంది. నేను పంపినవి మీకు అందాయా అంటూ! పొరపాటున మనం తపాలా చూడకుండా 'అందలేదు' అని అన్నామంటే అంతేసంగతులు. ఆయన ఒక మనిషినిచ్చి మనింటికి పంపుతాడు మరోకాపీ. కొన్ని పుస్తకాలను ఆయన డజన్లకొద్దీ కొంటారు, పంచుతారు.

Books worth reading are worth buying అన్న నానుడి అనుసరించి ఒక అరబ్ సామెత ఉంది. 'పుస్తకాలను చదవమని ఇచ్చేవాడు శుంఠ. అవి తీసుకుని, చదివి, దానిని సంగ్రహించకుండా తిరిగి ఇచ్చేవాడు పరమ శుంఠ'. ఈ సంగతి చంద్రమౌళి గారికి తెలుసు. అందుకే ఆయన పుస్తకం ఇచ్చేముందు 'దీని మరో కాపీ నా వద్ద ఉంది. దీనిని మీ వద్దనే ఉంచుకోండి!' అనో లేకపోతే, నా వద్ద ఇది ఒక్కటే ఉంది చదివి రిటర్న్ చేయండంటారు. రెండు విషయాలలోనూ ఆయన నిర్మొహమాటి.

**తన గ్రంథాలయం నుండి ఎన్నో పుస్తకాలను, ఎందరికో యిచ్చేస్తుంటారు. కొన్ని గ్రంథాలయాలవాళ్ళు కూడా ఇలా లబ్ధిపొందారు. ఆయన ఎందరో రచయితలకు స్ఫూర్తి. ఆ విషయాలన్ని సునందగారిని అడిగినా, కర్నూలు రెడ్డిగారినడిగినా.. నరసరాజుగారినడిగినా తెలుస్తాయి. ఎందరో, రోజూ, ఫలానా పుస్తకాలూ మీదగ్గరున్నాయా? అని అడుగుతూనే ఉంటారు. తన దగ్గర లేకుంటే, తన మిత్రులవద్దనుండైనా, తెప్పించిమరీ పంపించే ఏర్పాటు చేస్తారు. తనింటికి వచ్చే పోస్టుమాన్ మొదలు, చిన్నా పెద్దా అందరికీ, ఏదో పత్రికో, పుస్తకమో యిచ్చే సద్గుణం మనల్ని ఆకట్టుకుంటుంది. తన యింటికి వచ్చేవాళ్ళకు, కొన్ని ఆదేశ (?) సూత్రాలను, నిర్దేశిస్తారు 1. సెల్‌ఫోన్ సైలెంట్‌లో పెట్టాలి. 2. ఒకసారి యింటికి వచ్చాక, ఎప్పుడు వెళ్ళాలో, వాళ్ళు నిర్ణయించకూడదు, 3. తను చెప్పేది సాంతం విన్నాక, అభిప్రాయం అడిగితేనే చెప్పాలి. మధ్యలో మాట్లాడకూడదు, 4. మీరేమేమి చదివారూ? అని అడగకూడదు, 5. బజారు నుండి తనకోసం ఏమీ కొనుక్కొని రావద్దు, 6. వారేమిచ్చినా, వద్దనకూడదు - యిలాంటివి.**

పేరుకు తగినట్లుగానే (ఆయనది 'శివుని' మరోపేరు) ఆయన భోళాశంకరుడు, మితభాషి, ప్రథమకోపి. శివుడు అర్ధనారీశ్వరుడుకదా మరి చంద్రమౌళిగారి అర్ధాంగి ఝాన్సీ గారి గురించి చెప్పకుండా ఈ వ్యాసం పూర్తవదు. ఝాన్సీ సహజ భాషిణి, మంచి చదువరి. కల్మషం లేని వాక్చాతుర్యం ఆమె సొంతం. అతిథులపాలిటి అన్నపూర్ణ. రకరకాల ఫలహారాల తినకుండా, కాఫీ తాగకుండా, ఎవరూ ఆ ఇంటినుంచి విడుదల కారు. ప్రతి సంవత్సరం వాళ్ళ యింటి చెట్టు మామిడిపండ్లు కోయించి, అందరికీ పంచుతారు. శివుని ఝూటాఝూటంలో నున్న చంద్రుడు చల్లని వెన్నెలనిస్తాడు. ఈ చంద్రమౌళి జీవితంలో ఆమె అలా! ఆయన మానవరూపు దాల్చిన ఒక పుస్తక ప్రేమి. నిండైన సాహితీప్రియుడు. ఆయన సాంగత్యం పుస్తక ప్రియులకొక వరం. సాహిత్యాన్ని కావలసినవారికి చేర్చటంలో ఆయనకు ఆనందం ఉంది. గాలి పరిమళాన్ని మోసేది ప్రతిఫలాన్ని ఆశించి కాదు కదా!

కాండ్రేగుల నాగేశ్వరరావు

# వేదిక

**మిసిమి**, జనవరి 2016 సంచిక వేదికలో శ్రీయార్లగడ్డ బాలగంగాధరరావుగారు 'సుత్తనిపాతంలో బావరి శిష్యులు ప్రయాణించిన మార్గాన్ని కాదనటం ఎలా, అంగీకరించ వలసిందే' అంటూనే, నా భావన ఏమంటే అని ఆరంభించి, అసలు పాళీభాష అంటూ ఒకటి ఉందా? పాళీ అంటే నిబ్ అని, పాళీ అనే పదం తెలుగులో తప్ప మరే భాషలోనూ లేదని, ఆంధ్రులు ఉత్తరప్రదేశ్‌కు ఎగువన, నేపాల్‌కు దిగువన ఉండేవారని, గోదావరి అంటే నీరు అని గోదావరులు ఎన్నో ఉన్నాయని, ప్రతిష్ఠాన, మాహిష్మతీ, ఉజ్జయినీ, అశ్మకదేశం అన్నీ ఉత్తర భారతంలోనివే అని, సుత్తనిపాతంలో సూచించినమార్గం గజిబిజిగా ఉందనీ, అందుకు కారణం, అప్పటి భౌగోళికస్వరూపం తెలియనివారు దానిని వ్రాయటమే అని చెప్పుకుంటూ పోయారు.

ఒకప్పుడు ఉత్తర భారతదేశమంతటా ప్రాకృతభాష ఆయా ప్రాంతీయభేదాలతో మాట్లాడబడేదనే విషయంలో అభిప్రాయభేదం లేదు కనుక దాని గురించి మాట్లాడుకోవలసిన అవసరం లేదు. పాళీ అన్నా, మాగధీప్రాకృతం అన్నా, లేక రావుగారి భావన ప్రకారం ఆంధ్రప్రాకృతం అన్నా, (పాళీకి ఇంకొక పేరుగా అల్లంసెట్టివారన్నట్లు మాగధీప్రాకృతం అనటాన్నే నేను ఒప్పుకుంటాను) ఏ పేరు సరియైందన్నదే చర్చనీయం అవుతుంది కాని, ఆ భాష ఉనికి మాత్రం సంశయం కాదు. అంటే రావు గారు ఆ భాష ఉనికిని అంగీకరిస్తున్నారు. అయినపుడు 'పాళీ అనే భాష (పాళీ అనే పేరుతో కాదు) లేదు' అనటం ఎందుకో?

*ఈ విషయంలో పండితులు అభిప్రాయాలు ఎలా ఉన్నా, పాళీ అంటే బుద్ధునిబోధ అనే అర్థం బుద్ధఘోషాచార్యుని*



*(క్రీ.శ 4 వశతాబ్దం) కాలం నాటికే స్థిరపడింది. ఎందుకంటే ఇప్పుడు మనకు ఇందులో బుద్ధుని బోధనలు తప్ప ఇతర లౌకికసాహిత్యమేదీ కనిపించదు. పాళీ అనే పాళీ మాటకు బుద్ధుని బోధనల వరుస, పంక్తి అని అర్థం. దీనికి పాలి అనే ఇంకొక రూపం కూడా ఉంది. 'పాలయతి ఇతి పాలి' బుద్ధునిబోధ కాపాడుతుంది, రక్షిస్తుంది కనుక పాలి.*

ఆంధ్రులు నేపాలుకు దిగువన, ఉత్తరప్రదేశ్‌కు ఎగువన ఉండేవారన్నదానికిగాని, ఇంకా బుద్ధుని తర్వాతనే వారు నేపాలు దిగువనుండి దక్షిణానికి వలస వచ్చారన్నదానికిగాని రావుగారు ఏ ఆధారమూ చూపలేదు.

ఏ ఆధారమూ చూపకుండా షోడశమహా జనపదాల్లో ఒకటైన అశ్మక (అస్సక) ప్రాంతం ఉత్తర భారతదేశంలో ఉండేదనటం ఏమిటి? చరిత్రకారులంతా నాసిక్‌లోపుట్టి, బంగాళాఖాతంలో కలిసే గోదావరి ప్రాంతంలోనే అశ్మక రాజ్యాన్ని చూపించారు కదా!

రావుగారు దానిని ఏ పుస్తకంలో చదివినా, బావరి శిష్యులు కాశీవద్దగల గోదావరిప్రాంతం నుండి సారనాథ్‌లో ఉన్న బుద్ధుని వద్దకు వెళ్లారనటమే ఒక కట్టుకథ. పాళీత్రిపిటకాల్లో అందుకు ఏ ఆధారమూ లేదు.

గోదావరి అంటే నీటిప్రవాహం అనే అర్థాన్ని తీసుకుంటే ఇక ప్రపంచంలో గోదావరి కాని నది ఏది? నల్లనివారు ఎందరోఉన్నా నల్లనయ్య అనే పేరు కృష్ణున్నే స్ఫురింపజేసినట్లుగా, మహానీటి ప్రవాహమైన గోదావరికే ఆ పేరు సార్థకమై ఉండకూడదా! ఇంకా దానికి ఆ పేరురావటానికి గౌతమ మహర్షి – గోవు కథ కూడా పౌరాణిక ఆధారంగా ఉందికదా!

ప్రాచీనభారతదేశంలో ఉత్తరదేశం నుండి దక్షిణదేశానికి పోయే 'దక్షిణాపథం' అని పిలువబడిన మార్గాన్ని రావుగారు పరిశీలిస్తే బావరిశిష్యులు గజిబిజిగా ఉన్నదారిలో ప్రయాణించారని అనేవారు కాదు. దక్షిణాపథం అనబడిన ఆ మార్గం సుత్తనిపాతం ప్రకారం శ్రావస్తిలో మొదలై ప్రతిష్ఠానం వరకూ ఉండేది. అంతమేరకు అది సూటిగానే ఉంది. బుద్ధుడు శ్రావస్తిలో ఉన్నాడనుకొని వారు శ్రావస్తికి వెళ్లారు. అక్కడ లేకపోయేసరికి వైశాలి, రాజగృహం వైపు పయనించారు.

పైఠాను అశ్మక రాజ్యంలోనిదే. బావరి నివాసాన్ని మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌జిల్లానుండి తెలంగాణాలోని కరీంనగర్ జిల్లా వరకు ఎక్కడైనా చూపవచ్చు. కాని




త్రిపిటకాలకు వ్యాఖ్యానం రాసిన బుద్ధఘోషాచార్యుడు బావరి అశ్మకరాజ్యంలో గోదావరినది మధ్యలో మూడుయోజనాల విస్తీర్ణం గల ద్వీపంలో ఉండేవాడని చెప్పటం వలన, అటువంటి ద్వీపం ఈ ప్రాంతంలో నిజామాబాదు, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల సరిహద్దులో ఉన్న బాదనకుర్తియే కావటం వలన (ప్రస్తుతం ఇది ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఉంది). ఆ గ్రామమే ఒకప్పటి బావరి నివాసప్రాంతమని చెప్పవచ్చు. అందువలన బావరిశిష్యులు గోదావరినది వెంట పైఠాను వరకు ప్రయాణించి అక్కడినుండి దక్షిణాపథ రాజమార్గాన్ని అనుసరించినట్లు కనపడుతుంది.

ఇక 'ఆంధ్రబ్రాహ్మణులు బౌద్ధాన్ని అనుసరించారు గనుకనే ఉత్తరాది బ్రాహ్మణులు వీరిని బ్రాహ్మణులుగా అంగీకరించరు' అన్నారు. అంటే ఉత్తరాది బ్రాహ్మణులు బౌద్ధాన్ని అనుసరించలేదనేగదా అర్థం. కాని ఇది నిజం కాదు. బుద్ధుని ప్రధానశిష్యుడు సారిపుత్రుడు బ్రాహ్మణుడే. మహాకాత్యాయనుడు బ్రాహ్మణుడే. బుద్ధునిపై ఎంతో గౌరవాదరాలను చూపిన శైలుడు బ్రాహ్మణుడే. మొదట ఆయనను వ్యతిరేకించిన ఎంతోమంది ఉత్తరాదిబ్రాహ్మణులు ఆయనతో మాట్లాడిన తర్వాత ఆయన గృహస్థశిష్యులుగానో, భిక్షువులుగానో మారిపోవటం జరిగింది.

దీనితో షోడశ మహా జన పదాలను చూపించే ప్రాచీన భారతదేశ పటాన్ని, బావరి శిష్యులు పయనించిన మార్గాన్ని సూచించే పటాన్ని జతచేశాను.

భిక్ఖు ధమ్మరక్షిత (మోక్షానంద)

# వేదిక

## వేల్చేరువారు కన్యాశుల్కములో గురజాడ గతి – వి.వి.న.మూర్తి, మిసిమి, నవంబర్ 2015

గురజాడ రాజాజ్ఞపై క్రీ.శ.1892లో కన్యాశుల్కాన్ని వ్రాశారు. క్రీ.శ. 1897లో రాజు మరణించాక లభించిన స్వాతంత్ర్యంతో కన్యాశుల్కంలో నూతన భావాలకు వైతాళికులుగా గురజాడను చెప్పుకునే వందేళ్ళ ఆలోచనాపరుల పట్ల ఎలాంటి మర్యాదలు పాటించకుండా చీల్చి చెండాడి కొట్టి పారవేసి ఆనందతాండవం చేశాడు. 'మార్క్సిస్టులు తమ రాజకీయ పథకంలో చేర్చుకోవటం వారు గురజాడ గొంతును నూతన సమాజానికి శంఖారావంగా వేల్చేరువారు ప్రచారం చేశారు' అని వివిన మూర్తి అన్నారు. కన్యాశుల్కాన్ని ఆంధ్ర కమ్యూనిస్టులు గోబెల్స్ ప్రచారంలాగా తలకెత్తుకున్నారు. కన్యాశుల్కంలో మార్క్స్ భావాలు వున్నాయా? ఆనాటి సామాజిక దుష్టసాంప్రదాయాలు ఎత్తి చూపే ప్రయత్నమే కన్యాశుల్కం నాటకం.

మన ఆంధ్ర కమ్యూనిస్టుల గురించి క్రీ.శ. 1955లో ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆనాటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 'రష్యాలో వర్షం పడుతుందంటే ఇండియాలో గొడుగులు తెరచి పట్టుకుంటారు ఈ కమ్యూనిస్టులు' అని అన్నారు. తరువాత చాలా ఏండ్లకు ప్రముఖ ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడు, సాహితీవేత్త కీ.శే. గజ్జల మల్లారెడ్డి తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా ఇస్తూ 'ఆనాడు సంజీవరెడ్డి కమ్యూనిస్టుల గురించి చెప్పింది ఎంతో నిజం' అని అన్నాడు.

యార్లగడ్డవారు గురజాడవారి కాలంనాటి సామాజిక పరిస్థితుల వల్ల రచింపబడిన కన్యాశుల్క నాటకాన్ని, అనంతర కాలంలో దానిని బ్రాహ్మణ సమాజ వర్గం అమ్మకంగా పరిణమింపచేసుకోవడం, కన్యాశుల్కమనేది కన్యను పొందటానికి ఆమె తల్లిదండ్రులకు చెల్లించే సుంకం మాత్రమే మొదలగునవి వివరంగా రాశారు. ఇది రాను రాను వధువు తండ్రి ఆమెను అమ్మజూపిన వెలగా పరిణమించింది. వరుడు తొందరగా పరలోకగతుడైతే అతని ఆస్తి కుమార్తె ద్వారా తమకు లభిస్తుంది, విధవరాలైన తమ కుమార్తె తమ పంచన చేరి తమకు సేవలు చేస్తుందన్న ఆలోచన కూడా అందులో చోటు చేసుకుంది. ఎంత నైచ్యం? ఎంత కర్కశత్వం? వీటినే గురజాడ తన కన్యాశుల్కంలో చెప్పారు. నాటకం వ్రాస్తే మహాకవి అంటారా? అని కూడా ప్రశ్నించాడు. గురజాడవారు రచించిన కవితలు ఇంగ్లీషులో 8. 1. Sarangadhara, 2. Beauty of the Blue Hills, 3. The wonders of Ooty, 4. Worship of Lord Uma, 5. The word of long ago, 6. Is there no magic? 7. I took you for a picture, 8. Madras Congress. తెలుగు 27. 1. నీలగిరి పాటలు, 2. ఊటి చోద్యమేమిటి చెపుదు, 3. ఉమాపతి యర్చన, 4. నాటి మాట, 5. లేవొకో మంత్రములు, 6. చిత్తరువుని చూడ, 7. ముత్యాల సరములు, 8. కాసులు, 9. దామన్, పితియస్, 10. లవణరాజు కల 11. ముత్యాలసరం, 12. కన్యక, 13. మనిషి, 14. దేశభక్తి, 15. లంగరెత్తుము, 16. కోరుకొండ, 17. పూర్ణమ్మ, 18. దించులంగరు, 19. మిణుగురులు, 20. సుభద్ర, 21. Subject for extravaganza (English and Telugu), 22. పుష్పలావికలు, 23. బొట్టు, 24. సమస్యాపూర్ణం (ఒక పద్యం). 25. మాటలు – మబ్బులు, 26. మెరుపులు, 27. ఋతుశతకం, 28. పిల్లల పాట మొత్తం 36 కవితలకే కమ్యూనిస్టులు మహాకవి అని వుండవచ్చు.

ఆచార్యులవారు ఇంకా ఇలా అన్నారు.... సంప్రదాయమైన కన్యాశుల్కాన్ని అడ్డం పెట్టుకుని, యుక్తవయస్సుకు రాని బాలికలను అమ్మక వస్తువులుగా చేసి, ముదుసలులైన, కొండొకచో చావటానికి సిద్ధంగా వున్న వరులకిచ్చి పెళ్ళిచేసిందెవరు? బ్రాహ్మణులు. అది కూడా ఒక ప్రాంతంవారు తప్ప మిగిలిన సమాజంలో ఒక్క ఉదాహరణనైనా చూపగలరా? మొత్తం సమాజంలో బ్రాహ్మణులు ఒక వర్గం. వారిలోని ఒక సమస్యపై ఒక బ్రాహ్మణుడు వ్రాస్తే అది సాంఘిక సంస్కరణ అవుతుందా? ఎందుకు 100 ఏళ్ళుగా పై విధంగా నమ్మించారు? నమ్మించిందెవరు? వారు కారా? ఎవరిని ఉద్ధరించడానికి గురజాడ అది వ్రాశారో ఆ సమాజం ఎపుడైనా ఆయనను పట్టించుకుందా? మొదట ఆ నాటకానికి ప్రదర్శన పూర్వక ప్రచారాన్ని చేసింది కమ్యూనిస్టులు కారా? దానికి విస్తృతమైన ప్రచారం సమకూర్చేనాటికే బాల్య వివాహాలు అంతరించిపోలేదా? బాల్య వివాహాలు అంతరించిపోవడానికి కాలంలో వచ్చిన మార్పులు తదనుగుణంగా సమాజంలో వచ్చిన మార్పు తప్ప ఆనాటకం ఏమైనా దోహదం చేసిందా? మొదట వేల్చేరు వారు కమ్యూనిస్టు భావజాలంలో ఉన్న, కాలంతోపాటు ఆయన మార్పు చెందడం తప్పా? మార్పు చెందినట్లు స్పష్టంగా వెలిబుచ్చటం వ్యక్తికిష్టమైన మానసికారోగ్యానికి మేలు కాదా? వెల్చేరు వారు తన ఆలోచనా ధోరణిని మార్చుకుంటే వివినమూర్తి కెందుకంత ఆగ్రహం? అని కూడా ప్రశ్నించారు.

ఏతావాతా చెప్పడమేమంటే కన్యాశుల్కంలో కమ్యూనిస్టు భావజాలం లేదు. ఆంధ్ర కమ్యూనిస్టులే ఆయనను తలకెత్తుకుని ఆరాధించారు. 35 కవితలు రాసినవాడు మహాకవి అవుతాడా? ఆయన మహాకవి అయితే తెలుగు సాహిత్యానికి భిక్షపెట్టిన కవిత్రయం, పోతన, శ్రీనాథుడు, ప్రబంధ కవులకు ఎన్ని మహాబిరుదులివ్వాలి? సంగ్రహంగా చెప్పాలంటే గురజాడను మహాకవిని చేసింది మన కమ్యూనిస్టులు మాత్రమే. దానికి గుర్తింపులేదు.

**కోడూరు పుల్లారెడ్డి**

## వేదిక

### కన్యాశుల్కం - మరోస్పందన

జనవరి 16, సంచికలో యార్లగడ్డ బాలగంగాధర రావుగారు *కన్యాశుల్కం* నాటకాన్ని గురించి విస్తృతంగా చర్చించారు. తర్వాత కొన్ని సందేహాలు వెలిబుచ్చారు. వాటిలో కొన్నింటికి వివరణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తాను.

*కన్యాశుల్కం* నాటకం వ్రాసి వంద సంవత్సరాలైనా ఇంకా ప్రజలమధ్య వుండటమే దీని విశిష్టత. మార్క్సిస్టులు దీన్ని ప్రజలపై రుద్దారని కాకుండా ఒక చర్చను ప్రారంభించి, అందులోని సామాజిక ప్రయోజనాన్ని ప్రజలకు చెప్పారని అనుకోవాలి. భారతదేశంలో సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది కలిగించే అనేక ఆచారాలను ఎత్తిచూపుతూ, వాటి నిర్మూలనకు కృషిచేసిన వారిని వలస పాలకులకు మద్దతునిచ్చేవారిగా చూడనక్కరలేదు. సామాన్య ప్రజానీకాన్ని చైతన్య పరచడమే వారు చేసిన పని.

మూర్తిగారు గానీ మరెవరైనాగానీ కందుకూరిని, గురజాడను ఆరాధించమని ఇంకొకరికి ఆదేశాలివ్వలేదు. ఇచ్చినా తమకు అయిష్టమైన దీన్ని పట్టించుకోరు. ప్రత్యేక సమస్యను గురించి వివరించి, ఆ సమస్య వ్యక్తిగాని, సమాజానికి గాని ఏ విధమైన నష్టం వాటిల్లుతుందో సహేతుకంగా వివరిస్తే, అది ఎదుటివారికి సరియైనది అని అనిపించినప్పుడు మాత్రమే స్పందిస్తారు, ఉద్యమంలో తోడవుతారు. లేకపోతే లేదు.

వీరేశలింగం గారు వితంతు వివాహాలను ప్రోత్సహించారు. కొన్ని ఆయనే చేయించారు. అప్పారావుగారు బాల్యవివాహాలను, కన్యాశుల్కాన్ని ఆపే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో భాగంగా విజయనగరం సంస్థానాధీశుల ఆదేశంతో ఒక సర్వే నిర్వహించారు. తద్వారా బ్రిటీష్ ప్రభుత్వంతో బాల్యవివాహాల నిరోధక చట్టం తెచ్చేందుకు తోడ్పడ్డారు. వీరు సతీసహగమనాన్ని నిరోధించేందుకు ఎందుకు ప్రయత్నించలేదన్నది గంగాధరరావుగారి ప్రశ్న. సంఘసంస్కర్తలందరూ సమాజంలోని అన్ని దుర్గతుల నిరోధానికి పాటుపడలేదు. తాము, తాము చెయ్యగలిగిన వాటి కొరకే పోరాడుతారు. అదే కోవలో రాజా రామ్‌మోహన్ రాయ్ గారు సతీసహగమన నిరోధాన్ని, రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రపంచ శాంతి కొరకు, వివేకానందులవారు హిందూ ధర్మప్రాశస్త్యాన్ని ప్రచారం చేసేందుకు నడుం బిగించారు. అదేరకంగా వీరేశలింగంగారు, అప్పారావుగారు ఆ దిశగానే కృషిచేశారు. కన్యాశుల్కము అనేది ఒక సామాజిక సమస్య విపరీత ధోరణులతో స్త్రీ జాతికి (ఏ కులంవారైనా) అన్యాయం జరుగుతున్నదన్న కారణంతోనే దీన్ని సంస్కరింప బూనుకొన్నారు గురజాడవారు. దీన్ని బ్రాహ్మలు ఆమోదించి ఉద్యమంలో పాలుపంచుకొన్నారా అన్నది, వారి వారి సంస్కారంతో, అభ్యుదయ భావాలతో మాత్రమే ముడివడి వుంటుంది. సమాజంలో ఎక్కువమంది అలా వుండరు. విచక్షణంగా జ్ఞానం కలిగి సమాజ శ్రేయస్సు కోరే కొంతమంది మాత్రమే ఆ పని చేయగలరు.

ఒక సమస్యపై బ్రాహ్మణుడు వ్రాసినా, మరొక కులంవారు వ్రాసినా సాంఘిక సంస్కరణే అవుతుంది. సమాజంలో ఒక వర్గంవారికైనా అది మేలు జరిగే కార్యక్రమం కనుక సంస్కరణ అవుతుంది. కన్యాశుల్కంలోని సంస్కరణ అంశాన్ని గుర్తించి కమ్యూనిస్టులు ప్రచారం చేసివుంటారు. అప్పుడు కొంతమంది బ్రాహ్మణులు ప్రభావితమై వుంటారు. అది మామూలే. విశేషం ఏమీ లేదు. త్రికరణశుద్ధిగా బ్రాహ్మలు అందరూ కమ్యూనిజాన్ని అలవరచుకోవాలని ఎక్కడా లేదు.

బాల్యవివాహాలు మంచివి కావని, అవి అంతరించిపోవాలని కోరుకొన్నది కమ్యూనిస్టులయితే వారిని అభినందించాల్సిందే. బాల్యవివాహాలు సమాజానికి హితవు కాదనే విషయాన్ని నాటకం ద్వారాగాని, ప్రచారం ద్వారాగాని చేయడం మంచి కార్యక్రమమే. ఇంత చేసినా ఈనాటికీ యుక్తవయసు (18 సంవత్సరాలు) రాకపూర్వమే ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరుగుతూనే వున్నాయి. ఇప్పుడు కూడా 'చిన్నారి మల్లి' నాటక ప్రదర్శన అవసరమవుతూనేవుంది. ప్రతి సంవత్సరం ఒకరోజు శ్రీకాళహస్తిలో బాల్యవివాహాలు జరుగుతూనే వున్నాయి, పోలీసులు కేసులు పెడుతున్నారు కూడ.

కన్యాశుల్కం అన్నది ఒకనాటి చారిత్రక అంశం. రామాయణ, భారతాలు ఇతిహాసాలు. అంతేగాని చరిత్ర కూడ కాదు. అయినా వీటిలో కవులు తమ రచనాకౌశలంతో మలిచిన కథావస్తువును ప్రజలు ఈనాటికీ అన్ని విధాలా ఆదరిస్తున్నారు. అదేవిధంగా వందేళ్ళనాటి కన్యాశుల్కాన్ని ప్రదర్శించడంలో అనౌచిత్యం ఏమీ లేదు. ఎంతోమంది చిత్తశుద్ధితో చివరివరకూ కమ్యూనిస్టులుగానే వున్నారు.

అభిప్రాయాలు మార్చుకొన్నవారూ వున్నారు. రాహుల్ సాంకృత్యాయన్‌గారిని కమ్యూనిస్టు పార్టీ నుంచి బహిష్కరించారు. అయినా తాను కమ్యూనిస్టుగానే జీవితం చాలిస్తానని అన్నారు. అంటే పార్టీలో వుంటేనే కమ్యూనిస్టు కాదు. ఆ భావజాలంతో మనుగడ సాధించినవారు, సాగించేవారూ అందరూ కమ్యూనిస్టులే. పోతే, యార్లగడ్డవారి భారతాన్ని ప్రచురించడానికి డబ్బు ఇవ్వడం, ఇవ్వకపోవడం దాన్ని తీసుకోవడం, తీసుకోకపోవడం వ్యక్తిగత అంశాలు మాత్రమే అవుతాయి. దానిని ఏ సామాజిక అంశానికి ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదు.

**సందేహాలు :**

1. కన్యాశుల్కం నాటకాన్ని గురజాడకాక మరొక వర్గీయుడు రాసి వుంటే బ్రాహ్మణ సమాజం ఆమోదించేదా అంటే – అప్పుడు మాత్రం ఆమోదించారా? సమాజంలో మార్పు వెంటనే రాదు సరికదా వ్యతిరేకత వస్తుంది. ఆ తర్వాతనే క్రమంగా స్థిరపడుతుంది. 2. శారదా చట్టాన్ని ఉల్లంఘించి ఫ్రెంచిపేటలో, యానాంలో బాల్యవివాహాలు జరిపించింది బ్రాహ్మణులేనంటారు. 3. వితంతు వివాహాలు చేయవలసిన అవసరం బ్రాహ్మణుల్లోనే ఎక్కువగా వుండినది. అందుకే దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. వేరే కులంవారు వీరేశలింగంగారిని ఆశ్రయిస్తే వారికి కూడా చేయించేవారేమో!

పోతే, నెల్లూరులో 21-9-14 వ తేదీనాటి *కన్యాశుల్కం* ప్రదర్శన మాకొక గొప్ప అనుభవం. మా మిత్రులు నిరంజనరెడ్డిగారు, బాలసుబ్రహ్మణ్యంగారు (ఎమ్.ఎల్.ఏ), కాళిదాసు పురుషోత్తం గారు ఈ నాటకం 8.00 గం॥ల ప్రదర్శనను హైదరాబాదు, విశాఖపట్టణాలలో చూశారు. ఆ అద్భుత విన్యాసాన్ని నెల్లూరు ప్రజలకు కూడా చూపించదలచారు. మొదటగా 20 మంది మిత్రులం ఒక బృందంగా ఏర్పడి అనేక సమావేశాలు నిర్వహించుకొన్నాం. ఆ తర్వాత ఆచార్య ఆదిత్య, ఆనందరావు, రైతుసంఘం కోటిరెడ్డి గారు తోడయినారు. గురజాడగారి గొప్పతనాన్ని, *కన్యాశుల్కం* విశిష్టతను వివరిస్తూ ప్రచారం చేశాం. నగరంలోని అన్ని వర్గాల ప్రజలను, ప్రముఖులను కలిశాము. ఆర్థిక, మార్థిక సహకారాన్ని అర్థించాము. చాలామంది మంచి ప్రయత్నమని మమ్ము ప్రోత్సహించారు. దాంతోపాటుగా ఈ రోజుల్లో నాటక కళకు ఆదరణ లేదని, వృథా ప్రయత్నమని కొంతమంది నిరుత్సాహ పరిచారు. కానీ మా ప్రయత్నాన్ని కొనసాగించాము. జిల్లా కలెక్టరుగారు సానుకూలంగా స్పందించి, కస్తూర్బా కళాక్షేత్రాన్ని ఉచితంగా ఇవ్వడంతోబాటు ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. సహృదయులైన చాలామంది మిత్రులు ఆర్థిక సాయమందించారు.

నాటక వ్యయం దాదాపు 4.5 లక్షల రూపాయలు. ప్రదర్శన నిడివి 8 గంటలు. మధ్యాహ్నం 2.00 గం॥లకు మొదలై రాత్రి 10.00 గం॥లకు ముగించేటట్లు ఏర్పాటు చేసుకొన్నాం. మధ్యలో రెండు విరామ సమయాలల్లో అల్పాహారానికి తాత్కాలిక కాంటీన్ ఏర్పాటు చేశాము. అనూహ్యంగా మధ్యాహ్నం 1.30 గం॥లకే హాలు నిండిపోయింది. ఆ థియేటర్ పరిమితి 1100 సీట్లు. కానీ జనప్రవాహం కొనసాగింది. కొంత ముందుచూపుతో వరండాలో అదనపు కుర్చీలు వేయించి, టి.వి.లు అమర్చడం జరిగింది. సీట్లు లేవని కొంతమంది వెనుదిరిగిపోయారు. మరికొందరు రావడం మానుకున్నారు. ప్రక్క జిల్లాలనుండి కూడ కొంతమంది మిత్రులు, అభిమానులు విచ్చేశారు. జిల్లా పాలనాధికారి శ్రీకాంత్ కుటుంబ సభ్యులతోసహా నాటకాన్ని ఆసాంతం తిలకించి పులకితులయ్యారు. 45 మంది కళాకారుల్ని, 15 మంది సాంకేతిక నిపుణుల్ని సత్కరించిమరీ వెళ్ళారు.

నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రం చరిత్రలో 200 మందికి మించి హాజరయిన సంఘటన మరొకటి లేదు. ఈ నాటక ప్రదర్శనను పత్రికలన్నీ ప్రశంసించాయి. ఉక్కపోత, అననుకూల పరిస్థితిల్లో కూడ ప్రదర్శన విజయవంతమయింది. ఇందుకు కారణం గురజాడ పైనున్న గౌరవం, *కన్యాశుల్కం* నాటకం పైనున్న మక్కువ, కళాకారుల ప్రతిభ. నాటక ప్రదర్శన పూర్తయి ఒక సంవత్సరం దాటినా మిత్రులు చాలామంది ఆ ప్రస్తావన తెస్తూనే వున్నారు. నాటకంలో ప్రధాన అంశమయిన *కన్యాశుల్కం* తప్ప మిగతా అంశాలు లంచాలు, అధికారుల దౌష్ట్యం, వ్యక్తుల కుతంత్రాలు ఈనాటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్నవే. కృష్ణా, గుంటూరు జిల్లాలోనేకాక గురజాడ, కందుకూరి వారి సాహితి, సామాజిక సేవలు రాయలసీమ జిల్లాలలో కూడ ప్రచారం పొందినవే. వారిని బ్రాహ్మణులే కాదు సమాజంలోని అన్ని వర్గాల వారికి ఆదర్శ వ్యక్తులే అనేదానికి నెల్లూరు నాటక ప్రదర్శనయే నిదర్శనం.

**చెలంచర్ల భాస్కరరెడ్డి**
**కన్యాశుల్కం ప్రదర్శన కార్యదర్శి కమిటి**
**నెల్లూరు. ఫోన్ : 944 047 2840**



## గురజాడ అప్పారావుపంతులు

అప్పారావు మహాకవి. అతని గ్రంథాలు శతాధికాలు కావు గాని అన్నీ సానలు తీరిన జాతిరత్నాలు.

అప్పారావుభావుకత్వాన్ని గ్రహణశక్తి కలవారిలో కొంతమందే యెరుగుదురు. చాలామంది యెరక్కపోవడానికి కారణం మిక్కిలి చిన్నదే; అయితే చాలా బలమయింది.

అప్పారావు కన్యాశుల్కం సరికొత్త సరుకు. వీరేశలింగంపంతులు నవీనవాఙ్మయ నిర్మాతయే; గాని అతని వాఙ్మయం పాఠకలోకానికి కన్యాశుల్కాన్ని చక్కగా పరిచయపరపజాలేటంతటిది కాలేకపోయింది. పైగా—

అప్పారావుపేరు మొదట కవిగాకంటె వ్యావహారికభాషావాదిగా ప్రఖ్యాతి పొందింది. పండితులు చేసిన ప్రతివాదాలూ, పత్రికలు చేసిన విమర్శనలూ అక్షరాస్యుల కందరికీ అతన్ని పరిచయపరిచాయి. తరవాత కన్యాశుల్కమూ, ఖండకావ్యాలూ, చిన్నకథలూ, మాటామంతీ వ్యాసపరంపరా రసికుల హృదయాలమీద అతని పేరు అచ్చుగుద్దేశాయి.

అప్పారావు రాచకూతురికి ప్రయివేటు సెక్రటరీగా కాక స్వతంత్రుడై వుంటే యింకా యెన్ని మహాగ్రంథాలు రచించివుండునో. ఆంధ్రవాఙ్మయానికీ, ఆమూలాన్ని ఆంధ్రసంఘానికీ యింకా యెంత వికాసం కలిగించి వుండునో.

అప్పారావుమృతివల్ల అతని జీవలేఖిని గళితమై పోవడమే కాదు; అనేకమంది నవకవులకు కావలసిన మంచి వరవడి అసంపూర్ణమై పోయింది.

అప్పారావురచనల్లో పెద్దదీ, ప్రధానమూ అయిన కన్యాశుల్కం నాటకమా ప్రహసనమా? ఇది అనవసరప్రశ్న. ఏమంటే? ఆగ్రంథాన్ని గురించి యోచించతగ్గ ప్రధాన విషయం యిది కాదు. అందులో కవిత్వం వుందా లేదా, వాఙ్మయపిపాసువు లాస్వాదించడాని కందులో రసం వుందా లేదా?

అప్పారావురచనలు చేతబట్టి శబ్దరూపాలు మాత్రమే పరిశీలించేవాడు రసికుడు కాడు; పండితుడూ కాడూ; చివరికి వాఙ్మయం అంటే అభిరుచి కలవాడుకూడా కాడు.

అప్పారావు వాస్తవంగా ఆంధ్రవాఙ్మయాకాశం మీద ధ్రువతార. అది అనశ్వరంమాత్రమే కాదు; మార్గదర్శకం కూడాను.

నేడు కుమారకవిసింహాల్లో అప్పారావుని అనుకరించేవారనేకు లున్నారు. అప్పారావు రచనల మాధుర్యాన్ననుభవించే రసికులుకూడా చాలామందే వున్నారు. కాని ఆమహాకవిని గౌరవించడానికి ఒక శిలావిగ్రహప్రతిష్ఠాపనం లేదు; వొక తైలచిత్ర ప్రదర్శనమేనా లేదు; చివరికి, నలుగురూ వొకచోట కూచుని అతని భావుకత్వాన్ని స్మరించుకోడమేనా లేదు.

మొన్నమొన్న కళాసమితివారు మాత్రం చిన్న యెత్తుమీద రాజమహేంద్రవరంలో వొక స్మృతిసభ జరిపారు.

మొత్తానికి మనలో అకార్యకరణమే గాని కర్తవ్యనిష్ఠ తక్కువ; ఉద్రేకమే గాని ఉత్తేజనము తక్కువ; అనుకరణమే గాని స్వయంనిర్ణయం తక్కువ.

గురజాడ అప్పారావుపంతులు ఆంధ్రవాఙ్మయంలో క్రొత్తపోకడలు చూపిన ధీశాలి. అతన్ని మనం మరిచిపోతే అది చాలా దౌర్జన్యంలో చేరిపోతుంది.

– *శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి*

*('భారతి', జనవరి – 1933)*

దేశం ఎంతగా పరుల పాదాల కింద నలిగిపోవాలో అంతగానూ నలిగిపోయాకా, జాతి యెంతగా బానిస అయిపోవాలో అంతగానూ బానిస అయిపోయాకా, భాష యెంతగా శృంఖలాబద్ధం అయిపోవాలో అంతగానూ శృంఖలాబద్ధం అయిపోయాకా, సాహిత్యం ఎంతగా దిగజారిపోవాలో అంతగానూ దిగజారి పోయాకా, భవిష్యత్తు ఎంతగా అంధకార బంధురం అయిపోవాలో అంతగానూ అంధకారబంధురం అయిపోయాకా పుట్టుకువచ్చాడీ మహాకవి.

*(నవోదయ, డిసెంబరు, 1946)* –

*పై రెండు 'మనసు' రాయుడు గారి సౌజన్యంతో*

# పరితోషణ

- బి.వి. నరసింహారావు

*కొన్ని పాటలు పాడుకుంటే ఆనందంగా ఉంటుంది. మరికొన్ని నాట్యమాడుకుంటే అందంగా ఉంటుంది. బంగారి మామ పాటలు ఆడి పాడుకుంటానికి అనువుగా ఉంటాయి. బంగారిమామ పాటలను కవులు, గాయకులు, నాట్యకారులు ప్రత్యేకంగా గౌరవించారు. ఈ పాటలెన్నో రికార్డయినాయి. అనువాదం పొంది, ఖండాంతరాలు కూడా దాటినాయి. అయితే, ఈ పాటలకున్న ప్రాచుర్యం రచయిత అయిన కొనికళ్ల వెంకటరత్నం గారికి లేకపోవటం గమనించాలి. ఈ రచయిత పేరు ఒక వ్యక్తిగానైనా చాలామంది విని ఉండరేమో!*

కవి మిత్రులు కొనకళ్ళ వెంకటరత్నంగారు తన *బంగారిమామ* పాటలకు నన్ను ఏవైనా రెండు పరిచయ వాక్కులు వ్రాయవలసిందని కోరినప్పుడు నాకెందుకో ఆశ్చర్యం, ఆనందం కలిగినాయి.

“అదేమిటి? మీ పాటలకు సిసలైన వెల నిర్ణయించగల షరాబులు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. ఈనాడుంటే నండూరి సుబ్బారావుగారు మీ పాటల అంతస్తుని తన అమూల్యాభిప్రాయంతో కొలిచి ఉండేవారు. అలా వాగ్దానం చేశారు కూడా ఆయన. అసలు చలంగారొక్కరే ఏదైనా వ్రాస్తే అంతశ్శుద్ధిగల ఆ మనీషి వాక్కులు మీ కృతి ద్వారానికి తోరణంగా అందగించేవి” అన్నాను నేను. “ఔను. అదంతా నిజమే. కాని వారందరి అభిప్రాయాలు సాధికారంగా సమన్వయంచేసి అందమైన హారంగా గ్రుచ్చి అందీయగలవారు మీరు. అంతేకాదు, ఎన్నో సంవత్సరాలు నా ఆ పాటలు నాట్యంలో పాడి అభినయించి ప్రచారం చేసిపెట్టినవారు. అందుచేత మీరే వ్రాయాలి. మీరు వ్రాస్తే నాకెంతో ఆనందం, తృప్తి” అన్నారు మిత్రులు.

ఆ మాటలు వినగానే ఆశ్చర్యానందాలకు మించిన ఏదో భావం నాలో పరుగులు తీసినట్లయింది; పరవళ్ళు త్రొక్కినట్లయింది. ఈ పాటలపై పెద్దల అభిప్రాయాల్ని కొద్దిగానైనా ఇక్కడ ఉల్లేఖిస్తే నా ధర్మాన్ని నిర్వహించిన వాణ్ణవడమే కాకుండా, ఈ పాటలు విలువను కొంతకు కొంత స్పృశించినవాణ్ణికూడా ఔతాను.

మొదట చలంగారి మాటలు ఉదహరిస్తా–

“కొనకళ్ళ వెంకట్రత్నంగారి పేరు అసలు ఒక వ్యక్తిగానన్నా ఎవరూ వినలేదేమోననిపిస్తుంది. ఏలూరులో ఒక ఉదయం చేరాము – నండూరి సుబ్బారావుగారి ఇంట్లో – నేనూ, కృష్ణశాస్త్రి, నారాయణబాబూ. ఆయనని పాడమని అడుగుతున్నారు శాస్త్రిగారు. శాస్త్రిగారు ఇట్లా మనుషులచేత పాడించడం, వాళ్ళు పాడడం – నాకు పూర్వకాలం చాలా అనుభవం. కనక ఆయన అడగడంలో విలువ పైన నాకు సందేహం. వెంకట్రత్నంగారినించి ఏదో ఒక పదజాలం ఏదో రూపంలో మా మధ్యకి ఉరికి మడుగుకట్టి, నన్ను తొరగా ఇంటికి పంపుతుందనే ఆశతో తల తిప్పుకున్నాను. నా చెవికి “సుక్కలన్ని కొండమీద సోకుజేసుకునేవేళ” అన్న మాటలు, కృష్ణశాస్త్రి గారినుండి ఊపిరిబిగపట్టిన అరుపూ వినిపించాయి. కళ్ళువిప్పి ఏమిటది? అన్నట్టు చూశాననుకున్నాను. మరి ఎట్లా చూశానో! తల వొంచుకుని మాతో సంబంధం లేకుండా పాడే వెంకట్రత్నం గారితో ఐక్యమయింది నా మనసు. ఎంకి పాటల్ని అనుకరించిన పాటల్ని చూస్తే నాకు అసహ్యం. కాని ఇవి ఎంకిపాటల అనుకరణం కావు. ఎంకి పాటలనేవి లేకపోయినా ఇవి తెలుగు ప్రపంచంలోకి రావటం ఆగేది కాదు. కొన్నికొన్ని పాదాల్లో ఎంకిపాటల్ని మించిన లయ–విరుపులు – శబ్దంలో సంగీతం, ఎక్కడనించో అపురూపపు పుష్పాల్ని ఏరితెచ్చినట్టు ఆ మాటలు, మాటతోమాట ఐక్యం – అంతా ఒక గొప్ప అపురూపమైన చాలా అందమైన కవిత్వపు పటం.

పంటబోది వరిమడితో / పకపక నవ్వేవేళా–

చీకటి మిణుగురు జోతుల / చిటిలి చిల్లులడకమున్నే–

అంటూవుంటే హడలిపోయి చూశాను. ఈ పాటలు ఇంతకాలం వినక బతికిన నా అలసత్వానికి సిగ్గుపడుతో. ఆ పాదాలలోని సంగీతాన్నీ, కవిత్వాన్నీ వినకలేపోయినా, వినికూడా ‘ఎంతగొప్ప’ అని తలవొంచలేకపోయినా – ఎంత దౌర్భాగ్యం! మళ్ళీమళ్ళీ ఆదరంతో బి.వి. నరసింహారావుగారు వెంకట్రత్నంగారి కవిత్వంలోని అందాన్ని, పాటలో శ్రావ్యంతోనింపి, నా మనసుని రేడియోల మోతలో, బస్సు

దుమ్ములో కుంగిపోకుండా దులిపి పోతో ఉంటారు. నరసింహారావుగారి కంఠంలో నాజూకుగా పలుకుతో, పాటలోని ఎన్ని నిగూఢ భావాలు వ్యక్తమౌతాయో!

"చూపులో సిరి చిందువాడా!" అనగల కవిని ఎట్లా ఉపేక్షించి ఊరుకోవడం? నరసింహారావుగారి కంఠంలో, డాక్టరుగారి ముఖంలో – చిందుతుంది సిరి. కాని, స్త్రీ ప్రేమించి సంబోధించగల సిరిని చూపుల్లో చిందగల యువకులు ఈనాడు లేరు. కాని, సృష్టిదేవత కరుణించి ప్రసాదించిన ముఖంలో సిరినైనా కాపాడుకోవాలంటే, ఎంత జాగ్రత్త, ఎన్ని అబద్ధాలు, చల్లగా తప్పుకోవడాలు అవసరం. కంఠంలో సిరినైనా ప్రకాశింప చెయ్యాలంటే చాలా వంచనలూ, యాచనలూ కావాలి. ఆ సిరిని రూపాయలుగా మార్చుకోవలసి వొచ్చినప్పుడు – మెట్టుదిగి మోకరించనివాడి కలంలో సిరికూడా కాసుకి పనికిరాదు."

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి *బంగారిమామ* పాటలంటే చాల మంచి అభిప్రాయం. వాటి రచనాశిల్పాన్ని, భాషాసౌష్ఠవాన్ని, భావసౌకుమార్యాన్ని ఆయన మెచ్చుకుంటారు. ముచ్చటపడి మరిమరి పాడించుకుని వింటారు. యెంకిపాటల కర్త నండూరి సుబ్బారావుగారు. ఈ పాటలు మొదట విన్నప్పుడు మైమరచి పోవడం నేను కన్నారా చూశాను. "ఇలాంటి ఉత్తమ గేయాలు రచించిన యువకవిని ఉచితరీతిని సన్మానించడం నా కనీస ధర్మం" అన్నారు. అలాగే ఒక గొప్ప సభను ఏర్పాటుచేసి, శివశంకరశాస్త్రి, కృష్ణశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగార్ల వంటి సాహితీవేత్తల సమక్షాన ప్రియమారా గౌరవించి సత్కరించారు. ఆ ఘట్టం వెంకటరత్నంగారి సాహిత్యపు విలువకు ఒక చక్కని గీటురాయి. ఆంధ్రదేశంలో కవులు, గాయకులు, రసజ్ఞులు అందరికీ ఈ బంగారుమామ పాటలమీద ప్రత్యేక గౌరవభావముండడం నేనెరుగుదును. అనేక రంగాల్లో ఈ పాటలు పాడటం నేనెరుగుదును. ఈ గేయాలు రికార్డయి అనువాదంపొంది ఖండాంతరాలుకూడ ప్రయాణం చేయడం జరిగింది. ఈ పాటలు కొన్ని చలనచిత్రాలలోకి వెళ్ళాయి. అయితే చిత్రం! ఈ గేయాలకున్న ప్రాచుర్యం రచయిత అయిన వెంకటరత్నం గారికి లేకపోవడం గమనించాలి. చలంగారన్నట్లు ఈ రచయితపేరు ఒక వ్యక్తిగానన్నా చాలామంది విని ఉండరు.

మొదటిసారి ఈ పాటలు నేను విన్నప్పుడు నా హృదయం రసప్లావితమైపోయింది. నా శరీరం నాట్య పారవశ్యం చెందింది. ఈ పాటలు పాడీపాడీ నృత్యమాడియాడీ నేను ప్రతి గుండెతోనూ కదిలాను అనేక సంవత్సరాలు. నాకు జానపద సాహిత్యంమీద చక్కని అభిమానాన్ని, అభిప్రాయాన్ని కలిగించడానికి, నా నాట్యానికి ఒక విశిష్టమైన ప్రశస్తిని, ప్రత్యేకతను సమకూర్చి పెట్టడానికి ఈ పాటలు దోహదం చేశాయి. నేను నాట్యంలో అన్వయించుకుని అభినయించినవి – 'రావోయి బంగారిమామా' 'మొక్కజొన్నతోట', 'నారాతకిలా', 'వలచీనాడమ్మా', 'ముసురేసిందంటే', 'రాకోయి నారాజా' మొదలైన గేయాలు. 'రోడ్డు రోలర్', 'ఏడకెల్లినగాని' వంటి అనేక గీతాలు సభావేదికలమీద పాడి శ్రోతలను రాగరసరంజితులను చేయగలిగాను. ఇందులోని ఒక్కొక్క గేయం ఒక్కొక్క రసగుళిక. ఒక్కొక్క అందమైన కథానిక. అద్భుతమైన చిత్రణ. ఎలా వచ్చాయో వచ్చాయి వెంకటరత్నంగారి హృదయాన్ని చీల్చుకుని ఈ పాటలు మరోలోకపు మంచి మల్లెల్లా, పారిజాతాల్లా పరిమళాలు దశదిశలా వెదజల్లుకుంటూ. ఈ పాటల సృష్టికి వెంకటరత్నంగారి జీవితంలో ఒక మామూలు శృంగార ఘట్టంగాని, మరి యే ఇతరం గాని కారణం కానేకాదు. రసస్నిగ్ధమైన అతని హృదయం జానపద సాహిత్యాన్ని, జానపద జీవిత రహస్యాన్ని అంత ఆకళింపు చేసుకుని రాశీభూతం కావడమొక్కటే అందుకు కారణం. అందుకే ఈ గీతాలు అంత పదనుగా, భావపరిమళ భరితంగా ఉండడానికికూడ కారణం.

'పాడుకోగలిగితేనే బ్రతికుంటాయి' అన్న ప్రవాదం ఈ పాటలకు వర్తించదు. పాటకు ఆటకు బహు రమ్యంగా మలగిన ఈ గేయాలు మౌనంగా లోలోపల చదువుకున్నా, అర్థాలు, అందాలు అనేకం రంగుల రాగాలుగా, పదచిత్రాలుగా భావవైచిత్రితో మనకు జిగ్గుజిగ్గున సాక్షాత్కరిస్తూనే ఉంటాయి. మురిపించి మైమరపించే ఈ గేయాలు ఒకవంక నులివెచ్చని జానపద శృంగారాన్ని చిందిస్తూ, వేరొకవంక సామాజిక జీవన చైతన్యాన్ని సమపాళంలో రంగరించుకుంటూపోతాయి.

ఈ గేయాల ఛందస్సు చాల విలక్షణమైంది. గేయాలు వివిధ గతుల్లో, వింతవింత లయలో ఠీవిగా సాగిపోతాయి. చుక్కల రథంమీద చక్కగా పయనించే చందమామ మనకున్నంతవఱకు ఈ పాటలు తెలుగు సాహితీ గగనవీధుల్లో సహృదయ హృత్సరస్సీమల్లో కలహంసయానం చేస్తూనే ఉంటాయి.



కొనకళ్ల వెంకటరత్నం

# 'రావోయి బంగారి మామా'

- కొనకళ్ల వెంకటరత్నం

రావోయి బంగారిమామా నీతోటి
రాహస్య మొకటున్నదోయీ
పంటకాలువప్రక్క
జంటగా నిలుచుంటె,
నీడల్లో మన యీడు
జోడు తెలిశొస్తాది రావోయి...

ఈ వెన్నెల సొలపు,
ఈ తెమ్మెరల వలపు
రాత్రి మనసుఖకేళి
రంగరించాలోయి– రావోయి...

నీళ్లతూరల వెన్క
నిలుచున్న పాటనే
జలజలల్ విని, గుండె
ఝల్లుమంటున్నాది– రావోయి...

ఈనాటి మనవూసు
లేనాటికీ, మనకు,
ఎంత దూరానున్న,
వంతెనల్ కట్టాలి– రావోయి...

అవిసెపువ్వులు రెండు
అందుకున్నయి నాకు;
తుంచి నాసిగలోన
తురిమి పోదువుగాని– రావోయి...

ఏటిపడవసరంగు
పాట గిరికీలలో
చెలికాడ మనసొదల్
కలబోసుకొందాము– రావోయి...

జొన్నచేలో, గుబురు
జొంపాలలోగూడ,
సిగ్గేటో మనసులో
చెదరగొడుతున్నాది– రావోయి...



## ఘంటసాల ప్రత్యేకంగా పాడిన పాట

*సాయం సమయంలో ఆకాశంలో చుక్కలు సోకు చేసుకున్నాయంటూ ఎంతో బడాయిగా చెప్పిన కొనకళ్ళ వెంకటరత్నం గొప్ప కవిత్వ భావనకు గొప్ప అలంకరణ శైలి అవసరం లేదని నిరూపించారు. 'రావోయి బంగారి మావ' గేయాల్లో ఒక పడుచు తన బావతో పడవ సరంగు పాట గిరికీలు కొడుతుంటే కబుర్లు కలబోసుకుందామంటూ, అవిసె పువ్వులు రెండు అందుకున్నయి నాకు, తుంచి నా సిగలోన తురిమి పోదువుగాని అని కోరటం ఎంత అందమైన భావన! ఒక పడుచు కోరికను కొనకళ్ళ వారు పాటగా రాస్తే, ఒక స్త్రీ పరంగా పాడవలసిన పాటను తన బరువైన గొంతును మధురంగా మలిచి అందమైన తెలుగు భాషను, భావనను తన సప్తస్వరాల గమకంలో మనల్ని నిలువెల్ల స్నానమాడించి, సెలయేటిపై తేలియాడించడం ఘంటసాల వారికే చెల్లింది!*

# కంఠాభరణం

తెలుగు కథలు వార్తా కథనాలుగా, సంఘటన ఆదార డాక్యుమెంటరీ కథలుగా చాల కాలంగా వస్తున్నాయి. ఇవన్నీ వాగులాటి శబ్దం చేసేవే కానీ నదీలాటి లోతును ఉరవడిని, ఓరవడిని సాధించే కథలుగా నిలువలేకపోతున్నాయి. ముఖ్యంగా కథలలో మానసిక సంఘర్షణాత్మక కథనాలు కనుమరుగువుతున్న దశలో ఫిబ్రవరి మిసిమిలో వచ్చిన భవాని కథ తెలుగు కథకు ఆశను భరోసాను రేకెత్తించింది.

కథనుఇప్పటి వరకు నేనైతే ఎనిమిది సార్లు చదివిన. చదివినప్పుడల్లా కథలో కొత్త రహస్యాలు తెలివిడిలోకి వస్తున్నాయి. వస్తువు, భాష, బావుకత, నడక, పొదుపైన సంభాషణలు పాత్రల మధ్య సాధించిన సమన్వయం బంగారంలో ధాతు(రాగి)ని కలిపి నగను చేసినట్లు అత్యుత్తమంగా ఉంది. తెలుగు కథామతల్లి మెడలో భవాని మరో ఆభరణంగా తప్పక మిగిలిపోనుంది.

ఎందుకంటే, కథ ప్రారంభంలోని మొదటి వాక్యం 'కొందరికి జీవితాల్లో  కొన్ని తొందరగా జరిగి పోతుంటాయి'. కథ ముగింపు వరకు అదే వాక్యం సమతూకంతో విరుపు మెరుపులతో పాఠకున్ని చివరికి వెంటాడే వాక్యంలా పరిణామం చెందడం రచయిత పరిణతికి గొప్ప ఎత్తుగడ.

ఇకపోతే, కథ అంతా రచయిత ఊహ కల్పన శక్తి గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. కొన్ని వాక్యాలు పచ్చి వచనంలా ఉంటే, అనేక వాక్యాలు కవితాత్మకంగా సూటిగా గుండెను తాకుతాయి. వీటికి బోలెడు ఉదాహరణలు చూపవచ్చు. 'భవాని' కథ పరిపక్వత చెందిన పాఠకుల కోసం రాసింది. ప్లాట్‌ఫాం, బస్సు, కాలక్షేపం చదువరుల కోసం మాత్రం కానేరదు. కథ ప్రవాహంలో పాఠకుడు సంలీనమై ఈదులాడుతున్నప్పుడు అన్నంలోని మెరిగెలా రచయిత మధ్యలోకి రావడం ఉచితం కాదేమో. 'ఊ' కొట్టే కథల్లో 'ఊ' ఆగినపుడు 'వింటున్నావా' వలె రచయిత అనుకొని కథ మధ్యలోకి చొచ్చుకొని వచ్చాడేమో. దీనికి రచయిత సమాధానం చూడాలి.

రచయిత పేరు వేయకపోవడం బహుశా ఈ కథను చదివి ఆలోచనాపరులు ఎలా ప్రతి స్పందిస్తారో ఎలా స్వీకరిస్తారో చూడాలని కావచ్చుననుకుంటాను.

భవాని కథ చదువగానే నాకైతే చలం, బుచ్చిబాబు, వడ్డెర చండీదాస్‌లు  కలె కలిసి రాసినట్టుగా స్పురణలోకి వచ్చింది. నిశ్శబ్దంగా పాత్రల మనోవిశ్లేషణ రణన్నినాదం వినిపించింది. అద్భుతమైన కథ. అందించిన రచయితకు అభినందనలు. మంచి కథను అందించిన మిసిమికి కృతజ్ఞాతాభి వందనములు. మిసిమికి ప్రత్యేకంగా రాసిన కథలను అప్పుడప్పుడు  వేయడం ద్వారా పెద్దయన అలపాటి రవీంద్రనాథ్, అన్నపురెడ్డి పాటించిన విలువలకు ప్రమాణాలకు ఎలాంటి ధోకా కలుగదు. పై పెచ్చు ఆయన వ్యక్తిత్వం నాల్గింతలు  అవుతుంది.

- జూకంటి జగన్నాథం

*ఇది జగన్నాథంగారు పంపిన ఈమెయిల్ పి.డి.ఎఫ్., ఇమేజ్ ఇస్తున్నాం. కొన్ని ఒత్తులు, దీర్ఘాలు లేకపోవటం తెలుగు డి.టి.పి. నిర్వాకం. అలాగే ఉంచాం. దయచేసి తప్పులు పట్టకండి. –సం*

ఇంటి నెం. 6-5-101, విద్యానగర్, సిరిసిల్ల, జిల్లా : కరీంనగర్, తెలంగాణ.

# చదవండి...

– ఎన్నార్కె



✦ **శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రము :** వీనిలో ప్రతి శ్లోకానికి అర్థాన్ని వివస్తూ వ్యాఖ్యానాలు చేశారు రచయిత. భట్టనారాయణ విరచిత శ్రీ లలితా సహస్ర నామభాష్యమ్, శంకరాచార్యుని సౌందర్య లహరిలను ఆధార గ్రంథాలుగా స్వీకరించారు.

*పేజీలు : 160, వెల : ₹ 200/-, ప్రతులు అన్ని పుస్తక షాపులలో లభించును.*



✦ విహారిగా కలంపేరుతో పేరుగాంచిన జె.ఎస్.మూర్తి కథలు, నవలలు, కవితలు, నాటికలు, వ్యాసాలు, సమీక్షలు వ్రాశారు. ఇందులో కొన్ని ప్రక్రియలు పుస్తకాలుగా వచ్చాయి. ఈ మధ్యనే చినుకు పబ్లికేషన్స్ (గరికపాటి వారి వీధి, గాంధీనగర్, విజయవాడ) వీరి రచనలను పుస్తకాలుగా ప్రచురించారు.

**1. మంజరి :** ఇది విహారి వ్రాసిన పద్య కవితా సంపుటి. ఇందులో 5 దీర్ఘకవితలున్నాయి. అందులోని చిత్రప్రస్థానంలో కథాకథనం ఎంతో ఉత్కంఠతతో సాగింది.

*పేజీలు : 82, వెల : ₹ 80/-, ప్రతులకు – ఫోన్ : 984 802 5600*



**2. కిటికీ తెరిస్తే :** ఇది విహారి రచించిన కథానికలు. ఇందులో మొత్తం 10 కథలున్నాయి. ఇవన్నీ ఒక స్థాయికి చెందినవి. మనల్ని ఆలోచింప జేస్తాయి. మరీ ముఖ్యంగా సహజాతాలు, చేదోడు అన్న కథలు.

*పేజీలు : 130, వెల : ₹ 110/-, ప్రతులకు –*




**3. సమీక్షాకృతి :** శతాధిక పుస్తక పరిచయం. ఇందులో ఎందరో కవిపండితుల, కథల, విమర్శకులకు చెందిన 106 గ్రంథాలమీద సమీక్షలు ఉన్నాయి. సానుకూల అంశాలను ఒకటి రెండు పేజీలలో విశ్లేషించారు రచయిత.

*పేజీలు : 235, వెల : ₹ 120/-, ప్రతులకు – ఫోన్ : 984 802 5600*



✦ **కోహమ్ (నేనెవరు) :** మెహర్‌బాబా భక్తులయిన బండవరం రంగనాథస్వామి. జననం నుండి మరణం వాకిలివరకూ వచ్చిన విషయాల అక్షర రూపం కోహం అన్నారు.

*పేజీలు : 80, వెల వివరించలేదు, ప్రతులకు – అవతార్ మెహర్ బాబా వృద్ధా శ్రమ కేంద్ర ట్రస్టు, ఆదిలాబాద్.*



✦ **వీర తెలంగాణా విప్లవ పోరాటంలో కామ్రేడ్ పద్మ :** సుందరయ్య గారి వీర తెలంగాణా పోరాట గ్రంథం చదివిన వారెవరికైనా చిరకాలం గుర్తుండి పోయే పేరు కామ్రేడ్ పద్మ. ఆమె ఉత్తేజ జీవన గాథను, స్వయంగా ఆమె భర్త జంపా గౌతమరావు పుస్తకం రూపంలో తీసుకుని వచ్చారు. సందర్భోచితంగా ఆనాటి మహానాయకుల ప్రత్యేకతను గూర్చి కూడా తెలియజేశారు.

*పేజీలు : 150, వెల : ₹ 75/-, ప్రతులకు – జయంతి పబ్లికేషన్స్, కారల్ మార్క్స్ రోడ్డు, విజయవాడ వారి ప్రచురణ.*

✦ **శతావధాన భారతి :** (సంపూర్ణ శతావధానం). తెలుగు సాహిత్యంలో అవధాన ప్రక్రియ అత్యంత క్లిష్టమైనది. విశిష్టమైనది రచయిత రాంభట్ల పార్వతీశ్వర శర్మ పలు అవధానాలు చేసి అనుభవం గడించి సహస్రావధానంకు సన్నద్ధులు అవుతున్నాడు. ఈ సంక్లిష్ట ప్రక్రియకు మార్గదర్శక సూచికలనిచ్చారు రచయిత.

*పేజీలు : 72, వెల : ₹ 50/-, ప్రతులకు - ఫోన్: 924 785 9580*




✦ **సేతువు :** తులనాత్మక సాహిత్య విమర్శ. విమర్శకులు డా॥ శిఖామణి. ఇందులో 8 వ్యాసాలున్నాయి. వాటిలోని తులనాత్మక పరిశీలన మన మెదడుకు పదును పెడుతుంది. సాహితీ ప్రియులు ఆద్యంతం చదువ వలసిన పుస్తకం. ఆర్టిస్ట్ అక్బర్ వేసిన ముఖచిత్రం చూడ ముచ్చటగా ఉంది. కానీ ఆ వంతెనలో దేశీయత లేదు.

*పేజీలు : 100, వెల : ₹ 95/-, ప్రతులకు - ఫోన్ : 984 820 2526*




✦ **అక్షర శిల్పాలు :** రచయిత డా॥ కాసర్ల రంగారావుకు ప్రజాస్వామ్యం మీద ప్రీతి. తీవ్రవాదం మీద కంటే పెట్టుబడీ దారీ వ్యవస్థ మీద అయిష్టత. ఈ భావాలన్నీ తన గేయాలలో ఉటంకించారు.

*పేజీలు : 60, వెల : ₹ 75/-, ప్రతులకు - ఫోన్ : 949 312 2306*



✦ **వన ఝురి :** కవితలు రచయిత కరిపె రాజ్‌కుమార్. ఇప్పుడున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి కన్యగా భాసించే ఆదిలాబాద్ జిల్లాలోని అందాలను అక్షర బద్ధం చేసిన గేయ సంపుటి. రచన ఆహ్లాదంగా సాగింది.

*పేజీలు : 72, వెల : ₹ 100/-, ప్రతులకు* - H.No. 13-105, N.T.R. Chowk, Vidyanagar, Khanapur Mandal, Adilabad District - 504 203, T. S.



✦ **యక్షగానం :** దేవులపల్లి కృష్ణమూర్తి రచనలు. తడి ఆరని నేలతల్లి బిడ్డల జీవితాలను కథలుగా చెబుతాడు దేవులపల్లి. రేపటి చరిత్ర కారులకు ఉపయోగపడేలా ఇందులో పల్లెజీవనం నిక్షిప్తమై ఉంది. పల్లెటూరి కథలు ఏ భాషలో చెబితే అందంగా అమరుతాయో ఆ భాషలోనే చెబుతాడీ రచయిత. ఫొటోగ్రఫీ కంటే చిత్రకళ ఎప్పుడూ ఒకడుగు ముందే ఉంటుందని చెప్పకనే చెబుతున్నాయి ఏలే లక్ష్మణ్ అట్టమీద, అట్టవెనుక, లోపల వేసిన బొమ్మలు. హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ వారి ప్రచురణ.

*పేజీలు : 160, వెల : ₹ 120/-, ప్రతులకు - ఫోన్ : 23521849*




✦ **కడుపు కోత :** రచయిత దేవరాజు మహారాజు. వట్టికోట ఆళ్వారు స్వామితో ప్రారంభమై సుమోళి, గూడురు సీతారాం మాండలికంతో సుసంపన్నమైన తెలంగాణ భాషారీతిలో సాగిన మరొక కలికితురాయిగా నిలుస్తుంది ఈ పుస్తకం. ఇది తెలంగాణ ప్రజల భాషలో తొలి కథ సంపుటి.

*పేజీలు : 96 వెల : ₹ 75/-, ప్రతులకు -* All Leading Book Shops.



✦ **లవకుశ :** తెలుగు సినిమా చరిత్రలో కమనీయ కళాఖండంగా పేరుగాంచిన చిత్రం లవకుశ. నీ పేరు తలచినా చాలు అన్నట్లు పేరు వింటుంటేనే శ్రవణ శోభితమైన సంగీతం వినిపింపజేసే ఘంటసాల అపూర్వ రాగాలాపనతో ఈ సినిమా చిరస్మరణీయమైనది. ఈ చిత్రానికి సంబంధించిన చలనచిత్ర గీతాల సాహిత్య విశ్లేషణను ఎలమర్తి రమణయ్య, సంగీత విశ్లేషణను యస్.వి. రమణమూర్తి, ఆలోచనా రూపకల్పన కె.వి.రావు చేశారు. చిత్రంలోని ముఖ్య సన్నివేశాలెన్నిటినో కంటికింపుగా ముద్రించారు.

*పేజీలు : 96 వెల : ₹ 150/-, ప్రతులకు - ఫోన్ : 984 902 3852*



# **మిసిమి** *విజ్ఞానదాయకం*

**మిసిమి పత్రిక ప్రతి నెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని**
**ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹ 300/- తోపాటు పంపండి.**
**బయటి చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు అదనంగా ₹ 50/- కలపండి.**

1. **పేరు :** ..............................................................
2. **చిరునామా :**
   ఇం.నెం. ..............................................................
   వీధి ..............................................................
   ఊరు ..............................................................
   పిన్ ..............................................................
   సెల్ ..............................................................
3. **సంతకం :** ..............................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 600+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి



మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 900+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి





నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1200+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి



అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1500+50/-) **మిసిమి 2013/2014** సంచికల బౌండ్ పుస్తకం బహుమతి

**మిసిమి** మాసపత్రిక

**మీరు బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి**ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ ప్రక్కగడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ–ధమ్మ–సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్చయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**బహుమానంగా పంపవలసినవారి చిరునామా :**

..............................................................
..............................................................
..............................................................

**మిసిమి** మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536.



ఇరుల పోరు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.03.2016



మాణిక్య దక్ష వాటిక